
'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 345

మంగళవారం 6-3-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ట్రంప్ సుంకాల సెగ

6 నెలల కనిష్టానికి సేవల రంగం..
సెన్సెక్స్ 300 పాయింట్లు డౌన్ - 10లో



'మను' చరిత్ర...

ప్రపంచకప్‌లో పిన్న వయసులో స్వర్ణం
నెగ్గి మను భాకర్ రికార్డు – స్పోర్ట్స్‌లో

ఢిల్లీ వీధుల్లో.. హోదా గర్జన



ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందేనంటూ ఢిల్లీ వీధుల్లో నినదిస్తున్న ఉద్యమకారులు

దేశ రాజధానిలో వైఎస్సార్‌సీపీ మహాధర్నా

'ప్రత్యేక హోదా మా హక్కు' అంటూ నినదించిన శ్రేణులు

పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలంతా హాజరు

వామపక్షాలు, ఆప్, ప్రజాసంఘాల మద్దతు.. హోదా పోరాటయోధులపై ఢిల్లీ పోలీసుల గూండాగిరి

హోంమంత్రికి వినతిపత్రం ఇవ్వనీయకుండా ఆటంకం.. పలువురి అరెస్టు.. రోడ్డుపైనే బైఠాయించిన నేతలు

ఉద్రిక్తతల నడుమ విజయవంతంగా మహాధర్నా


ప్రత్యేకహోదా కోసం సోమవారం ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన మహాధర్నా వేదికపై ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు, ప్రజా సంఘాల నేతలు

సాక్షి, న్యూఢిల్లీ

'ప్రత్యేక హోదా మా హక్కు– ప్యాకేజీలతో మోసం చేయొద్దు' అన్న నినాదాలతో హస్తినలో దిక్కులు పిక్కటిల్లాయి. ఐదుకోట్ల మంది ఆంధ్రుల ఆవేదనను ప్రతిబింబిస్తూ.. ప్రత్యేక హోదా ఆకాంక్షకు ప్రతీకగా నిలుస్తూ.. దేశరాజధానిలో సోమవారం 'మహా ధర్నా' జరిగింది. నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తూ ఈ మహాధర్నాను చేపట్టిన సంగతి తెల్సిందే. పార్లమెంటు బడ్జెట్ మలివిడత సమావేశాలు సోమవారం ప్రారంభమైన తరుణంలో చేపట్టిన ఈ ధర్నా ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షను ఢిల్లీ పీఠానికి మరోసారి ఎలుగెత్తి చాటింది. 2015 ఆగస్టు 10న ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఇదే స్థలంలో భారీ ధర్నా నిర్వహించారు. నాలుగేళ్లుగా అనేక ఆందోళనల అనంతరం హోదాపై పోరు తుది దశకు చేరుకుంది. ఢిల్లీలో ధర్నా కార్యక్రమం హోదా కోసం పోరాడుతున్న ఆందోళనకారుల్లో సమరోత్సాహాన్ని నింపింది. ఈనెల 21న కేంద్రంపై

మిగతా 7వ పేజీలో ▶

హోదాపై 'బాబు' రోజుకో మాట



హోదాపై సీఎం చంద్రబాబు రోజుకో మాట మాట్లాడుతున్నారు. మేధావిని కాబట్టే ప్రజలు అధికారం ఇచ్చారని చెబుతూ వారినే మోసగిస్తావా. ఇలాగైతే ప్రజలు క్షమించరు. చంద్రబాబుకు అసెంబ్లీ సీట్లు పెంచుకునే విషయంలోనూ, ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలను కొనుగోలు చేయడంపైనా ఉన్న శ్రద్ధ హోదాపై లేకపోవడం దారుణం.

–మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎంపీ, వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్ష నేత

అటోఇటో తేల్చుకోవాలి..



హోదా విషయంలో రాజీపడేది లేదు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు అటో ఇటో తేల్చుకొనేందుకు ఢిల్లీ రావాలి. హోదా సాధన కోసం జరిగే అన్ని ఉద్యమాలకు మా మద్దతు ఉంటుంది. వై ఎస్సార్ సీపీ తలపెట్టిన ఈ ఉద్యమానికి మా పార్టీ తరపున సంఘీభావం తెలుపుతున్నాం.

– రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

బీజేపీ, టీడీపీలకు రోజులు దగ్గరపడ్డాయి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సందర్భంగా చట్టంలో ఇచ్చినవి హామీలు కాదు. అవి ఏపీకి అమలు చేయాల్సిన వివిధ అంశాలపై ఆదేశాలు. వీటిని అమలు చేయకుండా హామీలపై నిర్ణయాలంటూ కాలయాపన చేస్తున్న బీజేపీ, టీడీపీలకు రోజులు దగ్గర పడ్డాయి.

– మధు, సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

హోదాకు మద్దతిస్తాం



ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక హోదాను సాధించుకొనేందుకు ఏపీ ప్రజలు రోడ్లపైకి వచ్చారు. హోదా కోసం జరిపే ఉద్యమాలకు మా పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుంది.

– రామారావు, ఆప్ నేత

టీడీఎస్ పేరిట రూ.3,200 కోట్ల స్వాహా!

- ఉద్యోగుల వేతనాల నుంచి టీడీఎస్ కోతలు
- ఆదాయపన్ను శాఖకు జమ చేయని 447 కంపెనీలు
- అవన్నీ సొంత వ్యాపార అవసరాలకు మళ్లింపు

10 లో



'ది షేప్ ఆఫ్ వాటర్'కు ఆస్కార్ పంట

ఉత్తమ నటుడు


గ్యారీ ఓల్డ్‌మేన్

ఉత్తమ నటి


మెక్‌డోర్మండ్

- ఉత్తమ చిత్రం సహా నాలుగు విభాగాల్లో అవార్డులు కైవసం
- లాస్ ఏంజెలిస్‌లోని డాల్బీ థియేటర్‌లో ఘనంగా వేడుకలు
- శ్రీదేవి, శశికపూర్‌కు నివాళులర్పించిన 'ఆస్కార్'

ఉత్తమ దర్శకుడు


గెలెర్మో డెల్‌టోరో

- ఫ్యామిలీలో

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి

ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగం

- విభజన సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ కేంద్రం నెరవేర్చాలి
- సమస్యలు పరిష్కారం కానందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారు
- కేంద్రం నిధులతో పోలవరం పూర్తి చేయాలి, రైల్వేజోన్ ఇవ్వాలి
- అసెంబ్లీ సీట్లు పెంచాలి.. అమరావతికి ఆర్థిక సాయం చేయాలి

2 లో



ప్యాకేజీపైనే జైట్లీతో చర్చలు..

- జైట్లీతో భేటీలో హోదాకు బదులుగా రూ.16 వేల కోట్ల ప్యాకేజీపైనే టీడీపీ నేతల చర్చ
- ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనలు అడ్డంకి రాకుండా వివిధ సంస్థల సాయం ఇప్పించాలని వినతి
- హోదా గురించి గట్టిగా మాట్లాడామంటూ మీడియా ముందు టీడీపీ నేతల వెల్లడి

సాక్షి, అమరావతి/న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రజానీకమంతా ప్రత్యేక హోదా కోసం నినదిస్తుంటే తెలుగు దేశం పార్టీ ప్రతినిధుల బృందం సోమవారం ఢిల్లీలో అరుణ్‌జైట్లీతో సమావేశమై ప్రత్యేక ప్యాకేజీ గురించి చర్చలు జరిపింది. ప్రత్యేక హోదాకు బదులుగా ప్రత్యేక ప్యాకేజీ రూపంలో కేంద్రం ఇస్తామన్న రూ.16 వేల కోట్లను ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టులు (ఈఏపీ) రూపంలో వివిధ ఆర్థిక సంస్థల నుంచి త్వరితగతిన రాష్ట్రానికి ఇప్పించాలని టీడీపీ నేతలు జైట్లీని కోరారు. కేంద్ర మంత్రి సుజనాచౌదరి నేతృత్వంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ప్రణాళిక

మిగతా 2వ పేజీలో ▶



నీతోనే రామరాజ్యం.. నువ్వే రావాలయ్యా..

ప్రజా సంకల్ప యాత్రలో జగన్ ఎదుట ఓ అవ్వ ఆకాంక్ష


ప్రకాశం జిల్లా నాగులపాడు గ్రామంలో ఓ అవ్వను ఆప్యాయంగా పలకరిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

6 లో

ఫ్యామిలీలో

గుడ్డు కంటే కోడే ముందు

కోడి ముందా? గుడ్డు ముందా? ప్రపంచంలో ఇప్పటివరకు సమాధానం దొరకని ప్రశ్న. సింపుల్‌గా అనిపిస్తుంది. సమాధానమే.. చిక్కదు! కానీ మన ఊళ్లలో ఆడ పిల్లల దగ్గర కరెక్ట్ ఆన్సర్ ఉంది. గుడ్డు కంటే కోడే ముందు అంటున్నారు వాళ్లు! అదెలా? ఈ ఎంపవర్‌మెంట్ ఇంటర్వ్యూని చదవండి. పవర్ ఆఫ్ 'పాదుపు'.. కోడిదేనని.. బంగారు గుడ్లు ఆ కోడి పెట్టినవేనని తెలుస్తుంది!

ముందు ఇనుము వాడింది మనమే!

- సింధు నాగరికత కంటే ముందుగానే మన రాష్ట్రంలో ఇనుము వాడకం
- గోదావరి తీరాన విలసిల్లిన 'మెగాలిథిక్ నాగరికత'
- పురావస్తు శాఖ పరిశోధనల్లో వెల్లడి
- ఈ నెల 12 నుంచి ఏఎన్‌యూలో అంతర్జాతీయ సదస్సు

8 లో

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి

- ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగం
- ఏపీకి పొరుగు రాష్ట్రాలతో సమానస్థాయి వచ్చే వరకూ సాయం చేయాలి



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడుతున్న గవర్నర్ నరసింహన్

సాక్షి, అమరావతి: ''రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్‌వ్యవస్థీకరణ చట్టం–2014లో పేర్కొన్న హామీలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలి. జాతీయ సంస్థల ఏర్పాటుతో పాటు హామీలన్నింటినీ సత్వరం అమలు చేయడం ద్వారా పొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయి వచ్చే వరకూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేయూత అందించాలి'' అని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం శాసనసభ, శాసనమండలి సభ్యులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టం, ఆస్తులు, అప్పుల పంపకంలో అన్యాయం, కేంద్రం ఇచ్చిన హామీలు–అమలు పరిస్థితులపై విశ్లేషణలతో గవర్నర్ ప్రసంగం ఆరంభమైంది. విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు అనేక సమస్యలు ఏర్పడ్డాయని, వాటిలో కొన్ని ఇప్పటికీ పరిష్కారం కానందున రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గవర్నర్ వివరించారు. గవర్నర్ ప్రసంగంలోని మరిన్ని అంశాలు ఆయన మాటల్లోనే...

- ➤ విభజనతో ఏర్పడిన వనరుల వ్యత్యాసాన్ని సరిచేయాలి.
- ➤ కేంద్ర ప్రభుత్వ నిధులతో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలి. రైల్వే జోన్ ఏర్పాటు చేయాలి. గ్రీన్‌ఫీల్డ్ క్రూడాయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కారిడార్ ఏర్పాటు చేయాలి. అమరావతికి ఆర్థిక సహాయం చేయాలి.
- ➤ దుగరాజపట్నం పోర్టు, వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంటు, విశాఖపట్నం, విజయవాడ మెట్రోరైలు ప్రాజెక్టులు నిర్మించాలి.
- ➤ అసెంబ్లీ సీట్ల పెంపు హామీతో పాటు వైజాగ్ – చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు, అమరావతి ర్యాపిడ్ రైలు, రోడ్డు అనుసంధానం, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి సహాయం, తొమ్మిది, పది షెడ్యూళ్లలోని సంస్థల విభజన, గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటు వంటి హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాల్సి ఉంది.
- ➤ 2022 నాటికి మూడు ఉత్తమ రాష్ట్రాల్లో ఒకటిగా, 2029 నాటికి దేశంలో ఉత్తమ రాష్ట్రంగా, 2050 నాటికి విశ్వకేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రూపొందాలనేది నా ఆకాంక్ష.
- ➤ రెండంకెల సుస్థిర అభివృద్ధి లక్ష్యం. అర్హులందరికీ పక్కా ఇళ్లు.
- ➤ రాష్ట్రంలోని అన్ని వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. భావనపాడు పోర్టు, కియా మోటార్స్, బీఈఎల్, అగ్రి–ప్రాసెసింగ్ పార్కులు, టూరిజం ప్రాజెక్టులు, అనంతపురం – అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే, విమానాశ్రయాల అభివృద్ధి తదితర ప్రణాళికలు ఈ లక్ష్యంతో చేపట్టినవే.
- ➤ రూ.24,000 కోట్ల వ్యవసాయ రుణ విముక్తి పథకం అమల్లో భాగంగా ఇప్పటి వరకూ 1.17 కోట్ల ఖాతాలకు రూ.13,976 కోట్లను సర్దుబాటు చేశాం.
- ➤ గత మూడేళ్లలో రూ. 48,474 కోట్లు ఖర్చు చేయడం ద్వారా 13.61 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి వసతి కల్పించాం.
- ➤ రాబోయే సంవత్సరం నుంచి హిజ్రాలు, ఒంటరి మహిళలకు రూ.1,500 పింఛన్ అందిస్తాం.
- ➤ రాష్ట్రంలోని 14 నగరపాలక సంస్థలు, 4 పురపాలక సంఘాల పరిధిలో 203 అన్న క్యాంటీన్ల ఏర్పాటు లక్ష్యం. ఇందులో ఇప్పటికే మూడు ఆరంభమయ్యాయి.
- ➤ అమరావతి ఒక పరిపాలనా రాజధానిగా కాకుండా అంతర్జాతీయ ఆర్థిక కేంద్రంగా అభివృద్ధికి చర్యలు.
- ➤ యువతకు ఉపాధి కల్పనకు అత్యధిక ప్రాధాన్యం. ప్రైవేటు రంగంలో ఉపాధిని ప్రోత్సహిస్తూనే ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు జారీ.
- ➤ అగ్రిగోల్డ్ స్కామ్ అతి పెద్దది. డిపాజిట్ చేసిన సొమ్ము రాలేదనే మానసిక వ్యథతో డిపాజిటర్లు /ఏజెంట్లు 136 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

58 పేజీల ప్రసంగం గంటలోనే

ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించడం ఆనందంగా ఉంది అంటూ.. గవర్నర్ నరసింహన్ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. అనంతరం 58 పేజీల ఆంగ్ల ప్రసంగాన్ని గంటలోపే పూర్తి చేశారు. ఉదయం 9.28 గంటలకు జాతీయ గీతాలాపనతో సభ ఆరంభమైంది. వెంటనే గవర్నర్ ప్రసంగం మొదలుపెట్టారు. గవర్నర్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడింది. కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ ప్రధాన ప్రతిపక్షం లేకుండా బడ్జెట్ సమావేశాలు ఆరంభం కాలేదు. ఇప్పుడు మొట్టమొదటిసారి ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ సభ్యులు లేకుండానే బడ్జెట్ సమావేశాలు ఆరంభమయ్యాయి. తమ పార్టీ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేస్తే వెంటనే అసెంబ్లీకి వస్తామని వైఎస్సార్‌సీపీ తెలిపింది. ఆ డిమాండ్‌తోనే అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిన విషయం విదితమే. సభకు మండలి చైర్మన్ ఫరూక్, స్పీకర్ కోడెల శివప్రసాదరావు, ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటీ టీడీపీ, బీజేపీ సభ్యులు సభకు హాజరయ్యారు.

సభలో ఎంపీల ఆందోళన

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ మలివిడత బడ్జెట్ సమావేశాలు తెలుగు రాష్ట్రాల ఎంపీల నిరసనల మధ్య సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌తో పాటు, తెలుగుదేశం, టీఆర్ఎస్, వివిధ ప్రాంతీయ పార్టీల ఎంపీలు వివిధ అంశాలపై నిరసనలతో హోరెత్తించడంతో పార్లమెంట్ ఉభయ సభలు ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే మంగళవారానికి వాయిదా పడ్డాయి. ఉదయం లోక్‌సభ ప్రారంభంకాగానే తెలంగాణలో ఎస్టీ, మైనారిటీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లారు. రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని ప్లకార్డులు ప్రదర్శించారు. రిజర్వేషన్ల పెంపు విషయం రాష్ట్రాలకే వదిలేసేలా రాజ్యాంగంలోని ఆర్టికల్ 16ను సవరించాలని డిమాండ్ చేశారు. విశాఖ రైల్వేజోన్, కడప స్టీల్‌ప్లాంట్, ప్రత్యేకహోదా మొదలైన డిమాండ్లతో టీడీపీ ఎంపీలు సభలో ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో స్పీకర్ సుమిత్రామహాజన్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదావేశారు. తిరిగి ప్రారంభమైన తరువాత కూడా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో మంగళవారానికి వాయిదావేశారు. ఏపీ పునర్‌వ్యవస్థీకరణ చట్టాన్ని అమలు చేయడంలేదంటూ రాజ్యసభలో టీడీపీ ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శించారు. కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా డిమాండ్ చేస్తూ వెల్‌లో అతిపెద్ద బ్యానర్ ప్రదర్శించారు. సభలో గందరగోళ పరిస్థితి నెలకొనడంతో రాజ్యసభ చైర్మన్ సభను రెండుసార్లు వాయిదా వేశారు. పరిస్థితిలో మార్పు రాకపోవడంతో మంగళవారానికి వాయిదావేశారు.

హోదా కోసం కాదు.. ప్యాకేజీపైనే చర్చ

▶ మొదటి పేజీ తరువాయి

సంఘం వైస్ చైర్మన్ కుటుంబరావు, ఏపీ బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు సోమవారం జైట్లీతో దాదాపు 25 నిమిషాలకు పైగా సమావేశమై రాష్ట్రానికి కేంద్ర సాయంపై చర్చించారు. ప్రత్యేక హోదా అంశంపై నామమాత్రపు చర్చ కూడా జరగలేదని సమాచారం. కానీ భేటీ అనంతరం యనమల రామకృష్ణుడు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా మాకు ఇవ్వాల్సిన అవసరం ఉందని జైట్లీకి చెప్పామన్నారు. ప్రత్యేక ప్యాకేజీకి సంబంధించి సాయం అందనందున హోదా కావాలని కోరామన్నారు. అయితే, జైట్లీతో సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పెద్ద మొత్తంలో అప్పులు చేసిన నేపథ్యంలో ప్రత్యేక ప్యాకేజీగా ఇస్తామన్న రూ.16 వేల కోట్ల సాయాన్ని ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు అడ్డంకి రాకుండా ఎలా ఇవ్వాలన్న దానిపైనే టీడీపీ నేతల బృందం ప్రధానంగా చర్చించింది. కేంద్రం చెప్పే ఈఏపీలతో రాష్ట్రానికి ఇచ్చే సాయం ఆలస్యమయ్యే అవకాశం ఉందని, ఇతర సంస్థల నుంచి సాయం అందజేసే అవకాశాలను పరిశీలించాలని కోరింది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు అడ్డంకి రాకుండా ఏ రూపంలో సాయం పొందవచ్చన్నది విధి విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే కేంద్ర ఆర్థిక శాఖ సానుకూలంగా స్పందిస్తుందని జైట్లీ హామీ ఇచ్చినట్టు సమాచారం. 2014–15కి సంబంధించి 16 వేల కోట్ల రెవిన్యూ లోటును భర్తీ చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ డిమాండ్‌ను జైట్లీ తోసిపుచ్చారు. అయితే 14వ ఆర్థిక సంఘం 2015–16 ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసి ఆంధ్రప్రదేశ్‌కు నిర్ధారించిన రూ.6600 కోట్ల రెవిన్యూ లోటునే 2014–15కి కూడా వర్తింపచేద్దామంటూ మధ్యే మార్గ పరిష్కారాన్ని జైట్లీ సూచించినట్లు తెలిసింది. కాగా 2014–15కి రెవిన్యూ లోటుగా ఇప్పటికే కేంద్రం సుమారు 4 వేల కోట్లను రాష్ట్రానికి అందజేసిన సంగతి తెలిసిందే. మధ్యే మార్గ పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకారానికి వస్తే 2014–15 ఆర్థిక ఏడాదికి మరో రూ.2600 కోట్లు రెవెన్యూ లోటు కింద భర్తీ అయ్యేందుకు వీలుంది. కాగా, ప్రత్యేక హోదా, రావాల్సిన నిధులు, ఇతర రాష్ట్రాలకు ఇస్తున్నట్టు పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరామని మంత్రి యనమల తెలిపారు. ఆర్థిక లోటు భర్తీకి సంబంధించి ఆయన చెబుతున్న లెక్కలు తమకు ఆమోదయోగ్యం కాకపోవడంతో ఈ సమావేశం అసంపూర్తిగా ముగిసిందన్నారు. ఆర్థిక లోటు భర్తీపై మళ్లీ సమావేశమై చర్చిద్దామని సూచించినట్టు చెప్పారు.

అర్ధసత్యాలతో గవర్నర్ ప్రసంగం: మధు



సాక్షి, అమరావతి: బడ్జెట్ సమావేశాలను ప్రారంభం సందర్భంగా గవర్నర్ నరసింహన్ చేసిన ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వ ఆత్మస్తుతి, రాష్ట్ర పరిస్థితులు, పాలన పట్ల అర్ధసత్యాలు నిండిఉన్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ప్యాకేజీకి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన విషయం మరిచిపోయి తమ ప్రభుత్వం హామీల సాధనకు అలుపెరుగని కృషి చేసిందని గవర్నర్ అనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇది బీజేపీ, టీడీపీ దొబూచులాటకు అద్దం పడుతోందన్నారు.

ఎయిడెడ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

విజయవాడలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది దీక్ష

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలోని ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సర్వీసను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని ఏపీ ఎయిడెడ్ కాలేజెస్ పార్ట్‌టైం, టెంపరరీ, అన్‌ఎయిడెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రాజ్‌మార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ, అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. జీవో నంబర్ 35ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలకు ఎమ్మెల్సీలు రాము సూర్యారావు, బొడ్డు నాగేశ్వరరావు, విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎం. శ్రీనివాసరెడ్డి, కత్తి నరసింహారెడ్డి మద్దతు తెలిపారు. దీక్షలో సెక్రటరీ పీవీవీ సంజీవరావు, ఉపాధ్యక్షులు డి.అంబేడ్కర్, కోశాధికారి నవీన్, బి.వెంకటరత్నం, ప్రేమ్‌కుమార్, ఎం.కుటుంబరావు, డి.శ్రీనివాస్, సోమరాజు, అధ్యాపకేతర సిబ్బంది రాజు, తులసీరామ్ పాల్గొన్నారు.

వేగంగా సభ్యత్వ నమోదు: కమల్

సాక్షి, చెన్నై: రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు శిబిరాల్ని విస్తృతంగా ఏర్పాటు చేయాలని మక్కల్ నీది మయ్యం అధినేత కమలహాసన్ ఆదేశించారు. సోమవారం జిల్లాల ఇన్‌చార్జ్‌లతో ఆళ్వార్‌పేటలోని పార్టీ కార్యాలయంలో కమల్ సమావేశం అయ్యారు. అభిమానుల సహకారంతో మక్కల్ నీది మయ్యం లక్ష్యాలను , ఉద్దేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సభ్యులుగా చేర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

గవర్నర్ ప్రసంగంలోనూ.. బాబు యూటర్న్

- హోదా లేదు.. సాయమేనని గతేడాది గవర్నర్‌తో ప్రభుత్వం స్పష్టీకరణ
- ఇప్పుడు ప్రత్యేక హోదా అంటూ మాటమార్చిన బాబు సర్కార్

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదా వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, ప్యాకేజీ ముద్దంటూ మొన్నటివరకూ వాదిస్తూ వచ్చిన చంద్రబాబు సర్కారు తాజాగా మాట మార్చింది. గతేడాది బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ నరసింహన్ ప్రసంగానికి, 2018 –19 బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం ఉభయసభలను ఉద్దేశించి ఆయనే చేసిన ప్రసంగానికి మధ్య వైరుధ్యమే దీనికి నిదర్శనం. గతేడాది మార్చి 7న తాత్కాలిక అసెంబ్లీలో ఉభయ సభల సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వడం లేదని, దీని స్థానంలో ప్రత్యేక సహాయాన్ని ప్రకటించిందని స్పష్టం చేశారు. పేరులోనే తేడా తప్ప హోదా ఉన్న రాష్ట్రాలకు వర్తించే అన్ని ప్రయోజనాలు ప్రత్యేక సాయం కింద అందుతాయని ప్రకటించారు. తాజాగా సోమవారం ప్రత్యేక హోదా ఇవ్వడంతోపాటు విభజన చట్టంలోని అంశాలు, రాజ్యసభలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయాల్సిందేనని గవర్నర్ నోట రాష్ట్ర ప్రభుత్వం పలికించడం గమనార్హం. ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ చేసే ప్రసంగం ప్రభుత్వ విధాన పత్రమేనని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రభుత్వం రూపొందించి ఇచ్చిన విధానపత్రాన్నే గవర్నర్ చదువుతారు. దీన్ని బట్టే చంద్రబాబు పూటకోమాట మార్చుతున్నారని తేటతెల్లమవుతోంది.

ఎన్నిసార్లు మాట మార్చారో?

2014 ఎన్నికల ముందు తిరుపతిలో, ఇతర ప్రచార సభల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదేళ్లు, పదేళ్లు కాదు.. 15 ఏళ్లు కావాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. సీఎం అయ్యాక మాత్రం కేంద్ర ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలను రద్దు చేయాలని సిఫార్సు చేసినందున కేంద్రం ఏ రాష్ట్రానికీ హోదా ఇవ్వడంలేదని, దీనికంటే ఎక్కువ ప్రయోజనం ఉండేలా రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించిందని ప్రకటించారు. ప్రత్యేక హోదా సంజీవని అని, అది ఉంటే రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తారని, యువతకు ఉద్యోగాలు వస్తాయని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పదేపదే చెప్పడాన్ని చంద్రబాబు తీవ్రంగా తప్పుబట్టారు. 'హోదా వల్ల ఏమొస్తుంది. హోదా ఇస్తే వచ్చేది రూ.3000 కోట్లే. అంతకంటే చాలా రెట్లు ఆర్థిక ప్రయోజనాలతో ప్యాకేజీ కేంద్రం ఇచ్చింది. హోదాతో ఎలాంటి ఉపయోగం ఉండదు' అని చంద్రబాబు చెప్పడం గమనార్హం. ఇప్పుడు ఆయనే మాటమార్చి హోదా ఇవ్వాలనటాన్ని బీజేపీ నేతలు కూడా తప్పుబడుతున్నారు.

> **నాడు.. (2017–18 బడ్జెట్ ప్రసంగం)**
> కేంద్రం ప్రత్యేక హోదా స్థానంలో ప్రత్యేక సహాయాన్ని ప్రకటించింది. పేరులోనే తేడా తప్ప హోదా ఉన్న రాష్ట్రాలకు వర్తించే అన్ని ప్రయోజనాలు ప్రత్యేక సాయం కింద అందుతాయి.
> **నేడు (2018–19 బడ్జెట్ ప్రసంగం)**
> ప్రత్యేక హోదా ఇవ్వడంతోపాటు విభజన చట్టంలోని అంశాలు, రాజ్యసభలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయాల్సిందే.
> **ఇవి.. గతేడాది, ఈ ఏడాది బడ్జెట్ సందర్భంగా రాష్ట్ర గవర్నర్‌తో చంద్రబాబు సర్కార్ పలికించిన మాటలు.**

రైతుల్లో అశాంతి తలెత్తకూడదు

- టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- పోలవరం డిజైన్లకు ప్రత్యేక అధికారి
- ప్రాధాన్య జాబితాలోకి మరో 20 ప్రాజెక్టులు



సాక్షి, అమరావతి: రైతుల్లో అశాంతి తలెత్తకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణ ప్రభుత్వ బాధ్యతని, కందులు, మినుములు, అపరాలకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలన్నారు. మార్కెట్ జోక్యం ద్వారా రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చేయాలన్నారు. సోమవారం తన నివాసం నుంచి నీరు–ప్రగతి, వ్యవసాయంపై అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. రాబోయే ఖరీఫ్‌కు భూసార పరీక్షలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. సమష్టి కృషితో మూడేళ్లు వరుసగా రెండంకెల వృద్ధిరేటు సాధించామని చెప్పారు. జాతీయ స్థాయిలో వృద్ధిరేటు 6.8 శాతం ఉంటే, రాష్ట్రంలో సగటున 11.22 శాతం వృద్ధి రేటు సాధించామన్నారు. వ్యవసాయం అనుబంధ రంగాల్లో 17.79 శాతం వృద్ధి రేటు వచ్చే పరిస్థితి ఉందన్నారు. రబీ సీజన్‌లో ఒక్క ఎకరంలో కూడా పంటలు ఎండిపోకూడదని, సమర్థ నీటి నిర్వహణ ద్వారా పంటలు కాపాడుకోవాలని సూచించారు. ఉపాధి హామీ నిధుల విడుదలలో జాప్యంపై పార్లమెంటులో తమ పార్టీ ఎంపీలు ప్రస్తావించి కేంద్రంపై ఒత్తిడి తెస్తారని, ఈ పనుల్లో వేగం తగ్గకుండా చూడాలన్నారు. 80 కరువు మండలాల్లో 150 రోజులు ఉపాధి కల్పించాలని ఆదేశించారు.

పోలవరం డిజైన్ల వేగవంతానికి ప్రత్యేక అధికారి

పోలవరం ప్రాజెక్టు డిజైన్లను వేగంగా రూపొందించి, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నుంచి ఆమోదం పొందేలా చూడటానికి ప్రత్యేక అధికారిని నియమించాలని జలవనరుల శాఖ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు పనులపై ఆయన సోమవారం వర్చువల్ రివ్యూ నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఇప్పటివరకూ 1,02,480.90 ఎకరాలు సేకరించామని, ఇంకా 60,258.10 ఎకరాలు సేకరించాల్సి ఉందని అధికారులు తెలిపారు. దీనిపై సీఎం స్పందిస్తూ భూసేకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమీక్షలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రాజమౌళి, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతిపక్షం లేదని నిర్లక్ష్యం వద్దు

ప్రతిపక్షం లేదని అసెంబ్లీ సమావేశాలను తేలిగ్గా తీసుకోవద్దని చంద్రబాబు మంత్రులకు సూచించారు. గవర్నర్ ప్రసంగాన్ని ఆమోదించేందుకు సోమవారం అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రులు కచ్చితంగా సమావేశాలకు హాజరుకావాలని, ప్రశ్నించేవారు లేరు కదాని ఊరుకుంటే కుదరదన్నారు.


ఏపీ సర్కారు 2,680 ఒప్పందాలు

ఎంపీ వైవీ ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: గడిచిన నాలుగేళ్లలో వివిధ పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2,680 ఒప్పందాలు (ఎంఓయూలు) చేసుకుందని కేంద్రం తెలిపింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సోమవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్యశాఖ సహాయ మంత్రి సి.ఆర్.చౌదరి రాతపూర్వక సమాధానమిచ్చారు. రూ.17,80,891 కోట్ల విలువైన ఈ పెట్టుబడి ప్రతిపాదనల్లో ఇప్పటి వరకు 531 యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించాయని తెలిపారు. అలాగే రూ.1,29,661 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 2.64 లక్షల ఉద్యోగాలు కల్పించినట్టు వెల్లడించారు.

ఏపీ నుంచి ఒక్క ప్రతిపాదనా రాలేదు

నదీ పరిరక్షణ పథకంపై ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి మహేష్ శర్మ సమాధానం



సాక్షి, హైదరాబాద్: జాతీయ నదీ పరిరక్షణ పథకం (నేషనల్ రివర్స్ కన్సర్వేషన్ ప్లాన్) కింద గత నాలుగేళ్ల నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క ప్రతిపాదన కూడా రాలేదని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి డాక్టర్ మహేష్ శర్మ వెల్లడించారు. రాజ్యసభలో వైఎస్సార్ సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఈ పథకం కింద గోదావరి నది కాలుష్యాన్ని నియంత్రించేందుకు రాజమండ్రి ఎన్ఆర్‌సీపీ పథకం కింద రూ.21.78 కోట్ల వ్యయంతో 30 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంటును నెలకొల్పామని పేర్కొన్నారు. అయితే నాలుగేళ్లలో మరే ప్రతిపాదన రాలేదన్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు 2015 మార్చిలో వెల్లడించిన నివేదిక ప్రకారం ఏపీలో 2,871 మిలియన్ లీటర్ల మేరకు మురుగు నీరు వస్తున్నదని, అందులో కేవలం 247.27 మిలియన్ లీటర్ల సామర్థ్యం మేరకు మాత్రమే మురుగునీటి శుద్ధి వసతులున్నాయని మంత్రి వెల్లడించారు. మురుగునీటిని నియంత్రించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తోడుగా జాతీయ నదీ పరిరక్షణ పథకం కింద కేంద్రం కూడా పలు నదుల్లో కాలుష్యాన్ని తొలగించే చర్యలు చేపడుతోందన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే ప్రతిపాదనల మేరకు వాటికి ఆమోదం తెలుపుతోందని వివరించారు. అలాగే అమృత్ పథకం కింద కూడా ఆర్థిక సాయం పొంది మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. ఏపీలోని గ్రామీణ ప్రాంతాల్లో వెలువడుతున్న మురుగునీటిపై అధ్యయనం ఏదీ చేయలేదని మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం మంత్రిత్వ శాఖ తమకు సమాచారమిచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు.

గృహ నిర్బంధంలో ఎంపీ అవినాష్‌రెడ్డి

- గాయపడిన కార్యకర్తల పరామర్శకూ అంగీకరించని పోలీసులు
- కొనసాగుతున్న 144 సెక్షన్
- పులివెందుల పోలీసులకు నోటీసులు

సాక్షి ప్రతినిధి, కడప: కడప పార్లమెంటు సభ్యులు అవినాష్‌రెడ్డిని పోలీసులు గృహ నిర్బంధించారు. పులివెందుల అభివృద్ధిపై చర్చించే విషయమై ప్రతిపక్ష, అధికారపార్టీ నేతల మధ్య ఆదివారం ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు డీఎస్పీ కె.కృష్ణణ్ నేతృత్వంలోని ప్రత్యేక పోలీసుల బృందం ఎంపీ అవినాష్‌రెడ్డిని సాయంత్రం 5 గంటల నుంచి గృహ నిర్బంధంలో ఉంచింది. సోమవారం ఉదయం కూడా ఎంపీ బయటకు వెళ్లకుండా ఆయన ఇంటి వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. నిన్న ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన కౌన్సిలర్ వరప్రసాద్‌ను పరామర్శించేందుకు వెళ్లాలని ప్రయత్నించినా డీఎస్పీ ససేమిరా అన్నారు. సాయంత్రం పార్టీ జిల్లా సమన్వయకర్త వైఎస్ వివేకానందరెడ్డి ఎంపీ ఇంటికి వెళ్లి అవినాష్‌రెడ్డిని పరామర్శించారు.



గృహ నిర్బంధంలో ఉన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి

144 సెక్షన్ కొనసాగింపు..

పులివెందులలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఎస్పీ బాబూజీ అట్టాడ ఆదివారం పట్టణంలో విధించిన 144 సెక్షన్‌ను సోమవారం కూడా కొనసాగించారు. వైఎస్సార్ హయాంలో పులివెందులలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రావాలంటూ టీడీపీ శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి ఎంపీ అవినాష్‌రెడ్డికి విసిరిన సవాలు చినికి చినికి గాలివానలా మారి చివరకు ఇరు పార్టీల నేతల మధ్య రణరంగానికి దారితీసింది. టీడీపీ నేతలు కవ్వింపు చర్యలకు దిగి.. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడిన విషయం విదితమే. కాగా ఘర్షణకు పాల్పడ్డ అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వీడియో టేపులు, ఫొటోల ఆధారంగా ఆందోళనకారులను గుర్తించి వారిపై కేసులు నమోదుకు సమాయత్తమవుతున్నారు.

పులివెందుల పోలీసులకు నోటీసులు

లీగల్ (కడప అర్బన్): పులివెందులలో ఘర్షణలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల నష్టం కలిగేలా ప్రవర్తించారని, బాధ్యులైన వారిపై పోలీసులు ఏ మేరకు చర్యలు తీసుకున్నారో అనే అంశంతో కూడిన ఫిర్యాదులు రావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గోకవరపు శ్రీనివాస్ స్పందించారు. ధ్వంసమైన ఆస్తుల వివరాలు చెప్పాలని, బాధ్యులైన వారిలో ఎవరెవరిపై కేసులు నమోదు చేశారో వివరాలు తెలుపాలని పులివెందుల పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌ఓలుగా వ్యవహరించే సీఐ, ఎస్ఐలకు నోటీసులు ఇచ్చామన్నారు. వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎదుట హాజరై వివరాలు తెలుపాలని, తర్వాత తమ పరిధిలో కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు.

ప్రత్యేక హోదా డిమాండ్‌కు ఊపిరి పోసింది వైఎస్సార్‌సీపీనే

పులివెందుల ఘటనకు టీడీపీ, పోలీసులే బాధ్యులు: ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేక హోదా డిమాండ్‌కు ఊపిరి పోసింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా పులివెందులలోని తన స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఆకాంక్ష తీవ్రతను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయడానికే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు తరలి వెళ్లి ఢిల్లీలో ధర్నా చేశారన్నారు. గడిచిన నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధర్నాలు, యువ భేరీ సదస్సులు పెట్టారన్నారు. 2016 సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినప్పుడు చంద్రబాబు ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం అన్నారు. అదే మనిషి ప్రత్యేక హోదా మన హక్కు అన్నారంటే ఆ క్రెడిట్ పూర్తిగా వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. చంద్రబాబు కేంద్రం నుంచి తన మంత్రులను వైదొలగించి తాము పెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలన్నారు. పులివెందులలో జరిగిన ఘటనకు పూర్తిగా టీడీపీ, పోలీసుల వైఖరే కారణం అన్నారు. టీడీపీ నాయకులు యథేచ్ఛగా రోడ్డుపైకి రాగా వారిని నిలువరించడంలో పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారన్నారు.

మాట మార్చిన ముఖ్యమంత్రిని అడగరేం?

- మీడియాకు బీజేపీ ఎమ్మెల్సీ వీర్రాజు ఎదురు ప్రశ్నలు
- వాస్తవాలు చెబుతుంటే మేము వైఎస్సార్‌సీపీ స్క్రిప్టు చదువుతున్నామంటారా?
- టీడీపీ నేతల తీరుపై మండిపాటు
- పునర్విభజన చట్టంపై సభలో చర్చ పెట్టాలి: ఎమ్మెల్సీ మాధవ్
- టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొడతాం: విష్ణుకుమార్‌రాజు


మీడియాతో మాట్లాడుతున్న మాధవ్, సోమువీర్రాజు, విష్ణుకుమార్‌రాజు

సాక్షి, అమరావతి

ప్రత్యేక హోదా కంటే ప్యాకేజీ మేలని అంగీకరించామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు మాట మారుస్తుంటే ఎందుకు అడగరు.. మీకు ప్రశ్నించాల్సిన బాధ్యత ఉందా? లేదా? చెప్పండి అంటూ ఎదురు ప్రశ్నలతో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మీడియా ప్రతినిధులను ఉక్కిరిబిక్కిరి చేశారు. తాత్కాలిక అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో సోమవారం తమ పార్టీ ఎమ్మెల్సీ మాధవ్ వెంట వచ్చిన వీర్రాజు తాను చెప్పాల్సింది ఏమీలేదని, ఏమైనా అడిగితే బదులిస్తానని అన్నారు. ఈ సందర్భంగా పలు టీవీ ఛానల్స్ ప్రతినిధులు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడాన్ని రాష్ట్ర బీజేపీ ఏ విధంగా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. దీంతో ఆయన మీడియాకు ఎదురు ప్రశ్నలు సంధించారు. రాష్ట్రానికి కేంద్రం రూ.3 వేల కోట్ల ప్యాకేజీ ఇస్తోందని అర్ధరాత్రి ప్రెస్‌మీట్ పెట్టి ఆనందం వ్యక్తం చేసిన చంద్రబాబు ఇప్పుడు హోదా, విభజన హామీలు అంటూ రోజుకో మాట మారుస్తున్నారని, అటువంటి వారిని మీరు అడగాలా? వద్దా? అంటూ ప్రశ్నించారు. ఆ తర్వాత ఆయన అసెంబ్లీలోని బీజేఎల్పీ గదిలో మంత్రి మాణిక్యాలరావు, బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబుపైనా, తెలుగుదేశం నేతలపైనా మరోసారి విరుచుకుపడ్డారు. వైఎస్సార్‌సీపీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలను చేర్చుకుని, అందులో కొందరికి మంత్రి పదవులు కూడా ఇచ్చిన టీడీపీ వారు తాము వాస్తవాలు చెబుతుంటే వైఎస్సార్‌సీపీ స్క్రిప్టు చదువుతున్నారంటూ అభాండాలు వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్రం ఏమీ ఇవ్వలేదని చెబుతున్న టీడీపీ నేతలు గ్రామీణాభివృద్ధి పథకాల కింద అత్యధిక నిధులు తామే తెచ్చుకొని వ్యయం చేశామని మంత్రి నారా లోకేష్ ప్రకటించడాన్ని గుర్తించాలన్నారు. తనకు ఎమ్మెల్సీ పదవిని భిక్షమేశామన్న విమర్శలను ప్రస్తావిస్తూ పార్టీ ఆదేశిస్తే ఈ క్షణమే వదులుకోవడానికి సిద్ధమని ప్రకటించారు. టీడీపీ నాలెడ్జి సెంటర్ ప్రచురించిన పత్రాలను చూపిస్తూ అందులో అంశాలన్నీ అవాస్తవాలేనన్నారు.

విభజన చట్టంపై సభలో చర్చ పెట్టాలి


ఏపీ పునర్విభజన చట్టం–2014పై అసెంబ్లీ, మండలిలో చర్చ జరపాలని కోరినట్టు బీజేపీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, ఆకుల సత్యనారాయణ చెప్పారు. తాత్కాలిక అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ విభజన హామీల అమలు, రాష్ట్రానికి కేంద్రం చేసిన సాయం వంటి అంశాలు సభలో చర్చిస్తే చాలా నిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. టీడీపీ దుష్ప్రచారాన్ని చట్టసభల్లో తిప్పికొడతామని చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను కేంద్ర ప్రభుత్వం పొడగించలేదని, ఈ విషయంలో జరుగుతున్న ప్రచారం అంతా అవాస్తమన్నారు.

మోదీకి వ్యతిరేకంగా టీడీపీ ఫ్లెక్సీలు

ఏపీ శాసనసభ ఎదుట ప్రధాని మోదీకి వ్యతిరేకంగా 'మోదీజీ ఏమిటీ వివక్ష?' అంటూ విజయవాడకు చెందిన టీడీపీ నాయకుడు కాట్రగడ్డ బాబు పేరిట వెలిసిన ఫ్లెక్సీలు బీజేపీ నేతల్లో కలకలం రేపింది. ఈ ఫ్లెక్సీని ప్రభుత్వం ఎలా అనుమతించిందని, మిత్రపక్షం బీజేపీ పట్ల టీడీపీ ప్రభుత్వ ఉద్దేశం ఇదేనా అని నేతలు విమర్శలు గుప్పించారు. శాసనసభలో బీజేపీ ఎల్పీ కార్యాలయంలో మంత్రి మాణిక్యాలరావు, శాసనసభ పక్ష నేత విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు సోము వీర్రాజు, మాధవ్, ఆకుల సత్యనారాయణ తదితరులు ఈ ఫ్లెక్సీలపై తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఇది టీడీపీ ఉద్దేశమా? లేక వ్యక్తిగతమా? అన్నది తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. తాము మిత్రధర్మాన్ని పాటిస్తున్నప్పటికీ, టీడీపీ ఏ మాత్రమూ తమను ఖాతరు చేయడం లేదని, ప్రధానినే అవమానిస్తున్నారని దుయ్యబట్టారు. తాము కూడా టీడీపీకి దీటుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగలమని మండిపడ్డారు.

28 వరకు అసెంబ్లీ సమావేశాలు

17 రోజులపాటు సభ • బీఏసీ సమావేశంలో నిర్ణయం



సాక్షి, అమరావతి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 28 వరకు జరగనున్నాయి. 17 రోజుల పాటు సభ నిర్వహించనున్నారు. సోమవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత స్పీకర్ కోడెల శివప్రసాదరావు అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. మంగళ, బుధవారాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ నిర్వహిస్తారు. ఆ తర్వాత బుధవారం ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం చంద్రబాబు ప్రసంగిస్తారు. 8న ఉదయం 11.30 గంటలకు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఆ తర్వాత వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. 12 నుంచి 15 వరకూ బడ్జెట్ సాధారణ చర్చ జరిపి, చివరి రోజు ఆర్థిక మంత్రి యనమల ప్రసంగిస్తారు. 19 నుంచి 23 వరకూ, 26 నుంచి 28వ తేదీ వరకూ శాఖల వారీగా కేటాయింపులపై చర్చ చేపడతారు. 28న ద్రవ్య వినిమయ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించిన తర్వాత సమావేశాలు వాయిదా వేయాలని నిర్ణయించారు. ఈ నెల 9, 10, 11, 17, 18, 24, 25 తేదీల్లో సభకు సెలవులుగా నిర్ణయించారు. సమావేశంలో సీఎం చంద్రబాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథ్‌రెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు. శాసన మండలి కూడా అసెంబ్లీ షెడ్యూల్ ప్రకారమే జరగనుంది. మండలి చైర్మన్ ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో సభ నిర్వహణపై ఈ మేరకు నిర్ణయించారు.

26 కేజీబీవీల్లో ఇంటర్ తరగతులు

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం
- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ తరగతులను ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ప్రయోగాత్మకంగా 26 కేజీబీవీలను ఎంపిక చేసింది. వీటిలో 2018–19 విద్యా సంవత్సరం నుంచి ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియెట్ తరగతులను ప్రారంభించనున్నారు. 2019–20 నుంచి సెకండియర్ తరగతులను ప్రారంభిస్తారు. ముందుగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ప్రవేశపెట్టనున్నారు. ఒక్కో గ్రూపులో 40 మందికి అవకాశం కల్పిస్తారు. 171 కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో అదనపు తరగతి భవనాలు, ఇతర భవనాల నిర్మాణానికి కూడా ప్రభుత్వం ఇంతకు ముందే ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో ముందుగా ఇంటర్మీడియెట్ కోర్సులు ప్రారంభించనున్న 26 కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో భవన నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. ఫ్యాకల్టీ నియామకం, విద్యార్థులకు అవసరమైన వసతి, భోజన ఖర్చుల మొత్తాన్ని సర్వశిక్ష అభియాన్ నిధుల నుంచి వెచ్చించనున్నారు.

ఇంటర్మీడియెట్ కోర్సు ప్రారంభమయ్యే కేజీబీవీలు ఇవే..

శ్రీకాకుళం: కొత్తపేట, జి.సిగడాం
విజయనగరం: గజపతినగరం, విజయనగరం, చీపురుపల్లి
విశాఖపట్నం: మునగపాక, సబ్బవరం, నక్కపల్లి
ప్రకాశం: సీఎస్‌పురం, కె.బిట్రగుంట
గుంటూరు: నాదెండ్ల
నెల్లూరు: కావలి, వెంకటగిరి
చిత్తూరు: విజలాపురం, గంగవరం
అనంతపురం: బీటీ ప్రాజెక్టు, పరిగి, బెళుగుప్ప
కర్నూలు: తుగ్గలి, చాగలమర్రి
వైఎస్సార్: పెదపసుపుల, వీరబల్లి
తూర్పుగోదావరి: శంఖవరం, రంగాపురం
పశ్చిమగోదావరి: కుక్కునూరు

జూడాల సమ్మె సైరన్

- సమస్యలు పరిష్కరించాలని నేటి నుంచి విధుల బహిష్కరణ
- అత్యవసర సేవలకు మినహాయింపు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): న్యాయపరమైన తమ సమస్యల పరిష్కార విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరికి నిరసనగా జూనియర్ వైద్యులు సమ్మెకు దిగనున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి విధులను బహిష్కరించనున్నట్లు ఇప్పటికే రాష్ట్ర వైద్య విద్యాసంచాలకులకు సమ్మె నోటీసులు అందించిన జూడాలు, సోమవారం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.చక్రధర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.శశాంక్‌లను కలిసి నోటీసులు అందజేశారు. ఉపకార వేతనాల విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా విధులను బహిష్కరిస్తున్నట్లు వారు వెల్లడించారు. తమకు 2016 జనవరి నుంచి స్టైఫండ్‌ను పెంచుతున్నట్లు గత నెలలో ప్రభుత్వం జీవో ఇచ్చినా దానిపై ఇంత వరకూ స్పష్టత ఇవ్వలేదని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ వికాస్ పేర్కొన్నారు. ప్రభుత్వం జూడాలకు సంబంధించి స్టైఫండ్, బకాయిలు చెల్లించడంతో పాటు, బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి విధుల బహిష్కరణ: సిద్ధార్థ వైద్య కళాశాలకు సంబంధించి 150 మంది హౌస్‌సర్జన్‌లు, 100 మందికిపైగా పీజీ విద్యార్థులు, 60 మందికిపైగా సీనియర్ రెసిడెంట్‌లు మంగళవారం నుంచి విధులు బహిష్కరించనున్నారు. వీరిలో అత్యవసర చికిత్సా విభాగం, పోస్టు ఆపరేటివ్, ట్రామాకేర్, ఐసీయూ, లేబర్ వార్డు వంటి వాటిల్లో విధులు నిర్వహిస్తున్న వారు మాత్రం మానవతా దృక్పథంతో విధులకు హాజరు కానున్నట్లు జుడాలు తెలిపారు.

11న కాపు నిరుద్యోగులకు జాబ్‌మేళా

సాక్షి, అమరావతి: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈనెల 11వ తేదీన కాపు నిరుద్యోగ యువతీ, యువకులకు మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు రాష్ట్ర కాపు సంక్షేమ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కోట్ల శివశంకర్‌రావు తెలిపారు. ఈ మేళాలో 25 సంస్థలు పాల్గొని కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాలకు చెందిన నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తాయని చెప్పారు. జాబ్‌మేళాకు వచ్చే అభ్యర్థులు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వారై ఉండాలని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఇతర కోర్సులు చేసిన వారు ఉదయం 9.00 గంటలకు రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 7331174453 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

సాక్షి
మంగళవారం, మార్చి, 6

'ఈశాన్యం'లో కాషాయం

గత సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) 'కాంగ్రెస్ ముక్త్ భారత్' నినాదంతో అధికారంలోకొచ్చింది. ఆ తర్వాత కొన్ని మినహాయింపులతో ఆ పనిలో విజయవంతమవుతూనే ఉంది. కానీ సీపీఎం విషయంలో అలాంటి నినాదమేదీ ఇవ్వకుండానే త్రిపురలో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీని తుడిచిపెట్టింది. త్రిపురలో 60 స్థానాల్లో 59 సీట్లకు ఎన్నికలు జరగ్గా బీజేపీకి 35 లభించాయి. ఆ పార్టీ కూటమిలోని ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ)కి వచ్చిన 8 సీట్లు లెక్కలోకి తీసుకుంటే కూటమి బలం 43 అవుతుంది. సుదీర్ఘకాలం నుంచి ఆ రాష్ట్రాన్నేలుతున్న సీపీఎం 16 సీట్లతో సరిపెట్టుకోవాల్సివచ్చింది. 60 సీట్లున్న మేఘాలయలో అత్యధికంగా... అంటే 21 స్థానాలొచ్చిన పార్టీగా కాంగ్రెస్ ఆవిర్భవించినా ఆ పార్టీకి అధికారం దక్కకుండా చేయడంలో బీజేపీ కృతకృత్యమైంది. అక్కడ నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) బీజేపీ ఆశీస్సులతో మంగళవారం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. 60 స్థానాలున్న నాగాలాండ్‌లోనూ అదే పరిస్థితి. అక్కడ ఇంతవరకూ పాలకపక్షంగా ఉన్న నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్)కు 27 స్థానాలు లభించి అతి పెద్ద పార్టీగా ఉన్నా 17 స్థానాలు వచ్చిన నాగాలాండ్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ)యే 12 స్థానాలున్న బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఎన్నికల ముందు బీజేపీ ఎన్‌పీఎఫ్‌తో ఉన్న పదిహేనేళ్ల చెలిమిని విడిచి ఎన్‌డీపీపీతో జట్టు కట్టింది. తాజా ఎన్నికల తర్వాత ఈశాన్యంలో ఒక్క మిజోరం తప్ప మిగిలినచోట్ల కాంగ్రెస్ కనుమరుగైంది. క్రైస్తవ మత ప్రాబల్యం అధికంగా ఉన్న ఈశాన్య రాష్ట్రాల్లో కాషాయ జెండా రెపరెపలాడటం, పైగా పాతికేళ్లుగా సీపీఎం ఏలుతున్న త్రిపురను సైతం తన ఖాతాలో వేసుకోవడం అసాధారణమే.

త్రిపురలో ఇంతవరకూ ఒకే ఒక్క స్థానం ఉన్న బీజేపీకి ఒక్కసారిగా 35 స్థానాలు రావడం, ఆ పార్టీతో కలిసి పోటీచేసిన ఐపీఎఫ్‌టీకి 8 రావడం సాధారణ విషయం కాదు. అయితే ఓట్ల శాతం రీత్యా చూస్తే బీజేపీ, సీపీఎంల మధ్య పెద్ద తేడా లేదు. బీజేపీకి 43 శాతం ఓట్లు లభిస్తే సీపీఎంకు 42.7 శాతం వచ్చాయి. ఇన్నాళ్లనుంచీ సీపీఎంకు గట్టి పోటీ ఇస్తున్న కాంగ్రెస్ తన ఓట్ల శాతాన్ని కోల్పోనట్టయితే బహుశా బీజేపీకి ఇక్కడ విజయం సాధ్యమయ్యేది కాదు. కానీ 2013లో 36.5శాతం ఓట్లు పొందిన కాంగ్రెస్ ఈసారి 1.5 శాతానికి పడిపోయింది. 34 ఏళ్లపాటు ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన పశ్చిమబెంగాల్‌లో సీపీఎం అధికారం కోల్పోయి ఏడేళ్లవుతోంది. దానికి త్రిపుర కూడా ఇప్పుడు తోడైంది. ఇక అయిదేళ్లకోసారి పాలక పక్షాన్ని మార్చే అలవాటున్న కేరళ మాత్రమే ప్రస్తుతం సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్(ఎల్‌డీఎఫ్) చేతిలో ఉంది. సుదీర్ఘకాలం అధికారంలో ఉండటం ఏ పార్టీకైనా బలమూ, బలహీనత కూడా. బలం ఎందుకంటే– ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలతో పార్టీ ప్రజలకు చేరువ కావొచ్చు. పలుకుబడిని పెంచుకోవచ్చు. సంస్థాగతంగా పటిష్టం కావొచ్చు. అయితే అదే సమయంలో పార్టీ శ్రేణుల్లో నిర్లిప్తత గూడుకట్టుకుంటుంది. ధీమా ఏర్పడుతుంది. క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతున్నదో పైనున్న నాయకత్వానికి అందకుండా పోతుంది. కేరళ వంటి రాష్ట్రాల్లో పార్టీ నాయకత్వమూ, శ్రేణులూ కూడా నిరంతర జాగురూకతతో ఉంటారు. ఎక్కడేం జరుగుతున్నదో, దాన్ని అనుకూలంగా మలుచుకొనేందుకూ లేదా అధిగమించేందుకూ చేయాల్సిందేమిటో నిరంతరం చర్చించుకునే ప్రక్రియ కొనసాగుతుంది. త్రిపురలో 2013 ఎన్నికల్లో కేవలం ఒకే ఒక సీటుతో, రెండు శాతంలోపు ఓట్లతో ఉన్న బీజేపీ ఈసారి సవాలు విసిరినప్పుడు సీపీఎం తేలిగ్గా తీసుకుంది.

కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ నిర్దిష్ట కార్యాచరణతో పనిచేస్తున్నదనీ, ముఖ్యంగా రెండేళ్లుగా వేలాదిమంది ఆరెస్సెస్ కార్యకర్తలు బీజేపీ అనుకూల వాతావరణం ఏర్పడటానికి కృషి చేస్తున్నారని సీపీఎం శ్రేణులు సరిగా గుర్తించలేకపోయాయి. ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ వ్యక్తిగతంగా నిరాడంబరుడే కావొచ్చు... సొంతానికి ఇల్లు కూడా లేకపోవచ్చు... నిజాయతీతో కూడిన పాలన అందించి ఉండొచ్చు–కానీ రాష్ట్రంలో అన్ని స్థాయిల్లో పాతుకుపోయిన బెంగాలీ సంస్కృతి ఆధిపత్యంపై గిరిజనుల్లో గూడుకట్టుకుంటున్న అసంతృప్తిని పసిగట్టడంలో ఆ పార్టీ విఫలమైంది. త్రిపురలో 31శాతంమంది గిరిజనులు. వారిలో ఎక్కువమంది మాట్లాడే కోక్‌బొరాక్ భాష కాకుండా బెంగాలీయే అధికార భాషగా, బోధనాభాషగా చలామణి కావడం ఆ అసంతృప్తికి కారణం. రెండున్నర లక్షలమంది రాష్ట్ర ప్రభుత్వ సిబ్బందికి జీతాల విషయంలోనూ ఈ తరహా ఆగ్రహమే ఉంది. గత జూన్‌లో ప్రభుత్వం నాలుగో వేతన సంఘం సిఫార్సులు అమలు చేసిందిగానీ తాము అధికారంలోకొస్తే ఏడో వేతన సంఘం సిఫార్సులు అమలు చేస్తామని బీజేపీ ప్రకటించింది. అది అమలైతే ప్రభుత్వ సిబ్బందికి ఒక్కసారిగా రెట్టింపు వేతనం లభిస్తుంది. దీనికితోడు రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ సమస్య కూడా సీపీఎంకు ప్రతికూలంగా మారింది. దేశంలో అత్యధిక నిరుద్యోగం(19.7శాతం) త్రిపురలోనే ఉంది. 2016 జాతీయ క్రైం రికార్డుల బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం జాతీయ సగటు కంటే త్రిపురలో ఆత్మహత్యల రేటు కూడా అధికమే.

ఎన్నికల్లో గెలుపోటములు సర్వసాధారణం. వాటినిబట్టే ఒక పార్టీ బలాన్ని లేదా బలహీనతల్ని లెక్కేయలేం. అయితే త్రిపురకూ, ఈశాన్య ప్రాంతంలోని ఇతర రాష్ట్రాలకూ తేడా ఉంది. ఇతర రాష్ట్రాల్లో ఉండే ప్రాంతీయ పార్టీలు దాదాపుగా ఆయా ప్రాంతాల్లోని గిరిజన తెగలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. కానీ త్రిపురలో కార్యకర్తలు పునాదిగా ఉన్న పార్టీ సీపీఎం. మళ్లీ ఆ స్థాయిలో శ్రేణులున్న బీజేపీ అడుగుపెడితే తప్ప సీపీఎంను ఓడించడం మరెవరికీ సాధ్యం కాలేదు. మొత్తానికి బీజేపీ ఈశాన్య రాష్ట్రాల్లో వేళ్లానుకున్న తీరు ఆ ప్రాంతం అభివృద్ధికి ఏ స్థాయిలో తోడ్పడగలదో వేచిచూడాలి. గొడ్డు మాంసం వంటి అంశాల్లో దేశంలో ఇతరచోట్ల ఉన్నట్టు ఈశాన్యంలో వ్యవహరిస్తే బీజేపీ వ్యతిరేకత మూటగట్టుకుంటుంది. ఈ విజయంలోని పరిమితులేమిటో ఇతరుల కంటే బీజేపీకే ఎక్కువ తెలుసు.



"ఎన్నికల్లో భాగం కావడం ఎంత ముఖ్యమో ప్రజాభీష్టాన్ని గ్రహించడం, దానికి అనుగుణంగా వ్యవహరించడం కూడా అంతే ముఖ్యం."
– జోస్ సరమగో
పోర్చుగల్ రచయిత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.పంచమి రా.3.20 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం స్వాతి రా.11.27 వరకు, తదుపరి విశాఖ, వర్జ్యం... లేదు, దుర్ముహూర్తం ఉ.8.38 నుంచి 9.25 వరకు, తదుపరి రా.10.56 నుంచి 11.46 వరకు అమృతఘడియలు ప.2.21 నుంచి 4.01 వరకు.


సూర్యోదయం : 6.20
సూర్యాస్తమయం : 6.04
రాహుకాలం : ప 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

నమాజ్ వేళలు

ఫజర్ : 5.19
జొహర్ : 12.27
అసర్ : 4.45
మగ్రీబ్ : 6.24
ఇషా : 7.36

'ఒంటరి'తనంతోనే పరాజయం

విశ్లేషణ



డాక్టర్ ఏపీ విఠల్

దేశవ్యాప్తంగా తమ ప్రత్యేకతలను గుర్తించే నిజమైన సమాఖ్య వ్యవస్థ కావాలన్న కోరిక బలమవుతోంది. బీజేపీ తన అఖండ భారత్ నినాదాన్ని, ఏక శిలా సదృశమైన హిందూ జాతి అనే నినాదాన్ని వదిలి, తమ తమ ప్రత్యేక హక్కులను కాపాడాలంటున్న వారితో ఎన్నికల స్నేహం చేస్తోంది. కానీ ఒక వ్యక్తికి అన్యాయం జరిగితేనే పోరాడాల్సిన కమ్యూనిస్టు పార్టీ.. ఒక ప్రాంతం ప్రాంతానికే అన్యాయం జరుగుతుంటే, ఆ ప్రజల సరైన భావోద్వేగాలకు విలువ ఇవ్వకుండా సమైక్య నినాదంతో ముందుకెళ్లి 'ఒంటరి' అయింది.

ఇటీవల ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాలలో, త్రిపురలో వామపక్ష కూటమి ఓటమి ప్రత్యేకించి సీపీఎం పార్టీ వారికే కాదు.. సహజంగా వామపక్ష ప్రజాతంత్ర శక్తులను, వ్యక్తులను కొంత ఆవేదనకు, నిరాశకు గురి చేసింది అనడంలో అవాస్తవం లేదు. ఎందుకిలా జరిగిందని నన్ను చాలా మంది ఫోన్‌లో అడిగారు. నాకు సైతం మాణిక్ సర్కార్ నేతృత్వంలో ఉన్న త్రిపుర ప్రభుత్వ ఓటమి ఓ పట్టాన మింగుడు పడలేదు. నిజానికి అందుకు తక్షణ కారణాలేమిటి? ప్రజలలో ఆ పాలన పట్ల వచ్చిన వ్యతిరేకతే ప్రధాన కారణమా? 20 ఏళ్ల అవిచ్ఛిన్న పాలన పిదప అక్కడి ప్రజలు 'మోదీ షా'లు చేసిన మార్పు నినాదానికి భ్రమపడ్డారా? ఎటూ తేల్చుకోలేకపోతున్నాను. అదే సమయంలో డబ్బు వెదజల్లడం వంటి అప్రజాస్వామిక ధోరణిలో సాగుతున్న ధనికస్వామ్య ప్రభావం అని సరిపుచ్చుకోలేకపోతున్నాను. అలాగే కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఓట్లు చాలా తక్కువ (కేవలం 2 శాతం) కనుక ఆ ఓట్లన్నీ బీజేపీకే పడ్డాయా? అయితే కాంగ్రెస్ అలా బీజేపీకి మద్దతిచ్చే ప్రసక్తి ఉండదనిపిస్తున్నది. ఏదేమైనా.. దేశంలోని రాష్ట్రాల ముఖ్యమంత్రులందరిలో నిరాడంబరుడు, అవినీతిరహితుడు, ఇంకో మాటలో చెప్పాలంటే అత్యంత పేదవాడు, సౌమ్యుడిగా దేశవ్యాప్తంగానే గౌరవాభిమానాలు పొందిన ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ప్రభుత్వ ఓటమి ఈ పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఔన్నత్యమే. ప్రజల జీవితాలను మెరుగుపర్చడం ఈ పార్లమెంటరీ వ్యవస్థకున్న పరిమితుల్లో సాధ్యమా అన్న ప్రశ్న రావడంలోనూ ఆశ్చర్యం లేదు. అంతే కాదు అస్తుబిస్తుగా ఉన్న ఈ 'అవ్యవస్థ' కూడా నేటి 'మోదీ షా'ల పాలనలో మృగ్యమవుతున్నది.

భౌతిక వాస్తవికత విస్మరిస్తే ఎలా?

మన దేశంలో కమ్యూనిస్టుల వైఫల్యాలను గురించి ఆ పార్టీ నేతల్లో వారినో, వీరినో విమర్శించి సరిపుచ్చుకుంటే తప్పు చేసినవారమవుతాం. వ్యక్తుల తప్పుల పేరుతో భౌతిక వాస్తవికతను విస్మరించజాలం. కార్ల్‌మార్క్స్ తన కమ్యూనిస్టు మేనిఫెస్టో ఆరంభంలోనే 'ఈ మేనిఫెస్టో ఇంగ్లాండ్ వంటి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలకు వర్తిస్తుంది. కానీ, అన్ని దేశాలూ ఇదే మానిఫెస్టోను యధాతథంగా అమలు జరపకుండా తమతమ దేశాల భౌతిక వాస్తవిక పరిస్థితిలో తగు మార్పులు చేసుకుని అన్వయించుకోవాల్సి ఉంటుంద'ని స్పష్టంగా పేర్కొన్నారు. కనుక ముందుగా మన కమ్యూనిస్టు పార్టీలు, మార్క్సిజాన్ని మన దేశ భౌతిక వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా అన్వయించ గలుగుతున్నాయా? అన్నది మొదటి ప్రశ్న. అలాంటప్పుడు మన దేశ ప్రత్యేక భౌతిక వాస్తవం ఏమిటి? వర్ణ (కుల) వ్యవస్థ పేరుతో వర్గదోపిడీ, వర్ణ (కుల) అణచివేత అంటే సామాజిక, సాంస్కృతిక అణచివేత పడుగుపేకల్లా కలిసే ఉన్నాయి. కనుక ఆ రెండు విధాల దోపిడీ అంతం కానిదే సోషలిజం సాధన మాట అటుంచి, కనీస పురోగమన చైతన్యం కూడా సాధించలేం. దీనిపై కమ్యూనిస్టులలో, బహుజనుల్లోనూ పునరాలోచన సాగుతోంది.

అయితే, భారతదేశంలోని మరో ప్రధానమైన ప్రత్యేకత అయిన జాతీయత అంశంపై మేధావుల్లో చర్చ జరగలేదు. దేశంలో విభిన్న రాష్ట్రాలు ఉన్నాయి. వాటిని భాషా ప్రయుక్త రాష్ట్రాలు అంటున్నాం. నిజానికి అవన్నీ వివిధ జాతుల సముదాయం అనడం సవ్యంగా ఉంటుంది. కానీ, ఇది అఖండ భారత జాతి' అనీ, 'ఏక శిలా సదృశమైన భారతజాతి' అనీ, అఖండ హిందూ జాతి అని వాదించే జాతీయ ఉన్మత్తులు, మతతత్వవాదులు కూడా ఉన్నారు. అలాగే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య సంగ్రామాన్ని భారత జాతీయోద్యమం అని మామూలుగా అంటుంటాము. కానీ వాస్తవానికి అది భారత జాతుల ఉద్యమం అనడం

రెండో మాట



శాస్త్రీయంగా, వాస్తవికంగా ఉంటుంది. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా వివిధ తరహాల ప్రజానీకం వివిధ పోరాట రూపాలను ఎంచుకున్నారు. భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు, కొమరం భీం, గదర్ వీరులు, వీరపాండ్య కట్టబ్రహ్మన్, టిప్పుసుల్తాన్.. ఇలా ఎంతోమంది వైవిధ్య భరితంగా పోరాడారు. అలాగే గిరిజనులు ఆదివాసీలు, వివిధ జాతులకు చెందిన వారు తమ జీవన భద్రతకే కాక ఆత్మగౌరవం కోసం కూడా పోరాడారు. పైగా వివిధ రాజ్యాల పాలకులు కూడా కొన్ని చోట్ల జనంతో కలిసి పోరాడారు. సిపాయిల తిరుగుబాటు దీనికి ఒక చక్కని ఉదాహరణ. మతాలు వేరైనా, వలస బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా హిందూ, ముస్లిం వీరులు ఐక్యంగా పోరాడారు. కార్మికవర్గ తిరుగుబాట్లు, నావికా తిరుగుబాటులో మన సైనికులు.. వీటన్నింటి సమష్టి కృషి వల్లే స్వతంత్ర భారత్ ఆవిర్భవించింది. ఈ పోరాటాలన్నింటినీ పూర్వపక్షం చేస్తూ ఏక శిలాసదృశమైన భారత జాతీయ పోరాటం అనడం, ఆయా పోరాటాల ప్రభావాన్ని, ప్రజల ధైర్యసాహసాలను త్యాగనిరతిని మరుగుపర్చినట్లే అవుతుంది.

మతం జాతికి ప్రాతిపదిక కానే కాదు

కమ్యూనిస్టులు ప్రత్యేకించి గుర్తుంచుకోవలసిన అంశం ఒకటుంది. జాతికి మార్క్సిస్టు దృక్పథాన్ని ప్రతిబింబిస్తూ స్టాలిన్ ఒక నిర్వచనం లాంటిది చెప్పారు. 'జాతి అంటే ప్రధానంగా ఒకే భాష, కుడిఎడంగా ఒకే భౌగోళిక వాతావరణం, ఒకే జీవన విధానం సారూప్యంగా ఉండే సాంప్రదాయ వ్యవహార శైలి ఉండేది జాతి'. కానీ మనదేశంలో ప్రధాని, రాష్ట్రపతి తమ తమ మాతృభాషల్లో ప్రసంగిస్తే నూటికి 50 మందికి పైగా మన దేశ ప్రజానీకానికి అర్థం కాదు. ఇక్కడ వివిధ రకాల భౌగోళిక వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. ఇక ఆహార అలవాట్ల వైవిధ్యం చెప్పనక్కర్లేదు. ఇంత వైవిధ్యం, ప్రాంత భిన్నత్వం గల జాతుల సముదాయంగా ప్రపంచంలో మరే దేశమూ లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే కెంపులు, నీలాలు, పచ్చలు ఇలా నవరత్నాలు పొదిగి ఉన్న స్వర్ణాభరణంలో శోభాయమానమైన వివిధ జాతుల సముదాయం మన దేశం. దాన్ని మొత్తాన్ని కరిగించి ఒకే వెండికడ్డీలాగా పోతపోయడం మాదిరి, ఒక ఏకశిలా సదృశ్యమైన భారత జాతి అనడం అశాస్త్రీయమే కాదు అవాంఛనీయం కూడా. నిజానికి మతం జాతికి ప్రాతిపదిక కానే కాదు. స్టాలిన్ 1951లోనే నేటి తూర్పు పాకిస్తాన్, పాకిస్తాన్‌లను మత ప్రాతిపదికన ఒకటి చేశారు కానీ తూర్పు పాకిస్తాన్‌లోని వంగ జాతి పాకిస్తాన్ నుంచి విడిపోయి వేరే దేశంగా ఏర్పడుతుంది అన్నారు. మరో 22 సంవత్సరాల్లో ఆ జోస్యం నిజమైంది. ఆ విధంగా మతం జాతికి ప్రాతిపదిక కాదని రుజువైంది.

త్రిపురలో మార్క్సిస్టుల ఓటమి సందర్భంగా ఈ జాతుల ప్రస్తావన దేనికి? అనే ప్రశ్న రావచ్చు. మన దేశానికి స్వాతంత్ర్యం రాకముందే అప్పటి కమ్యూనిస్టు పార్టీ ఈ జాతుల విషయంలో ఒక తీర్మానం చేసుకుంది. తత్పర్యవసానమే సుందరయ్యగారి విశాలాంధ్రలో ప్రజారాజ్యం రచన. బెంగాల్ కమ్యూనిస్టు పార్టీ 'సోనార్ బంగ్లా' కూడా అదే. కేరళలో అక్కడి కమ్యూనిస్టు పార్టీ 'సుందర కేరళ' అన్నది ఆ కోవలోనే. దేశంలోని వివిధ జాతుల ప్రజానీకం తమ తమ ప్రత్యేక రాజ్యాంగాలతో తమతమ నూతన ప్రజాస్వామ్య పాలనను సాధించుకోవాలనీ కేంద్ర ప్రభుత్వం అనేది రక్షణ, రవాణా, కరెన్సీ, విదేశీ వ్యవహారాలు వంటివాటికే పరిమితమైన ఫెడరల్ –సమాఖ్య– వ్యవస్థ ఏర్పడాలని నాటి కమ్యూనిస్టు పార్టీ (1943–44) తీర్మానం.

నిజమైన సమాఖ్య వ్యవస్థకు పెరుగుతున్న డిమాండ్

త్రిపురలో ఎన్నికల అనంతరం బీజేపీతో కలిసి పోటీచేసి వామపక్ష ప్రభుత్వాన్ని ఓడించిన మర్నాడే బీజేపీ మిత్రపక్షం (గిరిజనుల ప్రాతినిధ్య సంస్థ) ఐపీటీఎఫ్ తాను బీజేపీతో కలిసి పోటీ చేసినా.. గిరిజనులకు ప్రత్యేక రాష్ట్రం కావాలన్న తమ దశాబ్దాల డిమాండును మాత్రం విడిచిపెట్టబోమని, బీజేపీ ప్రభుత్వం అలా ప్రత్యేక రాష్ట్రం ఇచ్చి తీరాలని ప్రకటించింది. నిజానికి దేశ వ్యాపితంగా తమ ప్రత్యేకతలను గుర్తించే, రాజ్యాంగబద్ధమైన నిజమైన సమాఖ్య వ్యవస్థ కావాలన్న కోరిక బలమవుతోంది. ఎన్నికల గెలుపు కోసం బీజేపీ తన అఖండభారత్ నినాదాన్ని, ఏక శిలా సదృశమైన హిందూ జాతి అనే నినాదాన్ని వదిలి, దానికి వ్యతిరేకంగా తమ తమ ప్రత్యేక హక్కులను కాపాడాలంటున్న వారితో ఎన్నికల స్నేహం చేస్తోంది. ఒక విధమైన జాతీయ వాదం ఇప్పుడు ప్రబలుతోంది. ఇంతెందుకు, ప్రత్యేక తెలంగాణ డిమాండ్ కూడా అలాంటి సదృశమైన ఉద్యమమే. కానీ ఒక వ్యక్తికి అన్యాయం జరిగితేనే పోరాడాల్సిన కమ్యూనిస్టు పార్టీ ఒక ప్రాంతం ప్రాంతానికే అన్యాయం జరుగుతుంటే, ఆ ప్రజల సరైన భావోద్వేగాలకు విలువ ఇవ్వకుండా సమైక్య నినాదంతో ముందుకెళ్లి 'ఒంటరి' అయింది.

తెలంగాణ న్యాయమైన పోరాటాన్ని సరైన రీతిలో నిర్వహించేందుకు కమ్యూనిస్టు పార్టీ పోరాడినట్లయితే ఎంతో ఘనమైన చరిత్ర గల కమ్యూనిస్టు పార్టీ ఇలా తిరిగి తమ ప్రాభవం కోసం కష్టపడి తంటాలు పడాల్సి ఉండేది కాదు. అస్సాం, కశ్మీర్ ఇలా కేవలం ఎన్నికల విజయం కోసం తమ అఖండ భారతాన్ని పక్కన పెట్టి తానే విచ్ఛిన్నకులుగా పేరు పెట్టిన వారితో ఎన్నికల ఒప్పందాలు కుదుర్చుకుని, అదంతా తన బలుపు అని బీజేపీ చూపిస్తోంది. కానీ కమ్యూనిస్టు పార్టీలు మాత్రం మా దేహం ముక్కలైనా దేశాన్ని ముక్కలు కానివ్వం అన్న నినాదాలను ఒక కొసకు లాగి ఆయా జాతుల, ఉపజాతుల ప్రజల న్యాయమైన కోరికలకు సైతం మద్దతు ఇవ్వలేక వారినుంచి ఒంటరి అవుతున్నాయి. ఇప్పుడు మూడో ఫ్రంట్ పేరుతో కేసీఆర్ వంటివారి ప్రయత్నాలకు నిజానికి బీజేపీ అశాస్త్రీయ, నిరంకుశ పాలనే ప్రధాన కారణం. అంత మాత్రాన కాంగ్రెస్ సమాఖ్య స్వరూపాన్ని నిలిపిందని కాదు.

కమ్యూనిస్టులు గతంలో బతకడం, తమ వ్యూహమైన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన పేరుతో నేడు అవసరమైన ఎత్తుగడలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం అనేది దేశాన్ని ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక దాస్యంలో మగ్గిపోయిన మధ్యయుగాల పాలన వంటి దుస్థితికి దారితీస్తుంది. నిజానికి ఈశాన్య ప్రాంత ప్రజల న్యాయమైన డిమాండ్లను కమ్యూనిస్టు పార్టీలే తీసుకుని ప్రజాపోరాటాన్ని పెంచి ఉంటే ఆ పోరాటం అభివృద్ధి నిరోధక శక్తుల ఆధిపత్యంలోకి పోకుండా కొంతమేరైనా నియంత్రించగలిగేవారు.

వాస్తవానికి 1947లో స్వాతంత్ర్యం రాకముందే నాగాలాండ్ తనను తాను ఒక ప్రత్యేక దేశంగా ప్రకటించుకుని ఎన్నికలలో గెలిచి ఆనాటి రాజు నాయకత్వాన ప్రభుత్వాన్ని ఏర్పర్చుకుంది. అందులో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన భాగస్వామి కూడా. నిజంగా విచ్ఛిన్నకర పార్టీలను ఎదుర్కోవాలంటే, ప్రధాన శత్రువును గుర్తించి ఆయా ప్రాంత ప్రజల న్యాయమైన డిమాండ్లను బలపరుస్తూ ప్రతి అంశాన్ని అఖిల భారత స్థాయిలో కాకుండా స్థానికంగా ఉండే పార్టీలకు, స్థానిక నాయకత్వానికి స్థానిక ఉద్యమాలకు కమ్యూనిస్టులు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ దిశలో కమ్యూనిస్టు పార్టీ, బహుజనుల మధ్య ఐక్యత, మైత్రి బలపడాలి.

వ్యాసకర్త మార్క్సిస్టు విశ్లేషకులు | మొబైల్ : 98480 69720

సంకెళ్ల మాటున రెక్కలు

వీరి ఒత్తిడికి తలొగ్గిన అసెంబ్లీ మున్సిపల్ చట్టానికి సవరణ చేసి రిజర్వేషన్లు కల్పించింది. దీనిని నాగా తెగలకు నాయకత్వం వహించే నాగా హోహో, ఈఎన్‌పీవో తీవ్రంగా వ్యతిరేకించాయి.



సామాన్య

మూడు ఈశాన్యరాష్ట్రాలు –నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మాజీ ప్రధాని వాజ్‌పేయి చెప్పి నట్టు ఈ మూడింటిలో విల క్షణ చరిత్ర కలిగిన నాగా లాండ్ పైన నా దృష్టి కేంద్రీ కరించాను. అణచివేత ఎంత ప్రమాదకరమైనదో అర్థం చేసుకొని, స్వేచ్ఛకి అత్యంత ప్రాముఖ్యమిచ్చే నాగాల వ్యక్తిత్వం నా ఆసక్తికి ఒక కారణం కాగా, ఆ అసెంబ్లీలో మహిళా ప్రాతినిధ్యం గురించి జరుగు తున్న చర్చ ఇంకొక కారణం.

1963లో రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుండి 2013 వరకు జరిగిన 12 అసెంబ్లీ ఎన్నికలలో ఒక్క మహిళా అభ్యర్థి కూడా గెలుపొందలేదు. ఈ పన్నెండు ఎన్నికలలో 19 మంది మహిళలు మాత్రమే పోటీ చేశారు. 60 మంది శాసనసభ్యులు ఉన్న ఆ అసెంబ్లీకి ఈసారి 253 నామినేషన్లు దాఖలు కాగా, వారిలో మహిళలు ఐదుగురే. ఇప్పటి అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్ మాతృక యునైటెడ్ డెమొక్రాటిక్ పార్టీకి అధ్యక్షురాలిగా పనిచేసిన రానో ఎం షైజా 1977లో లోక్‌సభకు ఎన్నిక కావడం మినహా చట్టసభలకు నాగా మహిళల ప్రాతినిధ్యం శూన్యం. ఈ విషయం గురించి జర్నలిస్ట్ ఈప్సిత చక్రవర్తి 'ఇదొక ఆసక్తి కరమైన అభాస. ఎందుకంటే నాగా మహిళలు పురుషులతో పాటు సాయుధ పోరాటంలో చేయి చేయి కలిపి పోరా డారు, శాంతి ప్రక్రియలో భాగమయ్యారు, వివిధ పౌర సంఘాల్లో కూడా ఎంతో సంఘటితంగా పనిచేస్తున్నారు' అంటారు.

ప్రొఫెసర్ హేమండార్ఫ్ నాగా స్త్రీల పరిస్థితి గురించి వ్యాఖ్యానిస్తూ 'నాగా సమాజంలో స్త్రీ పురుషుల మధ్య సమానత్వం ఉన్నదనే విషయం ఆ సమాజాన్ని దగ్గరగా పరిశీలించిన వారెవరికైనా అర్థమవుతుంది. నాగా మహిళలు అనుభవించే స్వేచ్ఛ, సంతోషకరమైన జీవితం, ఉన్నత స్థాయి చూస్తే భారతదేశంలోని నాగరిక ప్రాంతాల స్త్రీలు అసూయపడగలరు' అంటారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే మహిళా అభివృద్ధి సూచికలలో నాగాలాండ్ ముందుంది. 2011 సెన్సస్ ప్రకారం దేశంలో చైల్డ్ సెక్స్ రేషియో 914 ఉంటే, నాగాలాండ్‌లో 943గా ఉంది. మహిళల్లో అక్షరాస్యత దేశ సగటుకంటే పది శాతం పాయింట్లు ఎక్కువగా, 76% ఉంది. మహిళలపై జరిగే నేరాలు అతి తక్కువ. వీరి సాంప్రదాయక చట్టాల ప్రకారం రేపిస్ట్‌ని కొట్టి చంపవచ్చు. అత్యున్నత స్థాయి బ్యూరోక్రాట్‌లలో కూడా మహిళలు 305 వరకూ ఉన్నారు. అయితే నాగా మహిళా సామాజిక అభివృద్ధికి దోహదం చేసిన సంస్కృతీ సంప్రదాయాలే నేడు వారి రాజకీయ ఆకాంక్షలకు అడ్డంకిగా మారాయి.

దేశంలోని వివిధ రాష్ట్ర అసెంబ్లీలలో మహిళా ప్రాతినిధ్యం సగటు శోచనీయంగా, 9% మాత్రమే. 73,74 రాజ్యాంగ సవరణల తర్వాత స్థానిక సంస్థలలో మాత్రం 33% రిజర్వేషన్లు అమలవుతున్నాయి. నాగాలాండ్ స్థానిక సంస్థలలో మహిళా రిజర్వేషన్ల గురించి పెద్ద యుద్ధమే జరుగుతున్నది. ఇందుకు నాగా మదర్స్ అసోసియేషన్ ఎన్నో

ఆలోచనం



ఏళ్లుగా పోరాడుతున్నది. వీరి ఒత్తిడికి తలొగ్గిన అసెంబ్లీ మున్సిపల్ చట్టానికి సవరణ చేసి రిజర్వేషన్లు కల్పించింది. దీనిని నాగా తెగలకు నాయకత్వం వహించే నాగా హోహో, ఈఎన్‌పీవో తీవ్రంగా వ్యతిరేకించాయి. నాగా సమాజానికి సమానత్వమే ప్రాతిపదిక కనుక భారతదేశంలోని పితృస్వామ్య రాష్ట్రాల మాదిరిగా ఇక్కడ రిజర్వేషన్లు అవసరం లేదని, సాంప్రదాయికంగా వస్తున్న శ్రమ విభజనకి ఇది విఘాతమని పరస్పర విరుద్ధ వాదనలు చేస్తున్నారు. వీరి ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం నాగాలాండ్‌కి ఆర్టికల్ 371 ఇచ్చిన వెసులుబాటుని ఉపయోగించుకొని 73, 74 రాజ్యాంగ సవరణలు తమ సంస్కృతీ సంప్రదాయాలకు విఘాతమని తీర్మానించింది. అయితే మున్సిపాలిటీలు ఆధునిక వ్యవస్థలని నాగా మదర్స్ అసోసియేషన్ వాదన. సుప్రీంకోర్టు ఈ వాదనతో ఏకీభవిస్తూ ఎన్నికలు నిర్వహించమని ఆదేశించింది. ఎన్నికలు హింసాత్మకం కావడం, ఇద్దరు మరణించడం, ముఖ్యమంత్రి రాజీనామా కారణంగాను ఎన్నికలు నిలిచిపోయాయి. ఈ మొత్తం పరిణామాల గురించి హెచ్‌సీయూ పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు యువాన్ హాసింగ్ ఒక విషయం చెప్పారు. ప్రభుత్వం, యూఎన్‌డీపీ నిర్వహించిన సర్వేల ప్రకారం దాదాపు 805 మంది మహిళా రిజర్వేషన్లకు అనుకూలంగా ఉన్నారనీ, పితృస్వామ్య భావజాలమే అడ్డంకి అనీ హాసింగ్ వ్యాఖ్యానించారు. దీనితో స్థానిక సంస్థల విషయం అటుంచితే ఈసారి అసెంబ్లీకి ఒక్క మహిళ అయినా గెలుస్తుందనే ఆశ కలిగింది. అబోయి నియోజకవర్గం నుండి బరిలో ఉన్న అవాన్ కోన్యాక్ మొదట ఆధిక్యతలో ఉన్నా చివరికి ఓడిపోయారు.


నాగా ప్రతిఘటనకి మొట్టమొదటి రూపం నాగా క్లబ్. 1927లో సైమన్ కమిషన్‌కి ఇచ్చిన నివేదికలో వీరు 'మమ్మల్ని మాకే వదిలి వేయండి. ఆదిమ కాలంలో ఏ విధంగా జీవించామో ఆ విధంగా జీవించడానికి అవకాశం ఇవ్వండి' అని అభ్యర్థించారు. నాగా ప్రతిఘటనోద్యమం విస్తరించడానికీ, తలల వేట వంటి ఆచారాలతో అనైక్యంగా ఉన్న తెగల, గ్రామాల మధ్య సామరస్యం నెలకొల్పి జాతీయవాదాన్ని పెంపొందించడానికీ క్రిస్టియానిటీ ఉపయోగపడింది. నాగాలాండ్‌లో వాహనాల మీద 'జీసస్ సేవ్స్' అనే నినాదం ఉంటుంది. కరుణామయుడూ, ప్రగతిశీలుడూ, ప్రియమైన విప్లవకారుడూ, అసాధారణ అమరవీరుడూ, పునరుత్థానం తరువాత మొదట మహిళకే దర్శనం ఇచ్చిన యేసుక్రీస్తును ఆకాశంలో సగమైన మా మహిళలకు అవనిలోనూ సగం, అసెంబ్లీలలోనూ సగం, పార్లమెంట్‌లోనూ సగం ఇవ్వమని వేడుకొనుచున్నాను. ఆమెన్!

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి | 80196 00900

బీజేపీ నారాయణ మంత్రం

బీజేపీ రాణేను పార్టీలో చేర్చుకోవాలని అనుకున్నా, శివసేన ఆగ్రహాన్ని గమనించింది. అందుకే తమ పార్టీలో చేరడానికి బదులుగా వేరే పార్టీని ఏర్పాటు చేసి బయట నుంచి మద్దతు ఇమ్మని కమలనాథులు చెప్పారు.

విశ్లేషణ



మహేశ్ విజాపుర్కర్

నారాయణ్ రాణేకు రాజ్యసభ సీటు ఇస్తామని బీజేపీ చెప్పడమంటే, రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితి గురించి ఆ పరిణామం చాలా వివరిస్తుంది. ఉదాహరణకి– తన చిరకాల భాగస్వామి శివసేనతో ఇప్పటికే అసిధారావ్రతం చేస్తున్న బీజేపీ భవిష్యత్తులో సంబంధాలు కొనసాగించాలని అనుకోదు. అయితే గడచిన ఎన్నికలలో మాదిరిగా ఒంటరిగా పోటీ చేస్తే ఫలితాలు అప్పటి వలెనే ఉంటాయన్న పూచీ మాత్రం లేదు.

రాణే మాజీ ముఖ్యమంత్రి. బాల్ ఠాక్రే ఆశీస్సులతో మనోహర్ జోషిని దిగ్విజయంగా పదవీచ్యుతుడిని చేశారు. కానీ ఆయన కూడా శివసేన నుంచి దారుణ పరిస్థితులలో బయటకు వచ్చాక, ఇంకెప్పుడూ కూడా ఠాక్రే కరుణకు నోచుకున్నట్టు కనిపించదు. అంతకు ముందే సేన నుంచి బయటపడిన వారు ఛగన్ భుజబల్. కానీ ఆయనకు మాత్రం ఠాక్రే కుటుంబంతో సాన్నిహిత్యం ఉంది. వారి ఇంట ఆతిథ్యానికి కూడా లోటు లేదు. ఆ నేతలంటే ఇప్పటికీ ఇష్టమే కూడా. రాణే ఆ అదృష్టానికి నోచుకోలేదు. రాణే మీద ఉద్ధవ్ ఠాక్రేకు ఉన్న ద్వేషం చాలా బలమైనది. అతడి పార్టీ భాగస్వామిగా ఉన్న ప్రభుత్వాన్ని అస్థిరం చేస్తానని ఆయన హెచ్చరించారు. రాణేను కనుక మంత్రిమండలిలో చేర్చుకుంటే ప్రభుత్వాన్ని కూల్చేస్తానంటూ వచ్చిన బెదిరింపులో బీజేపీ వాస్తవాన్ని చూసింది. ఇంకా చెప్పాలంటే అలాగే జరగవచ్చునని భావించింది. ఈ రణఘోషలు చేస్తున్నా, వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ఒకరిపై ఒకరు పోటీ చేయక తప్పదన్న వాస్తవమే బీజేపీని ఇప్పటికీ వెనక్కి లాగుతోంది. అప్పుడు బీజేపీ, సేన విభేదాలతో ఎన్నికలకు వెళ్లినా తరువాత కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. అయితే ఈశాన్య రాష్ట్రాలలో కమలం సాధించిన విజయం మహారాష్ట్ర బీజేపీ శాఖలో కొంత విశ్వాసం నింపి ఉండాలి. అదే జరిగితే ప్రస్తుతం ఘర్షణ పథంలో నడుస్తున్న సంకీర్ణ భాగస్వాములయిన ఆ రెండు పార్టీల సమీకరణలలో చాలా నాటకీయ పరిణామాలు సంభవిస్తాయి. అయితే ఇది తరువాత జరిగే ఎన్నికలకు కాస్త ముందు మాత్రమే చోటు చేసుకుంటాయని అనుకోవాలి. అప్పుడే సాధ్యమవుతుంది.

నారాయణ్ రాణే ఒక ఉప ఎన్నిక సహా ఇటీవల జరిగిన రెండు ఎన్నికలలోను ఓటమి పాలయ్యారు. కొంకణ్ దక్షిణ ప్రాంతం మీద ఆయన కుటుంబానికి ఉన్న పట్టు కూడా 2014లో చెల్లాచెదురయింది. అలాంటి వ్యక్తి మీద బీజేపీ మక్కువ చూపడమే రాజకీయానికి మూలం. ఆ



ప్రాంతం ఆయనకు అనుకూలంగా ఉన్న ప్రాంతం కాదని ఎప్పుడూ మరిచిపోలేనిది. ఆయన వచ్చే ఎన్నికలలో అక్కడ సేనకు సమస్యలు సృష్టించవచ్చు.

అందుకే బీజేపీ రాణేను పార్టీలో చేర్చుకోవాలని అనుకున్నా, శివసేన ఆగ్రహాన్ని గమనించింది. అందుకే తమ పార్టీలో చేరడానికి బదులుగా వేరే పార్టీని ఏర్పాటు చేసి బయట నుంచి తమకు మద్దతు ఇమ్మని కమలనాథులు చెప్పారు. రాణే చేసినది కూడా అనివార్యంగా అదే. ఎందుకంటే బీజేపీ తనదైన ముద్రను పటిష్టం చేసుకోవాలని భావిస్తున్నట్టే, రాణే కూడా తనకొక రాజకీయ ఆశ్రయం కావాలని గట్టిగా తపన పడుతున్నారు. ఇదే అటు రాణేను, ఇటు శివసేనను కూడా నిరాశకు గురి చేసింది.

రాజ్యసభ స్థానం ఇస్తామంటూ బీజేపీ ఇచ్చిన అవకాశాన్ని అందుకోవడానికి రాణే కూడా తొందరను ప్రదర్శించలేదు. తన నిర్ణయం చెప్పడానికి ఆయన కొంత సమయం కోరారు. అది ఈ వారంతో పూర్తయిపోతుంది. ఆయన ఢిల్లీలో తనకు సమున్నత స్థానాన్ని కోరుకున్నారా? తనతో పాటు తన కుమారులకు కూడా రాష్ట్రంలో మంచి స్థానం కావాలని కోరారా? వీటి కోసం ఎలాంటి ఏర్పాట్లు చేసుకున్నారు అన్న విషయాలు ఇంకా తెలియలేదు. ఇందుకు సంబంధించిన మొత్తం చర్చలు, బీజేపీ ఇవ్వజూపిన అవకాశాల గురించి ఇంకా తెలియవలసి ఉంది. ఏమైనప్పటికీ ముంబయ్ నుంచి ఒక వార్తాపత్రికకు రాణే స్వయంగా చెప్పినట్టుగా పేర్కొంటున్న విషయం ఒకటి ఉంది. అది రాణే బీజేపీ అధినేత అమిత్‌షాను దేవేంద్ర ఫడ్నవీస్‌తో కలసి ఢిల్లీ కలసినప్పుడు జరిగిన మాటామంతీ గురించినది. బీజేపీ పట్ల రాణేకు ఉన్న నిబద్ధత గురించి అక్కడ అడిగారు. అయితే రాణే ఆకాంక్షాలు ఏ స్థాయిలోను బీజేపీకి అసౌకర్యంగా మారకూడదని స్పష్టం చేయడం కూడా జరిగింది. కానీ రాణే ప్రస్థానాన్ని గమనిస్తే ఆయన ఆకాంక్షలు శివసేనలో ఉండగా అటు పార్టీకి, ఇటు ఆయనకీ కూడా కష్టంగా మారాయి. తరువాత ఆయన కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అక్కడ కూడా అదే జరిగింది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : mvijapurkar@gmail.com

ఇకపై 45 కేజీల యూరియా బస్తాలు



న్యూఢిల్లీ: యూరియా వినియోగం తగ్గించేందుకు, ఎరువుల వినియోగంలో సమతూకం పాటించే లక్ష్యంతో ఇకపై యూరియా బస్తాల్ని 50 కేజీలు కాకుండా 45 కేజీల్లో విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 45 కేజీల బస్తాల అమ్మకం మార్చి 1, 2018 నుంచే అమల్లోకి వచ్చిందని, అయితే ఇప్పటికే అందుబాటులో ఉన్న 50 కేజీల బస్తాల్ని వచ్చే రెండు నెలలు అమ్ముకునేందుకు అనుమతిస్తామని ఎరువుల శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. హెక్టారు పొలానికి బస్తాల లెక్కన యూరియాను రైతులు వాడుతున్నారని, వినియోగం తగ్గించమని చెప్పినా వినడం లేదని.. అందువల్లే 45 కేజీల బస్తాల్ని విక్రయిస్తున్నామని ఆయన చెప్పారు. పన్నులు జతచేయకుండా 45 కేజీల యూరియా బస్తాను రూ. 242కు విక్రయిస్తారని నోటిఫికేషన్‌లో ప్రభుత్వం వెల్లడించింది. టన్ను యూరియాకు ప్రభుత్వం నిర్ణయించిన రూ. 5360 ధరకు అనుగుణంగా బస్తా రేటును నిర్ణయిస్తున్నారు. కాగా 25 కేజీలకు మించకుండా బస్తాల్ని విక్రయించేందుకు డీలర్లకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అయితే ప్యాకింగ్ కోసం 2 కేజీల యూరియాకు రూ. 1.50, 5 కేజీలకు రూ.2.25, 10 కేజీలకు రూ. 3.50, 25 కేజీలకు రూ. 5లు డీలర్లు వసూలు చేసుకోవచ్చు.

చికిత్స కోసం విదేశాలకు వెళ్లనున్న పరీకర్

పనాజీ: కొంతకాలంగా క్లోమ గ్రంధి సమస్యతో బాధపడుతోన్న గోవా సీఎం మనోహర్ పరీకర్ ముంబైలోని ఆస్పత్రిలో చేరారు. అక్కడి వైద్యుల సూచన మేరకు విదేశాలకు వెళ్లనున్నట్లు సీఎంవో కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. చికిత్స నిమిత్తం ఆయన అమెరికా వెళ్లనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. సీఎం రాష్ట్రంలో లేని సమయంలో పాలనాపరమైన సూచనలిచ్చేందుకు 'కేబినెట్ సలహా కమిటీ'ఏర్పాటైంది. పరీకర్ నేతృత్వంలో సోమవారం ఇక్కడ జరిగిన భేటీలో ఈ మేరకు నిర్ణయించారు. బీజేపీకి చెందిన సీనియర్ మంత్రి ఫ్రాన్సిస్ డిసౌజా, గోవా ఫార్వార్డ్ పార్టీ(జీఎఫ్‌పీ)కి చెందిన విజయ్ సర్దేశాయ్, మహారాష్ట్రవాది గోమంత్రక్ పార్టీ(ఎమ్‌జీపీ)కి చెందిన పలువురు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. సీఎం పలువురు పోలీసు ఉన్నతాధికారులతో కూడా సమావేశమయ్యారు.

భారతీయుల డబ్బు కాజేస్తున్న నేరగాళ్లు

అమెరికాలో ఎంబసీ ఫోన్ నంబర్ల నుంచే నకిలీ కాల్స్



వాషింగ్టన్: అమెరికాలోని భారతీయులకు కొందరు సైబర్ నేరగాళ్లు రాయబార కార్యాలయం (ఎంబసీ) ఫోన్ నంబర్ల నుంచే కాల్స్ చేసి డబ్బులు కాజేస్తున్న సంఘటనలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. పాస్‌పోర్టులు, వీసాల్లో తప్పులు ఉన్నాయనీ, వాటిని సరిదిద్దుకోకపోతే అమెరికా నుంచి పంపించి వేయడం లేదా అక్కడే జైలులో పెడతారంటూ నేరగాళ్లు అక్కడి భారతీయ అమెరికన్‌లకు ఫోన్లు చేస్తున్నారు. తమ ఖాతాలోకి డబ్బులు జమచేస్తే లేదా క్రెడిట్/డెబిట్ కార్డుల వివరాలు, ఓటీపీ చెబితే ఆ తప్పులను తామే సరిదిద్దుతామని వారు నమ్మబలుకుతున్నారు. సాంకేతికతను వాడి రాయబార కార్యాలయం ఫోన్‌ల నుంచే కాల్స్ వస్తున్నట్లు మాయ చేసి నమ్మిస్తున్నారు. ఈ తరహా మోసాలు రాయబార కార్యాలయం దృష్టికి రావడంతో అలాంటి వాటిని నమ్మవద్దని అధికారులు ఓ ప్రకటన జారీ చేశారు. అమెరికా ప్రభుత్వానికి దీనిపై ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభించారు.

ఎఫ్ఐఆర్‌లో మేజర్ ఆదిత్య పేరు చేర్చలేదు

షోపియాన్ కాల్పుల కేసులో సుప్రీంకోర్టుకు తెలిపిన జమ్మూ ప్రభుత్వం

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో జనవరి 27న జరిగిన షోపియాన్ కాల్పుల కేసులో మేజర్ ఆదిత్య కుమార్‌కు ఊరట లభించింది. కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో ఆదిత్య పేరును నిందితునిగా చేర్చలేదని సుప్రీంకోర్టుకు జమ్మూకశ్మీర్ ప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఏప్రిల్ 24 వరకు కేసులో తదుపరి దర్యాప్తు నిలిపేయాలని ఆదేశించింది. జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో జనవరి 27న భారత సైన్యంపై అల్లరి మూకలు రాళ్లతో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో సైన్యం కాల్పులు జరపగా.. ముగ్గురు పౌరులు మృతిచెందారు. ఘటనపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దర్యాప్తునకు ఆదేశించగా.. 10 గర్వాల్ రైఫిల్‌కు చెందిన ఆర్మీ అధికారులపై సెక్షన్ 302, 307 కింద కేసు నమోదు చేశారు. అయితే ఎఫ్ఐఆర్‌లో తన కొడుకు పేరును ఏకపక్షంగా నమోదు చేశారని, ఆ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని ఆదిత్య తండ్రి లెఫ్టినెంట్ కల్నల్ (రిటైర్డ్) కరమ్‌వీర్ సింగ్ సుప్రీంను ఆశ్రయించారు.


కిమ్‌తో దక్షిణ కొరియా అధికారుల భేటీ



సియోల్: దక్షిణ కొరియాకు చెందిన అత్యంత సీనియర్ అధికారుల బృందం ఉత్తర కొరియాకు వెళ్లి ఆ దేశాధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను సోమవారం కలిసింది. గత దశాబ్ద కాలంలో దక్షిణ కొరియా అధికారులు ఉత్తర కొరియాకు రావడం ఇదే తొలిసారి. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ తరపున ప్రతినిధులుగా వచ్చిన ఈ బృంద సభ్యులు, అమెరికాతో చర్చలకు కిమ్‌ను ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఉభయ కొరియాల మధ్య ఉన్న శత్రుత్వాన్ని పక్కనబెట్టి ఇటీవలే దక్షిణ కొరియాలో జరిగిన శీతాకాల ఒలింపిక్స్‌కు కిమ్ సోదరి హాజరవడం తెలిసిందే. ఉత్తర కొరియాలో పర్యటించాల్సిందిగా మూన్‌ను ఆమె కిమ్ తరపున అప్పట్లో ఆహ్వానించారు.

ఎస్ఎస్‌సీ పేపర్‌లీక్‌పై సీబీ'ఐ'

విద్యార్థుల డిమాండ్‌ను అంగీకరించామన్న రాజ్‌నాథ్



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) పేపర్ లీక్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించింది. ఫిబ్రవరి 17 నుంచి 22 వరకు దేశవ్యాప్తంగా పలు సెంటర్లలో జరిగిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (టైర్–2) పరీక్షల్లో అవకతవకలపై విచారణ జరపాలంటూ ఎస్ఎస్‌సీ కోరిన నేపథ్యంలోనే కేంద్రం ఈ ప్రకటన చేసింది. ఈ విషయాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. 'విద్యార్థుల డిమాండ్‌ను మేం అంగీకరించాం. సీబీఐ విచారణకు ఆదేశించాం. ఈ విద్యార్థులంతా ఆందోళనలు విరమించాలని కోరుతున్నాం' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పేపర్ లీక్‌ను నిరసిస్తూ ఫిబ్రవరి 27నుంచి ఢిల్లీలోని ఎస్ఎస్‌సీ కార్యాలయం ముందు ఉద్యోగ ఆశావహులు నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. ఢిల్లీ బీజేపీ చీఫ్, ఎంపీ మనోజ్ తివారీ.. పలువురు విద్యార్థుల బృందంతో కలిసి ఆదివారం కమిషన్ చైర్మన్ అషీమ్ ఖురానాతో చర్చలు జరిపి.. సీబీఐ విచారణకు డిమాండ్ చేశారు. హోం మంత్రి రాజ్‌నాథ్‌ను కలిసి తమ ఆందోళనను తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ దిగువశ్రేణి ఉద్యోగాలను భర్తీచేసేందుకు ఎస్ఎస్‌సీ నియామక పరీక్షలు నిర్వహిస్తుంది. ఫిబ్రవరి 17 నుంచి 22 వరకు జరిగిన ఎస్ఎస్‌సీ పరీక్షలకు దేశవ్యాప్తంగా 1,90,000 మంది హాజరయ్యారు. అయితే ఫిబ్రవరి 17న జరిగిన పరీక్షలో ఢిల్లీ, భోపాల్లోని ఒక్కో పరీక్షా కేంద్రంలో అవకతవకలు జరిగినట్లు వెల్లడవటంతో విద్యార్థులు ఆరు రోజులుగా ఆందోళన చేస్తున్నారు.



సిరియాలో తిరుగుబాటుదారుల అధీనంలోని ప్రాంతంపై సైన్యం జరిపిన వైమానిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారి. తూర్పు గౌతా ప్రాంతంలో సోమవారం జరిగిన ఈ దాడిలో దాదాపు 45 మంది పౌరులు మరణించారు

ఆధ్యాత్మిక పాలన అందిస్తా

తమిళనాడులో మంచి నాయకుడు లేడు

- ఆ లోటు భర్తీకే వస్తున్నా
- ఎంజీఆర్‌ను కాను.. ఆ తరహా సుపరిపాలన అందిస్తా
- చెన్నైలో రజనీకాంత్ ప్రసంగం



చెన్నైలో ఎంజీఆర్ ఎడ్యుకేషనల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో అభిమానులకు అభివాదం చేస్తున్న రజనీకాంత్



ఎంజీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించాక అభిమానులతో మాట్లాడుతున్న రజనీ

సాక్షి, చెన్నై: పార్టీ పేరు ప్రకటించి, పూర్తిస్థాయి రాజకీయ ఆరంగేట్రం చేయకముందే.. సూపర్ స్టార్ రజనీకాంత్ తన భవిష్యత్ రాజకీయ మార్గమెలా ఉండబోతోందో స్పష్టం చేశారు. జీవన విధానంలో ఆధ్యాత్మికతను నింపుకున్న రజనీ.. తన రాజకీయ మార్గం కూడా అదే దిశలో ఉండబోతోందని తేల్చి చెప్పారు. కుల, వర్గ వివక్ష లేని ఆధ్మాత్మిక పాలన అందిస్తానని స్పష్టం చేశారు. అదేసమయంలో సుపరిపాలన అందించేందుకు సాంకేతికత, సాంకేతిక నిపుణుల సహకారం తీసుకుంటానన్నారు.అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీ రామచంద్రన్(ఎంజీఆర్ స్థాయి తనది కాదని, తనే కాదు.. మరో వెయ్యేళ్లయినా ఆ స్థాయి నేత ఉద్భవించబోడన్న రజనీ.. ఎంజీఆర్ తరహాలో అద్భుత పాలన మాత్రం అందించగలనన్నారు. జయలలిత మరణం, కరుణానిధి అనారోగ్యంతో రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఆవరించిందని, దాన్ని తొలగించేందుకే తాను రాజకీయ రంగప్రవేశం చేస్తున్నానని వివరించారు.

రాజకీయాలు మాట్లాడక తప్పడంలేదు!

ఆధ్యాత్మిక పాలన అంటే ఏంటోనంటూ కొందరు హేళన చేస్తున్నారనీ, అలాంటి వారికి దాని సత్తా ఏంటో చూపిస్తానని ఆయన పేర్కొన్నారు. చెన్నై పూందమల్లిలోని ఎంజీఆర్ విద్య, పరిశోధన కేంద్రం 30వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం జరిగాయి. ఆ వేడుకలకు హాజరైన రజనీ.. అక్కడ ఎంజీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. 'ఈ వేదికపై రాజకీయాలు మాట్లాడకూడదని అనుకున్నాను. కానీ మాట్లాడక తప్పడం లేదు' అంటూ రజనీ తన ప్రసంగం ప్రారంభించారు. ఎంజీఆర్ శతజయంతి ఉత్సవాలను అన్నాడీఎంకే ప్రభుత్వం వాడవాడల్లో ఘనంగా జరిపిందనీ, అయితే ఆయన చిత్ర రంగానికి చెందిన వాడయినప్పటికీ సినిమా వాళ్లతో కలసి వేడుకలు నిర్వహించనే లేదని రజనీ అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు రాజకీయాలు కొత్తేమీ కాదనీ, ఎంజీఆర్, కరుణానిధి, మూపనార్, చో రామస్వామి వంటి వారిని చూసి రాజకీయాలు నేర్చుకున్నాననీ, ఆ విద్యను ఎప్పుడు ఎలా ప్రయోగించాలో బాగా తెలుసునని వ్యాఖ్యానించారు.

సత్తా ఏమిటో చూపుతా..

'రాజకీయాల్లోకి సినిమా వాళ్లు ఎందుకని కొందరు ప్రశ్నించారు. రాజకీయ ప్రవేశం చేస్తున్నట్లు ప్రకటించినప్పటి నుంచి నాపై ఎన్నో విమర్శలు, ఆరోపణలు, హేళనలు చేస్తున్నారు. నా వయస్సు 67 ఏళ్లు. ఈ వయసులోనూ నటుడిగా నా పని నేను చేసుకుంటుంటే కొందరు నేతలు మాత్రం వారి పని వారు సక్రమంగా చేయడం లేదు. అందుకే నేను ప్రజాక్షేత్రంలోకి రావాల్సి వస్తోంది' అని రజనీ తన ప్రసంగంలో చెప్పారు. రాజకీయమంటే ముళ్లు, పాములు, రాళ్లు రప్పలతో నిండినదని తనకు తెలుసునన్నారు. 'నేను రాజకీయాల్లోకి వస్తానంటే అడ్డుకునేందుకు మీరెవ్వరు? తిట్ల రాజకీయాలు ఆపేస్తే మంచిది' అని ఆయన కొందరిని పరోక్షంగా హెచ్చరించారు. ఆధ్యాత్మికతలో పరమాత్మ ఉందనీ, కుల, మత, జాతుల పరమైన పక్షపాతం లేకుండా నిజాయితీతో సేవ చేయాలన్న తపనే తన రాజకీయం అని రజనీ చెప్పారు. జయలలిత బతికున్నప్పుడు ఎందుకు రాజకీయ ప్రవేశం చేయలేదని ప్రశ్నిస్తున్నారనీ, అప్పట్లోనూ నేతలకు ముచ్చెమటలు పట్టించే సంకేతాలను తాను ఇచ్చిన విషయాన్ని వారు మరచిపోయినట్టు ఉన్నారని రజనీ అన్నారు.

చివరిరోజు ఆమోదించారు

- ఏడు కంపెనీలకు లాభం చేసేలా నిర్ణయం
- 2014 లోక్‌సభ ఫలితాలు వెలువడిన రోజే..
- దీనివల్ల చిదంబరానికి ఎంత మేలు జరిగింది?
- కాంగ్రెస్ హయాం అవినీతిపై మండిపడ్డ బీజేపీ





న్యూఢిల్లీ: 2014లో లోక్‌సభ ఎన్నికల ఫలితాల రోజు.. ప్రైవేటు కంపెనీలకు లబ్ధిచేకూర్చేలా మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం పలు బిల్లులను ఆమోదించారని బీజేపీ ఆరోపించింది. గీతాంజలి జెమ్స్ సహా పలు కంపెనీలకు మేలు చేసేలా బంగారు దిగుమతి పథకాన్ని తీసుకొచ్చారని పేర్కొంది.ఈ నిర్ణయం ద్వారా చిదంబరం ఎంత లాభం పొందారని కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ప్రశ్నించారు. విపక్షాలు బీజేపీపై చేస్తున్న అసత్యాలను ప్రజలకు వివరించేందుకు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ.. దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసింది. మొండి బకాయిలు బ్యాంకు పుస్తకాల్లో లేకుండా చేసింది. ప్రభుత్వం చివరి ఆరేళ్లలో రూ.52.15లక్షల కోట్లను అడ్వాన్స్‌గా కంపెనీలకు ఇచ్చింది. ఇందులో 36 శాతం నిధులు మొండి బకాయిలుగా గుర్తించగా.. అవి ప్రభుత్వం గద్దెదిగే సమయానికి 82 శాతానికి చేరాయి. గొప్ప ఆర్థికవేత్తలైన మన్మోహన్ సింగ్, చిదంబరంల హయాంలో అనవసర జోక్యం, మొండి బకాయిలను ప్రోత్సహించటం, ఒత్తిడి చేయటంతో బ్యాంకింగ్ వ్యవస్థ పట్టాలు తప్పింది' అని వెల్లడించారు. 80:20 పథకం ద్వారా ఏడు ప్రైవేటు కంపెనీలకు భారీగా లబ్ధి చేకూరిందన్నారు. 'మే 16న మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఓడిపోయింది. చిదంబరం కుర్చీ ప్రమాదంలో పడింది. చివరి రోజు అత్యవసరంగా ఏడు ప్రైవేటు కంపెనీలకు మేలు చేసేలా ఎందుకు నిర్ణయం తీసుకున్నారో.. చిదంబరం, రాహుల్ గాంధీ వెల్లడించాలి' అని రవిశంకర్ చెప్పారు.

పీఏసీకి '80:20' వివరాలు

యూపీఏ హయాంలో తెచ్చిన 80:20 బంగారు దిగుమతి పథకం వివరాలను పార్లమెంటు ప్రజాపద్దుల సంఘానికి (పీఏసీ) ఆర్థిక శాఖ అందజేయనుంది. ఈ పథకంలోని లొసుగులను వినియోగించుకునే గీతాంజలి గ్రూప్ ప్రమోటర్ మెహుల్ చోక్సీ మనీల్యాండరింగ్‌కు పాల్పడ్డారంటూ పీఏసీలోని బీజేపీ సభ్యులు ఆరోపించిన నేపథ్యంలో.. ఆర్థిక శాఖ పథకం వివరాలను సేకరిస్తోంది. పథకం, తదనంతర పరిణామాలపై 10 రోజుల్లో పీఏసీకి వివరాలు ఇవ్వనుంది. 80:20 బంగారు దిగుమతి పథకం ప్రకారం.. వ్యాపారస్తులు తాము గతంలో దిగుమతి చేసుకున్న బంగారంలో కనీసం 20 శాతమైనా ఎగుమతి చేసి ఉంటేనే.. తర్వాత మరోసారి బంగారం దిగుమతి చేసుకునేందుకు వీలుంటుంది.

డోక్లాంలో చైనా నిర్మాణాలు

రాజ్యసభలో రక్షణ మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ: డోక్లాం సరిహద్దుల్లో చైనా హెలిప్యాడ్లు, సెంట్రీ పోస్టులను నిర్మించిందని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఆమె మాట్లాడుతూ.. '2017లో డోక్లాం సరిహద్దుల్లో ఇరుదేశాలు బలగాలను వెనక్కు తీసుకున్నాయి. అయితే ఇటీవల మళ్లీ భారత్, చైనా దేశాలు మళ్లీ డోక్లాంలోని అదే ప్రాంతంలో తమ బలగాలు (తక్కువ సంఖ్యలో) మోహరించాయి. శీతాకాలంలో ఈ బలగాలను నిర్వహించేందుకు చైనా ఆర్మీ హెలిప్యాడ్లు, సెంట్రీ పోస్టులు, కందకాలు నిర్మించింది' అని మంత్రి తెలిపారు. ఉపగ్రహ చిత్రాల్లో యుద్ధట్యాంకులు, క్షిపణులను మోహరించటంతోపాటు సరిహద్దుల్లో చైనా ఏడు హెలిప్యాడ్లు నిర్మించినట్లు తెలుస్తోందంటూ ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా నిర్మలా సీతారామన్ ఈ సమాధానమిచ్చారు.

ఆర్మీ X కశ్మీర్ సర్కార్

- షోపియాన్ కాల్పులపై తలోమాట
- చనిపోయింది పౌరులన్న జమ్మూకశ్మీర్ సీఎం
- వారు ఉగ్రవాదులేనన్న ఆర్మీ

శ్రీనగర్: ఉగ్రవాదులను తుదముట్టించేందుకు జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాల్లో ఆదివారం రాత్రి ఆర్మీ చేపట్టిన ఆపరేషన్‌లో ఆరుగురు హతమయ్యారు. ఇందులో ఇద్దరు లష్కరే మిలిటెంట్లతోపాటు వారితో ఉన్న నలుగురినీ ఆర్మీ అంతమొందించింది. అయితే ఆ నలుగురూ ఉగ్రవాదులేనని ఆర్మీ స్పష్టం చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వారు పౌరులేనంటోంది. ఆదివారం రాత్రి దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్‌లోని పహ్నూ ప్రాంతంలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న జవాన్లు వేగంగా వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఆపే ప్రయత్నం చేశారు. దీంతో ఆ రెండు వాహనాలనుంచి హఠాత్తుగా కాల్పులు ప్రారంభమయ్యాయి. దీంతో జవాన్లు ఆత్మరక్షణ కోసం కాల్పులు ప్రారంభించారు. జవాన్లు అప్రమత్తమై కాల్పులు ప్రారంభించటంతో.. లష్కరే ఉగ్రవాది ఆమిన్ మాలిక్, ఆషిక్ సహా ఆరుగురు హతమయ్యారు.



ముఫ్తీ వకాస్

ఆర్మీ చేతుల్లో జైషే ఉగ్రవాది హతం

ఉగ్రసంస్థ జైషే మహ్మద్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ సంస్థ కీలక నేతగా (ఆత్మాహుతి దాడులకు ప్రణాళికలు రూపొందిస్తూ) ముఫ్తీ వకాస్ భారత బలగాలు, జమ్మూకశ్మీర్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో హతమయ్యాడు. ఫిబ్రవరి 10న సంజువాన్ ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రదాడిలో వకాస్ సూత్రధారి అని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. సోమవారం అవంతీపూర్ జిల్లా హత్వార్‌లోని ఓ ఇంట్లో ముఫ్తీ వకాస్ ఉన్నాడన్న సమాచారంతో ఆ ఇంటిని చుట్టుముట్టిన బలగాలు 20 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తిచేశాయి.

నేడు త్రిపుర సీఎం ఎంపిక

అగర్తలా: మంగళవారం జరిగే త్రిపుర బీజేపీ, దాని మిత్రపక్షం ఐపీఎఫ్‌టీ శాసనసభా పక్ష సమావేశంలో ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. త్రిపుర సీఎంగా ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విప్లవ్ దేవ్ పేరు దాదాపుగా ఖరారైనా.. నేడు జరిగే భేటీలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఆయనను శాసనసభా పక్ష నేతగా ఎన్నుకోనున్నారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు గడ్కారీ, ఓరంలు పరిశీలకులుగా హాజరవుతారు. ఈనెల 8న నూతన మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేస్తుంది.

నాగాలాండ్‌లో..: ఎన్నికల భాగస్వామి ఎన్‌డీపీపీతో కలిసే నాగాలాండ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని బీజేపీ తెలిపింది. 15 ఏళ్లపాటు మిత్రపక్షంగా కొనసాగిన నాగా పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్)కు మద్దతు ఇవ్వబోమని చెప్పింది.

రక్షణకు 11 లక్షల కోట్లు

- భారీగా చైనా బడ్జెట్
- భారత్ కన్నా మూడున్నర రెట్లు ఎక్కువ



బీజింగ్: భారత్ సహా వివిధ దేశాలతో సరిహద్దు వివాదాలను ఎదుర్కొంటున్న చైనా ఈ ఏడాది తన రక్షణ, సైనిక కార్యకలాపాల కోసం బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించింది. బడ్జెట్ నివేదికను చైనా ప్రధాన మంత్రి లీ కెఖియాంగ్ ఆ దేశ పార్లమెంటు ఎన్‌పీసీ (నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్)కి సమర్పించారు. 6.5 శాతం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటును ఈ ఏడాదికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు బడ్జెట్ నివేదికలో చైనా పేర్కొంది. రక్షణ కోసం 175 బిలియన్ డాలర్ల (సుమారు రూ.11.40 లక్షల కోట్లు) నిధులను కేటాయించింది. గతేడాదితో పోలిస్తే ఇది 8.1 శాతం ఎక్కువ. అమెరికా తర్వాత రక్షణ విభాగానికి అత్యధికంగా నిధులు కేటాయిస్తున్న దేశం చైనాయే. భారత్ తన బడ్జెట్‌లో రక్షణ విభాగానికి కేటాయించిన నిధుల (46 బిలియన్ డాలర్లు– దాదాపు రూ.2.99 లక్షల కోట్లు) కన్నా చైనా బడ్జెట్ దాదాపు మూడున్నర రెట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం.

బహుళ పార్టీ వ్యవస్థతో అర్థం లేని పోటీ

బహుళ పార్టీ ప్రజాస్వామ్యంతో పార్టీల మధ్య 'అనారోగ్యకర పోటీ' నెలకొంటుందని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు. చైనా అనుసరిస్తున్న ఏక పార్టీ వ్యవస్థే మంచిదన్నారు. చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సీపీపీసీసీ) సదస్సులో జిన్‌పింగ్ మాట్లాడారు. 'చైనా వ్యవస్థ కొత్తది. ఎందుకంటే ఇది అన్ని రాజకీయ పార్టీలను, పార్టీల ప్రమేయం లేని ప్రజలను ఉమ్మడి లక్ష్యం కోసం ఏకం చేస్తుంది. అధికార మార్పిడి, పార్టీల మధ్య అనారోగ్యకర పోటీతో వచ్చే నష్టాలు లేకుండా చేస్తుంది'అని అన్నారు.

కుదిపేసిన బ్యాంకింగ్ స్కాంలు

ఎలాంటి చర్చ లేకుండానే ఉభయసభలు నేటికి వాయిదా

- నీరవ్ ఆచూకీపై ప్రధాని సమాధానానికి ప్రతిపక్షాల పట్టు
- రాజ్యసభలో స్వల్పకాలిక చర్చకు మొగ్గుచూపని విపక్షాలు
- తెలంగాణలో ఎస్టీ, మైనార్టీల రిజర్వేషన్లు పెంచాలని టీఆర్ఎస్ డిమాండ్

న్యూఢిల్లీ: ప్రతిపక్షాల ఆందోళనల మధ్య మలిదశ బడ్జెట్ సమావేశాలు వాడీవేడిగా ప్రారంభమయ్యాయి. ఊహించినట్లే బ్యాంకింగ్ కుంభకోణాలపై విపక్షాలు ఉభయ సభల్ని స్తంభింపచేశాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై ప్రత్యేక చర్చ చేపట్టాలని, ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్, తృణమూల్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు లోక్‌సభ, రాజ్యసభల్లో పోడియంను చుట్టుముట్టి నినాదాలతో హోరెత్తించాయి. రిజర్వేషన్ల అంశంపై లోక్‌సభలో టీఆర్ఎస్, కావేరీ నదీ జలాల బోర్డు ఏర్పాటుపై సమాధానం చెప్పాలని పట్టుబడుతూ ఉభయ సభల్లో అన్నాడీఎంకే, డీఎంకేలు ఆందోళన కొనసాగించాయి.

ప్రశ్నోత్తరాల్లేకుండానే...

పీఎన్‌బీ కుంభకోణంపై విపక్షాల ఆందోళనలతో లోక్‌సభలో వాయిదాల పర్వం కొనసాగింది. దీంతో ప్రశ్నోత్తరాల సమయాన్ని చేపట్టకుండానే స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదావేశారు. సభ తిరిగి ప్రారంభమయ్యాక.. కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి పీఎన్‌బీ కుంభకోణం సూత్రధారి నీరవ్ మోదీ ఎక్కడున్నారో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ కూడా అదే అంశంపై నినాదాలు చేస్తూ కాంగ్రెస్‌కు జతకలిసింది. తెలంగాణలో ఎస్టీలు, మైనార్టీలకు రిజర్వేషన్లు పెంచాలని కోరుతూ టీఆర్ఎస్ ఎంపీలు స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టారు. రిజర్వేషన్ల అంశాన్ని రాష్ట్రానికే విడిచిపెట్టేలా ఆర్టికల్ 16ను సవరించాలని ఆ పార్టీ ఎంపీలు డిమాండ్ చేశారు. అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. ఉదయం లోక్‌సభ ప్రారంభానికి ముందు ప్రధాని మోదీ సభలోకి రాగానే బీజేపీ సభ్యులు చప్పట్లతో



ఢిల్లీలో పార్లమెంటు ప్రాంగణంలో విజయసంకేతం చూపిస్తున్న ప్రధాని మోదీ, అమిత్, రాజ్‌నాథ్, గడ్కారీ తదితరులు

స్వాగతం పలికారు. అనంతరం అధికార, ప్రతిపక్ష సభ్యులకు మోదీ అభివాదం చేశారు. మూడు ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ, దాని మిత్రపక్షాల విజయానికి సంకేతంగా బీజేపీ ఎంపీలు అస్సామీ గమోసా(కండువా)లతో దర్శనమిచ్చారు.

నిబంధన మేరకు చర్చకు అనుమతిస్తా

అటు పీఎన్‌బీ కుంభకోణంపై రాజ్యసభలోను ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. ఉదయం సభ ప్రారంభం కాగానే తృణమూల్ కాంగ్రెస్ బ్యాంకింగ్ కుంభకోణాల్ని ప్రస్తావించగా.. కావేరీ నదీ జలాల నిర్వహణ బోర్డు ఏర్పాటుపై సుప్రీం ఆదేశాల్ని అమలుచేయాలని అన్నాడీఎంకే, డీఎంకేలు పట్టుబట్టాయి. దీంతో చైర్మన్ వెంకయ్య నాయుడు సభను పదినిమిషాలు వాయిదా వేశారు. అనంతరం సమావేశమయ్యాక వెంకయ్య మాట్లాడుతూ.. పీఎన్‌బీ అంశంపై చర్చించాలని 267 నిబంధన కింద పలువురు సభ్యుల నుంచి నోటీసులు అందాయని తెలిపారు. పీఎన్‌బీ కుంభకోణం అంశం చాలా ముఖ్యమైందని.. అయితే 267 కింద కాకుండా 176 నిబంధన మేరకు చర్చకు అనుమతిస్తానని చెప్పారు. నీరవ్ మోదీని భారత్‌కు తీసుకురావాలంటూ తృణమూల్ సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. దీంతో చైర్మన్ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. సభ మరోసారి సమావేశమైనా ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించడంతో మంగళవారానికి వాయిదా వేశారు.

ప్రశ్నోత్తరాల అనంతరం చర్చ చేపట్టాలి: ప్రతిపక్షాలు

బ్యాంకింగ్ స్కాంలపై మంగళవారం 4 గంటలపాటు చర్చించాలని లోక్‌సభ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. స్పీకర్ సుమిత్రా మహాజన్ అధ్యక్షతన జరిగిన భేటీలో తృణమూల్ కాంగ్రెస్, బీజేడీ సభ్యులు మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12 గంటలకు చర్చను చేపట్టాలని కోరారు. అన్ని అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్ కుమార్ ఈ భేటీలో స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.



పాదయాత్ర1400 కిలోమీటర్లు అధిగమించడంతో నాగులపాడులో పూలబాటతో జగన్‌కు స్వాగతం


ప్రత్యేక హోదా ప్లకార్డులు పట్టుకుని జగన్‌తో కలిసి నడుస్తున్న వైఎస్సార్ సీపీ వైద్య విభాగం నేతలు


నాగులపాడు వద్ద మొక్క నాటి నీళ్లు పోస్తున్న జగన్


జగన్‌తో కలిసి అడుగులు వేస్తున్న శనక్కాయల విక్రేత


పాదయాత్రలో ప్రతిపక్ష నేతతో కలిసి నడుస్తున్న దివ్యాంగుడు


అలవలపాడులో వైఎస్సార్ సీపీ జెండాల రెపరెపలు



తక్కెళ్లపాడు, అలవలపాడు శివారులో జగన్‌కు అభివాదం చేస్తున్న అక్కచెల్లెమ్మలు

నీతోనే రామరాజ్యం.. నువ్వే రావాలయ్యా..

ప్రజా సంకల్ప యాత్రలో జగన్ ఎదుట ఓ అవ్వ ఆకాంక్ష

- దారిపొడవునా సమస్యలు విన్నవించిన జనం
- పంటలకు గిట్టుబాటు ధర లేదని వాపోయిన రైతులు
- మనందరి ప్రభుత్వం రాగానే ఆదుకుంటామని జననేత భరోసా
- 1,400 కి.మీ మైలు రాయిని అధిగమించిన పాదయాత్ర

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'నాన్న ఉన్నప్పుడు అంతా బాగుంది.. పంటలు బాగా పండాయి.. మంచినీళ్లకు ఇబ్బంది రాలేదు.. ముసలి వాళ్లకు పింఛన్లు ఇచ్చారు.. రోగులకు వైద్యం చేయించారు.. ఎవరు ఏదడిగినా కాద నకుండా ఇచ్చారయ్యా.. అలాంటి మనసున్న వాళ్లు కావాలయ్యా.. అలాంటి రామ రాజ్యం రావాలంటే నువ్వు ముఖ్యమంత్రి కావాలయ్యా' అని వృద్ధురాలు పల్లకి హనుమాయమ్మ ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఎదుట తన ఆకాంక్షను వెలిబుచ్చింది. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం 104వ రోజు ఆయన ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గంలో పాదయాత్ర సాగించారు. ఈ సందర్భంగా దారిపొడవునా పలు చోట్ల మహిళలు గుమ్మడి కాయలపై కర్పూరం వెలిగించి దిష్టితీశారు. వివిధ వర్గాల ప్రజలు జగన్‌తో తమ సమస్యలు చెప్పుకున్నారు. జె.పంగులూరు మండలం నాగులపాడు గ్రామానికి చెందిన హను మాయమ్మ వైఎస్ పాలనను గుర్తు చేస్తూ.. ప్రస్తుత ఇబ్బందులను ఏకరువుపె ట్టింది. నాగులపాడు వద్ద జగన్ 1,400 కిలోమీటర్ల మైలు రాయిని అధిగమిం చారు. అందుకు గుర్తుగా అక్కడ రావి మొక్కను నాటారు. పార్టీ జెండాను ఆవిష్క రించారు. వెంకటాపురంలో అద్దంకి చైతన్య మహిళా మండలికి చెందిన చెవుడు, మూగ పాఠశాల విద్యార్థులు జగన్‌ను కలిసి యాత్రకు మద్దతు ప్రకటించారు.

వైద్యుల సంఘీభావం

ఫిజియో థెరపిస్టులు పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ 'ప్రత్యేక హోదా ఏపీ హక్కు' అంటూ ప్లకార్డులు పట్టుకొని జగన్‌తో కలిసి కొద్దిదూరం నడిచారు. ఫిజియో థెరపీని ఆరోగ్యశ్రీలో చేర్చాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొల్లం దీపక్ సాహిత్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేఎల్ అరుణ్‌కుమార్‌లు కోరారు. అలవలపాడులో ఇటుకబట్టీ కార్మికులు జగన్‌కు తమ సమస్యలు వివరించారు. శనగ, పొగాకు పంటలకు గిట్టుబాటు ధర లేదని పంటను జగన్‌కు చూపించి రైతులు తమ బాధలు చెప్పుకున్నారు. ఈ ప్రాంతంలో శనగ ఎక్కువగా పండిస్తు న్నామని, దళారులు దోచుకోవడం తప్ప రైతన్నకు న్యాయం జరగటం లేదన్నారు. పాదయాత్రలో వైద్య విభాగం ప్రతినిధులు జగన్‌ను కలిశారు. ప్రత్యేక హోదా కోసం చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఫీజు కట్టలేదని సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నా..

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని కారణంగా అద్దంకిలోని రాయల్ కాలేజీ యాజమాన్యం తనకు ఇంటర్ సర్టిఫికెట్ ఇవ్వలేదని యు.ప్రతిభ అనే విద్యార్థిని జగన్‌తో వాపోయింది. కాలేజీ వాళ్లను అడిగితే నిధులు ట్రెజరీ నుంచి కాలేజీ అకౌం ట్‌కు రాలేదని, సర్టిఫికెట్లు కావాలంటే డబ్బులు కట్టి తీసుకుపోవాలని చెప్పారని ఆవే దన వ్యక్తం చేసింది. నాగులపాడు ఎస్సీ కాలనీలో తాగేందుకు నీళ్లు లేవని, కరువొచ్చి పంటలు పండటం లేదని స్థానిక మహిళలు వైఎస్ జగన్ ఎదుట వాపోయారు. తమ కాలనీలో సమస్యల గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మేదరమెట్లకు చెందిన అంజమ్మ, అనసూయ, జ్యోతి, రమ తదితరులు వెంకటాపురం–నాగులపాడు మధ్య జగన్‌కు రాఖీలు కట్టారు. యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని రైతులు జగన్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉద్యోగులు కోరారు. అందరి సమస్యలు ఓపికగా వింటూ.. మనందరి ప్రభుత్వం రాగానే అన్ని వర్గాల వారిని నవరత్నాలతో ఆదుకుంటామని జగన్ ధైర్యం చెప్పారు. పాదయాత్రలో జగన్ వెంట అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త బాచిన చెంచుగ రటయ్య, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, వైఎస్సాఆర్‌సీపీ నేత వైవీ భద్రారెడ్డి, యువజన నాయకుడు కృష్ణ చైతన్య తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.


అదుగో జగనన్న..


పాదయాత్రలో జగన్‌తో కలిసి నడుస్తున్న రైతు


అలవలపాడులో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్


విద్యార్థులతో జగన్


వెంకటాపురం శివారులో పొగాకు రైతులతో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత


అభివాదం చేస్తున్న విద్యార్థినులు

ప్రజాసంకల్ప యాత్ర 104వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం **1,414.7** కిలోమీటర్లు

104వ రోజు నడిచిన దూరం **16.3** కిలోమీటర్లు

ప్రారంభం: ఉ.7.30 గంటలకు అద్దంకి శివారు

ముగింపు: సా.5.50 గంటలకు తక్కెళ్లపాడు

ముఖ్యాంశాలు
- అద్దంకి శివారు, తక్కెళ్లపాడులో జనంతో మమేకం
- నాగులపాడు, వెంకటాపురం, అలవలపాడులో పార్టీ జెండా ఆవిష్కరణ
- నాగులపాడు వద్ద 1400 కి.మీ మైలు రాయి దాటిన పాదయాత్ర

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం

ఉ. 7.30 గంటలకు తక్కెళ్లపాడు

ముఖ్యాంశాలు
- తక్కెళ్లపాడు, జె.పంగులూరు, అరికట్లవారిపాలెం, గంగవరంలో జనంతో మమేకం
- ఇంకొల్లులో బహిరంగ సభ

104వ రోజు

05-03-2018, సోమవారం

తక్కెళ్లపాడు, ప్రకాశం జిల్లా



అటువంటి కడగండ్లే గ్రామ సచివాలయ వ్యవస్థకు నాలో బీజం వేశాయి

భోజన విరామ సమయంలో ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన మూగ, చెవుడు, అనాథ పిల్లలు కలి శారు. వారి ముద్దుముద్దు ముఖాలు, సంజ్ఞలతో వారు చూపించిన ప్రేమాభిమానాలు మనస్సుకు హత్తుకుపోయాయి. వారి హావభావాలు నన్ను కట్టిపడేశాయి. ఓ ఆరేళ్ల చిన్నారి తన కన్నీటి గాథను సైగలతోనే నా ముందుంచింది. తాను ఈ పరిస్థితిలో ఉన్నా కనీసం పింఛన్ కూడా రావడం లేదట. ఆదుకునే మనసుంటే.. తమకున్న లోపం శాపం కాదంటూ గుండె నిబ్బరాన్ని ప్రదర్శించింది. మరో పదేళ్ల చిన్నారి ముకుళిత హస్తాలతో చేసిన ప్రార్థన నన్నెంతో ఆకట్టుకుంది. ఆ చిన్నారి, ఆమె సోదరి కూడా అనాథలేనని తెలియడంతో నా గుండె బాధతో బరువెక్కింది. ఆ సంస్థలో చాలామంది మూగ, చెవుడు, మానసిక దివ్యాంగులున్నారట. నా వద్దకొచ్చిన వారిలోనే ఆరేడు మంది పిల్లలు మూగ, చెవిటివారున్నారు. వారికి కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ ఎందుకు చేయించలేకపోయారని నిర్వా హకులను అడిగాను. తమ సంస్థకు అంత ఆర్థిక స్థోమత లేదని, ఆరు, ఏడు లక్షల రూపాయలు ఖర్చయ్యే ఆ ఆపరేషన్‌ను ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేయించడం లేదని వాపోయారు. చికిత్స ఉండీ.. వైద్యం చేయించుకునే స్థోమత లేక దివ్యాంగులుగా మిగిలిపోయిన ఆ చిన్నారులను చూసి చలించిపోయాను. ఇలాంటి పిల్లలకు కొత్త జీవితాన్ని ఇవ్వగలిగితే అంతకంటే సార్థకత ఏముం టుంది? అనిపించింది. వారికి ఆపరేషన్లు చేయించకపోగా.. వారిలో చాలామందికి కనీసం పింఛన్లు కూడా ఇవ్వడం లేదట. ఒకే కడుపున పుట్టిన ముగ్గురు మూగ, చెవుడు పిల్లలుంటే.. వారిలో ఒక్కరికే పింఛన్ వస్తోందట. వాళ్లకు, వారి సహాయకులకు కనీసం బస్ పాసైనా ఇస్తే బావుంటుందని సంస్థ నిర్వాహకులు అన్నారు. ఇలాంటి వాళ్లకు ఆరోగ్యశ్రీ అందుబాటులో ఉంటే కొంతైనా ఊరట కలిగేది. నిజంగా మంచి మనసుతో వారిని ఆదుకోవడంలో కలిగే తృప్తి మరిదేంట్లో ఉంటుంది.

కులాంతర వివాహం చేసుకున్న అనూష, నాగరాజు ఈ రోజు నన్ను నాగులపాడులో కలిశారు. వారి ఇద్దరు పిల్లల్లో ఒకరికి గుండె జబ్బు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డులు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ వర్తించే అవకాశం లేదన్నారు. వాటికోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. ప్రయివేటు ఆస్పత్రికెళితే రూ.రెండు లక్షల వరకూ ఖర్చవుతుందన్నారట. సంవత్స రాల తరబడి రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులూ ఇవ్వకపోతే ఎలా? ఏదో ఒక సాకు పెట్టి.. సంక్షేమ పథకాల లబ్ధిదారులను కుదించాలన్నదే ఈ ప్రభుత్వ దురాలోచన. ప్రజలు పడు తున్న ఇటువంటి కడగండ్లే గ్రామ సచివాలయ వ్యవస్థకు నాలో బీజం వేశాయి.

'ఆయన ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతుకు ఇదే దుస్థితి అన్నా..' అంటూ వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు మోహన్‌రెడ్డి ఆవేదన వెలిబుచ్చాడు. నాలుగేళ్లుగా సాగర్ నీళ్లు రావడం లేదని, వర్షం జాడే కనిపించడం లేదని తెలిపాడు. గతేడాది ఎకరాకు పది క్వింటాళ్లు పండిన శనగ.. ఈ సంవత్సరం మూడు క్వింటాళ్లు కూడా పండలేదన్నాడు. పోయిన ఏడాది క్వింటా రూ.6 వేలుంటే.. ఈ సంవత్సరం రూ.3,600 కూడా దక్కే పరిస్థితి లేదన్నాడు. ఆఖరికి సబ్సిడీ విత్తనాలను కూడా అధిక రేట్లకు అమ్ముతున్న ఈ పాలనలో వ్యవసాయం చేసేదెలా.. అంటూ ప్రశ్నించాడు. మరో రైతన్న పొంగులూరు సాంబశివరావుదీ ఇదే పరిస్థితి. ఎనిమిదెకరాల్లో మిర్చి వేశాడట. గతంలో ఎకరాకు దాదాపు 30 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చేదట. ఇప్పుడు నీళ్లు లేక.. 12 క్వింటాళ్లు కూడా పండటం కష్టమేనన్నాడు. మిర్చి నాణ్యతా తగ్గిపోయిందట. ఖర్చు ఎకరాకు రూ.లక్ష వరకు అవుతోందట. గతంలో క్వింటా రూ.12 వేలు పలికిన ధర.. అమాంతం రూ.5,500 – 6000కు పడిపోయిందని బావురుమన్నాడు. పెట్టుబడులే కాదు.. కనీసం కూలీల ఖర్చు కూడా వచ్చేలా లేదని దిగాలుగా చెప్పాడు. ఇది నిజంగా దయనీయ పరిస్థితే. అన్నదాతే ఇలా కన్నీళ్లు పెడితే రాష్ట్రంలో సుఖశాంతులుం టాయా? ఈ పరిస్థితులు మార్చాలన్నదే నా తపన. అందుకే పెట్టుబడుల ఖర్చు తగ్గించడంతో పాటు.. గిట్టుబాటు ధర కల్పించాలన్నదే నా లక్ష్యం.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. గత నాలుగేళ్లుగా తెలంగాణలో నాగార్జునసాగర్ ఎడమ కాలువకు పుష్కలంగా నీళ్లు పారించుకుని మాగాణి పంటలు పండించుకుంటుంటే.. మన రాష్ట్రంలో మాత్రం నీటి కేటాయింపులున్నా.. కుడి కాలువ కింద నీళ్లు రాక, రైతన్న పంటలు వేసుకోలేక కష్టాలపాలవ్వడానికి కారణ మేంటి? మీ స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే దానికి కారణం కాదా?

వైఎస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

మాటలు కోతలు | **బడ్జెట్ 'సమ్'గతులు**

పొంతన కుదరని చేతలు

- ప్రకటనలకే పరిమితం.. పైసా విదల్చని సర్కారు
- నిరుద్యోగులకు భృతి లేదు.. పేదలకు ఇళ్లు లేవు
- విధానాల రూపకల్పనతోనే కాలక్షేపం
- ప్రత్యేక హోదాతో సమానంగా ప్రత్యేక కేంద్ర సాయాన్ని హామీగా పొందామని గత బడ్జెట్‌లో యనమల ప్రకటన
- తాజాగా హోదా కావాలంటూ గవర్నర్ ప్రసంగంలో చెప్పించిన సర్కారు

సాక్షి, అమరావతి: వరుసగా ఐదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధమైన రాష్ట్ర సర్కారు మాటలు, చేతలకు ఏమాత్రం పొంతన కుదరటం లేదు. గత ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన పలు అంశాలను అమలు చేయటంలో విఫలమైంది. విధానాల రూపకల్పన పేరుతో ఏడాదంతా గడిపింది. 2018–19 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు గురువారం సభకు సమర్పించనున్న నేపథ్యంలో గత ఏడాది బడ్జెట్‌లో చేసిన ప్రకటనలు, అమలు తీరును పరిశీలిద్దాం...

నిరుద్యోగులకు నయవంచన: నిరుద్యోగులకు ఆర్థిక సాయం (నిరు ద్యోగ భృతి) పేరుతో గత బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించినా పైసా విడుదల చేయలేదు. మరికొద్ది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో సర్కారు మాటలు అంతా ఉత్తదేనని తేలిపోతోంది. బడ్జెట్‌లో కేటాయింపులు చూపిస్తూ నిరుద్యోగులకు ఆదుకోకపోవటం దారుణమని అధికార వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి.



హోదాపై పిల్లిమొగ్గలు: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో సమానమైన ప్రత్యేక కేంద్ర సహాయం హామీని పొందామని గత ఏడాది బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఘనంగా ప్రకటించారు. తాజాగా గవర్నర్ ప్రసంగంలో ప్రత్యేక హోదా కావాలంటూ చెప్పించటాన్ని చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పిల్లి మొగ్గలు వేసినట్లు స్పష్టం అవుతోంది.

పేదల ఇళ్లకు కోత: గ్రామీణ పేదలకు రెండు లక్షల గృహాలు నిర్మిస్తామని గత బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. రూ. 1,456 కోట్ల వ్యయం చేయనున్నట్లు చెప్పి ఇప్పటి వరకు రూ.వెయ్యి కోట్లే ఖర్చు పెట్టారు. ఇళ్ల నిర్మాణాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో పేదల ఇళ్ల నిర్మాణాలు ముందడుగు పడలేదు.

సున్నా వడ్డీకి మంగళం: డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేస్తామని గత ఎన్నికలకు ముందు చెప్పిన టీడీపీ అధికారం చేపట్టాక మాఫీ కాదు కదా జీరో వడ్డీ రుణాలను కూడా అందించడం లేదు. డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాల కింద గత బడ్జెట్‌లో కేవలం రూ. 110 కోట్లు మాత్రమే కేటాయించారు. అయితే వడ్డీలేని రుణాలకు బకాయిలతో కలిపి రూ. 3,430 కోట్లు అవసరమని ఆర్థిక శాఖ లెక్క తేల్చింది. డ్వాక్రా సంఘాలు సకాలంలో రుణ వాయిదాలను చెల్లిస్తున్నా సున్నా వడ్డీ నిధులను ఇవ్వడం లేదని ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం జీరో వడ్డీ కింద కొన్ని నిధులను మాత్రమే విడుదల చేసింది. జీరో వడ్డీ కింద మహిళా సంఘాలకు 2016 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,400 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

డ్వాక్రాకు మొండిచేయి: డ్వాక్రా రుణాలను మాఫీ చేయకుండా చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి నిధి పేరుతో రూ.8,291 కోట్లు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు రూ.4,975 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఇంకా రూ. 3,316 కోట్లు చెల్లించాల్సి ఉండగా గత బడ్జెట్‌లో రూ. 1,600 కోట్లు మాత్రమే కేటాయించింది. ఆ నిధులను కూడా ఇప్పటివరకు విడుదల చేయలేదు.

వడ్డీకీ చాలని అరకొర మాఫీ: చంద్రబాబు అధికారంలో వచ్చే నాటికి రైతుల వ్యవసాయ రుణాలు 87,612 కోట్ల రూపాయలున్నాయి. వీటిని బేషరతుగా మాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు ప్రకటించిన ఆయన అధికారంలోకి రాగానే పలు ఆంక్షలు విధిస్తూ వడ్డీకి కూడా సరిపోని విధంగా రుణ మాఫీని రూ. 24,500 కోట్లకు కుదించారు. నాలుగేళ్లు గడిచిపోయినా ఆ 24,500 కోట్లలో ఇప్పటివరకు కేవలం రూ.13,176 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. అరకొర రుణమాఫీ కింద ఇంకా రూ. 9,576 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఇచ్చే అరకొర మొత్తాలను బ్యాంకులు వడ్డీ కింద జమ చేసుకుంటున్నాయి. అసలు చెల్లించాలని రైతులకు వేలం నోటీసులు పంపిస్తున్నాయి. ఇక రైతులకు వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.

అప్పుల్లో వేగంగా వృద్ధి: రాష్ట్ర అప్పులు 2015 మార్చి నాటికి రూ.1,48,743 కోట్లు ఉండగా గత డిసెంబర్ 4వ తేదీ నాటికి రూ.2,25,771 కోట్లకు పెరిగాయి. అప్పులు చేయడంలో శరవేగంగా వృద్ధి సాధించిన సర్కారు రైతులు, డ్వాక్రా సంఘాలు, నిరుద్యోగులు, పేదలకు బడ్జెట్‌లో ప్రకటించిన అంశాలను అమలు చేయడంలో వరుసగా నాలుగో ఏడు కూడా విఫలమైంది.



సోమవారం ఢిల్లీలో జరిగిన వైఎస్సార్‌ సీపీ మహాధర్నాలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, ప్రజలు



మహాధర్నా వేదికపై ప్రసంగిస్తున్న సీపీఎం నేత మధు, చిత్రంలో సీపీఐ నేత రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు

ఢిల్లీ వీధుల్లో.. హోదా గర్జన

▶మొదటిపేజీ తరువాయి

వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నది. ఏప్రిల్ 5 వరకు ఆ పార్టీ ఎంపీలు పార్లమెంటులో పోరాడనున్నారు. అప్పటికీ కేంద్రం స్పందించకపోతే ఏప్రిల్ 6న పార్టీ ఎంపీలు రాజీనామాలు సమర్పించనున్నారు. సోమవారంనాటి మహాధర్నా కార్యక్రమం ఆంధ్రుల ఆందోళనను, ఆవేదనను ఢిల్లీకి గట్టిగా వినిపించింది. నాయకుల అరెస్టులు, కార్యకర్తల ఆందోళనలు, తోపులాటలు, స్వల్ప ఉద్రిక్తతల నడుమ మధ్యాహ్నం 2 గంటలకు ఆందోళన కార్యక్రమం ముగిసింది. వామపక్షాలు, ఆప్, ప్రజాసంఘాల నేతలు ధర్నా కార్యక్రమానికి సంఘీభావం ప్రకటించడం, ప్రత్యేక హోదాకు మద్దతుగా ప్రసంగించడం మహాధర్నా కార్యక్రమంలో విశేషంగా నిలిచింది. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ ధర్నాలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఎంపీలు మేకపాటి రాజమోహన్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వెలగపల్లి వరప్రసాదరావు, పి.వి.మిథున్‌రెడ్డి సహా పార్టీ శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, పార్టీ సీనియర్ నేతలు, నియోజకవర్గ సమన్వయ కర్తలు, భారీగా తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ధర్నా సభకు అధ్యక్షత వహించారు. ఉదయం 10 గంటలకు ధర్నా ప్రారంభ సమయంలో మహా నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డికి పలువురు నేతలు నివాళులు అర్పించారు.

వామపక్షాలు, ఆప్, ప్రజాసంఘాల సంఘీభావం

వైఎస్సార్ కాంగ్రెస్ ఢిల్లీలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి సీపీఎం, సీపీఐ, ఆప్ పార్టీలు, ప్రత్యేక హోదా సాధన సమితి, సంయుక్త కార్యాచరణ కమిటీ, తదితర ప్రజాసంఘాలు సంఘీభావం తెలిపాయి. సినీ విమర్శకులు కత్తి మహేష్ సంఘీభావం తెలిపారు. సీపీఎం నుంచి పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సీపీఐ నుంచి పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు ధర్నాకు సంఘీభావం తెలుపుతూ వేదికపై మాట్లాడారు. ఆప్ నేత రామారావు, ప్రత్యేక హోదా సాధన సమితి నేతలు చలసాని శ్రీనివాసరావు, సదాశివరెడ్డి తదితరులు వైఎస్సార్ కాంగ్రెస్ పోరాటానికి మద్దతు తెలిపారు. ప్రత్యేక హోదా సంయుక్త కార్యాచరణ కమిటీ నేతలు వైఎస్సార్‌సీపీ ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

ఉదయం నుంచి ఉత్సాహంగా..

రెండు ప్రత్యేక రైళ్లలో ఢిల్లీ చేరుకున్న పార్టీ కార్యకర్తలు, నేతలు సోమవారం ఉదయం 8 గంటల నుంచే ధర్నాస్థలికి చేరుకోవడం కనిపించింది. జంతర్‌మంతర్ సమీపంలోని పార్లమెంట్ వీధిలో గల పోలీస్ స్టేషన్ ముందు ఈ ధర్నా ఉదయం 10 గంటలకే ప్రారంభమైంది. అప్పటికే ధర్నా వేదిక కిక్కిరిసిపోయింది. పదుల సంఖ్యలో నేతలు వేదికపై ప్రసంగించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అన్యాయంగా విభజించిన తీరు, దానికి పరిహారంగా ప్రత్యేక హోదా ఇస్తామని కేంద్రం మోసగిస్తున్న వైనాన్ని నేతలు కళ్లకు కట్టినట్టు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాల్సిన అవసరాన్ని, ఇవ్వకుండా చూపుతున్న సాకులను వివరించారు. హోదా తెచ్చేందుకు ముందు వరసలో ఉండి పోరాడాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టడంపై వక్తలు విమర్శలు కురిపించారు. కాగా పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశిస్తే ప్రత్యేక హోదా కోసం తాము కూడా రాజీనామా చేస్తామంటూ పలువురు ఎమ్మెల్యేలు ధర్నా వేదికపై ప్రకటించారు.

ధర్నాకు హాజరైన ముఖ్యనేతలు

ఎంపీలు: మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వి.వరప్రసాదరావు, మిథున్‌రెడ్డి

ఎమ్మెల్యేలు: పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, మేకపాటి గౌతం రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకా ప్రతాప్‌అప్పారావు, కోన రఘుపతి, అనిల్ యాదవ్, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్, రాజన్న దొర, అంజాద్ బాషా, అయిజయ్య, విశ్వేశ్వర్‌రెడ్డి, పుష్ప శ్రీవాణి, గౌరు చరిత, వి.కళావతి, కాకాని గోవర్దన్‌రెడ్డి, నారాయణస్వామి, కంబాల జోగులు, బి.ముత్యాల నాయుడు, దాడిశెట్టి రాజా, జగ్గిరెడ్డి, రక్షణనిధి, కొడాలి నాని, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆర్.ప్రసాదరెడ్డి, సునిల్ కుమార్, రవీంద్రనాథ్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ముస్తఫా, జంకె వెంకటరెడ్డి, ప్రతాప్‌కుమార్ రెడ్డి, కె.సంజీవయ్య, రఘురామిరెడ్డి, జయరాములు, సాయిప్రసాదరెడ్డి, రామచంద్రారెడ్డి, దేశాయి తిప్పారెడ్డి

ఎమ్మెల్సీలు: ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పిల్లి సుభాష్ చంద్రబోస్, కోలగట్ల వీరభద్రస్వామి, గోపాలరెడ్డి



పార్లమెంటు వైపు ర్యాలీగా వెళుతుండగా ఎంపీలు, విజయసాయిరెడ్డి, వరప్రసాద్, వైవీ సుబ్బారెడ్డి తదితరులను అరెస్టు చేస్తున్న పోలీసులు

నేతల అరెస్టులు.. శ్రేణుల కదనోత్సాహం..

ఢిల్లీలో ఎండలు మొదలవడంతో వాతావరణం వేడెక్కి ఉన్నా పార్టీ శ్రేణులు కదనోత్సాహాన్ని చూపాయి. ఉదయాన్నే ధర్నా స్థలికి చేరుకున్న శ్రేణులు అడుగడుగునా 'ప్రత్యేక హోదా' కోసం నినదించాయి. వక్తల ప్రసంగాలకు, విమర్శలకు స్పందిస్తూ పార్టీ కార్యకర్తలు నినాదాలు చేశారు. 'ప్రత్యేక హోదా.. ఆంధ్రుల హక్కు' అంటూ నినాదాలు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటా ఇరవై నిమిషాలకు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు కేంద్ర హోం శాఖ మంత్రికి వినతిపత్రం ఇచ్చేందుకు పార్లమెంటు వైపు ర్యాలీగా వెళుతుండగా పోలీసులు నేతలను దిగ్బంధించారు. నేతలను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనంలోకి ఎక్కించారు. అయితే ఈ సందర్భంలో పార్టీ నేతలు, కార్యకర్తలు వాహనాన్ని అడ్డుకున్నారు. వాహనం ముందు పార్టీ నేతలు రోడ్డుపై బైఠాయించారు. కొందరు రోడ్డుపైనే పడుకుండిపోయారు. దాదాపు 20 నిమిషాలు కార్యకర్తలు ప్రతిఘటించారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా తోపులాటలు చోటు చేసుకున్నాయి. పోలీసులు వాహనాన్ని వెనక్కి మళ్లించి మరో దారి గుండా నేతలను పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో పార్టీ శ్రేణులు పోలీసు వాహనాన్ని వెంబడించగా బారికేడ్లతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అరెస్టయిన వారిలో మేకపాటి, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, వరప్రసాదరావు, మిథున్‌రెడ్డి, పలువురు శాసనసభ్యులు, సీనియర్ నేతలు ఉన్నారు.

పార్టీ నేతలు: బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, పార్థసారథి, విశ్వరూప్, అనంత వెంకటరామిరెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, తమ్మినేని సీతారాం, వంగవీటి రాధా, కాపు రాంచంద్రారెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కన్నబాబు, ఉదయభాను, జోగి రమేష్, ధర్మాన కృష్ణదాసు, రెడ్డి శాంతి, గౌరు వెంకటరెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్, రెహమాన్, ఎ.వరప్రసాదరెడ్డి, రత్నాకర్, కుంభా రవిబాబు, గుడివాడ అమర్‌నాథ్, కారుమూరి నాగేశ్వరరావు, గోపాలరెడ్డి, కోటగిరి శ్రీధర్, మొండితోక అరుణ్, వంశీకృష్ణ, రేవతి, సింహాద్రి రమేశ్, వెంకటరమణ తదితరులు



పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీలు



'హోదా' కోరుతూ ఢిల్లీలో రోడ్డుపై ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు



ధర్నా వేదికపై ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ బోస్, చిత్రంలో పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు



బాబు ప్రజలను మోసం చేస్తున్నారు

మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎంపీ

ప్రత్యేక హోదాపై సీఎం చంద్రబాబు రోజుకోమాట మాట్లాడుతున్నారు. మేధావిని కాబట్టే రాష్ట్ర ప్రజలు అధికారం ఇచ్చారని చెబుతూ వారినే మోసగిస్తావా. ఇలాగైతే ప్రజలు క్షమించరు. రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుంటే ముఖ్యమంత్రిగా నోరు విప్పకపోవడం దారుణం. టీడీపీ, బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను ఘోరంగా వంచించడం దారుణం. చంద్రబాబుకు అసెంబ్లీ సీట్లు పెంచుకునే విషయంలోనూ, ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలను కొనుగోలు చేసేందుకు ఉన్న శ్రద్ధ ప్రత్యేక హోదాపై లేకపోవడం దారుణం. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి 20 మంది ఎంపీలను గెలిపించండి...హోదా ఎందుకు రాదో చూద్దాం. హోదా ఇచ్చే పార్టీకే కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మద్దతు ఉంటుంది.



'హోదా' తీర్మానాలు ఎటు పోయాయి?

వెలగపల్లి వరప్రసాదరావు, ఎంపీ

ప్రత్యేక హోదా కోసం అసెంబ్లీలో రెండుసార్లు చేసిన తీర్మానాలు ఎటు పోయాయి? రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు పూటకోమాట మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశారు. ప్రతిపక్షనేత వైఎస్ జగన్ నాలుగేళ్లుగా వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. హోదా కావాలని బీజేపీతో ఢీ కొంటున్నది జగన్ ఒక్కరే. వైఎస్సార్ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ, రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కేంద్రాన్ని అడిగేందుకు కూడా చంద్రబాబు సాహసించడం లేదు. ప్రత్యేక హోదా కోసం ప్రజలంతా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తుంటే, ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తోందని గుర్తించి చంద్రబాబు ఊసరవెల్లిలా రంగులు మార్చుతూ హోదా ఇవ్వాలంటూ ఇప్పుడు కొత్త పల్లవి అందుకున్నాడు.



అరెస్టులతో హోదాను అడ్డుకోలేరు

విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యులు

పార్లమెంటులో ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని అమలు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ శాంతియుతంగా చేస్తున్న పోరాటాన్ని అణచివేయడం దుర్మార్గం. అరెస్టులతో హోదాను అడ్డుకోలేరు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న మా పార్టీ నాయకులను అరెస్టు చేయడంలో సీఎం చంద్రబాబు పాత్రా ఉంది. మా పోరాటాన్ని మరింత ఉధృతం చేసి హోదాను సాధించి తీరతాం. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు. రాష్ట్ర ప్రజలు ప్రత్యేక హోదా కోరుకుంటున్నారా లేదా అనేది 2019 ఎన్నికల్లో తెలిసిపోతుంది. ఆ ఎన్నికలు రెఫరెండంగా భావించొచ్చు. పవన్ కళ్యాణ్ సవాలును స్వీకరించి మేం కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడుతున్నాం. అందుకు అవసరమైన మద్దతు కూడగడతానని చెప్పి ఇప్పుడేమో ఆయన దాని గురించే మాట్లాడటం లేదు.



అలాగైతే బాబునూ అరెస్టు చేయాలి

వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చి అమలు చేయకుండా చేతులెత్తేశారు. న్యాయం కోసం వివిధ స్థాయిల్లో ఆందోళనలు నిర్వహిస్తాం. అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే పార్లమెంటు వేదికగానే వైఎస్సార్‌సీపీ పార్లమెంటు సభ్యులం అక్కడే రాజీనామాలు చేస్తాం. హోదా హామీని అమలు చేయాలని ఆందోళన చేస్తే అరెస్టు చేస్తారా. అలాగైతే హోదా కావాలని ఇప్పుడు కొత్త పల్లవి అందుకున్న సీఎం చంద్రబాబును కూడా అరెస్టు చేయాలి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని నరేంద్రమోదీ తిరుపతి సభలో ఇచ్చిన హామీని అమలు చేయాలి. ఇచ్చిన హామీలపై కేంద్రాన్ని అడిగే ధైర్యం కూడా బాబుకు లేదు. స్వప్రయోజనాల కోసం హోదాను కేంద్రం వద్ద తాకట్టుపెట్టారు. ఎంపీలంతా రాజీనామా చేస్తే కేంద్రం దిగిరాక తప్పదు. టీడీపీ ఎంపీలు కూడా రాజీనామా చేయాలి.



ప్రభుత్వాన్ని పడగొట్టే శక్తి లేకపోయినా... ఒత్తిడి పెంచుతాం

అవిశ్వాస తీర్మానంతో కేంద్ర ప్రభుత్వాన్ని పడగొట్టే శక్తి వైఎస్సార్‌సీపీ ఎంపీలకు లేకపోయినా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పార్లమెంటులో పోరాటం చేస్తాం. అవిశ్వాసానికి మద్దతు ఇచ్చే ఎంపీలందరికీ లేఖలు రాస్తాం. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీలు ఐదుగురు మాత్రమే ఉన్నా ఐదు కోట్లమంది ప్రజలకు జరిగిన అన్యాయంపై పార్లమెంటులో జరిగే చర్చలో చెబుతాం. అయినా ప్రభుత్వం స్పందించకపోతే చెప్పిన మాట ప్రకారం వైఎస్సార్‌సీపీ ఎంపీలంతా రాజీనామా చేస్తాం.

-పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎంపీ



వేధింపులకు వెనుకంజ వేయవద్దు..

ప్రత్యేక హోదా విషయంలో అధికార పార్టీలు ఎన్ని ఇబ్బందులు తలపెట్టినా వెనకడుగు వేయవద్దు. వైఎస్సార్ సీపీ చేపట్టిన హోదా ఉద్యమానికి సంఘీభావం తెలుపుతున్నాం. హోదా ఉద్యమానికి ఎవరైనా అడ్డువస్తే వారిని పాతాళంలో బొందపెడదాం. అందరం కలసి హోదా సాధించుకుందాం.

- చలసాని శ్రీనివాస్, హోదా సాధన సమితి అధ్యక్షుడు



హామీలపై నిర్ణయాలేంటి..

రాష్ట్ర విభజన చట్టంలో ఏపీకి అమలు చేయాల్సిన వివిధ అంశాలపై చట్టం చేస్తే.. అందులోని హామీలు అమలు చేయకుండా.. హామీల అమలుపై నిర్ణయాలు ఏంటి కొత్తగా? హామీలు అమలు చేయాల్సిందిగా చట్టంలో ఆదేశాలిచ్చారు. అంతేగానీ హామీల అమలుపై నిర్ణయాలు తీసుకోమని కాదు. వైఎస్సార్ సీపీ ఉద్యమానికి పూర్తి సంఘీభావం తెలుపుతున్నా.

- కత్తి మహేష్, విశ్లేషకుడు, సినీ విమర్శకుడు

ఢిల్లీలో హోదా ఉద్యమం

మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో



ప్రత్యేక హోదా బ్రాండ్ అంబాసిడర్ జగన్..

ఏపీ ప్రత్యేక హోదాకు బ్రాండ్ అంబాసిడర్ వైఎస్ జగన్. హోదా కోసం అలుపెరగకుండా గత నాలుగేళ్లుగా పోరాడుతున్నారు. మోదీ, చంద్రబాబు ఇద్దరూ ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని తిరుపతి వెంకన్న సాక్షిగా హామీ ఇచ్చి విస్మరించారు. హోదాతోనే రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది.

- పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ



జగన్ ఆలోచన కరెక్టని చంద్రబాబు ఒప్పుకున్నారు..

ప్రత్యేక హోదా వల్ల రాష్ట్రానికి కలిగే ప్రయోజనాల విషయంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చెబుతున్న విషయాలు కరెక్టని చంద్రబాబు చివరికి అంగీకరించారు. ఇన్నాళ్లు హోదా వల్ల ఒరిగేదేముందని ప్రశ్నించిన చంద్రబాబు.. చివరికి హోదా కావాలంటున్నారు. ప్రత్యేక హోదా వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని చంద్రబాబు ఒప్పుకొనేలా జగన్ ఉద్యమాన్ని నడిపారు. ఇప్పటి వరకు హోదా విషయంలో దాటవేత ధోరణి అవలంభించిన చంద్రబాబు సోమవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో గవర్నర్ ప్రసంగంలోను హోదా విషయాన్ని ప్రస్తావించారు. అంటే నాలుగేళ్ల నుంచి జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేస్తున్న హోదా అవసరాన్ని చంద్రబాబు ఇప్పుడు గుర్తించారు. దీన్ని బట్టి చంద్రబాబు కంటే సమర్థుడు, శక్తివంతుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అంగీకరించినట్టే కదా!. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి హోదా విషయంలో నాలుగేళ్లుగా అసత్యాలతో మోసం చేసినందుకు ప్రజలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి. విభజించబడిన రాష్ట్రంలో ప్రజల బాగోగులు గురించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుగానే ఆలోచించారు.

- ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత



టీడీపీ ఎందుకు రాజీనామాలు చేయడం లేదు..

ప్రత్యేక హోదా సాధనకు టీడీపీ తన కేంద్ర మంత్రులు, ఎంపీల చేత ఎందుకు రాజీనామాలు చేయించదు. హోదా సాధనలో ఎందుకు వెనక్కి తగ్గుతున్నారు. ప్రజలు ఇచ్చిన పదవులను వదులుకొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం.

- కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ



హోదాతో రాష్ట్రంలోనే ఉద్యోగాలు..

ప్రత్యేక హోదా అమలైతే రాష్ట్రంలోని యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. మన రాష్ట్రంలో అనేక పరిశ్రమలు ఏర్పాటై ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

- మేకాప్రతాప్ అప్పారావు, ఎమ్మెల్యే



బాబును చూసి ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుంది

రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు మార్చిన తీరు చూస్తే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుంది. హోదా 15 ఏళ్లు కావాలని ఒకసారి, సంజీవనా అని మరోసారి, మళ్లీ హోదా కావాలని, మళ్లీ దాంతో ఉపయోగం లేదని బాబు మాటలు మారుస్తూ ప్రజలను వంచిస్తున్నారు.

- ఆదిమూలపు సురేశ్, ఎమ్మెల్యే



మేం కూడా రాజీనామాలకు సిద్ధం..

ప్రత్యేక హోదా సాధన కోసం మా పార్టీ ఎంపీలతో పాటు రాష్ట్ర ప్రజాప్రతినిధులుగా మేం కూడా మా పదవులు వదులుకొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రజలు ఇచ్చిన పదవులను వారి కోసం వదులుకునేందుకు ఏ మాత్రం ఆలోచించం. దీనికి టీడీపీ ప్రజాప్రతినిధులు కూడా సిద్ధంగా ఉన్నారా?.

- రాజన్నదొర, ఎమ్మెల్యే



ఇచ్చిన హామీలకు దిక్కేలేదు..

రాష్ట్ర విభజనతో ఏపీ తీవ్రంగా నష్టపోతుందని తెలిసి ఏపీకి అప్పటి ప్రభుత్వం హోదా హామీ ఇచ్చింది. అప్పుడు బీజేపీ కూడా పోటాపోటీగా 10 ఏళ్లు హోదా ఇస్తామంది. పదేళ్లుకాదు 15 ఏళ్లు ఇవ్వాలని చంద్రబాబు అడిగిన హామీకి ఇప్పుడు దిక్కేలేకుండా పోయింది. కేంద్ర మంత్రి సుజనా చౌదరి ప్రత్యేక హోదాను రద్దు చేసిన నోట్లతో పోల్చారు. ఇదీ హోదాపై టీడీపీకి ఉన్న చిత్తశుద్ధి. హోదా కోసం మా పార్టీ అధ్యక్షుడు ఆమరణ నిరాహార దీక్షకు కూడా దిగారు. ఇది జగన్ చిత్తశుద్ధి.

- పుష్పశ్రీ వాణి, ఎమ్మెల్యే



తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని తాకట్టుపెట్టారు..

ఓటుకు కోట్లు కేసులో దొరికిపోయిన చంద్రబాబు తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని మోదీ కాళ్లవద్ద తాకట్టుపెట్టారు. ప్రత్యేక హోదా విషయంలో ఆయన రాష్ట్ర ప్రజలను దారుణంగా వెన్నుపోటు పొడిచారు. హోదా కోసం మా ఎంపీలు రాజీనామాలు చేశాక ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో తిరిగి మా ఎంపీలను గెలిపించుకుంటాం.

- అంజాద్ బాషా, ఎమ్మెల్యే



సీబీఐ అంటే బాబుకు భయం

ఓటుకు కోట్లు, ఇతర అవినీతి కేసుల్లో దొరికిపోయిన చంద్రబాబు ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తే ఎక్కడ కేంద్రం సీబీఐని ప్రయోగిస్తుందో అని భయపడుతున్నారు. అందుకే రాజీపడిపోయారు. రాష్ట్రంలో పరిపాలనను అవినీతిమయం చేశారు. పనుల్లో వాటాలు పంచుకోండని చంద్రబాబు చెప్పినట్టు స్వయంగా మంత్రులు చెబుతున్నారు. బాబు అవినీతికి ఇది నిదర్శనం.

- ఐజయ్య, ఎమ్మెల్యే



పార్ట్‌నర్ పవన్ ఎందుకు ప్రశ్నించడం లేదు?

బీజేపీ, టీడీపీ ఇచ్చే హామీలను అమలు చేయించే బాధ్యత తనదే అని, హామీలు అమలు చేయకపోతే ప్రశ్నిస్తానని చెప్పిన చంద్రబాబు పార్ట్‌నర్ పవన్ కల్యాణ్ ఇప్పుడెందుకు ప్రశ్నించడం లేదు. ఐదేళ్లుకాదు పదేళ్లుకాదు పదిహేనేళ్లు హోదా కావాలన్న వారు ఇప్పుడు రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుంటే పవన్ ఎందుకు ప్రశ్నించడంలేదు.

- కొరుముట్ల శ్రీనివాసులు. ఎమ్మెల్యే



హైదరాబాద్ లేదు కనుక హోదా ఇచ్చారు..

కొత్తగా ఏర్పాటైన తెలంగాణకు అప్పటికే రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను ఇచ్చేశారు. దీంతో ఏపీ నష్టపోకుండా ఉండేందుకు ప్రత్యేక హోదా ఇస్తామన్నారు. ఇచ్చిన హామీ మేరకు కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వాలి. వాళ్లువీళ్లు వద్దన్నారంటూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే ఆ ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

- కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఎమ్మెల్యే



వైఎస్సార్ సీపీ వల్లే హోదా సజీవం..

ప్రత్యేక హోదా సాధన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అలుపెరగకుండా పోరాటం చేస్తుండడం వల్లే ఇప్పటికీ ఈ హామీ సజీవంగా ఉంది. టీడీపీ ఈ అంశాన్ని పక్కదోవ పట్టించాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి సఫలం కాలేదు.

- డా.సునీల్ కుమార్, ఎమ్మెల్యే



జగన్ వ్యక్తికాదు.. రాష్ట్ర ప్రజల శక్తి

ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్న జగన్ ఒక వ్యక్తి కాదు. రాష్ట్ర ప్రజల శక్తి. వంద మంది బాబులు వచ్చినా జగన్‌ను ఆపలేరు.

- రెహమాన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత

ఆంధ్రుల హక్కును తాకట్టుపెట్టారు

ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రావిపాటి జగదీష్



ఏఎన్‌యూ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం, ఏపీ విద్యార్థి జేఏసీ నాయకులు

ఏఎన్‌యూ: ఆంధ్రుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ప్రత్యేక హోదాను నీరుగార్చి ఆంధ్రుల హక్కులను కేంద్రం వద్ద తాకట్టుపెట్టారని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రావిపాటి జగదీష్ మండిపడ్డారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలోని హామీలన్నీ నెరవేర్చాలన్న డిమాండ్‌తో ఏపీ విద్యార్థి జేఏసీ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బంద్ నిర్వహించారు. యూనివర్సిటీ ద్వారాల గేట్లకు తాళాలు వేసి ఉద్యోగులు, విద్యార్థులను యూనివర్సిటీలోకి రాకుండా అడ్డుకున్నారు. యూనివర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేశారు. హోదాను నీరుగార్చితే సహించమని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రావిపాటి జగదీష్ మాట్లాడుతూ హోదా సాధించేందుకు అన్ని పార్టీలు, సంఘాలు కలిసి ముందుకు సాగాలన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధించే వరకు విద్యార్థులు ఉద్యమాలను ఉధృతం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రత్యేక హోదా సాధించేందుకు కృషి చేయని ఎంపీల ఇళ్లకు చీర, జాకెట్ పంపుతామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఏఎన్‌యూ శాఖ నాయకులు ఎ.ఆదినారాయణ మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా వెంటనే ఇవ్వాలని, విభజన చట్టంలోని హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నూతన రాష్ట్రంలో జాతీయ విద్యాసంస్థలు, ఉన్నత విద్యాసంస్థలకు అధిక నిధులు కేటాయించాలన్నారు. ఏపీ విద్యార్థి జేఏసీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు నంబూరు శాస్త్రి మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధించేందుకు రాష్ట్రంలోని అన్ని వర్గాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆంధ్రుల ఆగ్రహాన్ని చవిచూడకముందే కేంద్రం ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కుర్రం శ్రీనివాస్, విద్యార్థి జేఏసీ నాయకులు బాబూరావు, నారాయణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా నివాసం వద్ద జేఏసీ సంఘాల నేతల ఆందోళన

విభజన హామీలు నెరవేర్చాలని డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రత్యేక హోదా సాధన సమితి ప్రతినిధి సదాశివరెడ్డి, ఎస్కేయూ విద్యార్థి జేఏసీ నేతలు సోమవారం ఢిల్లీలోని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా నివాసం ముందు ఆందోళనకు దిగారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వారిని పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మోదీ, చంద్రబాబులపై కేసు నమోదు చేయండి

ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్



ఢిల్లీ డీసీపీ మాధుర్‌వర్మకు ఫిర్యాదు చేస్తున్న ఏపీసీసీ నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏపీ ప్రజలను మోసం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబులపై కేసు నమోదు చేయాలని ఏపీసీసీ నేతలు ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత ఎన్నికల ప్రచారంలో ఏపీకి ప్రత్యేక హోదా సహా రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేస్తామని మోదీ, చంద్రబాబులు ప్రజలకు హామీలు ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చాక వాటి అమలును విస్మరించారని పేర్కొంటూ సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌లో పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి, పళ్లంరాజు, గిడుగు రుద్రరాజు ఇతర నేతలు ఫిర్యాదు చేశారు.

ఏపీ విభజన చట్టం అమలు చేయాలి

సుప్రీంకోర్టులో పొంగులేటి పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ తెలంగాణ శాసనమండలిలో కాంగ్రెస్ పక్ష ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ ఎ.కె.సిక్రి నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను సోమవారం విచారించింది. చట్టాలు అమలు చేయాలని తాము ఆదేశాలు ఎలా ఇవ్వగలమని ధర్మాసనం ప్రశ్నించగా గతంలో పలు చట్టాల అమలుపై దాఖలైన పిటిషన్లలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కె.శ్రవణ్‌కుమార్ ఉదహరించారు. ఈ నేపథ్యంలో ప్రతివాదులైన కేంద్ర హోం, ఆర్థిక, ఉక్కు, జల వనరుల, మానవ వనరుల అభివృద్ధి శాఖలకు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు పిటిషన్ కాపీని అందజేయాలని పిటిషనర్‌కు సూచిస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసినట్టు న్యాయవాది కె.శ్రవణ్‌కుమార్ మీడియాకు తెలిపారు.

వ్యవ‘సాయం’ సున్నా

ప్రత్యేక బడ్జెట్‌తో అన్నదాతలకు ఒరిగింది శూన్యం

కష్టాల కావడిలో కౌలు రైతన్నలు ● బ్యాంకు రుణం రాదు.. ప్రైవేట్ అప్పులే శరణ్యం

రాష్ట్రంలో ఏటేటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం

అయినా సాగులో వృద్ధి రేటు ఘనం అంటున్న సర్కారు





సాక్షి, అమరావతి: అదును తప్పిన వర్షాలు, నకిలీ విత్తనాలు, మద్దతు ధర లభించక రైతులు ప్రకృతికి ఎదురీదుతుంటే ప్రభుత్వం మాత్రం వ్యవసాయ అభివృద్ధి అద్భుతం అంటూ అంకెల గారడీ చేస్తోంది. 2016–17లో వ్యవసాయ, అనుబంధ రంగాల వృద్ధిరేటు 14 శాతమన్న వ్యవసాయ మంత్రి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 21 శాతం నమోదు కాబోతోందని చెబుతున్నారు. ఆక్వా, ఉద్యాన రంగాలలో అభివృద్ధిని వ్యవసాయంతో కలిపి మసిపూసి మారేడు కాయ చేస్తున్నారు. వ్యవసాయానికి నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రత్యేక బడ్జెట్‌తో రైతులకు ఒరిగింది శూన్యమని నిపుణులు పేర్కొంటున్నారు.

ఏటా లెక్కలు మించి హామీలు

- రాష్ట్ర విభజన అనంతరం 2014–15లో ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో ప్రణాళిక, ప్రణాళికేతర కేటాయింపులు రూ.12,749 కోట్లు కాగా ఇందులో రూ.5 వేల కోట్లను రుణమాఫీకి కేటాయించారు.
- 2015–16 రెండో బడ్జెట్‌లో కేటాయింపులు రూ.14,184 కోట్లు కాగా ప్రణాళికేతర వ్యయం రూ.9,670.78 కోట్లుగా ఉంది. రెండో విడత రుణమాఫీకి రూ.5 వేల కోట్లు, ఉచిత విద్యుత్‌కు రూ.3 వేల కోట్లు కేటాయించారు. ఇవన్నీ పోనూ నికరంగా వ్యవసాయానికి మిగిలింది కేవలం రూ.4 వేల కోట్లే.
- 2016–17 బడ్జెట్ కేటాయింపులు రూ.16,250 కోట్లయితే రూ.3,500 కోట్లు రుణమాఫీకి, రూ.3 వేల కోట్లు ఉచిత విద్యుత్‌కు కేటాయించారు. గత ఏడాది కంటే ప్రణాళికా వ్యయానికి రూ.1,312 కోట్లు పెంచారు. వర్షాలు లేక సాగు విస్తీర్ణం తగ్గిందంటూనే దిగుబడి లక్ష్యం మాత్రం నిరుటి కన్నా పెరిగిందంటున్నారు. పప్పు ధాన్యాల దిగుబడి 2014–15లో 9.5 లక్షల టన్నులుగా ఉంటే 15–16లో 12.65 లక్షల టన్నులకు పెరిగిందని ఘనంగా ప్రకటించిన మంత్రి అపరాలకు గిట్టుబాటు ధర లభించని విషయాన్ని విస్మరించారు.
- 2017–18 వ్యవసాయ బడ్జెట్‌లో మొత్తం కేటాయింపులు రూ.18,214 కోట్లయితే అనుబంధ రంగాలు, రుణమాఫీ పోనూ వ్యవసాయానికి మిగిలింది కేవలం రూ.9,091 కోట్లు మాత్రమే. ప్రణాళికా వ్యయం రూ.1,170 కోట్లు, ప్రణాళికేతర వ్యయం రూ. 4,357 కోట్లు.
- బడ్జెట్లు పెట్టిన ప్రతిసారీ లెక్కకు మించి హామీలు ఇచ్చి తరువాత మరిచిపోవటం ఆనవాయితీగా మారింది. వ్యవసాయానికి సంబంధించి కొత్త ప్రాజెక్టు ఒక్కటీ రాలేదు. వేలాది ఫుడ్ పార్కులు వస్తున్నాయని చెప్పడమే తప్ప పట్టుమని పది కూడా ప్రారంభం కాలేదు.

కంది ధరలు ఢమాల్

కందికి హెక్టార్‌కు కనీసం రూ.10 వేల ఆదాయం వచ్చేటట్టు చూస్తామని 2017–18 బడ్జెట్‌లో ప్రకటించిన వ్యవసాయ శాఖ మంత్రి హామీని నమ్మి సాగు చేసిన రైతులు మోసపోయారు. లాభం మాట అటుంచి పెట్టుబడులు కూడా దక్కని దుస్థితి నెలకొంది.

కౌలు రైతులకు సున్నా

రాష్ట్రంలో సుమారు 17 లక్షల మంది కౌలు రైతులున్నట్టు గుర్తించిన సర్కారు అందరికీ రుణ అర్హత పత్రాలు ఇస్తామని ప్రతి బడ్జెట్‌లో చెబుతున్నా 7 లక్షల మందికి కూడా కార్డులు జారీ చేయలేదు. వీరిలోనూ రుణాలు దక్కింది కేవలం 80 వేల మందికి మాత్రమే. మిగతా రైతులంతా ప్రైవేట్ అప్పులనే ఆశ్రయించారు. వాస్తవ సాగుదార్లలో 80 శాతం మంది కౌలు రైతులే కాగా వారికిచ్చే రుణాలు రూ. 200 కోట్లకు మించిలేవు. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో 90 శాతం మంది కౌలు రైతులే కావటం గమనార్హం.

స్వామినాథన్ సిఫార్సులు గాలికి

వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల్ని అమలు చేస్తామని తొలి బడ్జెట్‌లో ప్రకటించిన ప్రభుత్వం ఆ తర్వాత మరచిపోయింది. రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఊసే లేదు. కనీస మద్దతు ధరలు లేక మిర్చి, పత్తి, కందులు, పెసలు, మినుము, మొక్కజొన్న, చివరకు ధాన్యం రైతులు సైతం రోడ్డెక్కారు. ఇక నకిలీ విత్తనాలు అన్నదాతలను కాటేస్తున్నాయి. గుంటూరు, ప్రకాశం, కర్నూలు తదితర జిల్లాల్లో కల్తీ మిరప విత్తనాల వల్ల నష్టపోయిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. టీడీపీ అధికారం చేపట్టాక వరుసగా నాలుగేళ్లుగా సాగు విస్తీర్ణం క్షీణించింది. వ్యవసాయ శాఖ మంత్రే ఈ విషయాన్ని అంగీకరించారు.

రెయిన్‌గన్లు తుస్

2015–16 ఖరీఫ్ ప్రారంభంలో ఓ మోస్తరు వర్షాలు పడడంతో రాయలసీమలో వేరుశనగ సాగు అధికంగా దాదాపు 9.29 లక్షల హెక్టార్లలో చేపట్టారు. తర్వాత వర్షాలు లేక పంట బెట్టకు వచ్చింది. కరవును వారం రోజుల్లో రెయిన్‌గన్లతో జయిస్తానని చెప్పిన సీఎం రూ.216 కోట్లకు పైగా ప్రజాధనాన్ని నీటిపాలు చేశారు.

రాష్ట్రంలో తగ్గుతున్న సాగు విస్తీర్ణం
(ఖరీఫ్‌లో మొత్తం విస్తీర్ణం 43.86 లక్షల హెక్టార్లు)

సంవత్సరం	సాగు విస్తీర్ణం	తగ్గిన విస్తీర్ణం
2014–15	40.98	2.9
2015–16	36.34	7.52
2016–17	38.62	5.24
2017–18	40.47	4.57
(రబీలో మొత్తం విస్తీర్ణం 27.26 లక్షల హెక్టార్లు)		
2015	23.19	4.07
2016	22.78	4.5
2017	19.47	7.79
2018	23.81	1.44

చిన్న రైతులపై చిన్నచూపు

పొలం పిలుస్తోంది, ఇంకుడు గుంతలు, చంద్రన్న రైతు క్షేత్రాలు తదితర పేర్లతో విడుదల చేస్తున్న నిధులు అధికార పార్టీ నేతల జేబుల్లోకే చేరుతున్నాయి. గత ఏడాది వ్యవసాయ యాంత్రీకరణకు కేటాయించిన రూ.147 కోట్లు పెద్ద కంపెనీల ఖాతాల్లోకి చేరాయి. రైతులకు వడ్డీలేని రుణాల కింద రూ.172 కోట్లు (రూ.లక్ష లోపు రుణాలకు) కేటాయిస్తే సగం కూడా ఖర్చు చేయలేదు. చిన్న, సన్నకారు, కౌలు రైతులను ఆదుకునే పావలా వడ్డీ రుణాలకు రూ.5 కోట్లు కేటాయించడాన్ని బట్టి చూస్తుంటే సర్కారు ధోరణి తెలిసిపోతోంది. రైతు బంధు పథకానికి కేటాయించిన రూ.18 కోట్లు టీడీపీకి అనుకూలంగా వ్యవహరించే వారికే అందాయి.

ఉన్న తోటలనే నరికేస్తున్నారు

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమాకు రూ. 269 కోట్లు కేటాయించినా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించలేదని రైతు సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రూ.308 కోట్లు అంటూ హడావుడి చేసినా పరిపాలనా భవనం తప్ప మిగతావన్నీ అద్దె కార్యాలయాలకే పరిమితమయ్యాయి. ఇక సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయానికి రూ.25 కోట్లు కేటాయించి ప్రభుత్వేతర సంస్థలను మేపుతున్నారు. ఉద్యానవన శాఖలో పంటల విస్తీర్ణం 35 శాతం పెంచటం అటుంచి ఉన్న తోటల్ని నరికేసుకునే దుస్థితి దాపురించింది. బిందు, తుంపర సేద్యం కోసం కేటాయించిన రూ.717 కోట్లు అధికార పార్టీ నేతలు బొక్కేసినట్టు ఫిర్యాదులున్నాయి. అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో కరవు నివారణ పథకం జాడ లేదు. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకునే చర్యలు తీసుకోకుండా ప్రచార ఆర్భాటంతో వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ అని ప్రకటించటం వల్ల ప్రయోజనం ఏముందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముందు ఇనుము వాడింది మనమే!

- సింధు నాగరికత కంటే ముందుగానే మన రాష్ట్రంలో ఇనుము వాడకం
- గోదావరి తీరాన విలసిల్లిన ‘మెగాలిథిక్ నాగరికత’
- రాష్ట్ర పురావస్తు శాఖ పరిశోధనల్లో వెల్లడి
- ఈ నెల 12 నుంచి ఏఎన్‌యూలో అంతర్జాతీయ సదస్సు





తవ్వకాల్లో బయటపడిన మెగాలిథిక్ యుగం నాటి సమాధులు, ఇనుప పనిముట్లు

సాక్షి, అమరావతి బ్యూరో: దేశంలో మొదటిసారిగా ఇనుము వాడింది సింధు నాగరికత ప్రజలని ఇన్నాళ్లూ అనుకున్నాం. కానీ వారి కంటే 500 ఏళ్ల ముందే.. అది కూడా మన రాష్ట్రంలో.. ముందుగా ఇనుమును వాడారని మీకు తెలుసా? గోదావరి నదీ తీరాన మెగాలిథిక్ నాగరికత కాలంలో ఇనుప పనిముట్లు వాడినట్లు రాష్ట్ర పురావస్తు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. అంతేకాకుండా సింధు నాగరికత కాలం నాటి ప్రజల కంటే దక్షిణ భారతదేశంలో విలసిల్లిన మెగాలిథిక్ నాగరికత కాలం నాటి ప్రజలు ఆధునికంగా ముందున్నారని స్పష్టమైంది. పుణేకు చెందిన డెక్కన్ కాలేజీ సహకారంతో రాష్ట్ర పురావస్తు శాఖ పోలవరం ముంపు గ్రామాల్లో జరుపుతున్న పరిశోధనలు ఈ విషయాన్ని నిర్ధారించడం విశేషం.

బయటపడ్డ మెగాలిథిక్ అవశేషాలు

పోలవరం ముంపు గ్రామాల్లో రాష్ట్ర పురావస్తు శాఖ నాలుగు నెలలుగా పరిశోధనలు చేస్తోంది. డెక్కన్ కాలేజ్ భాగస్వామ్యంతో తవ్వకాలు చేపడుతోంది. తూర్పుగోదావరి జిల్లా రాయనిపేట, పశ్చిమగోదావరి జిల్లా రుద్రమకోట వద్ద వందలాది తవ్వకాలు జరిపారు. ఈ తవ్వకాల్లో మెగాలిథిక్ యుగం నాటి అవశేషాలు బయటపడ్డాయి. ప్రధానంగా ఆ కాలం నాటి పెద్ద పెద్ద సమాధులను కనుగొన్నారు. వాటిని తవ్వగా మానవుల ఎముకలు, ఇనుప పరికరాలు, అలంకరణ రాళ్లు, మట్టిపాత్రలు బయటపడ్డాయి.

మెగాలిథిక్ నాగరికత అంటే..

ఆదిమానవ దశ నుంచి పరిపక్వతతో కూడిన కుటుంబ జీవనానికి మధ్య ఉన్న సంధి దశనే మెగాలిథిక్ నాగరికత అంటారు. క్రీ.పూ.3,000 నుంచి క్రీ.పూ.1,000 మధ్య ఈ నాగరికత దక్షిణ భారతదేశంలో విలసిల్లింది. సింధులోయ నాగరికతలో క్రీ.పూ.2,500 నుంచి క్రీ.పూ.1,750 మధ్య ఇనుము వాడినట్లు పరిశోధకులు నిర్ధారించారు. కానీ అంతకంటే దాదాపు 500 ఏళ్ల క్రితమే మెగాలిథిక్ నాగరికతలో ఇనుము వాడినట్లు పురావస్తు పరిశోధనల్లో వెల్లడైంది. దీంతో నాటి మానవుల జీవన శైలి మీద పరిశోధనలు చేస్తే మరింత సమాచారం లభిస్తుందని భావిస్తున్నారు. తవ్వకాల్లో బయల్పడిన ఎముకల ఆధారంగా అప్పటి మానవుల డీఎన్‌ఏ మ్యాపింగ్ చేయించాలని పురావస్తు శాఖ కమిషనర్ వాణీమోహన్ నిర్ణయించారు. దీనికోసం యూకేలోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంతోపాటు దక్షిణ కొరియా, థాయ్‌లాండ్ తదితర దేశాల్లోని పరిశోధన సంస్థలతో చర్చించారు.

మార్చి 12 నుంచి అంతర్జాతీయ సదస్సు

మెగాలిథిక్ సంస్కృతిపై రాష్ట్ర పురావస్తు శాఖ మార్చి 12 నుంచి మూడు రోజులపాటు అంతర్జాతీయ సదస్సును నిర్వహించనుంది. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే ఈ సదస్సుకు దాదాపు 100 మంది అంతర్జాతీయ ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు హాజరుకానున్నారు.

డీఎన్‌ఏ మ్యాపింగ్ ద్వారా పరిశోధనలకు ఊతం



తవ్వకాల్లో లభించిన మానవ అవశేషాలను డీఎన్‌ఏ మ్యాపింగ్ కోసం అంతర్జాతీయ పరిశోధన సంస్థలకు పంపాలని నిర్ణయించాం. దీని ద్వారా ఆనాటి మానవుల జన్యు స్థితిగతులు, వ్యాధి నిరోధక శక్తి అంచనా వేయొచ్చు. ఈ వివరాలను వైద్య పరిశోధనలకు ఉపయోగించొచ్చని భావిస్తున్నారు. మెగాలిథిక్ నాగరికతను పాఠ్యాంశాల్లో చేర్చే విషయంపై ప్రభుత్వంతో చర్చిస్తాం. రాష్ట్రంలో మరికొన్ని ప్రాంతాల్లో కూడా పరిశోధనలు చేస్తాం.

– వాణీమోహన్,
పురావస్తు శాఖ కమిషనర్

అక్షయగోల్డ్ ఆస్తులకు ఎంతిస్తారో చెప్పండి

కంపెనీ స్వాధీనానికి ముందుకొచ్చిన సంస్థకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: అక్షయగోల్డ్ ఆస్తులకు ఎంత మొత్తం చెల్లిస్తారో చెప్పాలని ఆ కంపెనీని స్వాధీనం చేసుకునేందుకు ముందుకు వచ్చిన సంస్థను హైకోర్టు ఆదేశించింది. అదేవిధంగా గుర్తించిన అక్షయగోల్డ్ ఆస్తుల విలువ ఎంతో చెప్పాలని ఏపీ సీఐడీని ఆదేశించింది. ఈ వివరాల కోసం కేసు విచారణను ఈనెల 20కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ ఎస్వీ భట్‌లతో కూడిన ధర్మాసనం ప్రకటించింది. అక్షయగోల్డ్ కంపెనీని స్వాధీనం చేసుకోడానికి ఓ కంపెనీ ముందుకు వచ్చినట్లు డిపాజిటర్ల అసోసియేషన్, అక్షయగోల్డ్ చైర్మన్ బోగి సుబ్రహ్మణ్యంల ఆమోదంతో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసినట్లు పీఏ క్రిష్టఫర్ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ ప్రసాద్ చెప్పారు. గుర్తించిన ఆస్తుల విలువల మదింపునకు సమయం కావాలని కోరారు. ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి తిరిగి చెల్లించని అక్షయగోల్డ్ కంపెనీ బాగోతంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను ధర్మాసనం సోమవారం మరోసారి విచారించింది. అక్షయగోల్డ్‌కు చెందిన 320 ఆస్తులు జప్తు చేశామని, మరో 39 ఆస్తుల్ని జప్తు చేయాల్సివుందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కష్ణప్రకాశ్ చెప్పారు. 270 ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ రూ.38.7 కోట్లు ఉంటే మార్కెట్ ధరల ప్రకారం రూ.92 కోట్లు ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. అగ్రిగోల్డ్ కేసుకి సంబంధించి ఎస్ఎల్ గ్రూప్‌నకు చెందిన వ్యక్తి అగ్రిగోల్డ్ యాజమాన్యంతో కలిసేందుకు సిద్ధంగా ఉన్నారా? అలాగే, ఆ వ్యక్తికి అన్ని వివరాలు వెల్లడించేందుకు అగ్రిగోల్డ్ యాజమాన్యం సిద్ధమేనా? అని ధర్మాసనం ఇరుపక్షాలను ప్రశ్నించింది. దీనిపై స్పష్టత ఇవ్వాలని ఇరుపక్షాల్ని ఆదేశించింది. అగ్రిగోల్డ్ యాజమాన్యం కోట్ల రూపాయల డిపాజిట్లను వసూలు చేసి ఎగవేతపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణను ఈనెల 20కి వాయిదా వేసింది.

పీఆర్‌టీయూ వివాదాలపై న్యాయ విచారణకు డిమాండ్

సాక్షి, అమరావతి: ఏపీ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ)లో నిధుల దుర్వినియోగంతో పాటు నెలకొన్న వివాదాలపై న్యాయవిచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం సోమవారం ప్రభుత్వానికి విన్నవించింది. ఈ మేరకు వారొక వినతిపత్రం అందించినట్లు సంఘం అధ్యక్షుడు రావి శ్రీనివాస ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘానికి చెందిన ఎమ్మెల్సీ ఒకరు విభేదాలు సృష్టిస్తూ సభ్యుల మధ్య చిచ్చుపెడుతూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. సంఘంలో ఆర్థిక లావాదేవీల్లో వచ్చిన తేడాల వల్లనే ఇలాంటివి జరుగుతున్నాయని, ఆ ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● తెలంగాణ

వడివడిగా.. ‘ఫ్రంట్’ దిశగా..!

- కూటమి ఏర్పాటుపై ప్రణాళిక సిద్ధం చేస్తున్న కేసీఆర్
- దేశవ్యాప్తంగా వివిధ వర్గాలు, రంగాల ప్రముఖులు, సంఘాలతో భేటీకి నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం జాతీయ స్థాయిలో రాజకీయ ఫ్రంట్ ఏర్పాటు చేస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు.. భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా వివిధ వర్గాలకు చెందిన సంఘాలు, సంస్థలు, ప్రముఖులతో వరుసగా సమావేశాలు నిర్వహించాలని ఆయన నిర్ణయించారు. మొదట ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ వంటి అఖిల భారత సర్వీసు రిటైర్డ్ అధికారులతో భేటీ కావాలని యోచిస్తున్నారు. జాతీయ స్థాయిలో, వివిధ రాష్ట్రాలలో ఏళ్ల తరబడి ప్రభుత్వంలో పనిచేయడం, అనేక రాజకీయ పరిణామాలను చూసిన అనుభవం ఉన్న ఆలిండియా సర్వీసు అధికారులతో సమావేశమైతే.. దేశానికి కావల్సిన ఎజెండాను రూపొందించడానికి దోహదపడుతుందని కేసీఆర్ భావిస్తున్నారు. అఖిల భారత సర్వీసు అధికారులతో సమావేశమైన తర్వాత రక్షణ శాఖ (సైనిక, వైమానిక, నౌకాదళ) మాజీ ఉన్నతాధికారులు, ఇతర ఉద్యోగులతో... దేశవ్యాప్తంగా ఉన్న న్యాయ నిపుణులు, ప్రముఖ న్యాయవాదులు, అఖిల భారత రైతు సంఘాలు, వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న రైతుల సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రిటైర్డ్ ఉద్యోగ సంఘాలతో, మీడియా సంస్థలు, జర్నలిస్టులు, పారిశ్రామికవేత్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులతోనూ భేటీ కావడానికి సన్నాహాలు చేస్తున్నారు. కేంద్రం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేసిన ఆర్థిక శాఖ అధికారులు, నిపుణులతోనూ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

భేటీల కోసం సమన్వయకర్తలు..

ప్రముఖులు, సంఘాలతో నిర్వహించే సమావేశాలను హైదరాబాద్, ఢిల్లీలో పాటు కోల్‌కతా, ముంబై, చెన్నై, బెంగుళూరు వంటి నగరాల్లోనూ నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. మొత్తంగా వివిధ వర్గాల ప్రతినిధులతో వరుసగా సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు కూడా మొదలైనట్లు తెలుస్తోంది. ఆయా వర్గాలను సంప్రదించడానికి, సమన్వయం చేయడానికి సీఎం ప్రత్యేకంగా సమన్వయకర్తలను నియమించినట్లు సమాచారం.

కేసీఆర్‌కు అజిత్ జోగి ఫోన్

జాతీయ స్థాయిలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం, ఆ రాష్ట్ర జనతా కాంగ్రెస్ పార్టీ నేత అజిత్ ప్రమోద్‌కుమార్ జోగి కేసీఆర్‌తో చర్చించారు. సోమవారం సీఎం కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఆయన.. రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాలన్న కేసీఆర్ ప్రకటనకు మద్దతు ప్రకటించారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు విషయంలో సానుకూలత వ్యక్తం చేశారు. ‘గొప్ప నేతగా ఇప్పటికే నిరూపించుకున్నారు. మరోసారి గొప్ప నేతగా నిరూపించుకుంటారు’ అని అజిత్ జోగి కేసీఆర్‌ను అభినందించినట్లు తెలిసింది.

కేంద్రం ఇచ్చిన నిధులంటే ‘లెక్క’లేదు!

- రూ.847 కోట్లకు యూసీలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఆదేశం
- స్పందించని ఏపీ సర్కారు
- ఖర్చుల లెక్కలు పంపకపోవడంపై మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ నిలదీత
- ఇంకా అంచనాలు పెంచే పనిలోనే ఆర్ అండ్ బీ



సాక్షి, అమరావతి: కేంద్ర రోడ్డు నిధి (సెంట్రల్ రోడ్ ఫండ్.. సీఆర్ఎఫ్) కింద ఏపీకి మంజూరైన రూ.847 కోట్లకు సంబంధించి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు (వినియోగ ధ్రువ పత్రాలు) సమర్పించాలని కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా ఏపీ సర్కారు పెడచెవిన పెడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సీఆర్ఎఫ్ నిధుల కింద ఏపీకి రూ.847 కోట్లకు పైగా కేటాయించగా, 2016–17 సంవత్సరంలో ఏపీకి కేంద్రం రూ.619 కోట్లు మంజూరుచేసింది. గడిచిన ఆర్థిక ఏడాదిలో నిధులకు సంబంధించి యూసీలు అరకొరగానే పంపించారని మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఏడాదీ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు లేకపోవడంతో కేంద్ర అధికారులు ఇటీవలే ఘాటుగా లేఖ రాశారు. చేసిన ఖర్చుకు సంబంధించి వివరాలు, యూసీలు పంపకుంటే ఎలా.. అని నిలదీసినట్లు సమాచారం. రాష్ట్రానికి కేటాయించిన నిధులతో రాష్ట్ర రహదారులు, ప్రధాన రహదారుల అభివృద్ధికి ఈ నిధులు వినియోగించాలని కేంద్రం మంజూరు సమయంలో సూచించింది.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

రాష్ట్రంలోని 13 జిల్లాల్లో మొత్తం 61 రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించి పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. సాంకేతిక, ఆర్థికఅనుమతులు మంజూరు చేసిన నాలుగు నెలల్లోగా పనులు ప్రారంభించాలని ఆదేశాలిచ్చారు. పనులు పూర్తయిన వెంటనే యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి ఇంతవరకూ ఓ కొలిక్కి రాలేదు. పరిపాలన అనుమతులు ఇచ్చిన రహదారులకు అంచనాలు పెంచే పనిలో ప్రభుత్వం ఉండటం గమనార్హం. గుంటూరు, తూర్పుగోదావరి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఇప్పటికే అంచనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి సంకట పరిస్థితి ఎదుర్కొంటోంది. రూ.15 వేల కోట్ల మద్యం ఆదాయం కోసం 15 వేల కిలోమీటర్ల రాష్ట్ర రహదారుల స్థాయి తగ్గిస్తూ జీవో జారీచేసింది. ప్రధాన రహదారులుగా (ఎండీఆర్‌లు) మార్చడంతో రోడ్ల అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక ఏడాది బడ్జెట్‌లో రూ.2,100 కోట్లు కేటాయించింది. అయితే ఎడాపెడా పెంచుతున్న అంచనా వ్యయంతో ఈ నిధులు సరిపోవని వాణిజ్య బ్యాంకుల నుంచి రూ.3 వేల కోట్ల రుణాలకు ఏపీఆర్‌డీసీ ప్రతిపాదనలు రూపొందించింది. అయితే ఇటీవలే విజయా బ్యాంకు నుంచి ఏడాదికి 7.90 శాతం వడ్డీతో రూ.వెయ్యి కోట్ల రుణం ఏపీఆర్‌డీసీకి మంజూరైంది. పనుల పర్యవేక్షణకు సూపరింటెండెంట్ ఇంజనీర్ల పోస్టులు పలు జిల్లాల్లో విశాఖ, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రోజుకు ఎన్ని కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపడుతున్నారో.. సంబంధిత శాఖ అధికారులకే తెలియకపోవడం గమనార్హం. ఈ విషయమై గతంలో ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న అనిల్ చంద్ర పునేఠా పనులపై సమీక్షించిన సమయంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో సీఆర్ఎఫ్ కింద మంజూరు చేసిన నిధులకు సంబంధించి త్వరగా యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించాలని కేంద్రం ఒత్తిడి పెంచడంతో రాష్ట్ర ప్రభుత్వం అయోమయ స్థితిలో ఉంది.

ఐజీఆర్‌యూఏలో సీపీఎల్ కోర్సుల్లో ప్రవేశాలు

ఉత్తరప్రదేశ్‌లోని అమేథిలో ఉన్న ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ (ఐజీఆర్‌యూఏ).. కమర్షియల్ పైలెట్ లైసెన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఐజీఆర్‌యూఏ.. కేంద్ర పౌర విమానయాన శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి వ్యవస్థ. ❖ వ్యవధి: 18 నెలలు (అవసరమనుకుంటే పొడిగిస్తారు). ❖ మొత్తం ఖాళీలు: 75 (జనరల్-38+ఓబీసీ-20+ఎస్సీ-11+ఎస్టీ-6). ❖ అర్హతలు: ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులుగా ఇంటర్మీడియెట్/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. మ్యాథ్స్, ఫిజిక్స్‌లో ఒక్కోదాంట్లో కనీసం 55 శాతం (ఎస్సీ/ఎస్టీ/ఓబీసీకి 50 శాతం) మార్కులు వచ్చి ఉండాలి. ❖ వయసు: ప్రవేశం నాటికి కనీసం 17 ఏళ్లు ఉండాలి. ❖ ఎంపిక: రాతపరీక్ష, వైవా/ఇంటర్వ్యూ, పైలెట్ ఆప్టిట్యూడ్ టెస్ట్. ❖ దరఖాస్తు రుసుం: రూ.10,000; ఎస్సీ/ఎస్టీ కేటగిరీలకు ఫీజు లేదు. ❖ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్. ❖ చివరి తేదీ: బ్యాంక్ చలాన్ ద్వారా ఫీజు చెల్లిస్తే.. ఏప్రిల్ 24, 2018; ఆన్‌లైన్ విధానంలో ఫీజు చెల్లిస్తే.. మే 1, 2018. ❖ వెబ్‌సైట్: www.igrua.gov.in

ఫిజికల్ సైన్స్ మోడల్ పేపర్ (తె.మీ.)

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com



వ్యాపారంలో నష్టాలు, కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా.. పిల్లలను ఉన్నత చదువులు చదివించి, మంచి హోదాలో చూడాలనే తండ్రి ఆశయం.. అదే ఆ అబ్బాయిలో పట్టుదల పెంచింది. పదో తరగతిలో ఫస్ట్‌క్లాస్ మార్కులు మాత్రమే వచ్చినా... ఆ తర్వాత వచ్చిన ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకుంటూ... క్రమంగా ఎదుగుతూ... ఏపీ గ్రూప్-2 స్టేట్ టాపర్ స్థాయికి ఎదిగారు చింతలపూడి విజయ్‌కుమార్‌రెడ్డి. తనతోపాటు భార్య, తమ్ముడు సైతం గ్రూప్ 2 సాధించేలా తోడ్పాటు అందించడం ఆయన ఘనతకు నిదర్శనం. ఇటీవల విడుదలైన ఏపీ గ్రూప్-2 (2016) ఫలితాల్లో 357.35 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలిచి, డిప్యూటీ తహశీల్దార్‌గా ఎంపికైన చింతలపూడి విజయ్‌కుమార్‌రెడ్డి విజయ ప్రస్థానం ఆయన మాటల్లోనే...

చదివింది బీఫార్మసీ. కానీ తన లక్ష్యం ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగం.. సమాజానికి మేలు చేయడం.. అందుకే బీఫార్మసీ పూర్తవుతూనే ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో విజయం సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. సివిల్స్ ప్రిపరేషన్‌తో ఏపీ గ్రూప్2 (2016) ఫలితాల్లో 337.10 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మహిళా టాపర్‌గా నిలిచారు.. ఎల్.రామలక్ష్మి. పోటీ పరీక్షల్లో అకడమిక్ నేపథ్యంతో సంబంధం లేకుండా అందరికీ కష్టమైన అంశాలు, ఇష్టమైన అంశాలు ఉంటాయని.. అందుకు అనుగుణంగా ప్రిపరేషన్ సాగించడంలోనే విజయ రహస్యం దాగి ఉందంటున్న రామలక్ష్మి సక్సెస్ స్పీక్స్ ఆమె మాటల్లోనే..



గ్రూప్-2 స్టేట్ టాపర్
సీహెచ్ విజయ్ కుమార్‌రెడ్డి ప్రస్థానం

గ్రూప్-2 స్టేట్ మహిళా టాపర్
ఎల్.రామలక్ష్మి

సక్సెస్ స్పీక్స్

గ్రూప్-2 విజేతల గెలుపు బాట

సగటు విద్యార్థి నుంచి.. స్టేట్ టాపర్ స్థాయికి..!

నా సక్సెస్ స్టోరీ చెప్పాలంటే.. ముందు మా కుటుంబ పరిస్థితులతో ప్రారంభించాలి. వాస్తవానికి మా స్వస్థలం ప్రకాశం జిల్లా, పెద్దారవీడు మండలంలోని కంభంపాడు. నాన్న సుబ్బారెడ్డి. నా చిన్నప్పుడు మా కుటుంబానికి 30 ఎకరాల భూమి ఉండేది. పూర్తి గ్రామీణ ప్రాంతం కావడంతో మా చదువుల కోసం ఆ భూమిని విక్రయించి, మార్కాపురానికి వలస వచ్చేశారు. నాన్న అక్కడ వ్యాపారం చేశారు. కానీ, నష్టాలు వచ్చాయి. దీంతో వ్యాపారం కంటే ఉద్యోగమే స్థిరమైందనే భావనను మాకు కల్పించారు. మమ్మల్ని మంచి చదువులు చదివించాలని, ఉన్నత స్థానాల్లో చూడాలన్నది నాన్న తపన. అందుకే.. నేను, తమ్ముడు మొదటి నుంచీ ప్రభుత్వ ఉద్యోగాల కోసం కృషి చేశాం. ఫలితంగా ఇప్పటికే నేను రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సొంతం చేసుకోవడం.. తాజాగా గ్రూప్-2లో విజయం సాధించడం సాధ్యమైంది.

విద్యాభ్యాసం

నా విద్యాభ్యాసం అంతా మార్కాపురంలోనే కొనసాగింది. 1999లో పదో తరగతిలో ఫస్ట్ క్లాస్ మార్కులు వచ్చాయి. ఇంటర్‌లో 736 మార్కులు సాధించాను. బీఎస్సీలో 74 శాతం మార్కులు వచ్చాయి. బీఎస్సీ తర్వాత నా దృష్టి ఉపాధ్యాయ వృత్తిపై పడింది. దాంతో 2005లో బీఈడీ పూర్తిచేశాక.. 2006 డీఎస్సీలో ఎస్‌జీటీ పోస్ట్‌కు ఎంపికయ్యాను.

2008 గ్రూప్-2లోనూ విజయం

ఒకవైపు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే మరింత ఉన్నతమైన హోదా పొందాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాను. ఈ లక్ష్యానికి అనుగుణంగా అప్పట్లో నాకు కనిపించిన మార్గం ఏపీపీఎస్సీ. సరిగ్గా అదే సమయంలో గ్రూప్-2 నోటిఫికేషన్ వెలువడటంతో ఆ దిశగా కృషిచేశాను. ఫలితంగా 2008లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పోస్టు లభించింది. ప్రస్తుతం అదే హోదాలో విశాఖపట్నం తొమ్మిదో సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్నాను.

మళ్లీ గ్రూప్-2 ఎందుకంటే..

2008, గ్రూప్-2లోనే ఏఎల్‌ఓగా ఎంపికైనా.. మళ్లీ గ్రూప్-2 (2016)కు హాజరుకావడానికి ప్రధాన కారణం.. స్వస్థలంలో విధులు నిర్వహించాలనే ఆకాంక్షే. గ్రూప్-2లో పోస్ట్‌లన్నీ జోన్ స్థాయి పోస్ట్‌లు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సొంత జోన్‌లో పని చేయాలనే లక్ష్యంతో చదివాను. 2016, గ్రూప్-2కు ప్రిపరేషన్ క్రమంలో కొంత విభిన్నమైన వ్యూహం అనుసరించాను. ఎకనామిక్ సర్వే చదివేటప్పుడు.. ఒక స్టోరీ చదువుతున్నట్లు చదువుతూ.. ముఖ్యమైన అంశాలు, గణాంకాలను నోట్స్ రూపంలో రాసుకున్నాను. ఇంటర్నెట్ ద్వారా అవసరమైన సమాచారాన్ని సేకరించాను.

ఒకటి లేదా రెండు పుస్తకాలు

ఏ సబ్జెక్ట్‌లోనైనా.. ఒకటి లేదా రెండు పుస్తకాలు మాత్రమే చదివాను. దీనివల్ల మానసికంగా, సబ్జెక్ట్ పరంగా ఎదురయ్యే గందరగోళం సమస్య రాకుండా చూసుకోగలిగాను. అంతేకాకుండా ప్రతి సబ్జెక్ట్‌ను సమకాలీన అంశాలతో బేరీజు వేసుకుంటూ చదవడం కూడా ఎంతో కలిసొచ్చింది. గ్రూప్-2 ప్రిపరేషన్‌లో చాలామంది అభ్యర్థులు చేసే పొరపాటు బిట్స్, గైడ్స్‌ను ఫాలో కావడం. కానీ.. ఇది పరీక్ష హాల్లో ప్రతికూల ప్రభావం చూపుతుంది. వాస్తవానికి ఇటీవల ఏపీపీఎస్సీ పరీక్షల్లో పరోక్ష ప్రశ్నలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ విషయాన్ని గమనించి.. నా గ్రూప్-2 ప్రిపరేషన్‌ను అందుకు అనుగుణంగా ఉండేలా మలచుకున్నాను.

ఆరు నెలల సెలవు పెట్టి.. ప్రిపరేషన్

గ్రూప్-2, 2016లో ఎట్టి పరిస్థితుల్లోనైనా విజయం సాధించాలనే లక్ష్యం నిర్దేశించుకున్నాను. గతేడాది ఫిబ్రవరి నుంచి జూలై వరకు ఆరు నెలలు సెలవు పెట్టి ప్రిపరేషన్ సాగించాను. ఫలితంగా తాజా విజయం లభించింది. రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు రావడం సంతోషంగా ఉంది. డిప్యూటీ తహశీల్దార్‌గా ప్రజలకు అందాల్సిన పథకాలు వారికి చేరేలా పనిచేయడం తద్వారా సమాజాభివృద్ధికి నావంతు కృషిచేయడమే లక్ష్యం.

ఆ ఇద్దరి విజయం మరింత ఆనందం

ప్రస్తుత ఫలితాల్లో మా కుటుంబానికి మరింత ఆనందం కలిగించే విషయం.. ఇంతకుముందు గ్రూప్-2 (2012)లో విజయం సాధించి ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికై ప్రస్తుతం సీఐగా మడకశిర (అనంతపురం జిల్లా)లో పనిచేస్తున్న భార్య గీతా కుమారి, అలాగే తమ్ముడు అశోక్ కుమార్‌రెడ్డి ఇద్దరూ తాజా గ్రూప్-2 ఫలితాల్లో మంచి మార్కులు సాధించి.. డిప్యూటీ తహశీల్దార్ పోస్టులకు ఎంపిక కావడం.

సాధించాలనే తపన

గ్రూప్స్ ఔత్సాహిక అభ్యర్థులకు లక్ష్యంపై స్పష్టత ఉండాలి. లక్ష్యం నిర్దేశించుకున్నాక.. దాన్ని సాధించాలనే తపన... పరీక్ష రోజు వరకు ఉండాలి. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సబ్జెక్ట్ కొంత ప్రతికూలంగా ఉంటుంది. ఫలానా సబ్జెక్ట్‌లో 'వీక్'గా ఉన్నామనే భావనతోనే సాగితే.. ఆ సబ్జెక్ట్‌లో పట్టు సాధించడం అసాధ్యం. నాకు ఎకనామిక్స్ కష్టంగా అనిపించేది. క్రమేణా దానిపై ఆసక్తి పెంచుకున్నాను. ఫలితంగా ఆ పేపర్‌లో 115.86 మార్కులు వచ్చాయి. ఇలా.. ప్రతిఒక్కరూ తమకు ప్రతికూలం లేదా బలహీనంగా ఉన్న సబ్జెక్ట్‌పై ఆసక్తిని పెంపొందించుకుంటే.. తొలుత కష్టంగా ఉన్నప్పటికీ క్రమంగా అందులో లీనమై చదవగలిగే నైపుణ్యం అలవడుతుంది!!

లక్ష్యం 'సివిల్స్'..

మా స్వస్థలం విశాఖపట్నం జిల్లా, చీడికాడ మండలంలోని తురువోలు గ్రామం. అమ్మ సత్యవాణి, నాన్న జగ్గినాయుడు. పూర్తిగా వ్యవసాయ కుటుంబం. మాకున్న కొద్దిపాటి పొలమే కుటుంబానికి ఆధారం. అయినా అమ్మానాన్న.. అమ్మాయికి చదువెందుకని ఆలోచించలేదు. ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే

నా చదువంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే కొనసాగింది. అయిదో తరగతి వరకు స్వగ్రామంలో, ఆరు నుంచి పదో తరగతి వరకు భీమునిపట్నంలో చదివాను. పదోతరగతిలో మంచి మార్కులు (535) వచ్చాయి. ఆ తర్వాత తాటిపూడిలోని ఏపీఆర్‌జేసీలో ఇంటర్మీడియెట్ పూర్తిచేశాను. ఎంసెట్‌లో 9000వ ర్యాంకు వచ్చింది. ఆ ర్యాంకుతో భీమవరంలోని ఓ ప్రైవేటు ఫార్మసీ కళాశాలలో చేరాను. 2013లో బీఫార్మసీ పూర్తయింది.

సివిల్స్ లక్ష్యంగా

వాస్తవానికి బీఫార్మసీతో ఉద్యోగాలు లభిస్తాయి. కానీ, అధిక శాతం ప్రైవేటు రంగంలోనే ఉంటాయి. దీంతో ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడాలని నిశ్చయించుకున్నాను. అది కూడా ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగం అయితే సమాజానికి కూడా మేలు చేయొచ్చని భావించాను. అప్పుడే అత్యున్నత సివిల్ సర్వీసెస్ గురించి తెలిసింది. సివిల్స్‌ను లక్ష్యంగా నిర్దేశించుకునే సమయానికి ఈ పరీక్షలో విజయం సాధిస్తే.. లభించే హోదాల గురించే తెలుసు. కానీ.. ప్రిపరేషన్ పరంగా ఎలాంటి అవగాహనా లేదు. దీంతో 2014లో హైదరాబాద్‌లో సివిల్స్ కోచింగ్‌లో చేరాను.

సివిల్స్ విజయమే లక్ష్యం

ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్ పోస్ట్‌కు నియామకం ఖరారైంది. నా భవిష్యత్తు లక్ష్యం సివిల్స్‌లో విజయం సాధించడమే. గతేడాదంతా గ్రూప్స్ ప్రిపరేషన్‌కే సరిపోయింది. దీంతో అటెంప్ట్ ఇవ్వలేదు. ఈ ఏడాది కూడా పరీక్షకు హాజరుకాను. సివిల్స్-2019లో విజయం సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాను.

నోటిఫికేషన్ చూశాకే.. గ్రూప్-2పై దృష్టి

వాస్తవానికి గ్రూప్-2లో ఈ స్థాయిలో నిలుస్తానని ఊహించలేదు. సివిల్స్‌కు ప్రిపరేషన్ సాగిస్తున్న తరుణంలో గ్రూప్-2 నోటిఫికేషన్ వెలువడింది. ఆ నోటిఫికేషన్ చూశాకే.. ఒక అటెంప్ట్ ఇస్తే ఎలా ఉంటుంది? అనే ఆలోచన కలిగింది. ఆ ఆలోచనకు అనుగుణంగా దరఖాస్తు చేసుకున్నాను. నా విషయంలో గ్రూప్-2 ప్రిపరేషన్ క్రమంలో సివిల్స్ శిక్షణ ఎంతో ఉపకరించింది. గ్రూప్-2లోని అధిక శాతం సిలబస్, సివిల్స్ సిలబస్‌లోని అంశాల సమ్మిళితంగా ఉండటంతో ప్రిపరేషన్ పరంగా ఎలాంటి ఇబ్బందీ ఎదురుకాలేదు. అప్పటికే ఆయా సబ్జెక్ట్‌ల ప్రిపరేషన్‌ను డిస్క్రిప్టివ్ విధానంలో పూర్తిచేయడం.. ఫలితంగా గ్రూప్-2 ఆబ్జెక్టివ్ అయినప్పటికీ పరీక్షహాల్లో సులువుగా సమాధానాలు గుర్తించగలిగాను.

ఏపీ అంశాలపై ప్రత్యేకంగా

గ్రూప్-2 ప్రిపరేషన్ పరంగా ఏపీ హిస్టరీ, ఏపీ ఎకానమీ అంశాలకు మాత్రం ప్రత్యేకంగా సమయం కేటాయించాల్సి వచ్చింది. అదేమంత కష్టం అనిపించలేదు. వాటికి సంబంధించి అకాడమీ పుస్తకాలను అనుసరించాను. ప్రిపరేషన్ పరంగా నాకు ప్రధానంగా కలిసొచ్చిన వ్యూహం.. సమన్వయం చేసుకోవడం! హిస్టరీ, పాలిటీ, ఎకానమీ.. ఇలా అన్ని సబ్జెక్ట్‌లకు సంబంధించిన సమకాలీన అంశాలను కోర్ అంశాలతో అనుసంధానం చేసుకుంటూ చదివాను. రోజూ కరెంట్ అఫైర్స్‌ను తప్పనిసరిగా అనుసరించాను.

అందరికీ 'పోటీ'యే!

గ్రూప్స్, సివిల్స్ వంటి పోటీ పరీక్షల విషయంలో అభ్యర్థుల్లో నెలకొన్న ప్రధాన అభిప్రాయం.. కొన్ని సబ్జెక్ట్‌లు కొందరికి అనుకూలం.. మరికొందరికి ప్రతికూలం అనేది. కానీ.. పరీక్ష హాల్లో ప్రశ్నపత్రాల తీరు చూస్తే ఇలాంటివన్నీ అపోహలే అని అర్థమవుతుంది. ఎలాంటి నేపథ్యమున్న వారికైనా.. విజయంలో ప్రధాన సాధనం విశ్లేషణాత్మక దృక్పథం. ఒక విషయాన్ని పలు కోణాల్లో ఆలోచించి ప్రశ్నకు సరైన సమాధానాన్ని గుర్తించడం ముఖ్యం. సబ్జెక్ట్‌ను ఆకళింపు చేసుకునే విషయంలో ప్రిపరేషన్ పరంగా అన్ని సబ్జెక్ట్‌లపై పట్టు సాధించడం ద్వారా పరీక్ష హాల్లో చూపే ప్రతిభే విజయానికి కొలమానం!!

విద్య, ఉద్యోగ సమాచారం




ఐసీఏఆర్ - అగ్రికల్చర్ కోర్సులు

దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ, అనుబంధ కోర్సుల కళాశాలల్లో డిగ్రీ, పీజీ, డాక్టోరల్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశానికి నిర్వహించే జాతీయస్థాయి పరీక్షల తేదీలను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) ప్రకటించింది. దీనిద్వారా వ్యవసాయ యూనివర్సిటీల్లోని బ్యాచిలర్ కోర్సుల్లో 15 శాతం సీట్లను; పీజీలో 25 శాతం, డాక్టోరల్ కోర్సుల్లో 25 శాతం సీట్లను భర్తీచేస్తారు.

కోర్సు-అర్హతలు-పరీక్ష తేదీలు

1. అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ):
- ❖ **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/అగ్రికల్చర్/మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులూ అర్హులే.
- ❖ **యూజీ ప్రవేశ పరీక్ష తేదీ:** 2018, మే 12న ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు.

2. పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ):
- ❖ **అర్హత:** అగ్రికల్చర్, అనుబంధ సైన్స్ కోర్సులు లేదా సంబంధిత విభాగంలో.. నాలుగేళ్ల కోర్సులు పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐఏఆర్ఐ, ఎన్‌డీఆర్‌ఐలలో కొన్ని కోర్సులకు మూడేళ్ల వ్యవధి ఉన్న డిగ్రీ కోర్సులు చేసిన వారూ అర్హులే. ఫైనల్ ఇయర్ విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- ❖ **పీజీ ప్రవేశ పరీక్ష తేదీ:** 2018, మే 13న ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు.
- ❖ పీజీ కోర్సులకు ఎంపికైన వారిలో 475 మందికి ఐసీఏఆర్ పీజీ ఉపకార వేతనం లభిస్తుంది. ఒకవేళ ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికవ్వకుండా, స్థానికేతర రాష్ట్రంలో సీటు పొందితే నేషనల్ టాలెంట్ స్కాలర్‌షిప్ (పీజీఎస్) పొందొచ్చు.



3. పీహెచ్‌డీ:
- ❖ **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి అగ్రికల్చర్, అనుబంధ కోర్సుల్లో పీజీ పూర్తిచేసిన/చివరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు అర్హులు.
- ❖ **పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష తేదీ:** 2018, మే 13న ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు.
- ❖ **వెబ్‌సైట్:** www.icar.org.in

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీలో 13 ఖాళీలు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ (ఎన్ఐడబ్ల్యూఈ)... 13 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ❖ **పోస్టు-ఖాళీలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్ (పీఈ)-9 (సీఈ-3+ఏపీ-1+జీఐఎస్-1+ఎంఈ-1+ఈఈ-1+ఈఎల్-2); ప్రాజెక్టు ఆఫీసర్ (పీవో)-1 (అకౌంట్స్); జూనియర్ ఇంజనీర్ (జేఈ)-2; జూనియర్ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ (జేఈఏ)-1 (స్టెనో-టైపిస్ట్).
- ❖ **వేతనం:** పీఈ, పీవో-రూ.50,000-రూ.60,000; జేఈ-రూ.35,000; జేఈఏ-రూ.25,000.
- ❖ **వయసు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి పీఈ, పీవో పోస్టులకు 35 ఏళ్లు; జేఈ, జేఈఏ పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- ❖ **ఎంపిక:** టెస్ట్/ఇంటర్వ్యూ. ❖ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- ❖ **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** మార్చి 28, 2018.
- ❖ **వెబ్‌సైట్:** niwe.res.in

నవోదయ విద్యాలయాల్లో 9వ తరగతి ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2018-19కి గాను 9వ తరగతిలో మిగిలిన ఖాళీలకు లేటరల్ ఎంట్రీ కింద దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది. అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యకు చిరునామాగా నిలిచే ఈ విద్యాలయాలు తమిళనాడు మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి మొత్తం 626 ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాల్లోని జేఎన్‌వీల్లో ఖాళీలు

- ❖ **ఆంధ్రప్రదేశ్‌లో...** అనంతపురం-0, చిత్తూరు-9, తూర్పు గోదావరి (1)-10, తూర్పుగోదావరి (2)-1, గుంటూరు-13, వైఎస్సార్ కడప-7, కృష్ణా-9, కర్నూలు-2, నెల్లూరు-6, ప్రకాశం (1)-4, ప్రకాశం (2)-8, శ్రీకాకుళం-3, విశాఖపట్నం-4, విజయనగరం-5, పశ్చిమ గోదావరి-8.
- ❖ **తెలంగాణలో..** ఆదిలాబాద్-2, కరీంనగర్-7, ఖమ్మం-7, మహబూబ్‌నగర్-7, మెదక్-6, నల్గొండ-6, నిజామాబాద్-9, రంగారెడ్డి-5, వరంగల్-2. తెలంగాణలో పాత ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జేఎన్‌వీలు ఉన్నాయి.
- ❖ **అర్హతలు:** ఏదైనా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2017-18 విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతూ తుది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. ❖ **వయసు:** 2002, మే 1-ఏప్రిల్ 30, 2006 మధ్య జన్మించి ఉండాలి. ❖ **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ద్వారా.
- ❖ **ప్రవేశ పరీక్ష విధానం:** దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్ నుంచి 15, హిందీ-15, మ్యాథమెటిక్స్-35, సైన్స్ నుంచి 35 చొప్పున ప్రశ్నలు ఇస్తారు. ఎనిమిదో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి 2 గంటల 30 నిమిషాలు. పరీక్ష ఇంగ్లిష్, హిందీ మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.
- ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **చివరి తేదీ:** ఏప్రిల్ 5, 2018. ❖ **ప్రవేశ పరీక్ష తేదీ:** మే 19, 2018.
- ❖ **వెబ్‌సైట్:** www.nvshq.org

ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్స్

యునైటెడ్ స్టేట్-ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ (యూఎస్ఐఈఎఫ్)... 2019-20కిగాను ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్స్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వివిధ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ, పరిశోధనలు, బోధనలు వంటి వాటికి ఈ ఫెలోషిప్స్ అందిస్తారు.

- ❖ **ఫెలోషిప్స్:** ఫుల్‌బ్రైట్-నెహ్రూ మాస్టర్స్ ఫెలోషిప్స్, ఫుల్‌బ్రైట్-నెహ్రూ డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోషిప్స్, ఫుల్‌బ్రైట్-నెహ్రూ పోస్ట్‌డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోషిప్స్, ఫుల్‌బ్రైట్-నెహ్రూ అకడమిక్ అండ్ ప్రొఫెషనల్ ఎక్సలెన్స్ ఫెలోషిప్స్, ఫుల్‌బ్రైట్-నెహ్రూ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేటర్స్ సెమినార్; ఫుల్‌బ్రైట్-కలాం క్లైమేట్ ఫెలోషిప్ ఫర్ డాక్టోరల్ రీసెర్చ్, ఫుల్‌బ్రైట్-కలాం క్లైమేట్ ఫెలోషిప్ ఫర్ పోస్ట్‌డాక్టోరల్ రీసెర్చ్; హ్యుబర్ట్ హెచ్.హంఫ్రే ఫెలోషిప్ ప్రోగ్రామ్, ఫుల్‌బ్రైట్ ఫారెన్ లాంగ్వేజ్ టీచింగ్ అసిస్టెంట్ ప్రోగామ్, ఫుల్‌బ్రైట్ డిస్టింగ్విష్డ్ అవార్డ్స్ ఇన్ టీచింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఇంటర్నేషనల్ టీచర్స్, ఫుల్‌బ్రైట్ టీచింగ్ ఎక్సలెన్స్ అండ్ అచీవ్‌మెంట్ ప్రోగ్రామ్, ఫుల్‌బ్రైట్ స్కాలర్-ఇన్-రెసిడెన్స్ ప్రోగ్రామ్.
- ❖ **అర్హతలు:** సంబంధిత ఫెలోషిప్స్, విభాగాలను బట్టి బ్యాచిలర్ డిగ్రీ (అమెరికన్ బ్యాచిలర్ డిగ్రీకి సమానమై ఉండాలి)/పీహెచ్‌డీ. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, అనుభవం తదితర అర్హతలుండాలి.
- ❖ **చివరి తేదీ:** ఫెలోషిప్ బట్టి వేర్వేరు తేదీలను గడువుగా నిర్ణయించారు. ఫుల్‌బ్రైట్-నెహ్రూలోని మాస్టర్స్, డాక్టోరల్ ఫెలోషిప్స్‌కు జూన్ 15, 2018; పోస్ట్‌డాక్టోరల్, అకడమిక్ అండ్ ప్రొఫెషనల్ ఎక్సలెన్స్ ఫెలోషిప్స్‌కు, ఫుల్‌బ్రైట్-కలాం ఫెలోషిప్స్‌కు జూలై 16, 2018; ఫుల్‌బ్రైట్-నెహ్రూ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేటర్స్ సెమినార్‌కు ఆగస్టు 31, 2018. ఇతర ఫెలోషిప్స్‌లోని హ్యుబర్ట్ హెచ్.హంఫ్రే ఫెలోషిప్ ప్రోగ్రామ్‌కు జూన్ 15, 2018. మిగిలిన వాటికి ఆగస్టు 31, 2018.
- ❖ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.usief.org.in

సాక్షి బిజినెస్
మంగళవారం 6-3-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
300 ▼	100 ▼
33,747	10,359

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 10.30కి)

నాస్‌డాక్	7,320	▲	62
డోజోన్స్	24,729	▲	191
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,116	▲	46
డాక్స్	12,091	▲	177
షాంఘై	3,258	▲	3
నికాయ్	21,042	▽	140

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.85	65.98
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.20	91.38
€	యూరో	ఎస్‌బీఐ	81.49	81.65
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.71	62.84
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.36	51.46
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.08	50.17
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.74	19.23
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.11	18.83
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.27	11.80

టాటా 'జెస్ట్' స్పెషల్ ఎడిషన్

ధర రూ.7.53 లక్షలు



ముంబై: దేశీ ప్రముఖ వాహన తయారీ కంపెనీ 'టాటా మోటార్స్' తాజాగా తన కాంపాక్ట్ సెడాన్ 'జెస్ట్'లో స్పెషల్ ఎడిషన్ 'జెస్ట్ ప్రీమియో'ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ధర రూ.7.53 లక్షలు (ఎక్స్‌షోరూమ్ ఢిల్లీ). 1.3 లీటర్ సామర్థ్యపు డీజిల్ ఇంజిన్ కలిగిన ఈ ప్రత్యేక ఎడిషన్‌లో 13 అదనపు ఫీచర్లను పొందుపరిచామని కంపెనీ తెలిపింది. కాగా కంపెనీ 2014 ఆగస్ట్‌లో ఈ కారును ఆవిష్కరించింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా 85,000 యూనిట్లను విక్రయించింది.

మహీంద్రా కొత్త 'మోజో'

ధర రూ.1.49 లక్షలు



ముంబై: మహీంద్రా టూవీలర్స్ తాజాగా తన ప్రీమియం స్పోర్ట్స్ టూరర్ బైక్ 'మోజో'లో కొత్త వేరియంట్ 'మోజో యూటీ (యూనివర్సల్ టూరర్) 300'ను మార్కెట్‌లోకి ఆవిష్కరించింది. దీని ధర రూ.1.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్ ఢిల్లీ). ఈ నెలలోని మోజో యూటీ-300 బుకింగ్స్‌పై రూ.10,000 విలువైన ప్రయోజనాలు పొందొచ్చని కంపెనీ తెలిపింది. మోజో యూటీ-300లో 300 సీసీ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్, కాంపాక్ట్ డిజిటల్ ప్యానెల్, కార్బ్యురేటర్ ఫ్యూయెల్ సిస్టమ్, 17 అంగుళాల ట్యూబ్‌లెస్ టైర్స్, 21 లీటర్ల ఫ్యూయెల్ ట్యాంక్ వంటి పలు ప్రత్యేకతలున్నాయని వివరించింది. కాగా స్టాండర్డ్ మోజో వేరియంట్ 'మోజో ఎక్స్‌టీ (ఎక్స్‌ట్రీమ్ టూరర్) 300'తో పోలిస్తే తాజా వేరియంట్ ధర రూ.23,000 వరకు చౌక.

బీఎండబ్ల్యూ 6సిరీస్ గ్రాన్ టురిస్మో @ 58.9 లక్షలు



చెన్నై: లగ్జరీ కార్ల తయారీ కంపెనీ 'బీఎండబ్ల్యూ' చెన్నై ప్లాంటులో తొలిసారిగా తయారుచేసిన 6 సిరీస్ గ్రాన్ టురిస్మో కారు 'బీఎండబ్ల్యూ 630ఐ గ్రాన్ టురిస్మో స్పోర్ట్ లైన్'ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఇది పెట్రోల్ వేరియంట్ రూపంలో అందుబాటులో ఉండనుంది. దీని ధర రూ.58.9 లక్షలు (ఎక్స్‌షోరూమ్). స్థానికంగానే తయారుచేసిన ఈ కారును చెన్నైలోని కేయూఎన్ ఎక్స్‌క్లూజివ్ ఔట్‌లెట్‌లో బుకింగ్ చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ గత నెలలో న్యూఢిల్లీలో జరిగిన ఆటో ఎక్స్‌పో కార్యక్రమంలో ఈ కారును ఆవిష్కరించారు.

టీడీఎస్ పేరిట రూ.3,200 కోట్లు స్వాహా!

ఉద్యోగుల వేతనాల నుంచి టీడీఎస్ కోతలు

- ఆదాయపన్ను శాఖకు జమ చేయని కంపెనీలు
- అవన్నీ సొంత వ్యాపార అవసరాలకు మళ్లింపు



న్యూఢిల్లీ: నీరవ్ మోదీ 12,700 కోట్ల స్కామ్ దేశ బ్యాంకింగ్ రంగాన్ని కుదిపేస్తే... మరోవంక టీడీఎస్ రూపంలో కంపెనీలు రూ.3,200 కోట్ల మేర భారీ అక్రమాలకు పాల్పడిన విషయం వెలుగులోకి వచ్చింది. టీడీఎస్ అంటే... ఉద్యోగుల జీతం నుంచి ఆదాయపు పన్ను నిమిత్తం నెల నెలా కోత వేసే మొత్తం. ప్రతీ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కంపెనీలు తమ ఉద్యోగుల వార్షికాదాయం గనక పన్ను చెల్లించేటంత ఉంటే ఆ మేరకు టీడీఎస్‌ను మినహాయించి వారి పేరిట ఆదాయపన్ను శాఖకు జమ చేస్తుంటాయి. అయితే 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 447 కంపెనీలు టీడీఎస్ సొమ్మును జమ చేయకుండా పక్కదారి పట్టించినట్టు ఆ శాఖ గుర్తించింది. ఈ నిధుల్ని కంపెనీలు మూలధన అవసరాలు, ఇతర వ్యాపార కార్యకలాపాలకు వాడేసుకున్నాయి. ఈ మేరకు ఆదాయపన్ను శాఖ వర్గాలను ఉటంకిస్తూ... ఓ ఆంగ్ల దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. ఇలా టీడీఎస్ ఎగవేతలకు పాల్పడిన వాటిలో ఇన్‌ఫ్రా కంపెనీలు, చిత్ర నిర్మాణ సంస్థలు, ఇతర కంపెనీలు ఉన్నాయి. కొన్ని కంపెనీలు టీడీఎస్ సొమ్ములో సగం మేర జమ చేసి, మిగిలిన సగాన్ని తమ అవసరాలకు వాడుకున్నట్టు తెలిసింది. ఈ సంస్థలపై ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 276బి కింద విచారణ ప్రారంభించినట్లు సమాచారం.

ఐటీ శాఖలో ఈ-కమ్యూనికేషన్ వ్యవస్థ

ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) దేశవ్యాప్తంగా పన్ను చెల్లింపుదారులతో ప్రత్యక్ష సంబంధాల కోసం కాగిత రహిత ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టనుంది. ఈ-కమ్యూనికేషన్ వ్యవస్థను ఆదాయపన్ను శాఖలో ఏర్పాటు చేస్తారు. ఆ విభాగం ఏ పన్ను చెల్లింపుదారుడికైనా సమాచారం, ఇతర ధ్రువీకరణలకు ఆన్‌లైన్‌లోనే ఈమెయిల్‌కు నోటీసులు పంపుతుంది. ఈ విషయాన్ని మొబైల్‌కు సందేశం పంపడం ద్వారా తెలియజేస్తారు. ఈ కమ్యూనికేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసే మెషీన్ పన్ను చెల్లింపుదారుల స్పందనను నమోదు చేయనుంది.

అమెరికా దిగుమతి సుంకాలపై దేశీ పరిశ్రమ అంచనాలు

మనపై ప్రభావం తక్కువే!!

అమెరికాకు మన అల్యూమినియం, ఉక్కు ఎగుమతులు పరిమితమే

- ఇతర దేశాలే ఎక్కువగా ఎగుమతి చేస్తున్నాయ్
- భారత్‌పై ప్రభావం పరోక్షంగా ఉండొచ్చని వ్యాఖ్య





న్యూఢిల్లీ: ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీ సుంకాలు విధించాలన్న అమెరికా ప్రతిపాదన... భారత్‌పై పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదని దేశీ ఉక్కు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అమెరికా మొత్తం ఉక్కు దిగుమతుల్లో భారత్ వాటా కేవలం రెండు శాతమేనని ప్రభుత్వ రంగ ఉక్కు దిగ్గజం సెయిల్ రూర్కెలా ప్లాంటు మాజీ ఎండీ సనక్ మిశ్రా తెలిపారు. అమెరికాకు ఎగుమతి చేసే పరిమాణం తక్కువగా ఉండటం, దేశీయంగా డిమాండ్ పెరుగుతుండటం తదితర అంశాల వల్ల సుంకాల పెంపు ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండబోదని ఆయన చెప్పారు. 'అమెరికా మొత్తం ఉక్కు దిగుమతుల్లో భారత వాటా రెండు శాతమే ఉంటుంది. దేశీయంగా ఉక్కు మార్కెట్, వినియోగం భారీగా పెరుగుతోంది' అని మిశ్రా తెలిపారు. మరోవైపు, ఉక్కు ఉత్పత్తులపై సుంకాలు పెంచాలన్న అమెరికా ప్రతిపాదన.. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) నిబంధనలకు విరుద్ధమని ఎస్సార్ స్టీల్ డైరెక్టర్ (కమర్షియల్) హెచ్.శివరామ కృష్ణన్ వ్యాఖ్యానించారు. ఒకవేళ దీన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదించిన పక్షంలో... అంతర్జాతీయంగా ఉక్కు వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపవచ్చని పేర్కొన్నారు. అయితే, భారత్‌పై పరోక్షంగా కొంత ప్రభావం పడొచ్చన్నారు. 'అమెరికాకు యూరోపియన్ దేశాల నుంచి జరిగే ఎగుమతులపై ప్రధానంగా ప్రతికూల ప్రభావం పడుతుంది. ఫలితంగా యూరప్‌తో పాటు ఇతర ప్రాంతాలకు భారత్ చేసే ఎగుమతులపైనా ఇది ప్రభావం చూపుతుంది'' అని ఆయన చెప్పారు. అమెరికాకు భారత్ ఉక్కు ఎగుమతులపై స్వల్ప ప్రభావమే ఉంటుందని సెయిల్ మాజీ చైర్మన్ సుశీల్ కుమార్ రుంగ్టా చెప్పారు. అయితే అమెరికా నిర్ణయంతో మిగతా దేశాలు కూడా ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని.. ఇది అంతర్జాతీయంగా ఉక్కు వ్యాపారంలో పెను మార్పులు తీసుకురావచ్చని.. లేదా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఉక్కు దిగుమతులపై 25%, అల్యూమినియంపై 10% సుంకాలు విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించడం తెలిసిందే. దీనికి అధికారిక ముద్ర వేస్తూ.. వచ్చేవారం ఈ ప్రతిపాదనపై ఆయన సంతకాలు చేసే అవకాశముంది.

ఇతర దేశాలపైనే ఎక్కువ ప్రభావం: కొటక్

సుంకాల పెంపు అమలైతే... ఇతర దేశాల నుంచి అమెరికాకు ఉక్కు ఎగుమతులు సుమారు 9-14 మిలియన్ టన్నుల మేర తగ్గొచ్చని కొటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ ఒక నివేదికలో పేర్కొంది. 'దిగుమతి సుంకాలను పెంచడంతో పాటు దేశీయంగా ఉక్కు మిల్లుల సామర్థ్యాలను ప్రస్తుతమున్న 72 శాతం స్థాయి నుంచి 80- 85 శాతం స్థాయికి పెంచాలన్న అమెరికా నిర్ణయాలతో ఆ దేశానికి ఇతర దేశాల నుంచి ఉక్కు ఎగుమతులు 9- 14 మిలియన్ టన్నుల మేర తగ్గొచ్చు'' అని అంచనా వేసింది. 2017లో అమెరికా 82 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయగా 36 మిలియన్ టన్నులు దిగుమతి చేసుకుంది. ఒకవేళ ప్లాంట్ల సామర్థ్యం మెరుగుపడి ఉక్కు ఉత్పత్తి 91-96 మిలియన్ టన్నులకు పెరిగిన పక్షంలో దిగుమతులు 22- 25 ఎంటీకి తగ్గిపోవచ్చని అంచనా. అమెరికాకు ఉక్కు ఎగుమతుల్లో కెనడా, బ్రెజిల్, దక్షిణ కొరియా, మెక్సికో, రష్యా దేశాల వాటా దాదాపు 60 శాతం. గతేడాది భారత్ 0.9 ఎంటీ ఉక్కు మాత్రమే ఎగుమతి చేసింది. అయితే అమెరికా తీసుకునే రక్షణాత్మక చర్యల ప్రభావం ప్రపంచ ఉక్కు మార్కెట్లపై ప్రత్యక్షంగా మాత్రం తక్కువ స్థాయిలోనే ఉండవచ్చని ఈ నివేదిక అభిప్రాయపడింది. మరోవైపు, సుంకాల పెంపు ప్రపంచ వాణిజ్యంతో పాటు అమెరికా ఎకానమీపైనా, అక్కడి తయారీ.. నిర్మాణ రంగాలపైనా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపవచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ప్రతినిధి గెర్రీ రైస్ పేర్కొన్నారు.



'నాఫ్టా'ని సరిచేస్తే పునరాలోచిస్తా: ట్రంప్

సుంకాల విధింపు అంశం అంతర్జాతీయంగా ఉక్కు పరిశ్రమలో ప్రకంపలను సృష్టిస్తున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా మరో ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో (నాఫ్టా) లోపాలను సరిదిద్ది 'సముచితమైన, కొత్త' ఒప్పందం రూపొందిన పక్షంలో ఉక్కు, అల్యూమినియంపై ప్రతిపాదిత సుంకాల విధింపు అంశాన్ని పక్కన పెట్టేందుకు సిద్ధంగా ఉన్నానని తాజాగా మైక్రో బ్లాగింగ్ సైట్ ట్విటర్‌లో ఆయన పేర్కొన్నారు. 'కెనడా, మెక్సికోతో అమెరికాకు భారీ వాణిజ్య లోటు ఉంది. ప్రస్తుతం పునఃసమీక్ష జరుగుతున్నప్పటికీ.. నాఫ్టా ఒప్పందం అమెరికాకు కంపెనీలు, ఉద్యోగాలపరంగా ప్రతికూలంగానే ఉంటూ వచ్చింది. ఈ నేపథ్యంలో సముచితమైన రీతిలో కొత్తగా నాఫ్టా ఒప్పందం కుదిరిన పక్షంలో మాత్రమే సుంకాల అంశం పక్కన పెట్టే అవకాశం ఉంది' అని వివరించారు.

ఇంకా మినహాయింపులెందుకు?: విల్బర్ రాస్

ఉక్కు, అల్యూమినియంపై దిగుమతుల సుంకాల పెంపు ప్రతిపాదనను అమెరికా సమర్థించుకుంది. రెండో ప్రపంచ యుద్ధం ముగిశాక దశాబ్దాలుగా చైనా, జర్మనీ వంటి దేశాలకు అన్ని రకాల మినహాయింపులిస్తూ వస్తున్న తప్పుడు విధానాలను సరిదిద్దేందుకు ఇది ఉపయోగపడుతుందని అమెరికా వాణిజ్య శాఖ మంత్రి విల్బర్ రాస్ వ్యాఖ్యానించారు. ప్రతీకార చర్యగా యూరోపియన్ దేశాలు కూడా అమెరికా నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలు పెంచవచ్చన్న ఆందోళనలు అర్థరహితమని ఆయన కొట్టిపారేశారు. 'రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ఆ ప్రభావాల నుంచి యూరప్, ఆసియా దేశాలకు తోడ్పాటు నివ్వాలన్న సదుద్దేశంతో అప్పట్లో అన్ని రకాల మినహాయింపులు ఇచ్చేశాం. కానీ ఆయా దేశాలు ప్రస్తుతం పటిష్టంగా ఎదిగాక కూడా వాటిని కొనసాగించడం అర్థరహితం. గతంలో చేసిన అనేక తప్పిదాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది' అని రాస్ పేర్కొన్నారు. అటు యూరోపియన్ యూనియన్ కొంత ప్రతీకార చర్యలకూ దిగే అవకాశమూ ఉందన్నారు. అయితే, ఇది కేవలం 3 బిలియన్ డాలర్ల మేర అమెరికన్ ఉత్పత్తులకే పరిమితం కాగలదని రాస్ వ్యాఖ్యానించారు.

టాటా మోటార్స్‌లో నారీ భేరి!

- 20-25 శాతానికి మహిళా ఉద్యోగులు
- నాలుగైదేళ్లలో సాధిస్తామని కంపెనీ ప్రకటన



ముంబై: ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ మహిళలకు పెద్ద పీట వేయనుంది. మహిళా ఉద్యోగులకు సరైన ప్రాతినిధ్యం కల్పించే దిశగా చర్యలు ఆరంభించింది. కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో వచ్చే నాలుగైదేళ్ల కాలంలో పావు శాతం మహిళలే ఉంటారన్న ఆశాభావం వ్యక్తం చేసింది. దేశంలో మొట్టమొదటిది అయిన పుణెలోని టాటా మోటార్స్ ప్లాంట్‌లో 1974లోనే జేఆర్‌డీ టాటా మహిళా ఇంజనీర్‌గా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణ మూర్తి సతీమణి సుధా మూర్తిని నియమించుకున్న విషయాన్ని గుర్తు చేసింది. ''గడిచిన నాలుగైదేళ్ల కాలంలో మహిళా ఉద్యోగులను గణనీయంగా పెంచుకున్నాం. వచ్చే నాలుగైదేళ్ల కాలంలో మహిళా ఉద్యోగుల సంఖ్య 20-25 శాతానికి పెంచుకోవాలనే లక్ష్యంతో ఉన్నాం'' అని టాటా మోటార్స్ చీఫ్ హెచ్‌ఆర్ గజేంద్ర చందేల్ తెలియజేశారు. ఈ ఏడాది జనవరి నాటికి కంపెనీలో 2,628 మంది మహిళా ఉద్యోగులు ఉన్నట్టు చెప్పారు. ఇందులో 1,952 షాప్ ఫ్లోర్‌లో పనిచేసేవారని, మొత్తం ఫ్యాక్టరీ ఉద్యోగులు 41,390 మందిలో ఇది 5 శాతమని వివరించారు. టాటా మోటార్స్‌లో ప్రస్తుతం మొత్తం 55,159 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ''గత కొన్నేళ్లలో క్యాంపస్‌ల నుంచి ఎక్కువ మంది మహిళలను నియమించుకుంటున్నాం. 2018 బ్యాచ్‌ల నుంచి 25 శాతం మేర మహిళలనే నియమించుకోవాలన్న లక్ష్యంతో ఉన్నాం'' అని చందేల్ తెలిపారు.

ఆర్సెలర్ ప్రెసిడెంట్‌గా ఆదిత్య మిట్టల్



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఉక్కు దిగ్గజం ఆర్సెలర్ మిట్టల్ ప్రెసిడెంట్‌గా ఆదిత్య మిట్టల్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్సెలర్ మిట్టల్ యూరప్ విభాగానికి సీఎఫ్‌వో, సీఈవోగా ఉన్న ఆదిత్యకు తాజాగా ప్రెసిడెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఆర్సెలర్ మిట్టల్ చైర్మన్, సీఈవో లక్ష్మీనివాస్ మిట్టల్ కుమారుడే ఆదిత్య మిట్టల్. చైర్మన్‌కి కుడిభుజంగా వ్యవహరిస్తూ.. గ్రూప్ కార్యకలాపాల్లో ఆదిత్య వ్యూహాత్మక పాత్ర పోషిస్తున్నారని సంస్థ వివరించింది. ప్రపంచవ్యాప్తంగా 60 దేశాల్లో ఆర్సెలర్ మిట్టల్ కార్యకలాపాలు సాగిస్తోంది.

బ్యాంకులకు ఆర్‌బీఐ రూ.లక్ష కోట్ల అదనపు లిక్విడిటీ

ముంబై: ఆర్‌బీఐ అదనంగా మరో రూ.లక్ష కోట్ల మేర బ్యాంకుల్లో ద్రవ్య లభ్యతను పెంచనుంది. దీర్ఘకాలిక రుణ సాధనాల ద్వారా బ్యాంకుల నిధుల అవసరాలను తీర్చనుంది. బ్యాంకులకు నిధుల అవసరాలు, మార్చి చివరి నాటికి ద్రవ్య నిర్వహణ పరంగా వెసులుబాటు కల్పించేందుకు అదనపు నిధుల్ని భిన్న సాధనాల ద్వారా అందుబాటులోకి తేనున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది.

ట్రంప్ సుంకాల సెగ..

దిగుమతి సుంకాల పెంపుతో వాణిజ్య యుద్ధాల భయం

- ఆరు నెలల కనిష్టానికి సేవల రంగం
- తరలిపోతున్న విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు
- బలహీనంగా అంతర్జాతీయ సంకేతాలు
- ప్రభావం చూపని బీజేపీ 'ఈశాన్య' విజయాలు
- ఐటీ షేర్ల లాభాలతో తగ్గిన నష్టాలు
- సెన్సెక్స్ 300 పాయింట్లు డౌన్.. 34వేల దిగువకు
- 10,400 కిందకు నిఫ్టీ.. 100 పాయింట్ల నష్టం



ట్రంప్ సుంకాల దెబ్బకు మన స్టాక్ మార్కెట్ సోమవారం కుదేలైంది. ఫిబ్రవరిలో సేవల రంగం గణాంకాలు నిరాశపరచడం, విదేశీ ఇన్వెస్టర్లు గత నెలలో 12,000 కోట్ల మేర ఈక్విటీ పెట్టుబడులు వెనక్కి తీసుకోవడం ప్రతికూల ప్రభావం చూపించాయి. వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ స్టాక్ సూచీలు క్షీణించాయి. సెన్సెక్స్ 34,000 పాయింట్లు, నిఫ్టీ 10,400 పాయింట్లు దిగువకు పడిపోయాయి. రూపాయి బలపడడంతో ఐటీ షేర్లు లాభపడడం, యూరప్ మార్కెట్లు లాభాలతో ఆరంభమవడంతో నష్టాలు ఒకింత తగ్గాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్300 పాయింట్ల నష్టంతో 33,747 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 100 పాయింట్ల నష్టంతో 10,324 పాయింట్ల వద్ద ముగిశాయి. సెన్సెక్స్ రెండు వారాల కనిష్టానికి, నిఫ్టీ 11 వారాల కనిష్టానికి పడిపోయాయి. లోహ, బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్, వాహన షేర్లు కుదేలయ్యాయి. ట్రంప్ సుంకాల కారణంగా అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధాలు చెలరేగుతాయనే ఆందోళన ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. లోహ, వాహన షేర్లు పతనమయ్యాయి. పీఎస్‌యూ బ్యాంక్, ఐటీ సూచీలు మినహా మిగిలిన అన్ని రంగాల సూచీలూ నష్టపోయాయి.

నష్టాలతో ఆరంభం...

సెన్సెక్స్ 34.034 పాయింట్ల వద్ద బలహీనంగా ఆరంభమైంది. అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఇంట్రాడేలో 394 పాయింట్ల నష్టంతో 33,653 పాయింట్ల కనిష్ట స్థాయిని తాకింది. ఇక నిఫ్టీ ఇంట్రాడేలో 134 పాయింట్లు నష్టపోయింది. ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ ఘనవిజయం స్టాక్ మార్కెట్ పతనాన్ని అడ్డుకోలేకపోయింది. లోహ ఉత్పత్తుల దిగుమతులపై సుంకాలు విధించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు మన మార్కెట్‌ను పడగొట్టాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. అయితే డాలర్‌తో రూపాయి మారకం బలపడడం నష్టాలను తగ్గించిందని పేర్కొన్నారు. మార్కెట్ పతనం నేపథ్యంలో పెరిగినప్పుడల్లా విక్రయించే విధానాన్ని అవలంబించాలని రెలిగేర్ బ్రోకింగ్ ప్రెసిడెంట్ జయంత్ మాంగ్లిక్ సూచించారు.

లోహ షేర్లు వెలవెల..

అమెరికాలోకి దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకాలు విధించనున్నామన్న ట్రంప్ ప్రకటనతో లోహ షేర్లు కళ తప్పాయి. ఎన్‌ఎమ్‌డీసీ 5.8%, నాల్కో 5%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 4.6%, జిందాల్ స్టీల్ 4.3%, హిందాల్కో 4.2%, సెయిల్ 3.5%, టాటా స్టీల్ 2.9%, వేదాంత 2.5% నష్టపోయాయి.

టాటా మోటార్స్ 5 శాతం డౌన్: టాటా మోటార్స్ 5 శాతం నష్టపోయి రూ. 352 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో తాజా ఏడాది కనిష్ట స్థాయి రూ.351ను తాకింది. కంపెనీకి చెందిన లగ్జరీ బ్రాండ్ జేఎల్ఆర్ అమ్మకాలు తగ్గడం, యూరప్ నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే కార్లపై కూడా సుంకాలు విధిస్తామని డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించడం ఈ షేర్‌ను పడగొట్టాయి. జేఎల్ఆర్‌కు అమెరికా రెండో అతి పెద్ద మార్కెట్.

ఎదురీదిన ఐడీబీఐ బ్యాంక్: మార్కెట్ భారీగా పతనమైనప్పటికీ ఐడీబీఐ బ్యాంక్ 5% లాభంతో రూ.84 వద్ద ముగిసింది. ఈ బ్యాంక్ రేటింగ్‌ను ప్రతికూలం నుంచి స్థిరత్వంనకు పలు రేటింగ్ ఏజెన్సీలు పెంచడంతో ఈ షేర్ ఇంట్రాడేలో 10%కి పైగా లాభపడి తాజా ఏడాది గరిష్ట స్థాయి, రూ.90ని తాకింది. నెల రోజుల్లో ఈ షేర్ 51% పెరగడం విశేషం.

మరిన్ని వివరాలు...

- ఐటీ రంగానికి ఈ ఏడాది ఆశావహంగా ఉండనున్నదన్న గ్లోబల్ ఎనలిస్ట్ మోషే కత్రి అంచనాలు ఐటీ షేర్లకు ఊపునిచ్చాయి. టీసీఎస్ 2.2 శాతం, టెక్ మహీంద్రా 3 శాతం చొప్పున పెరిగాయి.
- 31 సెన్సెక్స్ షేర్లలో ఆరు షేర్లు మాత్రమే లాభపడ్డాయి. సన్ ఫార్మా 2.5 శాతం, టీసీఎస్ 2.2 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 0.8 శాతం, ఎస్‌బీఐ 0.4 శాతం, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.2 శాతం, ఎన్‌టీపీసీ 0.1 శాతంచొప్పున పెరిగాయి.
- పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.12,636 కోట్ల రుణ కుంభకోణం దర్యాప్తులో భాగంగా సీబీఐ నలుగురిని అరెస్ట్ చేయడంతో గీతాంజలి జెమ్స్ షేర్ల పతనం 13వ ట్రేడింగ్ సెషన్‌లోనూ కొనసాగింది. ఈ షేర్ మరో 5% పతనమైంది. పీఎన్‌బీ స్కామ్ వెలుగులోకి వచ్చిన నాటి నుంచి చూస్తే ఈ షేర్ 70% కుదేలైంది.
- 26 శాతం వాటా విక్రయానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్న వార్తల కారణంగా బీఈఎమ్ఎల్ షేర్ 10 శాతం లాభపడింది.
- రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.4%, కోల్ ఇండియా 2.3 శాతం, ఓఎన్‌జీసీ 2.1%, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ 2 శాతం, యస్ బ్యాంక్ 1.9 శాతం, హిందుస్తాన్ యూనిలివర్1.9 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 1.3 శాతం, ఐటీసీ 1.2 శాతం, ఏషియన్ పెయింట్స్ 1.2 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 1.2 శాతం చొప్పున నష్టపోయాయి.

పతనానికి పంచ కారణాలు..

వాణిజ్య యుద్ధాల భయం

అమెరికాలోకి దిగుమతయ్యే ఉక్కు ఉత్పత్తులపై 25 శాతం, అల్యూమినియం ఉత్పత్తులపై 10 శాతం మేర సుంకాలు విధించనున్నామని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడం ప్రపంచ మార్కెట్లను పతన బాట పట్టించింది. ఇలాంటి రక్షణాత్మక విధానాల వల్ల వాణిజ్య యుద్ధాలు చెలరేగుతాయని, ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఇది దెబ్బతీస్తుందని విశ్లేషకులంటున్నారు.

ఆరు నెలల కనిష్టానికి సేవల రంగం

భారత సేవల రంగం గత నెలలో ఆరు నెలల కనిష్టానికి పడిపోయింది. డిమాండ్ బలహీనంగా ఉండటంతో కొత్త ఆర్డర్లు తగ్గాయి. జనవరిలో 51.7గా ఉన్న నికాయ్ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ గత నెలలో 47.8కి పడిపోయింది.

విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు: గత నెలలో విదేశీ ఇన్వెస్టర్లు రూ.12,000 కోట్ల మేర ఈక్విటీ విక్రయాలు(ఇది ఐదు నెలల గరిష్ట స్థాయి) జరపడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. మన మార్కెట్ చోదకానికి కీలకమైన విదేశీ నిధులు తరలిపోతుండడం ప్రతికూల ప్రభావం చూపుతోంది.

ఆసియా మార్కెట్ల పతనం

చైనాలో వార్షిక పార్లమెంట్ సమావేశాలు ఆరంభం కావడం, ఇటలీలో హంగ్ పార్లమెంట్ ఏర్పడే అవకాశాలున్నాయన్న వార్తలకు తోడు ట్రంప్ సుంకాలు వాణిజ్య యుద్ధాలకు తెరతీస్తాయన్న ఆందోళన కారణంగా ఆసియా మార్కెట్లు నష్టపోయాయి. ఇక్కడి ఇన్వెస్టర్లు సురక్షిత సాధనాలైన యెన్ కరెన్సీ, పుత్తడిలకు తమ పెట్టుబడులను తరలించారు. దీంతో హాంగ్‌కాంగ్ సూచీ 2.2%, జపాన్ నికాయ్ 0.6%, కోస్పి 1.1% చొప్పున క్షీణించాయి.

పెరుగుతున్న వడ్డీ వ్యయాలు

మార్జినల్ కాస్ట్ లెండింగ్ రేట్స్(ఎమ్‌సీఎల్‌ఆర్)ను ఎస్‌బీఐ ఇటీవలనే పెంచింది. ఐసీఐసీఐ బ్యాంక్ కూడా పెంచగా, మరికొన్ని బ్యాంక్‌లు ఇదే బాటలో ఉన్నాయి. ఫిబ్రవరి పాలసీలో ఆర్‌బీఐ వడ్డీరేట్లను పెంచకపోయినప్పటికీ, ఎమ్‌సీఎల్‌ఆర్ పెంపు కారణంగా వడ్డీ రేట్లు పెరుగుతాయని, ఇది రిటైల్ ఇన్వెస్టర్లకు, కంపెనీలకు భారమని నిపుణులంటున్నారు.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	30,665
బంగారం (99.5, 10గ్రా)	30,515
వెండి (కిలో)	38,550
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	– –
బంగారం (22 క్యారెట్లు)	29,180
వెండి (కిలో)	--
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	30,640
బంగారం (22 క్యారెట్లు)	29,180
వెండి (కిలో)	41,700
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	31,450
బంగారం (22 క్యారెట్లు)	29,120
వెండి (కిలో)	39,800
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	31,832
బంగారం (22 క్యారెట్లు)	29,180
వెండి (కిలో)	41,700
విజయవాడ (గురువారం ధరలు)	
బంగారం (24 క్యారెట్లు)	31,250
బంగారం (22 క్యారెట్లు)	29,000
వెండి(కిలో)	39,300
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	31,550
బంగారం (22 క్యారెట్లు)	29,180
వెండి (కిలో)	39,700

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 06-3-2018

విశాఖ	350-00
చిత్తూరు	378-00
వరంగల్	347-00
ముంబై	390-00
చెన్నై	385-00
విజయవాడ	340-00
గోదావరి	340-00
నమక్కల్	370-00
05-3-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	345-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.05

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.55 (రాత్రి 11.00కు)	$61.25 (శుక్రవారం ముగింపు)
బ్రెంట్	65.61 (రాత్రి 11.00కు)	$64.37 (శుక్రవారం ముగింపు)

సేవల రంగంలో కుదుపు



ఆరు నెలల కనిష్టానికి బిజినెస్ సూచీ • ఫిబ్రవరిలో 47.8గా నమోదు

న్యూఢిల్లీ: సేవల రంగం ఫిబ్రవరిలో పడకేసింది. వృద్ధి ఆరు నెలల కనిష్టానికి పడిపోయింది. నికాయ్ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ జనవరిలో 51.7 ఉండగా ఫిబ్రవరిలో 47.8కి తగ్గింది. గతేడాది ఆగస్ట్ తర్వాత చూస్తే ఇంత తక్కువ స్థాయిలో వృద్ధి నమోదవడం మళ్లీ ఇదే. కీలకమైన 50 మార్కును దిగిరావడం మూడు నెలల్లో ఇదే తొలిసారి. డిమాండ్ బలహీనంగా ఉండటంతో కొత్త ఆర్డర్లు రావటం తగ్గిపోయినట్టు ఈ సూచీని నిర్వహించే ఐహెచ్‌ఎస్ మార్కిట్ సంస్థ తెలిపింది. అయితే, రానున్న 12 నెలల కాలానికి సంస్థలు ఆశాభావంతో ఉండటం సానుకూలం. ''వృద్ధి క్షీణత తాత్కాలికమేనని సంస్థలు భావిస్తున్నాయి. వృద్ధి అంచనాలకు అనుగుణంగా 2011 జూన్ నుంచి చూస్తే ఉద్యోగుల నియామకం ఎంతో వేగంగా ఉంది'' అని ఐహెచ్‌ఎస్ మార్కిట్ ఎకనామిస్ట్ ఆష్నా దోధియా పేర్కొన్నారు. ఇక సేవలు, తయారీ రంగాలకు సంబంధించిన నికాయ్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ సైతం ఫిబ్రవరిలో 49.7కి క్షీణించింది. జనవరిలో ఇది 52.5గా ఉంది. సేవల రంగం తిరోగమనమే దీనికి ప్రధాన కారణంగా ఉంది. ముడి సరుకుల ద్రవ్యోల్బణం కూడా గతేడాది నవంబర్ తర్వాత పెరిగినట్టు ఈ సంస్థ తెలిపింది.

ఆర్‌పీ ఇన్ఫో సిస్టమ్స్ డైరెక్టర్‌ను ప్రశ్నించిన సీబీఐ



న్యూఢిల్లీ: బ్యాంకుల కన్సార్షియంను దాదాపు రూ. 515 కోట్ల మేర మోసగించారన్న కేసుకు సంబంధించి కంప్యూటర్స్ తయారీ సంస్థ ఆర్‌పీ ఇన్ఫో సిస్టమ్స్ డైరెక్టర్ శివాజీ పంజాను సీబీఐ ప్రశ్నించింది. ఈ స్కామ్ విషయంలో కంపెనీకి చెందిన ఇతర అధికారులపై కూడా కేసులు నమోదు చేసిన సీబీఐ, ఆర్‌పీ ఇన్ఫోసిస్టమ్స్ కార్యాలయంతో పాటు నిందితుల ఇళ్లలో కూడా సోదాలు నిర్వహించింది. గతంలో కూడా కంపెనీపై ఈ తరహా ఆరోపణలు వచ్చాయి. 2015లో ఐడీబీఐ బ్యాంకును రూ. 180 కోట్లు మోసగించిన ఆరోపణలపై సీబీఐ కేసు నమోదు చేసింది. చిరాగ్ బ్రాండ్ కింద కంప్యూటర్స్ తయారు చేసే ఆర్‌పీ ఇన్ఫోసిస్టమ్స్.. నకిలీ పత్రాలు సృష్టించి 2012 నుంచి ఎస్‌బీఐ, అలహాబాద్ బ్యాంక్ తదితర బ్యాంకుల కన్సార్షియం నుంచి రుణాలు పొందిందన్న ఆరోపణలతో తాజా కేసు నమోదైంది. ఈ రుణాలన్నీ మొండిబాకీలుగా మారినట్లు అధికారవర్గాలు తెలిపాయి. మరోవైపు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ. 12,700 కోట్ల స్కాముపై విచారణ చేస్తున్న సీబీఐ తాజాగా బ్యాంకు ఉద్యోగి ఎస్‌కే చాంద్‌ను ప్రశ్నిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన ట్రెజరీ విభాగం జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

మీ ఆధార్ నంబర్‌పై ఎన్ని సిమ్‌లు ఉన్నాయి?

- తెలుసుకునే అవకాశం కస్టమర్లకు కల్పించాలి
- టెలికం కంపెనీలకు యూఐడీఏఐ ఆదేశాలు

న్యూఢిల్లీ: సిమ్ కార్డుల అక్రమ వినియోగాన్ని అరికట్టే దిశగా యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. తమ ఆధార్ నంబర్‌పై ఎన్ని సిమ్ కార్డులు జారీ అయ్యాయో తెలుసుకునే అవకాశాన్ని కస్టమర్లకు ఈ నెల 15 నాటికి కల్పించాలని అన్ని టెలికం కంపెనీలను ఆదేశించింది. ఇతరులు ఎవరైనా తమ పేరిట అక్రమంగా వినియోగిస్తుంటే దీని ద్వారా కస్టమర్లకు తెలుసుకునే అవకాశం లభించనుంది. కొంత మంది రిటైలర్లు, టెలికం ఆపరేటర్లు, కంపెనీల ఏజెంట్లు ఆధార్ అథెంటికేషన్‌ను దుర్వినియోగం చేస్తూ, వాస్తవ ఆధార్ కార్డుదారుడి పేరిట వేరొకరికి సిమ్ కార్డులు జారీ చేయడం, ధ్రువీకరణ చేస్తున్నట్టు ఫిర్యాదులు రావడంతో యూఐడీఏఐ ఈ ఆదేశాలు జారీ చేసింది.

ఎన్‌బీసీసీకి రూ.192 కోట్ల ఆర్‌ఈసీ ఆర్డర్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ నిర్మాణ సంస్థ ఎన్‌బీసీసీకి రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ) నుంచి రూ.192 కోట్ల ఆర్డర్ లభించింది. గురుగ్రామ్‌లో ఆర్‌ఈసీకి టౌన్‌షిప్‌ని నిర్మించి డెవలప్‌చేసే ఆర్డర్ లభించిందని ఎన్‌బీసీసీ తెలిపింది. ఈ ప్రాజెక్ట్‌కు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తామని, 7% ఫీజు వస్తుందని పేర్కొంది.

వచ్చే ఏడాది వృద్ధి 7.5 శాతం: క్రిసిల్

- దేశీయ వినియోగమే చోదకం
- బ్యాంకుల్లో ఎన్‌పీఏల పరిష్కారం కీలకం



ముంబై

వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2018–19) దేశ జీడీపీ వృద్ధి రేటు 7.5 శాతానికి చేరుకుంటుందని ప్రముఖ రేటింగ్ సంస్థ క్రిసిల్ అంచనా వేసింది. దేశీయ వినియోగం, విధానాల పరంగా ప్రోత్సాహం, అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి సానుకూల అంశాలని తన నివేదికలో తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2017–18) మాత్రం జీడీపీ వృద్ధి రేటు 6.5 శాతంగా ఉంటుందని క్రిసిల్ పేర్కొంది. రానున్న ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 7 – 7.5 శాతం వరకు ఉండొచ్చని 2018 ఆర్థిక సర్వే సైతం పేర్కొన్న విషయం విదితమే. రెండు వరుస ప్రతికూల ఆర్థిక సంవత్సరాలు... ఒక ఏడాదిలో డీమోనిటైజేషన్, మరో ఏడాదిలో జీఎస్టీ అమలు తర్వాత వృద్ధి చెప్పుకోతగ్గ 7.5 శాతానికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేరుకోనుందని క్రిసిల్ తన నివేదికలో పేర్కొంది. బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలకు పరిష్కారం, గ్రామీణ మార్కెట్ తిరిగి జవసత్వాన్ని సంతరించుకోవడం, నిరంతరాయ సంస్కరణలు, ప్రపంచ వృద్ధి అన్నవి భారత వృద్ధి రేటు పెరుగుదల, స్థిరత్వాన్ని నిర్ణయించే అంశాలుగా క్రిసిల్ ప్రస్తావించింది. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో 10.5 శాతానికి చేరిన స్థూల ఎన్‌పీఏల అంశాన్ని పరిష్కరించకుండా స్థిరమైన ఆర్థికవృద్ధి సాధ్యం కాదని అభిప్రాయపడింది. ఎన్‌సీఎల్‌టీ పరిష్కార ప్రక్రియ పట్ల ఆశాభావం వ్యక్తం చేసింది. 2019 మార్చి నాటికి ఎన్‌పీఏలు 11 శాతాన్ని చేరుకోవచ్చని అంచనా వ్యక్తం చేసింది. గ్రామీణ, మౌలిక రంగాలపై ఎక్కువగా నిధులు ఖర్చు చేయడం ద్వారా డిమాండ్, ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించడం వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధికి కలిసొస్తాయని పేర్కొంది. అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి పుంజుకునే అవకాశాలున్నాయని అంచనా వేసింది.

చైనా జీడీపీ లక్ష్యం 6.5 శాతం

బీజింగ్: చైనా గతేడాది మాదిరిగానే 2018 సంవత్సరంలోనూ వృద్ధి రేటు లక్ష్యాన్ని 6.5 శాతంగానే నిర్ణయించింది. సోమవారం పార్లమెంటు వార్షిక సమావేశాల ప్రారంభం సందర్భంగా గడిచిన ఏడాదిలో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ప్రధాని లీ కెకియాంగ్ ప్రకటన చేశారు. ఈ సందర్భంగానే 6.5 శాతం వృద్ధి సాధించే సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణాన్ని మూడు శాతం స్థాయిలోనే ఉంచాలని, కొత్తగా 1.1 కోట్ల ఉద్యోగాలను పట్టణ ప్రాంతాల్లో కల్పించాలనే లక్ష్యాలను వెల్లడించారు. నిరుద్యోగిత రేటు 5.5 శాతంగానే ఉంటుందని పేర్కొన్నారు.

యాక్సిస్‌కు రూ.3 కోట్ల జరిమానా

- ఐవోబీకి రూ.2 కోట్లు
- కేవైసీ నిబంధనలు పాటించనందుకే



ముంబై: ఖాతాదారుల వివరాల సేకరణకు (కేవైసీ) సంబంధించి నిబంధనలను పాటించనందుకు గాను రెండు బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ పెనాల్టీ విధించింది. ప్రైవేట్ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్‌కు రూ. 3 కోట్లు, ప్రభుత్వ రంగానికి చెందిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌కు (ఐవోబీ) రూ.2 కోట్లు జరిమానా విధించింది. 2016 మార్చి 31 నాటికి యాక్సిస్ బ్యాంక్ ఆర్థిక పరిస్థితులను సమీక్షించగా.. మొండిబాకీల విషయంలో పలు నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని గుర్తించినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. దీంతో 2018 ఫిబ్రవరి 27న రూ. 3 కోట్ల మేర పెనాల్టీ విధించినట్లు వివరించింది. ఇక ప్రభుత్వ రంగ బ్యాంక్ ఐవోబీకి చెందిన ఒకానొక శాఖలో మోసం చోటు చేసుకున్నట్లు గుర్తించిన నేపథ్యంలో రూ. 2 కోట్ల జరిమానా విధించినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

మారుతీ ఆల్టో @ 35 లక్షల యూనిట్లు



న్యూఢిల్లీ: దేశీ దిగ్గజ కార్ల తయారీ కంపెనీ 'మారుతీ సుజుకీ ఇండియా' తాజాగా తాను అత్యధికంగా విక్రయించే మోడల్ 'ఆల్టో' అమ్మకాలకు సంబంధించి 35 లక్షల యూనిట్ల మైలురాయిని అధిగమించినట్లు ప్రకటించింది. 2017–18లో ఆల్టో బ్రాండ్ వృద్ధి రేటు 6 శాతంగా ఉందని కంపెనీ తెలిపింది. ''ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 33 శాతం మార్కెట్ వాటాను సొంతం చేసుకున్నాం. దేశీ మార్కెట్‌లో గత 14 ఏళ్లుగా అత్యధికంగా విక్రయమౌతోన్న కారు ఆల్టోయే'' అని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) ఆర్.ఎస్.కల్సి చెప్పారు. 2006 నుంచి చూస్తే.. ఆల్టో కొత్త కస్టమర్ల సంఖ్య ప్రతి రెండేళ్లకూ 5 లక్షల చొప్పున పెరుగుతూ వచ్చిందన్నారు. ఆల్టో విక్రయాలు 2008లో 10 లక్షల యూనిట్ల మార్క్‌ను, 2010లో 15 లక్షల యూనిట్ల మార్క్‌ను అధిగమించాయని పేర్కొన్నారు.

అరబిందో యూనిట్‌లో యూఎస్‌ఎఫ్‌డీఏ తనిఖీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ కంపెనీ అరబిందో ఫార్మాకు చెందిన ఫార్ములేషన్స్ తయారీ యూనిట్–4లో యూఎస్‌ఎఫ్‌డీఏ తనిఖీలు నిర్వహించింది. హైదరాబాద్ సమీపంలోని పాశమైలారం వద్ద ఉన్న ఈ కేంద్రంలో ఫిబ్రవరి 12– 20 మధ్య జరిగిన తనిఖీల్లో తొమ్మిది అంశాలను యూఎస్‌ఎఫ్‌డీఏ లేవనెత్తింది. ఈ అంశాలు డేటా సమగ్రతకు సంబంధించినవి కావని అరబిందో వెల్లడించింది. పూర్తి నివేదికను ఎఫ్‌డీఏకు గడువులోగా సమర్పించే పనిలో నిమగ్నమైనట్టు తెలిపింది. యూఎస్‌ఎఫ్‌డీఏ తనిఖీల నేపథ్యంలో సోమవారం అరబిందో షేరు క్రితం ముగింపుతో పోలిస్తే 3.73 శాతం తగ్గి రూ.600.80 వద్ద స్థిరపడింది.

అశోక్ లేలాండ్‌లో తగ్గిన ఎల్‌ఐసీ వాటా

న్యూఢిల్లీ: హిందుజా గ్రూప్‌కు చెందిన ప్రధాన కంపెనీ అశోక్ లేలాండ్‌లో ప్రభుత్వ రంగ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) తన వాటాను తగ్గించుకుంది. ఎల్‌ఐసీ 2.05 శాతం వాటాకు సమానమైన 5.97 కోట్ల అశోక్ లేలాండ్ షేర్లను బహిరంగ మార్కెట్లో విక్రయించింది. ఈ షేర్లను 2015, అక్టోబర్ నుంచి ఈ ఏడాది మార్చి 1 మధ్య ఎల్‌ఐసీ విక్రయించింది. దీంతో అశోక్ లేలాండ్ కంపెనీలో ఎల్‌ఐసీ వాటా 5.16 శాతం నుంచి 3.11 శాతానికి తగ్గింది. ఈ వార్తల నేపథ్యంలో బీఎస్‌ఈలో ఎల్‌ఐసీ షేర్ 0.5 శాతం నష్టంతో రూ.140 వద్ద ముగిసింది.

సెబీకి దేవి సీ ఫుడ్స్ ఐపీఓ పత్రాలు



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దేవి సీ ఫుడ్స్ కంపెనీ త్వరలో ఐపీఓకు రానుంది. ఈ కంపెనీ ఐపీఓ సంబంధిత పత్రాలను సెబీకి సోమవారం సమర్పించింది. ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.900 కోట్లు సమీకరించాలని యోచిస్తోంది. ఈ ఐపీఓలో భాగంగా కంపెనీ ప్రమోటర్లు తమ వాటా షేర్లను విక్రయించనున్నారు. ఈ ఐపీఓకు యాక్సిస్ క్యాపిటల్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీలు లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తాయి. ఈ కంపెనీ ప్రాసెస్డ్ రొయ్యలు, రొయ్యల మేతను తయారు చేస్తోంది.

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	403.95	406.1
AMBUJA CEME	246.1	253.15
ASIAN PAINT	1105.95	1118.9
AXIS BANK L	524.55	525.75
BAJAJ AUTO	2943.55	3020.9
BAJAJ FINAN	1636.95	1659.35
BHARTI AIRT	421.45	427.75
BOSCH LIMIT	18348	18707.5
BHARAT PETR	434.3	441.9
CIPLA LTD	579.25	581.7
COAL INDIA	305.8	312.9
EICHER MOTO	27548.35	27742.35
GAIL (INDIA	443.6	454.25
HCL TECHNOL	932.1	942.8
HDFC LTD	1789.6	1814.15
HDFC BANK L	1869.95	1874.35
HERO MOTOCO	3556.45	3576.9
HINDALCO I	229.6	240.8
HIND.Petrol	366.75	376.75
HIND.Unilever	1299.75	1324.25
INDIABULLS	1238.25	1256.3
ICICI BANK	303.35	304.95
INDUSIND BA	1689.2	1700.35
BHARTI INFR	339.15	345.2
INFOSYS LIM	1155.9	1160.75
INDIAN OIL	379.25	381.5
ITC LTD	260.25	264
KOTAK MAHIN	1100	1095.7
LARSEN & TO	1300.7	1315.2
LUPIN LIMIT	790.15	803.9
MAHINDRA &	739.6	732.55
MARUTI SUZU	8795.1	8873.45
NTPC LTD	163.3	163
OIL AND NAT	185.55	189.7
POWER GRID	196.95	197.4
RELIANCE IN	924.1	948.4
STATE BANK	263.5	262.15
SUN PHARMAC	548.55	535.4
TATA MOTORS	352.05	370.75
TATA STEEL	655.9	675.05
TATA CONSUL	3105.85	3037.7
TECH MAHIND	630.85	611.9
ULTRATECH C	4095.4	4153.3
UPL LIMITED	720.9	714.25
VEDANTA LIM	315.9	323.25
WIPRO LTD	290.95	292.5
YES BANK LI	312.95	321.05
ZEE ENTERTA	551.85	555.4

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

ABB INDIA L	1490.5	1525.15
ACC LIMITED	1606.15	1633.8
ASHOK LEYLA	140.15	140.95
BAJAJ FINSE	5037.45	4999.4
BANK OF BAR	138.8	138.3
BHARAT ELEC	155.55	153.3
BHEL	90.4	90.7
BRITANNIA I	4902.45	4943.85
CADILA HEAL	391.9	404.05
COLGATE PAL	1048.3	1056.9
CONTAINER C	1280.35	1312.35
CUMMINS IND	797.4	804.1
DABUR INDIA	325	325.2
DLF LIMITED	222.9	224.3
AVENUE SUPE	1314.3	1314.25
EMAMI LIMIT	1097.55	1081.2
GLAXOSMITHK	2386.1	2378.9
GLENMARK PH	551.4	544.5
GODREJ CONS	1075.3	1080.2
GLAXOSMITHK	6716.95	6791.5
HAVELLS IND	507.15	511.25
HIND.Zinc	313.65	315.6
ICICI PRU L	397.8	408.1
IDEA CELLUL	82.55	83.05
INTERGLOBE	1309.1	1332.15
JSW STEEL L	291.65	305.5
LIC HOUSING	514.85	507.05
MARICO LIMI	308.5	312.15
UNITED SPIR	3191.35	3244.85
MOTHERSON S	309.9	319.9
MRF LTD	72324.65	72683.65
NHPC LTD	27.75	27.8
NMDC LTD.	122.9	130.7
ORACLE FIN	3759.2	3855.55
OIL INDIA L	350.3	349.75
PIRAMAL ENT	2440.9	2547.05
PETRONET LN	235.5	240.8
POWER FIN C	101.75	102.45
P&G HYGIENE	9300.15	9413.85
PIDILITE IN	889.95	894.4
PUNJAB NATI	100.1	101.05
RURAL ELEC	140.2	142.15
STEEL AUTHO	78.05	80.9
SHREE CEMEN	16626.1	16595.35
SIEMENS LTD	1142.25	1153.15
SHRIRAM TRA	1369.4	1338.55
SUN TV NETW	912.25	916.65
TATA POWER	82.15	84.3
TITAN COMPA	808.9	810.2
TORRENT PHA	1366.6	1338.1

బీఎస్‌ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	8	8
Alphageo	795.2	806.4
Alu Flouride	115	114.5
Amar Raja Bat	804	812.7
And Bank	44.2	45.2
And Cemen	10.75	10.99
And Paper	303.9	308.8
And Petro	57.2	58.75
Anjani Portl	188	190
Aries Agro Ltd	202	210.15
Aurobindo Ph	600.8	624.1
Avantel Soft	575.5	560.55
Avanti Feeds	2432.2	2431.55
AvonOrg	11	11.49
BN Rathi Sec	42.5	42.55
Balaji Amin	624.4	633.25
Bambino Agro	241.1	247.85
Bartronics	13.46	13.23
Bhagira Chem	300.15	309
Bhagya Nag	46	48.05
Bhagya Wood	25.65	26.95
Brilliant Sec	10.65	11.21
CIL Securi	30.5	30.5
Cannan Intl	10.49	11.04
Color Chip	38.75	40.2
Combat Drugs	27.4	27.4
Cont Coffee	298	299.45
CoroFert	554.55	549.8
Cosboard Ind	38	37.5
Country Club	13.9	13.98
Cubex Tub	25.6	25.9
Cybermate	3.1	3.1
DR Reddy	2182.45	2228.05
Danlaw Tec	69.9	69.85
DecCement	568	568.15
Divi's Lab	1010.4	1017.25
Divya Granit	93.95	94
Dolphin Medi	1.18	1.13
Dredgin Corp	703.05	678.9
Empee Sugars	3.91	4
Everest Org	137.6	142.9
Fortune Info	77.45	78.35
Four Soft	86.3	87.3
Frontier Inf	2.45	2.45
GMR Ferro	3.6	3.56
GMR Infra	18.5	18.6
GVK Power	15.7	16.5
Gati Corpn	108.4	111.8
Gayatri Bio	7.96	8.82
Gayatri Proj	210	210.7
Gayatri Sugrs	10.51	10.01
Gennex Lab	4.22	4.36
GodavDru	34	34.9
Goldstn Tele	216.95	216.85
Goldstone Tech	15	15.39
Granules (I)	113.8	116
HBL Nife Pow	56.65	56.95
HYDIndus	1680	1708.3
Heritage Food	691.35	683.95
HindFlurocarb	11.47	12.07
ICSA Ltd	3.15	3.11
IDL Industrs	560	568.1
IKF Soft	0.66	0.66
IQMS Soft	16.95	16.45
IVRCL Infras	4.35	4.44
Incap	88	91.35
IndoNationl	845	863.05
Infotech En	625.1	633.5
Innaredy Com	3.15	3.11
Invinex Lab	119.9	117.5
JSTL	43.5	44.6
KCP LTD	122.5	127.75
KNR Constructio	302.05	303.2
KakatiCem	290	295.1
Kallam Spg	31.4	31.05
Kernex Micro	42.25	43
Krebs Bio	172.5	175.3
LGS Global	5.56	5.3
LancoIndus	338	347.35
Lokesh Mach	63.05	66.05
Lotus Choc	49.5	50.9
MIC Elec	6.86	7.09
Madhucon Proje	26.7	27.3
Maytas Infra	41.5	42
Mold-tek	59.9	60
Moldtek Plastic	325	338.2
Moschip Semi	32.35	31.8
NCLInd	223.25	233.25
NETTLINX	76.9	77.45
NMDC Ltd	123.05	130.7
NagarAgrich	42.2	43.5
NagarAgrite	7	6.97
NagarConst	126.8	130.55
Natco Pharma	757.5	781.7
Nava Bh Ventur	150.25	152.4
Neha Inter	7.37	6.92
Neocure Ther	3.98	3.82
Neuland Lab	703.6	714.5
Nihar Info Glo	13.33	14.03
Nile	819.5	798.9
Oil Country	41.7	42.4
Ortin labs	19.95	20.15
Pankaj Poly	9.69	9.25
Panyam Cemen	47	47.65
PennInd	57	58.25
Phytochem I	63.5	63.25
Pitti Lamin	91.75	92.85
Pokarna	206.1	213.05
Prajay Engs	11.81	11.25
PremiExpl	377	387.05
Prism Cement	124.5	126.5
Rain Industries	369.15	362
Raj Packagin	36.65	35.8
Ram Informat	42.35	42.95
RavilGr	24.25	23.1
Reg.Ceramic	5.75	5.85
Restile Cer	6.6	6.98
Roopa Indus	14.05	13.6
Sagar Cem	938	966.35
Sai Wires(I)	1.04	1.04
Samkrg Pist	299.7	299.9
Sampre Nutri	53.95	51.4
SangInd	114.4	117.7
Satvah. Ispat	22.5	22.9
Saven Techno	25.95	25.4
Sibar Auto	23.15	22.75
South Bio Tech	3.21	3.37
SrRayAlk	55.35	56.35
Srinivasa Ship	60.7	60.1
Sujana Metal	1.39	1.39
Sujana Towers	3.8	3.94
Sujana Univers	0.86	0.9
Surana Strip	2.03	1.94
Surana Tele	5.5	5.5
Suryachakra Pow	0.9	0.91
Suryalata Sp	148.5	154.15
SuvarCem	129	129.95
Suven Pharma	187.8	190.55
TCI Finance	28.55	29.25
Taj Gvk Hotel	163.15	164.95
Tanla Solutions	33.25	35.35
Trans Biotek	2.71	2.62
Transport Co	277	271
Trendy Knit	0.27	0.26
Usher Agro	6	6.24
VBC Ferro	40.6	40.65
VST Indus	3120.1	3172
Vamshi Rubb	51.5	52.25
Viceroy Hotels	15.15	15.65
VijayTextil	50	52.3
Vimta Labs	202.05	203.8
Virat Crane	55	54.3
Virinchi Con	116.95	116.6
VisakaInd	694	686
Vision Tech	1.45	1.52
Vista Pharma	48.35	50.85
Vivimed Labs	75.6	77.6
ZenoTech Lab	40.7	42.5



స్త్రీ చిహ్నా రూపానికి వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం

రామవరప్పాడు (గన్నవరం): విజయవాడ ఎనికేపాడులోని ఎస్సార్కే ఫౌండేషన్‌కు అరుదైన పురస్కారం లభించింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయ కళాశాలలలో సోమవారం అతి పెద్దదైన స్త్రీ చిహ్నా సంకేతం రూపంలో ఏర్పడడం ద్వారా చాంపియన్స్ బుక్స్ ఆఫ్ వరల్డ్ రికార్డును కైవసం చేసుకుంది. ఈ ఘనత సాధించేందుకు ఎస్సార్కే ఫౌండేషన్ విద్యార్థినులు మొత్తం కలిపి 2,277 మంది, మహిళా అధ్యాపకులు అతి తక్కువ సమయం రెండు నిమిషాల్లో స్త్రీ సంకేత రూపంగా ఏర్పడి ఈ రికార్డు సాధించారు. ఈ సందర్భంగా చాంపియన్స్ బుక్స్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఎడ్యుకేటర్స్, స్కోర్‌మోర్ ఫౌండేషన్ అధ్యక్షుడు పట్టాభిరాం రికార్డుకు సంబంధించిన సర్టిఫికెట్, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, చాంపియన్స్ బుక్స్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఎడ్యుకేటర్ పట్టాభిరాం, విజయ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాతీరంలో సముద్రపు చేపలు



బఫర్‌ఫిష్, జాలర్లకు చిక్కిన సముద్రపు జలగ

నాగాయలంక (అవనిగడ్డ): కృష్ణాజిల్లా నాగాయలంకలోని కృష్ణానది తీరంలో సముద్రపు చేపలు విహారం చేస్తున్నాయి. ఇక్కడ బంగాళాఖాతం ముఖద్వారంతో అనుసంధానం కావడంతో వింత చేపలు తారసపడుతున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. గతంలో సముద్రపు చేపలు కృష్ణానదిలోకి వచ్చేవి కావు. కొన్నేళ్లుగా బంగాళాఖాతం బ్యాక్‌వాటర్ మాత్రమే నదిలో ప్రవహిస్తుండటంతో సముద్రంలో ఉండే భారీ సైజు బఫర్ చేపలు, జలగలు మత్స్యకారులకు చిక్కుతున్నాయి. సోమవారం 4.5 కేజీలున్న బఫర్ చేపలు, జలగలు చిక్కాయి. అవి తినేందుకు పనికిరాకపోవడంతో జాలర్లు మళ్లీ వాటిని సముద్రంలోకి వదిలేశారు.

అధికారులకు రూ.5.91 లక్షల జరిమానా

సమస్యల పరిష్కారంలో అలసత్వంపై 'పశ్చిమ' కలెక్టర్ చర్యలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పశ్చిమగోదావరి జిల్లాలో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్న అధికారులకు కలెక్టర్ భారీ జరిమానాలు విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా స్థాయి అధికారుల సంప్రదింపుల కమిటీ సమావేశానికి కలెక్టరు కె.భాస్కర్ అధ్యక్షత వహించారు. జిల్లాలో 'మీ కోసం'లో ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహించడాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. రెండు నెలలైనా 591 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో ఒక్కొక్క పెండింగ్ దరఖాస్తుకు సంబంధిత అధికారులు రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.5.91 లక్షలు జరిమానాగా చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా, 2009 నుంచి ఇప్పటి వరకు తుపాన్ సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.10 కోట్ల నిధులకు సంబంధించి ఆయా శాఖల అధికారులు నిధులు వినియోగానికి సంబంధించిన యూసీలను ఇంకా ఇవ్వలేదని కలెక్టర్ అన్నారు. తక్షణమే యూసీలు ఇవ్వకపోతే ఏప్రిల్ జీతం నిలుపుదల చేస్తామని ఆయన హెచ్చరించారు.

కార్మికుల ఉపాధికి సమాధి

విశాఖపట్నం జిల్లాలోని చిట్టివలస జ్యూట్ (జనపనార) మిల్లుకు వందేళ్లకు పైబడి చరిత్ర ఉంది. ఇది రాష్ట్రంలోనే మొదటిది. కార్మిక పోరాటాలకు పురిటిగడ్డగా కూడా పేరొందింది. అంతటి పేరున్న ఈ మిల్లు.. యాజమాన్యం నిర్లక్ష్యం, కార్మిక సంఘాల పోరాట వైఫల్యంతో తొమ్మిదేళ్లుగా లాకౌట్‌లోనే ఉంది. ఈ మిల్లుపై చిట్టివలస చుట్టుపక్కల ఆరు మండలాలకు చెందిన ఆరువేల మంది కార్మికులు ప్రత్యక్షంగా, 50 వేల మంది పరోక్షంగా ఆధారపడ్డారు.

- తొమ్మిదేళ్లుగా చిట్టివలస జ్యూట్ మిల్లుకు మూత
- యాజమాన్యం నిర్లక్ష్యమే శాపం
- మిల్లును నట్టేటముంచిన ఉన్నతాధికారులు
- తొమ్మిదేళ్లుగా కార్మికులకు బకాయిలూ చెల్లించని వైనం
- మిల్లు ఆస్తుల్ని కొనుగోలు చేస్తున్న మంత్రి గంటా బంధువులు!

ట్రిబ్యునల్ తీర్పిచ్చినా కార్మిక శాఖ వైఖరి కారణంగా మిల్లు ప్రారంభం కాలేదు. మిల్లు చరిత్రలో ఎప్పుడూ ఆరుమాసాలకు మించి లాకౌట్‌ను ప్రకటించలేదు. అలాంటిది తొమ్మిదేళ్లుగా సైరన్ మోగనేలేదు.



చిట్టివలస జ్యూట్‌మిల్లు లాకౌట్ సమయంలో తుప్పపడుతున్న యంత్రాలు

తగరపువలస (భీమిలి): మిల్లు యజమాని కె.కె.బజోరియా మిల్లు బాధ్యతల్ని కొంతమంది ఉన్నతాధికారులకు అప్పగించి కోల్‌కతాలో ఉండిపోవడంతో మిల్లు ఆర్థిక పతనం ప్రారంభమైంది. ఉన్నతాధికారులు.. అవినీతికి పాల్పడటం, కార్మిక సంఘాలు పోరాటం చేయకుండా తాయిలాలతో సరిపుచ్చడం వంటివి చేశారు. అంతేకాకుండా కార్మికుల నియామకాల పేరుతో 2008లో అభ్యర్థుల నుంచి రూ.లక్షల్లో నగదు వసూలు చేసి జేబులు నింపుకున్నారు. తర్వాత విద్యుత్ కోత సాకుతో 2009 ఏప్రిల్ 20న మిల్లుకు లాకౌట్ ప్రకటించారు. 2009 ఆగస్టులో మిల్లు లాకౌట్ చెల్లదని విశాఖపట్నం కార్మిక

అంతా 'గంటా' మాయ!

2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత కార్మిక మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక మంత్రి గంటా శ్రీనివాసరావు నెల రోజుల్లో మిల్లును తెరిపిస్తామని ఐక్య కార్మిక సంఘాలకు హామీ ఇచ్చారు. అయితే ఈ హామీ ఇప్పటికీ నెరవేరలేదు. మిల్లు మూతపడిన తర్వాత ఇప్పటివరకు 1200 మంది కార్మికులు ఉద్యోగ విరమణ చేయడమో, మరణించడమో జరిగింది. మిగిలిన కార్మికులు ఇతర పనులు చేసుకుంటున్నారు. కార్మికవాడలో ఇళ్లు కూలిపోతున్నా, ప్రమాదాలకు గురై కార్మికులు చనిపోతున్నా పట్టించుకోవడం లేదు. గత నెల 27న మిల్లు యజమాని బజోరియాను పిలిపించి మాట్లాడారు కానీ మిల్లు నడపడంపై హామీ ఇప్పించలేకపోయారు. ఈ నెల 20న మరోమారు చర్చలు జరుపుతామని చేతులు దులిపేసుకున్నారు. ఈలోగా భీమిలిలో మిల్లుకు చెందిన గోడౌన్లను మంత్రి గంటా బంధువులే కొనుగోలు చేసి కూల్చేసినట్టు కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. కార్మికుల క్వార్టర్లు, మైదానం, మిల్లును గంటా బంధువులే కొనుగోలు చేసినట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



చిట్టివలస జ్యూట్ మిల్లు ముఖద్వారం (ఇన్‌సెట్‌లో) భీమిలిలో ఇటీవల కూల్చివేసిన మిల్లు గోడౌన్లు

కార్మికుల బకాయిలూ చెల్లించని వైనం

2009 నుంచి 2017 వరకు పదవీ విరమణ చేసిన, మరణించిన కార్మికులకు రూ.11.44 కోట్లు పీఎఫ్ రావాల్సి ఉంది. 3,650 మంది కార్మికులకు గ్రాట్యుటీ కింద రూ.36.50 కోట్లు చెల్లించాల్సి ఉంది. 2009 నుంచి 2015 వరకు వేతనాల చెల్లింపుల చట్టం ప్రకారం.. రూ.106 కోట్లు చెల్లించాలని కార్మిక ట్రిబ్యునల్ ఆదేశించింది. అదేవిధంగా పదవీ విరమణ చేసిన కార్మికుల నుంచి యాజమాన్యం రూ.3 కోట్లు డిపాజిట్లుగా స్వీకరించింది. రూ.1.50 కోట్ల బోనస్ కార్మికులకు చెల్లించాల్సి ఉంది. భీమిలి మున్సిపాల్టీకి ఆస్తిపన్ను రూ.3 కోట్లు చెల్లించాలి. వాణిజ్య పన్నులు రూ.25 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. విద్యుత్ బిల్లులు, బ్యాంకు రుణాలు కూడా యాజమాన్యం కట్టాల్సి ఉంది.

లాకౌట్‌తో కుమార్తె వివాహం చేయలేకపోయా..



మిల్లు లాకౌట్ తర్వాత కుమార్తె వివాహం చేయలేకపోయా. హోటల్‌లో కుక్‌గా పనిచేస్తూ భార్య, కుమార్తెను పోషిస్తున్నా. మిల్లు లాకౌట్‌లో ఉండగా రిటైర్ అయ్యాను. యాజమాన్యం నుంచి రూ.60 వేల గ్రాట్యుటీ రావాల్సి ఉంది.

– గిడుతూరి గురుమూర్తి, రిటైర్డ్ కార్మికుడు

మిల్లు నడపడం కష్టం



మిల్లు యజమాని ఇటీవల మంత్రి గంటా, కలెక్టర్, అధికారుల సమక్షంలో ఐక్య కార్మిక సంఘాలతో సమావేశమై.. వాయిదాల్లో కార్మికులకు ఇవ్వాల్సినవన్నీ ఇస్తామన్నారు. కార్మికులు చెవిలో పువ్వులు పెడతామంటే నమ్మే పరిస్థితి లేదు.

– కాకర్లపూడి వరహాలరాజు, ఇంటక్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు

ప్రభుత్వం విఫలం



మిల్లును నిర్వహిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి టీడీపీ గెలిచింది. కార్మికులు కష్టాల్లో ఉన్నప్పుడు మంత్రి గంటా పరామర్శించిన దాఖలాలు లేవు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో మళ్లీ మిల్లు నడుపుతామని మాయమాటలు చెబుతున్నారు. మిల్లు ఆస్తులు మంత్రే కొనుగోలు చేస్తున్నట్టు తెలిసింది. ముందుగా కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలి.

– అక్కరమాని విజయనిర్మల, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, భీమిలి

వాంతులు, విరేచనాలతో 50 మందికి అస్వస్థత



సయ్యద్ సబీనా మృతదేహం

గుంటూరుఈస్ట్: గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురై ఆది, సోమవారాల్లో పలువురు ఆస్పత్రుల్లో చేరారు. సుమారు 50 మంది వరకు అస్వస్థతకు గురైనట్టు సమాచారం. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సయ్యద్ సబీనా (28) సోమవారం మృతి చెందింది. ఆనందపేట జీరోలైనుకు చెందిన సబీనా కలుషిత నీరు తాగడంతో ఆదివారం అస్వస్థతకు గురైందని కుటుంబీకులు చెబుతున్నారు. జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కార్పొరేషన్ అధికారుల అశ్రద్ధ కారణంగా కలుషిత నీరు సరఫరా అయిందని, దాంతోనే తన సోదరి అనారోగ్యానికి గురై మృతి చెందిందని అజ్మతుల్లా ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలా ఉండగా, ఆదివారం వాంతులు విరోచనాలతో వివిధ కాలనీల్లో జనం అస్వస్థతకు గురవుతున్నట్టు తెలుసుకున్న కార్పొరేషన్ అధికారులు ప్రతి ఇంట్లో నీటి నమూనాలు సేకరించి, రీజనల్ ల్యాబ్ అధికారులకు పరీక్షల నిమిత్తం పంపించారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రజల అనారోగ్యానికి కలుషిత నీరు కారణం కాదని మున్సిపల్ కమిషనర్ సి.అనూరాధ తెలిపారు. దాచేపల్లి, ఉప్పలపాడు నుంచి కూడా పలువురు వాంతులు, విరేచనాలతో జీజీహెచ్‌కు వచ్చి చికిత్స పొందు తున్నారు. కాగా, సంగడిగుంట, లాలాపేట, పాతగుంటూరు, ఎల్‌బీనగర్, సుద్దపల్లిడొంక, తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 30 మంది కలుషిత నీరు తాగి అనారోగ్యానికి గురై జీజీహెచ్‌కు వచ్చారు. వీరిని ప్రాథమిక చికిత్స అనంతరం జ్వరాల ఆసుపత్రికి తరలించారు.

ఆదర్శంగా నిలిచేలా ఎన్టీఆర్ బయోపిక్: బాలకృష్ణ

కొమరవోలు (పామర్రు): భావితరాలకు ఆదర్శంగా నిలిచేలా ఎన్టీఆర్ బయోపిక్‌ను తీస్తున్నామని హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ సినీ హీరో నందమూరి బాలకృష్ణ చెప్పారు. సోమవారం తన అమ్మమ్మ స్వగ్రామమైన కృష్ణా జిల్లా, పామర్రు మండలం కొమరవోలు చేరుకుని ఎన్టీఆర్ దంపతుల విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... తన తండ్రి ఎన్టీఆర్ జీవిత చరిత్రను బయోపిక్‌గా రూపొందించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 29న హైదరాబాద్‌లోని రామకృష్ణ స్టూడియోలో సినిమా షూటింగ్ ప్రారంభోత్సవానికి బంధుమిత్రులను ఆహ్వానించేందుకు ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన వివిధ పథకాలు దేశవ్యాప్తంగా విశేష ప్రాచుర్యం పొందాయని చెప్పారు. ఆయన గొప్పతనాన్ని సామాన్య ప్రజలకు వివరించేందుకు ఈ బయోపిక్ తీస్తున్నామన్నారు.

గ్రీవెన్స్‌లో మహిళల ఆత్మహత్యాయత్నం

కలెక్టర్ సమక్షంలో ఎలుకల మందు తాగిన వైనం
తహసీల్దార్, వీఆర్వోలు రౌడీలతో కుమ్మక్కవుతున్నారని ఆరోపణ



జెడ్పీ ఆవరణలో బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధిత మహిళలు

ఎస్‌వీఎన్‌కాలనీ/గుంటూరు ఈస్ట్: అధికారులే రౌడీలతో కుమ్మక్కై తమ స్థలాలు అన్యాక్రాంతం అయ్యేందుకు దోహదపడుతున్నారని ఆరోపిస్తూ ఇద్దరు మహిళలు సోమవారం కలెక్టర్ సమక్షంలోనే ఆత్మహత్యా ప్రయత్నం చేయడం గుంటూరు జిల్లాలో కలకలం రేపింది. జెడ్పీ ఆవరణలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో స్వర్ణభారతి నగర్, స్వర్ణాంధ్ర నగర్‌లకు చెందిన ఇద్దరు మహిళలు ఎలుకల మందు, నిద్రమాత్రలు తీసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితులను కలెక్టర్ వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. స్వర్ణభారతి నగర్‌లో తమ స్థలాలకు దొంగ ఫారాలు సృష్టించి పలువురు కబ్జాలకు పాల్పడుతున్నారని నామాల లక్ష్మి జెడ్పీలోని గ్రీవెన్స్‌లో నిరసన వ్యక్తంచేసింది. ఇదే ప్రాంతంలోని మిగిలిన బాధిత మహిళలతో ఆమె జెడ్పీ ఆవరణలోని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపింది. గుంటూరు మండల తహసీల్దార్, వీఆర్వో అక్కడి ఖాళీ స్థలాలను, పేదల గుడిసెలను, దేవాలయ స్థలాలను స్థానిక రౌడీలతో కలిసి ఖాళీచేయించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించింది. ఇందులో అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురి హస్తం ఉందని ఆరోపించింది. స్వర్ణాంధ్రనగర్‌కు చెందిన మరో మహిళ దోమతోటి బుజ్జి కూడా మాట్లాడుతూ తనకు వరుసకు సోదరి అయిన జొన్నలగడ్డ జ్యోతికి గతంలో ఎమ్మార్వో ప్లాట్ కేటాయించారని, ఆ ప్లాట్ పక్కనే ఉంటున్న జొన్నలగడ్డ జ్ఞానసుందరి, ఆమె కుటుంబసభ్యులు తన సోదరి స్థలంలో కాలువల కోసం భూమిని తవ్వారని.. ఇదేమని ప్రశ్నిస్తే, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించింది. వీరిద్దరూ మధ్యాహ్నం 1.30కు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న హరియాణాకు చెందిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను విజయవాడ జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. రైల్వే జీఆర్పీ ఎస్పీ కె.వి.మోహనరావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. సోమవారం ప్లాట్‌ఫాం 10పై ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో సాధారణ తనిఖీలు చేస్తున్న జీఆర్పీ సీఐ రత్నరాజు, సిబ్బందిని చూసి ఆ వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. సదరు వ్యక్తులు రైళ్లలో చోరీ చేసే అంతరాష్ట్ర ముఠాగా గుర్తించారు. ఖరీదైన బంగారు వస్తువులు, నగదు చోరీ చేసే ఘరానా దొంగలుగా తేలిందన్నారు. వీరి వద్ద సుమారు రూ.60 లక్షల విలువైన బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు కె.వి.మోహనరావు తెలిపారు.

హిందుజాతో పీపీఏ రద్దుపై వెనక్కి!

ఇదే జరిగితే జనంపై రూ.1.82 లక్షల కోట్ల భారం

- దావోస్, హైదరాబాద్‌ల్లో సీఎంతో హిందుజాల భేటీ
- పీపీఏ కొనసాగించాలని వినతి
- రద్దుపై వెనక్కి వెళ్లే విషయంలో సీఎం సానుకూల స్పందన!

సాక్షి ప్రతినిధి, కర్నూలు: హిందుజా ప్లాంటుతో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) రద్దుపై వెనక్కి వెళ్లాలంటూ ప్రభుత్వంపై ఒత్తిళ్లు వస్తున్నాయా? ఈ మేరకు సీఎం చంద్రబాబుతో హిందుజా కంపెనీ అధినేతలు వరుసగా భేటీ అవుతున్నారా? ఏకంగా దావోస్‌లోనూ సమావేశమయ్యారా? దీనికి అనుగుణంగా పీపీఏను రద్దు నిర్ణయంపై విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు వెనక్కి వెళ్లాలంటూ ఒత్తిళ్లు వస్తున్నాయా? ఇదే జరిగితే రూ.1.82 లక్షల కోట్ల అదనపు భారం రాష్ట్ర ప్రజలపై కరెంటు చార్జీల రూపంలో పడనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గతంలో హైదరాబాద్‌లో సీఎంతో హిందుజా గ్రూపు చైర్మన్ అశోక్ పి.హిందుజా భేటీ అయ్యారు. దావోస్ పర్యటనలో ఆయన సోదరుడు జీపీ హిందుజా, పీపీ హిందుజాలు సీఎంను కలిసి చర్చించారు. గత నెల 7న చంద్రబాబుకు అశోక్ పి. హిందుజా లేఖ కూడా రాశారు.

దావోస్ సమావేశం తర్వాత..

హిందుజాతో 1998లో నాటి చంద్రబాబు ప్రభుత్వం పీపీఏ చేసుకుంది. 100 శాతం విద్యుత్‌ను సరఫరా చేసేలా పీపీఏను కొనసాగిస్తూ 28 ఏప్రిల్ 2016లో డిస్కంలు ఒప్పందం చేసుకున్నాయి. యూనిట్ విద్యుత్ ధర అధికంగా ఉన్నప్పటికీ పీపీఏ చేసుకున్నారంటూ విద్యుత్ రంగ నిపుణుల నుంచి విమర్శలు రావడంతో పీపీఏను రద్దు చేసుకుంటున్నట్టు డిస్కంలు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ సంస్థ (ఏపీఈఆర్సీ)కి జనవరిలో లేఖ రాశాయి. ఈ నేపథ్యంలోనే హిందుజాలు సీఎంతో భేటీ కావడం గమనార్హం. అలాగే సీఎంకు రాసిన లేఖలో విశాఖపట్నం సమీపంలో 1,040 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ప్లాంటు నిర్మాణానికి రూ.8 వేల కోట్లు ఖర్చు అయ్యిందని, దీనికోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నామని వివరించారు. పీపీఏ రద్దుతో రుణాల చెల్లింపునకు ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. హిందుజా ప్లాంటుకు మెగా ప్రాజెక్టు హోదా వస్తుందని, హుదూద్ తుపాను వల్ల జరిగిన నష్టానికి బీమా కూడా త్వరలో అందే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రాజెక్టు వ్యయం తగ్గుతుందని తెలిపారు. దావోస్ భేటీ తర్వాత మీ నుంచి సంపూర్ణ భరోసా లభించిందని సీఎం గురించి హిందుజా తన లేఖలో పేర్కొనడం గమనార్హం. తమతో కూర్చుని మాట్లాడితే పీపీఏ రద్దు సమస్య పరిష్కారమవుతుందన్న నమ్మకాన్ని కూడా అశోక్ పి.హిందుజా వ్యక్తం చేయడం అనుమానాలను రేకెత్తిస్తోంది. మెగా ప్రాజెక్టు హోదా, బీమా పరిహారం అందితే యూనిట్ విద్యుత్ ధర తగ్గనుందనే కారణాన్ని చూపి ఇప్పుడు పీపీఏ రద్దుపై ప్రభుత్వం వెనక్కి వెళ్లే అవకాశం ఉందన్న చర్చ అధికార వర్గాల్లో సాగుతోంది. ఇదే జరిగితే జనంపై అదనపు విద్యుత్ ఖర్చుతో భారీ భారం పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

లక్ష కోట్లకుపైగా భారం..

ఇప్పుడు విద్యుత్ తక్కువ ధరకే అందుబాటులోకి వస్తోంది. యూనిట్ విద్యుత్ రూ.2.50 నుంచి రూ.3లకే లభిస్తోంది. అయితే, హిందుజా ప్లాంటు యూనిట్ ధర ఏకంగా రూ.4 వరకూ ఉంటోంది. పీపీఏ లేకపోయినప్పటికీ ఏపీఈఆర్సీ జారీ చేసిన తాత్కాలిక టారిఫ్ మేరకు ఇప్పటికే 6,623 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను డిస్కంలకు హిందుజా విక్రయించింది. తాజా పరిణామాల నేపథ్యంలో పీపీఏ రద్దు నిర్ణయంపై వెనక్కి వెళితే తిరిగి హిందుజా నుంచి మార్కెట్ ధర కంటే యూనిట్‌కు రూపాయి అదనంగా చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తుంది. 1,040 మెగావాట్ల ప్లాంటు అంటే ఏటా 72,883.20 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ లెక్కన యూనిట్‌కు రూపాయి అదనంగా లెక్కిస్తే ఏటా రూ.7,288 కోట్ల మేర అదనపు భారం పడుతుంది. పీపీఏ కాలపరిమితి 25 ఏళ్లు ఉంటుంది. అంటే 25 ఏళ్ల కాలానికి రూ.1,82,200 కోట్ల అదనపు భారం జనంపై పడనుంది. ఒకవేళ మెగా ప్రాజెక్టు హోదా వచ్చి, హుదూద్ బీమా పరిహారం అందినప్పటికీ యూనిట్ ధరలో కేవలం 20 నుంచి 30 పైసలు మాత్రమే తేడా ఉంటుందని తెలుస్తోంది. అంటే నికరంగా లక్ష కోట్లకుపైగానే భారం డిస్కంలపై పడుతుంది. ఈ భారాన్ని కరెంటు చార్జీల రూపంలో జనంపైనే వేస్తారని విద్యుత్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం 6-3-2018



మళ్లీ టాప్-50లోకి లియాండర్ పేస్

భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్-50లోకి వచ్చాడు. గతవారం దుబాయ్ ఓపెన్‌లో జేమీ సెరెటాని (అమెరికా)తో కలిసి రన్నరప్‌గా నిలవడంతో పేస్ ఆరు స్థానాలు పురోగతి సాధించాడు. సోమవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో అతడు 46వ స్థానంలో నిలిచాడు. భారత్‌కే చెందిన రోహన్ బోపన్న 20వ ర్యాంక్‌లో, దివిజ్ శరణ్ 44వ ర్యాంక్‌లో ఉన్నారు. సింగిల్స్‌లో యూకీ బాంబ్రీ 110వ స్థానంలో ఉన్నాడు.



> తొలి ప్రపంచకప్‌లోనే స్వర్ణం గెలుచుకోవడం చాలా సంతోషంగా ఉంది. రాబోయే రోజుల్లో వివిధ పోటీల్లో నా ప్రదర్శన మరింత మెరుగ్గా ఉండేలా ప్రయత్నిస్తా
> -మను భాకర్

ఏ'మను' వర్ణించను!

ప్రపంచ కప్‌లో 16 ఏళ్ల భారత షూటర్ మను భాకర్‌కు స్వర్ణం ◆ రవికుమార్‌కు కాంస్యం

గ్వాడలహారా (మెక్సికో): ప్రపంచ కప్ షూటింగ్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్ పోరు... భారత్‌కు చెందిన 16 ఏళ్ల మను భాకర్ ఒకవైపు... సొంతగడ్డపై ఆడుతున్న 32 ఏళ్ల సీనియర్ అలెజాంద్రా జవాలా మరోవైపు... ఇద్దరి గత రికార్డు చూస్తే అసలు జవాలాకు మనూ పోటీనే కాదు. ఇంత పెద్ద టోర్నీలో తొలిసారి భారత షూటర్ బరిలోకి దిగితే, ఇప్పటికే రెండు ప్రపంచ కప్‌లలో స్వర్ణాలు గెలిచి, రియో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన ఘనత జవాలా సొంతం! 24 షాట్‌ల ఫైనల్లో 23 షాట్‌లు ముగిసేసరికి 1.3 పాయింట్ ముందంజలో ఉన్న మెక్సికో క్రీడాకారిణి దాదాపు విజయాన్ని ఖాయం చేసుకుంది. అయితే ఆఖరి షాట్‌లో తీవ్రమైన ఒత్తిడిని అధిగమించి మను 10.6 స్కోరు సాధిస్తే... జవాలా తడబడి 8.8 పాయింట్లకే పరిమితమైంది. ఫలితంగా ప్రపంచ కప్ షూటింగ్‌లో స్వర్ణం సాధించిన అతి పిన్న వయస్కురాలిగా మను భాకర్ నిలిచింది. మొత్తం 237.5 పాయింట్లతో ఆమె అగ్రస్థానం సాధించగా... జవాలా (237.1 పాయింట్లు) రజతం, సెలిన్ గోబర్‌విలే (ఫ్రాన్స్–217 పాయింట్లు) కాంస్యం గెల్చుకున్నారు. ఇదే విభాగంలో భారత్‌కే చెందిన యశస్విని సింగ్ (196.1 పాయింట్లు) నాలుగో స్థానంలో నిలిచింది.

పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత షూటర్ రవికుమార్ కాంస్య పతకం సాధించాడు. ప్రపంచకప్‌లో అతనికి ఇదే తొలి పతకం కావడం విశేషం. ఈ పోటీలో రవికుమార్ 226.4 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ప్రపంచ నంబర్‌వన్ ఇస్త్వాన్ పెనీ (హంగేరీ– 249.5 పాయింట్లు) స్వర్ణం సాధించగా, అలెగ్జాండర్ షిర్ల్ (ఆస్ట్రియా–248.7 పాయింట్లు) రజత పతకం గెలుచుకున్నాడు. భారత్‌కు చెందిన దీపక్ కుమార్ నాలుగో స్థానంలో నిలిచి నిరాశగా వెనుదిరిగాడు. ఇప్పటివరకు ఈ టోర్నీలో జరిగిన నాలుగు ఈవెంట్స్‌లోనూ భారత్‌కు పతకాలు రావడం విశేషం.



ఆరేళ్ల వయసులో బాక్సింగ్ సాధన, ఆరు నెలలు తిరిగేసరికి హరియాణా సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం... స్కేటింగ్‌లో రాష్ట్ర చాంపియన్, అథ్లెటిక్స్‌లోనూ పతకాలు... టాంగ్ టా మణిపూర్ మార్షల్ ఆర్ట్స్‌లో జాతీయ స్థాయిలో స్వర్ణం, ఆపై కరాటేలో కూడా మరో పతకం... ఇంతే కాదు, క్రికెట్, కబడ్డీ, టెన్నిస్, స్విమ్మింగ్... ఒక్కటేమిటి ఆ అమ్మాయి ఆడని ఆట లేదు. 16 ఏళ్ల వయసుకే మను భాకర్ స్పోర్ట్స్ రికార్డు ఇది.

షూటింగ్‌ను ప్రారంభించింది ఏప్రిల్ 2016లో... జూన్ 2017కు వచ్చేసరికి జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పోటీల బరిలో... ఏడాది కూడా కాక ముందే సీనియర్ ప్రపంచకప్‌లో స్వర్ణ పతకం... మను అనూహ్య ప్రస్థానమిది. మెరైన్ ఇంజినీర్ అయిన తండ్రి ప్రోత్సాహంతో అన్ని ఆటలు ఆడేసి సత్తా చాటిన ఈ అమ్మాయి ఇప్పుడు షూటింగ్‌లో అంతర్జాతీయ యవనికపై మెరిసి శిఖరాన నిలిచింది.

హరియాణాలోని ఝజ్జర్ జిల్లా గోరియా గ్రామం మను స్వస్థలం. వేర్వేరు ఆటల్లో సత్తా చాటుతూ పోయిన ఈ అమ్మాయి బాక్సింగ్ ఆడే సమయంలో కంటికి స్వల్ప గాయమైంది. దాంతో ఆందోళన చెందిన ఆమె తల్లి ఇలాంటి ప్రమాదకరమైన ఆటలు ఇక చాలు అని గట్టిగా చెప్పడంతో షూటింగ్ వైపు మళ్లింది. ఝజ్జర్‌లోని యూనివర్సల్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో ఆమె షూటింగ్‌లో శిక్షణ పొందింది. సహజ ప్రతిభ, ఎక్కడ అడుగు పెట్టినా గెలవాలనే పట్టుదల వెరసి మను ఒక్కసారిగా దూసుకుపోయింది. 2017 సంవత్సరం మను కెరీర్‌కు సంబంధించి తొలి ఏడాది మాత్రమే. అయితేనేం ఆమె అన్ని విధాలా తన ముద్ర చూపించింది. జాతీయ స్థాయి జూనియర్ అండ్ యూత్ కేటగిరిలో తొలి స్వర్ణంతో ఆమె ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత జపాన్‌లో జరిగిన ఆసియా ఎయిర్‌గన్ చాంపియన్‌షిప్‌లో రజతం సాధించింది. ఇక డిసెంబర్‌లో జరిగిన సీనియర్ నేషనల్స్‌లోనైతే వరుసగా రికార్డులు బద్దలు కొట్టి పతకాల వెల్లువతో సంచలనం సృష్టించింది. గత నెలలో జరిగిన 'ఖేలో ఇండియా' పోటీల్లో రెండు జూనియర్ జాతీయ రికార్డులు బద్దలు కొట్టిన మను... కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే 27 మంది సభ్యుల భారత జట్టులోకి ఎంపికైంది. ఇప్పుడు తాజా ప్రదర్శన ఆమె స్థాయిని మరింత పెంచింది. 'మా అమ్మాయి ఏ ఆట ఆడినా ఏనాడూ వద్దనలేదు. తనపై మాకు అంత గట్టి నమ్మకం ఉండేది. రూ.1 లక్ష 40 వేలతో ఆమెకు తొలిసారి గన్ కొనిచ్చిన రోజు నాకు బాగా గుర్తుంది. ఈ రోజు ఆమె సాధించిన ఘనత ముందు ఆ విలువ ఏమాత్రం ఎక్కువగా అనిపించడం లేదు' అని ఆమె తండ్రి రామ్ కిషన్ గర్వంగా అన్నారు. చదువులోనూ ఎక్కడగా తగ్గని మను పదో తరగతి పరీక్షల్లో 10 సీజీపీఏ సాధించడం విశేషం. క్రీడల్లో ఉండేవారు సాధారణంగా ఎంచుకునే సులువైన సబ్జెక్ట్‌లకు భిన్నంగా మెడిసిన్ పూర్తి చేయాలనేది ఆమె లక్ష్యం. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో తమ కూతురు సత్తా చాటుతుందని ఆమె తల్లి సుమేధ ఆత్మవిశ్వాసంతో చెబుతోంది.

సంచలన షూటర్...

మను భాకర్ సత్తా ఏమిటో గత డిసెంబర్‌లో తిరువనంతపురంలో జరిగిన సీనియర్ నేషనల్స్ చాంపియన్‌షిప్‌లోనే అందరికీ తెలిసింది. ఈ ఈవెంట్‌లో మను ఏకంగా 9 స్వర్ణాలు సహా మొత్తం 15 పతకాలు సాధించింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో సీనియర్ హీనా సిద్ధును ఓడించిన మను... ఈ క్రమంలో హీనా పేరిట సుదీర్ఘ కాలంగా ఉన్న అత్యధిక పాయింట్ల (240.6 పాయింట్లు) జాతీయ రికార్డును కూడా బద్దలు కొట్టి స్వర్ణం నెగ్గింది. **-సాక్షి క్రీడా విభాగం**

22 బంతుల్లోనే...

- ముగిసిన దక్షిణాఫ్రికా ఆట
- తొలి టెస్టులో 118 పరుగులతో ఆసీస్ ఘన విజయం

దర్బన్: దక్షిణాఫ్రికా గడ్డపై తమ అద్భుత రికార్డును కొనసాగిస్తూ టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా 1–0తో ముందంజ వేసింది. సఫారీల చివరి వికెట్ తీసి విజయాన్ని ఖాయం చేసుకునేందుకు మ్యాచ్ ఆఖరి రోజు సోమవారం ఆసీస్‌కు 3.4 ఓవర్లు మాత్రమే సరిపోయాయి. రెండో ఇన్నింగ్స్‌లో 293/9 స్కోరుతో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా మరో ఐదు పరుగులు జోడించి 298 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా ఆస్ట్రేలియాకు 118 పరుగుల భారీ గెలుపు దక్కింది. చివరి బ్యాట్స్‌మన్ డి కాక్ (83)ను హాజల్‌వుడ్ ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేయడంతో కంగారూలు సంబరాల్లో మునిగిపోయారు. మ్యాచ్‌లో 9 వికెట్లతో ప్రత్యర్థి పతనాన్ని శాసించిన మిచెల్ స్టార్క్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. రెండో టెస్టు శుక్రవారం నుంచి పోర్ట్ ఎలిజబెత్‌లో జరుగుతుంది.

వార్నర్ వర్సెస్ డి కాక్...



టెస్టు నాలుగో రోజు టీ విరామం సమయంలో ఇరు జట్ల ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కు వెళుతున్న సమయంలో వార్నర్, డి కాక్ పరస్పరం దూషించుకోవడం కొత్త వివాదాన్ని రేపింది. డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లే దారిలో ఉన్న మెట్ల వద్దే వార్నర్ ఆవేశంగా డి కాక్ వైపు దూసుకుపోయే ప్రయత్నం చేయడం కెమెరాల్లో రికార్డయింది. సహచరుడు ఖాజా పక్కకు తీసుకెళ్లే ప్రయత్నం చేసినా వార్నర్ మాత్రం తగ్గలేదు. కొద్ది దూరంలోనే ఉన్న డి కాక్ కూడా ఆ సమయంలో ఏదో అంటూ తమ జట్టు గది వైపు వెళ్లిపోయాడు. మరోవైపు డివిలియర్స్‌ను రనౌట్ చేసిన అనంతరం అతని పక్కనే బాల్ విసిరేసి 'అతి'గా వ్యవహరించిన స్పిన్నర్ లయన్‌పై మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా పడింది.

అరుణకు రైల్వే ఉద్యోగం



సాక్షి, హైదరాబాద్: ట్రిటిచ్చ చకప్ జిమ్నాస్టిక్స్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ జిమ్నాస్ట్ బుద్దా అరుణరెడ్డికి నజరానాల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమెకు రూ. 2 కోట్ల నగదు ప్రోత్సాహకం ప్రకటించగా... తాజాగా దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) గ్రూప్ 'సి' ఉద్యోగాన్ని కేటాయించింది. అంతర్జాతీయ వేదికపై అదరగొట్టిన అరుణకు ఎస్‌సీఆర్‌లో ఉద్యోగం కేటాయించడం సంతోషంగా ఉందని జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ తెలిపారు.

తరుణ్ జంటకు టైటిల్



సాక్షి, హైదరాబాద్: జమైకా ఇంటర్నేషనల్ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ కోన తరుణ్ డబుల్స్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. జమైకాలోని కింగ్‌స్టన్‌లో జరిగిన ఈ టోర్నీ పురుషుల డబుల్స్ ఫైనల్లో... తరుణ్–సౌరభ్ శర్మ (భారత్) జంట 21–17, 21–17తో గారెత్ హెన్రీ–రికెట్స్ (జమైకా) ద్వయంపై గెలిచింది. సెమీస్‌లో ఈ జోడీ 21–5, 21–8తో టాప్ సీడ్ జోస్ గ్యురెవా–డానిల్లె టొర్రె (పెరూ) జంటపై విజయం సాధించింది.

భారత్ శుభారంభం

సియోల్: దక్షిణ కొరియాతో జరుగుతోన్న ఐదు మ్యాచ్‌ల హాకీ సిరీస్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 1–0తో దక్షిణ కొరియాపై విజయం సాధించింది. మ్యాచ్ ప్రారంభమైన 5వ నిమిషంలోనే లాల్రెమ్‌సియామి గోల్ నమోదు చేయడంతో భారత్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత కూడా ఆధిపత్యం కొనసాగించింది. ఈ మ్యాచ్‌తో భారత కెప్టెన్ రాణి రాంపాల్ తన కెరీర్‌లో 200 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది.

ఆఖరి ఓవర్లో కర్ణాటక గెలుపు

ధర్మశాల: విజయానికి 6 బంతుల్లో 11 పరుగులు అవసరం. భారత్ 'బి' బ్యాట్స్‌మన్ సిద్ధేశ్ లాడ్ (70; 6 ఫోర్లు) జోరు మీదున్నాడు. చివరి ఓవర్ వేసేందుకు ఆఫ్ స్పిన్నర్ కృష్ణప్ప గౌతమ్ బంతినందుకున్నాడు. ఈ స్థితిలో 'బి' జట్టే గెలిచేలా కనిపించింది. కానీ గౌతమ్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. లాడ్‌ను అవుట్ చేయడంతో పాటు నాలుగే పరుగులిచ్చాడు. దీంతో సోమవారం జరిగిన దేవధర్ ట్రోఫీ వన్డే మ్యాచ్‌లో కర్ణాటక 6 పరుగులతో నెగ్గింది. మొదట కర్ణాటక 50 ఓవర్లలో 8 వికెట్లకు 296 పరుగులు చేసింది. రవి సమర్థ్ (117; 13 ఫోర్లు, 1 సిక్స్) శతకం బాదాడు. సిద్ధార్థ్ కౌల్ (3/49) రాణించాడు. ఛేదనలో 'బి' జట్టు 23 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఆంధ్ర ఆటగాడు హనుమ విహారి (4) విఫలమయ్యాడు. ఈ స్థితిలో మనోజ్ తివారీ (120; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) నిలిచాడు. చక్కగా ఆడిన అతడికి కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (33), లాడ్ సహకరించారు. 42వ ఓవర్‌కు 241/4తో విజయం దిశగా సాగుతున్నట్లు కనిపించినా వెంటవెంటనే నాలుగు వికెట్లు కోల్పోయి వెనుకబడింది. శ్రేయస్ గోపాల్ 3 వికెట్లు తీశాడు.



నవ యువ సమరం



- నేటి నుంచే ముక్కోణపు టి20 టోర్నీ
- కుర్రాళ్లతో బరిలో దిగుతున్న భారత్
- తొలి మ్యాచ్‌లో శ్రీలంకతో ఢీ

రాత్రి 7 గంటల నుంచి డి స్పోర్ట్‌లో ప్రత్యక్ష ప్రసారం

పేస్ బౌలింగ్‌లో పూర్తిగా కొత్త కూర్పు... స్పిన్ దళంలోనూ కొంత మార్పు... బ్యాటింగ్‌లో దూకుడు మేళవింపు... సత్తా పరీక్షకు సిద్ధమైన ఆల్‌రౌండర్లు... వెరసి ముక్కోణపు టి20 టోర్నీలో నయా టీమిండియా! ప్రధాన ఆటగాళ్ల విశ్రాంతి నేపథ్యంలో ఒక ప్రయోగం! నేటి నుంచే సమరం ప్రారంభం.

కొలంబో: శ్రీలంక స్వాతంత్య్రం పొంది 70 ఏళ్లవుతున్న సందర్భంగా తలపెట్టిన 'నిదాహస్' ముక్కోణపు టి20 టోర్నీ మంగళవారం ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో భారత్ ఆతిథ్య శ్రీలంకను ఇక్కడి ప్రేమదాస స్టేడియంలో ఎదుర్కోనుంది. కెప్టెన్ విరాట్ కోహ్లి సహా ఆరుగురు రెగ్యులర్ ఆటగాళ్లు లేకుండానే బరిలో దిగుతున్నందున టీమిండియా కొత్తకొత్తగా కనిపిస్తోంది. అన్ని విభాగాల్లో కూర్పు మారనుంది. ఈ నేపథ్యంలో అలవాటైన ఉపఖండ పరిస్థితుల్లో రోహిత్ శర్మ సారథ్యంలోని మన జట్టు ఎలా ఆడుతుందోననే ఆసక్తి నెలకొంది.

అందరికీ అవకాశం...

బ్యాటింగ్‌లో మనీష్ పాండే, దినేశ్ కార్తీక్, రిషభ్ పంత్, ఆల్‌రౌండర్ కోటాలో దీపక్ హుడా, విజయ్ శంకర్, స్పిన్‌లో వాషింగ్టన్ సుందర్, పేస్‌లో మొహమ్మద్ సిరాజ్, ఉనాద్కట్, శార్దుల్ ఠాకూర్... ఇలా జట్టులోని ఎక్కువ శాతం ఆటగాళ్లు తమని తాము నిరూపించుకునేందుకు ఈ టోర్నీ చక్కని వేదిక. సమీకరణాల రీత్యా ఒకరిద్దరు తప్ప వీరిలో అందరూ తుది జట్టులో ఉండేవారే. ఇక్కడ రాణిస్తే వీరికిది అదనపు ప్రయోజనంగా మారుతుంది. అన్నిటికీ మించి దక్షిణాఫ్రికా పర్యటనలో పూర్తిగా విఫలమైన రోహిత్ శర్మ ముందు మరో అవకాశం. ఈ 'హిట్ మ్యాన్' ఇప్పుడు బ్యాటింగ్ బాధ్యత నెరవేర్చడంతో పాటు సారథ్య సామర్థ్యమూ చాటుకోవాలి. ఇష్టమైన ప్రత్యర్థి లంకపై చెలరేగితే పూర్వ ఫామ్‌ను అందుకుంటాడు. వైస్ కెప్టెన్ హోదా దక్కిన మరో ఓపెనర్ శిఖర్ ధావన్ ఇందుకు తగ్గట్లు ఆడాల్సి ఉంటుంది. సఫారీలపై టి20ల్లో వన్‌డౌన్‌లో మెరుపులు మెరిపించిన రైనా మరోసారి ఆకట్టుకుంటే స్థానం పదిలం చేసుకుంటాడు. కేఎల్ రాహుల్, పాండేలను 4, 5 స్థానాల్లో పంపాలనుకుంటే... వికెట్ కీపర్‌గా కార్తీక్, పంత్‌లలో ఎవరుండాలో తేల్చుకోవాల్సి ఉంటుంది. స్పిన్ ఆల్‌రౌండర్ స్థానానికి సుందర్, హుడా మధ్య పోటీ ఉంది. చహల్‌కు తోడుగా అక్షర్ పటేల్‌ను ఆడించే అవకాశాలే ఎక్కువ. శార్దూల్, ఉనాద్కట్, సిరాజ్‌లతో పేస్ కూర్పు మొత్తం కొత్తగా కనిపిస్తోంది. మూడో పేసర్ కావాలనుకుంటేనే సిరాజ్‌కు అవకాశం ఉంటుంది.

> 'టోర్నీ ఫేవరెట్లమా? కాదా? పూర్తి స్థాయి జట్టుతో ఆడుతున్నామా..? లేదా..? అనే విషయాలు నేను ఆలోచించడం లేదు. జట్టుకు సారథ్యం వహించే అవకాశం రావడం అదృష్టం. దానిని ఓ గౌరవంగా భావిస్తా. తీరికలేని క్రికెట్ నుంచి కొంత విశ్రాంతి అవసరం. కుర్రాళ్లు ఎంతోకాలంగా స్థిరంగా రాణిస్తూ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఇక్కడ వారెలా ఆడతారో చూడాలనుకుంటున్నాం. ఒక్క ఓవర్‌తో అంతా మారిపోయే టి20ల్లో తమదైన రోజున ఏ జట్టైనా గెలవగలదు.'
> -రోహిత్ శర్మ

లంక మెరుగైనా..?

గతేడాది వరుస పరాజయాలతో డీలాపడిన శ్రీలంక... ఇటీవల బంగ్లాదేశ్ పర్యటనలో వన్డే టోర్నీ, టెస్టు సిరీస్ నెగ్గి ఆత్మవిశ్వాసం కూడగట్టుకుంది. జట్టులోకి తిరిగొచ్చిన యువ బ్యాట్స్‌మన్ కుశాల్ మెండిస్ చక్కగా రాణించాడు. అయితే కీలక ఆటగాళ్లు గుణరత్నే, మాథ్యూస్ దూరమవడం లంకకు లోటుగా మారనుంది. కెప్టెన్ చండిమాల్, ఓపెనర్ ఉపుల్ తరంగాలతో పాటు తిసారా పెరీరా వంటి ఆల్‌రౌండర్లున్న బ్యాటింగ్ ఆర్డర్ ప్రత్యర్థికి సవాల్ విసిరేదే. పేసర్ లక్మల్, స్పిన్నర్ అఖిల ధనంజయ ఇటీవలి సిరీస్‌లలో భారత్‌ను ఇబ్బందిపెట్టారు. సొంతగడ్డపై వీరిని ఎదుర్కొనడంలో జాగ్రత్తగా ఉండాలి. రెండో పేసర్‌గా చమీర, షనక, నువాన్ ప్రదీప్‌లలో ఎవరిని ఆడిస్తారో చూడాలి.

పిచ్, వాతావరణం

వికెట్ నెమ్మదిగా ఉంటుంది. ఆరంభంలో పేసర్లకు సహకరిస్తుంది. మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్ తిరగొచ్చు. సాయంత్రం వేళ వాతావరణం కొంత మేఘావృతంగా ఉండనుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్, సురేశ్ రైనా, కేఎల్ రాహుల్, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్/రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్/దీపక్ హుడా, యజువేంద్ర చహల్, అక్షర్ పటేల్, శార్దుల్ ఠాకూర్, జైదేవ్ ఉనాద్కట్.

శ్రీలంక: కుశాల్ మెండిస్, గుణతిలక, కుశాల్ పెరీరా, చండిమాల్ (కెప్టెన్), ఉపుల్ తరంగ, షనక, తిసారా పెరీరా, ధనంజయ, అపొన్సొ, లక్మల్, చమీర.

ముక్కోణపు టి20 టోర్నీ షెడ్యూల్

మార్చి 6	భారత్ X శ్రీలంక
మార్చి 8	భారత్ X బంగ్లాదేశ్
మార్చి 10	శ్రీలంక X బంగ్లాదేశ్
మార్చి 12	భారత్ X శ్రీలంక
మార్చి 14	భారత్ X బంగ్లాదేశ్
మార్చి 16	శ్రీలంక X బంగ్లాదేశ్
మార్చి 18: ఫైనల్	

మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటల నుంచి మొదలవుతాయి. అన్ని మ్యాచ్‌లను 'డి స్పోర్ట్' చానెల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. భారత్‌లో ఈ టోర్నీ డిజిటల్ టీవీ హక్కులను జియో టీవీ సొంతం చేసుకుంది. మ్యాచ్‌లను జియో టీవీలోనూ తిలకించవచ్చు.

DSPORT

278 గత 11 ఇన్నింగ్స్‌లలో లంకపై రోహిత్ చేసిన పరుగులు. వీటిలో డిసెంబర్‌లో 43 బంతుల్లో చేసిన సెంచరీ కూడా ఉంది. స్ట్రైక్ రేట్ 146.31.

3 శ్రీలంకలో శ్రీలంకతో జరిగిన మూడు టి20 మ్యాచ్‌ల్లోనూ భారత జట్టే నెగ్గింది. ఓవరాల్‌గా రెండు జట్ల మధ్య 14 టి20 మ్యాచ్‌లు జరిగాయి. పదింటిలో భారత్, నాలుగింటిలో శ్రీలంక గెలిచాయి.



తాత్కాలిక సచివాలయంలో ఆర్‌టీజీఎస్ పనితీరును గవర్నర్‌కు వివరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో గవర్నర్ సతీమణి విమల

ఆర్‌టీజీ పనితీరు బాగుంది: గవర్నర్

సాక్షి, అమరావతి: వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో ఏర్పాటు చేసిన రియల్‌టైమ్ గవర్నెన్స్ (ఆర్‌టీజీ) సెంటర్‌ను గవర్నర్ నరసింహన్ సందర్శించారు. ఆర్‌టీజీ పనితీరు బాగుందని ఆయన కితాబిచ్చారు. సోమవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రసంగం చేసిన అనంతరం గవర్నర్ నరసింహన్, సతీమణి విమలానరసింహన్‌తో కలసి బ్యాటరీ కారులో సచివాలయంలోని వివిధ బ్లాకులను సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో సీఎం చంద్రబాబు ముందంజలో ఉంటారన్నారు. ఈ ఆర్‌టీజీ కేంద్రం ద్వారా సీఎం అధిక వృద్ధిరేటును నమోదు చేయగలరని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు గవర్నర్ దంపతులు సచివాలయంలోని క్యాంటీన్, డిస్పెన్సరీలతోపాటు వివిధ విభాగాలను పరిశీలించారు.

18న శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం



సాక్షి, తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 18వ తేదీన విళంబినామ సంవత్సర ఉగాది ఆస్థానాన్ని నిర్వహించనున్నారు. ఆదే రోజు వేకువజామున శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, విష్వక్సేనుల వారికి వేర్వేరుగా తిరుమంజనం నిర్వహించి, విశేషాభరణాలతో అలంకరిస్తారు. తర్వాత ఉత్సవమూర్తులను ఘంటామండపంలో వేంచేపు చేసి, పడిప్రసాదాలు, అన్నప్రసాదాలతో నివేదిస్తారు. అనంతరం ఆస్థాన వేడుకలు నిర్వహించనున్నారు. ఈ ఉగాది ఆస్థానం నేపథ్యంలో 18వ తేదీ నిర్వహించాల్సిన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవ సేవలను టీటీడీ రద్దు చేసింది.

14న అన్నమయ్య 515వ వర్ధంతి ఉత్సవం: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులవారి 515వ వర్ధంతి మహోత్సవాన్ని ఈనెల 14వ తేదీన తిరుమలలో నిర్వహించనున్నారు. ఇక్కడి నారాయణగిరి ఉద్యానవనంలో ఉత్సవమూర్తులు వేంచేపు చేసి, సాయంత్రం 6.00 గంటల నుంచి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో గోష్టిగానం నిర్వహించనున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శిగా పరశురాం

సాక్షి, హైదరాబాద్: అనంతపురం మాజీ మేయర్ రాగె పరశురాం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు కేంద్ర కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

'స్వీపర్లు, కాంపౌండర్లను విధుల్లోకి తీసుకోవాలి'

సాక్షి, అమరావతి: ఆయుష్ ఆస్పత్రిలో స్వీపర్లు, కాంపౌండర్లను తొలగించడం అన్యాయమని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆయుష్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వి.హనుమంతరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయంపై ఆయుష్ కమిషనర్‌ను కలవగా తన చేతుల్లో ఏమీ లేదని, ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని చెప్పారన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 20వ తేదీన చలో కమిషనరేట్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

గ్రామ పంచాయతీలకు రూ.747 కోట్లు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు రెండో విడత ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సులకు మేరకు కేంద్రం ఈ ఏడాది రాష్ట్రంలోని 12,918 గ్రామాలకు రూ.1,484 కోట్లు మంజూరు చేసింది. అయితే మొదటి విడతలో రూ.737 కోట్లు ఇప్పటికే విడుదల చేసింది. రెండో విడత కింద రూ.747 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సాయం కోసం 29 సార్లు సీఎం ఢిల్లీకి: కాల్వ



సాక్షి, అమరావతి: రాష్ట్రానికి సాయం అందించాలని కేంద్రాన్ని కోరేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 29 సార్లు ఢిల్లీకి వెళ్లారని మంత్రి కాల్వ శ్రీనివాసులు చెప్పారు. తాత్కాలిక అసెంబ్లీ మీడియా పాయింట్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి సాయం కోసం కేంద్ర పెద్దలకు చంద్రబాబు పదేపదే విజ్ఞప్తులు చేశారని, రాజధాని, పోలవరం పూర్తి చేసేందుకు నిధులు కోరినట్టు తెలిపారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తున్నాం: పల్లె

గత ఎన్నికల్లో టీడీపీ ఏవైతే హామీలు ఇచ్చిందో వాటన్నింటినీ అమలు చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి చెప్పారు. మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. రెండంకెల వృద్ధి రేటుతో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధితో ముందుకుపోతోందన్నారు.

ఆ 19 అంశాలను కేంద్రం పరిష్కరించాలి: డొక్కా

రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలతో పాటు, రాష్ట్రానికి హామీ ఇచ్చిన 19 అంశాలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని టీడీపీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ డిమాండ్ చేశారు. మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీకి హాజరయ్యే విషయంలో ప్రతిపక్షం పునరాలోచన చేయాలన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాల్సిన అంశం సుప్రీం కోర్టు, పార్లమెంట్ పరిధిలో ఉందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

రావెల మానసిక స్థితి అర్థం కావట్లేదు

ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్ వ్యాఖ్య



సాక్షి, అమరావతి: మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు మానసిక పరిస్థితి అర్థం కావట్లేదని మంత్రి జవహర్ వ్యాఖ్యానించారు. టీడీపీలో దళితులకు గౌరవం లేదంటూ రావెల చేసిన వ్యాఖ్యలను జవహర్ ఖండించారు. సోమవారం తాత్కాలిక సచివాలయంలోని తన చాంబర్‌లో జవహర్ మీడియాతో మాట్లాడుతూ.. రావెల వేరే ప్రయోజనాలను ఆశిస్తూ సంచలనాల కోసం ఆయన ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రావెల వ్యాఖ్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామని, వీటిని పరిశీలించి అధిష్టానం తదుపరి చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

కంది రైతులను ఆదుకుంటాం

రాష్ట్రంలో కంది రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ మంత్రి సీహెచ్.ఆదినారాయణరెడ్డి తెలిపారు. సోమవారం తాత్కాలిక సచివాలయంలో కంది పంట కొనుగోళ్లపై అధికారులతో మంత్రులు సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రులు విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ ద్వారా 45 వేల మెట్రిక్ టన్నుల కందిని కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చిందన్నారు.

రాష్ట్రాన్ని విభజించి నిధులివ్వరా: లోకేశ్

రాష్ట్రాన్ని విభజించి నిధులు ఇవ్వనంటే ఎలా? అని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు. అసెంబ్లీ లాబీలో ఆయన సోమవారం మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు చిట్‌చాట్ జరిపారు. తమకు ప్రత్యేక హోదాతోపాటు మిగతా అంశాలూ ముఖ్యమేనని తెలిపారు. విభజన జరిగినప్పుడు పార్లమెంట్‌లో ఉన్న అన్ని పార్టీలకు ఏపీకి న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు.

ఉధృతమవుతున్న 'విద్యుత్' సమ్మె

- నిలిచిపోయిన మీటర్ల రీడింగ్
- సమ్మెలో 24వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు



రేపు విద్యుత్ సౌధ ముట్టడించాలని వెలసిన పోస్టర్

సాక్షి ప్రతినిధి, తిరుపతి/కర్నూలు (కొండారెడ్డి ఫోర్టు)/డోన్ టౌన్: రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె తీవ్ర రూపం దాల్చింది. ఎస్పీడీసీఎల్, ఈపీడీసీఎల్ డిస్కంల పరిధిలోని 13 జిల్లాల్లోనూ ఈనెల 3వ తేదీ నుంచి జరగాల్సిన విద్యుత్ మీటర్ల రీడింగ్ నమోదు, బిల్లుల బట్వాడా ప్రక్రియ నిలిచిపోయింది. స్పాట్ బిల్లింగ్ వర్కర్లు, బిల్ కలెక్షన్ కార్మికులు ఒక్కసారిగా బంద్‌లో పాల్గొనడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం దిగివచ్చి తమ డిమాండ్లను పరిష్కరించే వరకూ సమ్మెను ఆపేది లేదని విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి స్పష్టం చేస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా 24 వేల మంది సమ్మెలోకి..

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్పీడీసీఎల్, ఈపీడీసీఎల్ పరిధిలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విభాగాల్లో షిఫ్ట్ ఆపరేటర్లు, లైన్‌మన్లు, పోల్ టూ పోల్ వర్కర్లు, మీటర్ రీడింగ్ ఆపరేటర్లు, ఎస్పీఎంలు, గ్యాంగ్‌మన్లు, వాచ్‌మన్లు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు.. ఇలా 72 రకాల ఉద్యోగులు ఉన్నారు. 13 జిల్లాల్లో కలిపి వీరు 24వేల మంది ఉన్నారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు కాంట్రాక్టు కార్మికులను రెగులర్ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ డిమాండ్‌తో పాటు సమాన పనికి సమాన వేతనం, థర్డ్ పార్టీ వ్యవస్థను రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 20 నుంచి వీరందరూ సమ్మెలోకి వెళ్లారు. ఇప్పటివరకు వారిని సర్కార్ గాని, యాజమాన్యంగానీ చర్చలకు పిలవలేదు. మరోవైపు.. ప్రభుత్వ కుట్రలో భాగంగా.. సమ్మెలోకి వెళ్తే ఉన్న ఉద్యోగాలు తీసి వేస్తామని కాంట్రాక్టర్లు కార్మికులను బెదిరిస్తున్నారు. ఇప్పటికే కొందరు కాంట్రాక్టర్లు కొత్తవారిని తీసుకునేందుకు పేపర్లలో ప్రకటనలు ఇస్తున్నారు.

రేపు విద్యుత్ సౌధ ముట్టడి

ఈ నెల 7న విద్యుత్ సౌధను ముట్టడించాలని విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల జేఏసీ నేతలు నిర్ణయించారు. ఇందుకు సీఐటీయూ, ఏఐటీయూసీలు మద్దతు పలికాయి. ఇప్పటికే విజయవాడ, గుంటూరు, తిరుపతి, విశాఖలో యూనియన్ నేతల ఆమరణ నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలంటూ చిత్తూరులో సోమవారం ముగ్గురు కార్మికులు 400 కేవీ టవర్ ఎక్కారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి



జి.తిరుపాల్ (ఫైల్)

ఉద్యోగం నుంచి తొలగిస్తానని కాంట్రాక్టర్ బెదిరించడంతో తీవ్ర మనోవేదనకు గురై గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిన విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుడు జి.తిరుపాల్ (56) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలంటూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు కర్నూలులోని ఎస్ఈ కార్యాలయం ఎదుట రాస్తారోకో చేశారు. తిరుపాల్ కర్నూలు జిల్లా డోన్ మండలం చిన్నమల్కాపురం సబ్‌స్టేషన్‌లో 26 ఏళ్లుగా ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సమ్మె నేపథ్యంలో.. ఫిబ్రవరి 28న కాంట్రాక్టర్ విజయకుమార్‌రెడ్డి తిరుపాల్‌కు ఫోన్‌చేసి, వెంటనే విధుల్లోకి రావాలని, లేదంటే ఉద్యోగం తీసేస్తానని బెదిరించాడు. దీంతో గుండెపోటుతో తిరుపాల్ కుప్పకూలగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు చెప్పగా, హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ 7 రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు.

ట్రాన్స్‌జెండర్స్‌కు గుర్తింపు కార్డులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్స్‌ను గుర్తించి వారికి మెడికల్ సర్టిఫికెట్లు, ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 11 బోధనాసుపత్రులను గుర్తించారు. వీటిల్లో ట్రాన్స్‌జెండర్స్‌ను గుర్తించేందుకు.. ముగ్గురు వైద్యుల బృందాన్ని నియమిస్తారు. వీరు సర్టిఫై చేసిన తర్వాత.. ప్రతినెలా చివరి సోమవారం నేరుగా మీసేవా కేంద్రాల ద్వారా గుర్తింపు కార్డుతో పాటు మెడికల్ సర్టిఫికెట్ పొందచ్చు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం: అచ్చెన్న

సాక్షి, అమరావతి: ఆర్టీసీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని, నేషనల్ మజ్దూర్ యూనియన్ సమ్మె నోటీసు యోచనను విరమించుకోవాలని రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కార్మిక సంఘ నేతలను కోరారు. సోమవారం ఆర్టీసీ హౌజ్‌లో మంత్రి అచ్చెన్న, ఎండీ మాలకొండయ్య, రవాణా శాఖ డిప్యూటీ సెక్రటరీ ఉన్నితన్‌లతో ఎన్ఎంయూ నేతలు ప్రసాదరావు, పీవీ రమణారెడ్డి, శ్రీనివాసరావు భేటీ అయ్యారు. సమస్యలు పరిష్కరించకుంటే 12న సమ్మె నోటీసు ఇచ్చేందుకు ఎన్ఎంయూ నేతలు సిద్ధమయ్యారు. పే స్కేల్స్‌కు సంబంధించి ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది.

నేడు ధర్నాలు చేయాలని ఈయూ పిలుపు

రవాణా రంగాన్ని, ఆర్టీసీని నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లు రద్దు చేయాలనే డిమాండ్‌తో మంగళవారం ఆర్టీసీ కార్మిక సంఘాలు నిరసనలు చేపట్టాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) ఓ ప్రకటనలో పిలుపునిచ్చింది.

సీనియర్ రెసిడెంట్స్‌కు వేతనాలు పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సీనియర్ రెసిడెంట్లు, సూపర్ స్పెషాలిటీ వైద్యులందరికీ గౌరవ వేతనాలను 40% పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన గౌరవ వేతనం 2017 ఆగస్టు నుంచి వర్తిస్తుంది. సీనియర్ రెసిడెంట్లకు రూ.33 వేల నుంచి రూ.45 వేలకు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు రూ.41 వేల నుంచి రూ.55 వేలకు పెంచారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.



“ఫెమినిజం ఆడవాళ్లను శక్తిమంతులను చేయడానికి కాదు. ఆడవాళ్లు శక్తిమంతులే. ఆ శక్తిని ప్రపంచం తెలుసుకోవడానికి చేసే ప్రయత్నమే అది.”

- జి.డి. ఆండర్సన్, స్త్రీవాద కవయిత్రి



వెన్నెల
మహాబోధి విద్యాలయ నిర్వాహకురాలు, సికింద్రాబాద్

కోడి ముందా? గుడ్డు ముందా?
ప్రపంచంలో ఇప్పటివరకు సమాధానం దొరకని ప్రశ్న.
చిక్కులేని సింపుల్ ప్రశ్న! సమాధానమే.. చిక్కదు!
కానీ మన ఊళ్లలో ఆడపిల్లల దగ్గర కరెక్ట్ ఆన్సర్ ఉంది.
గుడ్డు కంటే కోడే ముందు అంటున్నారు వాళ్లు!
‘మేము చేసే పొదుపే ఆ బంగారు గుడ్డు’ అంటున్నారు.
అదెలా?
ఈ ఎంపవర్‌మెంట్ ఇంటర్వ్యూని చదవండి.

గుడ్డు కంటే కోడే ముందు

మహిళకు ఆర్థిక స్వావలంబన, సాధికారత అనే భావన పురుడు పోసుకుని దశాబ్దాలు దాటింది. ఈ ఫలాలు క్షేత్రస్థాయిలో వేళ్లూనుకున్నాయా? మహిళ ఆశించిన స్థాయిలో సాధికార సాధనలో పయనిస్తోందా? బొట్టు బిళ్ల కోసం భర్తను రెండు రూపాయలడుగుతూనే ఉందా! లేక ఇప్పుడామె చేతిలో నాలుగు డబ్బులు కనిపిస్తున్నాయా? ఆమె శక్తి సామర్థ్యాల మీద ఆమెకు నమ్మకం కలుగుతోందా? తనకు తానుగా ముందుకు సాగగలననే ధీమా ఆమెలో పొడచూపుతోందా? ఆత్మవిశ్వాసంతో ‘నాకు నేనే ఆధారం... నేనే ఒక శక్తి’ అనేటంతటి మనోబలం ఆమె సొంతమైందా? గ్రామస్థాయిలో పర్యటించి పరిశోధించిన వెన్నెలతో సాక్షి ముఖాముఖి.

‘‘ఉమెన్ ఎంపవర్‌మెంట్ త్రూ పావర్టీ రిడక్షన్ ప్రోగ్రామ్’ నా పీహెచ్‌డీ. ఈ సందర్భంగా రంగారెడ్డి, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో కుగ్రామాలతో సహా చాలా విస్తృతంగా పర్యటించాను. రెండు వేల మంది మహిళలను కలిశాను. వారితో మాట్లాడుతున్నప్పుడు ‘ఫెమినైన్ జెండర్‌లోనే సేవింగ్స్ గుణం ఎక్కువ’ని నేను నమ్మిన సిద్ధాంతం నిజమేనని మరోసారి నిర్ధారణ అయింది. మహిళలకు స్వతహాగా పొదుపు చేసే గుణం ఉంటుంది. ప్రకృతిలో ప్రతి ప్రాణి అంతే. మహిళల జీన్స్‌లోనే ఉంటుంది. ఇంట్లో ఒక అమ్మాయి అబ్బాయి ఉంటే... పెద్దవాళ్లు చెరో పది రూపాయలు ఇస్తే అబ్బాయిలు మొత్తం డబ్బుని తినడానికో, ఆడుకునే వస్తువులకో ఖర్చు చేస్తారు. అమ్మాయిలైతే కొందరు రెండు రూపాయలు ఖర్చు చేసి ఎనిమిది రూపాయలు పొదుపు చేస్తారు, కొందరు ఎనిమిది రూపాయలు ఖర్చు చేసి రెండు రూపాయలు పొదుపు చేస్తారు. ఈ మాత్రపు తేడా ఉంటుంది తప్ప అస్సలు పొదుపు చేయని అమ్మాయిలు కనిపించరు. ఇంత చక్కగా ప్లాన్ చేయగలిగిన ఆడవాళ్లకు ఆర్థిక సాధికారత లేకపోవడం ఏమిటి? అనిపించేది.



● బాల్యంలో తండ్రి గద్దర్‌తో వెన్నెల

శిఖరాన్ని చేరకమానదు!

గతంలో మహిళలకు ఆర్థిక సాధికారత లేకపోవడానికి దారి తీసిన పరిస్థితులు అనేకం. అయితే మహిళ వాటి నుంచి బయటపడుతోంది. తొలి అడుగు మొదలైన రోజే మార్పు ప్రభావం ఏదని అడిగితే చెప్పడం కష్టమే. మొదలైన ప్రస్థానం శిఖరాన్ని చేరక మానదు. నేను కలిసిన వాళ్లలో ఎక్కువ మంది పెద్దగా చదువుకోని వాళ్లే. అలాంటి వాళ్లు కూడా గంట సేపు నాతో మాట్లాడితే తమకు పని గంటలు వృథా అవుతాయని ఆరాట పడేవారు. ప్రొడక్టివ్ టైమ్‌ని నిరుపయోగంగా గడపడం వాళ్లకు నచ్చడం లేదు. రెండు గంటల సేపు పత్తి కోస్తే వంద రూపాయలొస్తాయి. అలాంటి పని సీజన్‌లో టైమ్ వేస్ట్ కాకూడదనే ఆలోచన ఉందంటే వాళ్లకా బాధ్యత ఎవరు నేర్పారు? వాళ్లకు వాళ్లే నేర్చుకున్నారు.

చేయి చాచడం లేదిప్పుడు!

‘ఒకప్పుడు ఏ చిన్న అవసరం అయినా ఒక్క పది రూపాయలకు కూడా భర్త దగ్గర చేయి చాచాల్సి వచ్చేది, మా పుట్టింటోళ్లు వచ్చారు, కోడిగుడ్డు కూర వండుతాను... అని అడిగి, భర్త పాతిక రూపాయలిస్తే గుడ్లు తెచ్చి వండేవాళ్లం. ఇప్పుడు మా దగ్గరే డబ్బులుంటు న్నాయ్. మా మీటింగుల్లో డాక్టర్లు చెప్పినట్లు ఇంట్లో కూడా గుడ్లు వండుతున్నాం. వాళ్లను డబ్బులు అడగకుండా మేము గుడ్లు తెచ్చి వండితే ఏ మొగుడికైనా అడ్డు చెప్పడానికి ఏముం టుంది’... అని ప్రశ్నించిందొ కామె. ‘డబ్బు మా దగ్గర ఉంటే బంగారు గుడ్డు చేతిలో ఉన్నట్లే’ అన్నది మరొకామె.

> “తల్లులు ఆడపిల్లలను చదివించడానికి చొరవ చూపిస్తున్నారు. గ్రామాల్లో మహిళలు పెద్ద చదువులు చదువుకోకపోయినప్పటికీ జీవితాన్ని నిర్మించుకోవడంలో చాలా తెలివిగా ఉంటున్నారు, సాధికారత కోసం భర్తతో విభేదించడం లేదు. తమకు తాముగా ఆర్థిక వెసులుబాటును సాధించుకుంటూ సాధికారత దిశగా పయనిస్తున్నారు.

ఇంకా... ‘మేము దాచుకున్న డబ్బు బ్యాంకులో మా పేరుతోనే ఉంటుంది. భర్తకు అవసరమైనప్పుడు మేమే ఇవ్వగలుగుతున్నాం. షావుకారు దగ్గర డబ్బు దాచుకుంటే మాకు తెలియకుండానే మా మగవాళ్లు వెళ్లి తెచ్చేసుకునేటోళ్లు. ఇప్పుడు బ్యాంకులోళ్లు అలా ఇవ్వరు కదా! మేమెళ్లి సంతకం చేస్తేనే బ్యాంకు వాళ్లు డబ్బిస్తారు. అలాంటప్పుడు ఇంట్లో మగవాళ్లు చీటికీ మాటికీ మా మీద చెయ్యి లేపగలుగుతారా?’ అన్నారు కొంతమంది. ఆ మాటల్లో వ్యక్తమైన ధీమా అక్షరాల్లో చెప్పలేనిది. వాళ్ల ముఖాలను అలా చూడాల్సిందే.

ధైర్యం పెరిగింది!

స్వతహాగా పొదుపు గుణం ఉన్న మహిళలకు ఇందిరా క్రాంతి పథం వంటి గవర్నమెంట్ స్కీమ్‌లు మంచి తోడ్పాటునిచ్చాయి. బ్యాంకు లావాదేవీలు నేర్చుకున్నారు. ఆడవాళ్లలో రిస్క్ చేయగలిగిన ధైర్యం కూడా కనిపించింది. పదివేల నుంచి లక్ష రూపాయల వరకు పెట్టుబడితో చిన్న చిన్న దుకాణాలు, బ్యూటీపార్లర్, గేదెలు కొని పాల వ్యాపారం వంటివి చేయడానికి ముందుకొస్తున్నారు. సక్సెస్ అవ్వాలనే తపన, సక్సెస్ అవ్వగలమనే ఆత్మవిశ్వాసం చూశాను. ఒకవేళ పెట్టిన డబ్బు రాకపోతే మరే పనులైనా చేసుకుని ఆ లోటును పూడ్చుకోగలమనే ధీమా కూడా కనిపిస్తోంది. దాంతో ప్రతి నిర్ణయానికీ వెనుకాడడం, భర్త ఏమంటాడోననే భయం కనిపించడం లేదు.

అన్నీ నీకు చెప్పాలా?

ఆడవాళ్లు సంపాదించిన ప్రతి రూపాయినీ ఇంటికే ఖర్చు చేస్తుంటారు కాబట్టి భర్తలు కూడా అడ్డు చెప్పడం లేదు. మగవాళ్లు దానిని సౌకర్యంగానే భావిస్తున్నారు. ఆడవాళ్లు డబ్బు సంపాదించగలిగిన స్థితికి చేరడంతో భర్త సంపాదన గురించి కూడా తెలుసుకోగలుగుతున్నారు. వాళ్లకు భర్తను అడిగే ధైర్యం వచ్చింది. అంతకు ముందు పొలంలో పండిన ధాన్యం అమ్మితే ఎంత డబ్బు వచ్చిందనేది భార్యకు తెలిసేది కాదు. ఆమె అడిగినా ‘అవన్నీ నీకు చెప్పాలా’ అనే తిరస్కార సమాధానం వచ్చేది. ఇప్పుడు భర్తలు భార్యతో ఆర్థిక విషయాలను పంచుకుంటున్నారు. వచ్చిన డబ్బులో దేనికి ఎంత ఖర్చు చేసుకుందాం అనే చర్చ ఇళ్లలో జరుగుతోంది. ఇంటికి అవసరమైన వస్తువుల మీద ఆడవాళ్లకే ఎక్కువ ఇంట్రస్ట్ ఉంటుంది. ఆ సంతోషాలను కూడా సొంతం చేసుకోగలుగుతున్నారు. గవర్నమెంట్ స్కీమ్‌ల వల్ల గ్రామాల్లో ఉండే మహిళలు కూడా కనీసం నెలకోసారయినా పట్టణాలకు వస్తున్నారు. ప్రభుత్వ ఆఫీసుల్లో ఉద్యోగులను చూస్తున్నారు. చదువుకోవడం వల్ల వచ్చే విజ్ఞానం విలువ తెలుసుకోగలుగుతున్నారు. ఈ రివల్యూషన్ తెచ్చిన గొప్ప ప్రయోజనం ఏమిటంటే... ఇప్పుడు ఆడపిల్లలను చదివించడంలో మహిళలు చొరవ చూపిస్తున్నారు. గ్రామాల్లో మహిళలు పెద్ద చదువులు చదువుకోకపోయినప్పటికీ జీవితాన్ని నిర్మించుకోవడంలో చాలా తెలివిగా ఉంటున్నారు, సాధికారత కోసం భర్తతో విభేదించడం లేదు. తమకు తాముగా ఆర్థిక వెసులుబాటును సాధించుకుంటూ సాధికారత దిశగా పయనిస్తున్నారనే చెప్పాలి.

ఇక రాజకీయాధికారం విషయానికి వస్తే నేను కలిసిన వారిలో 20 మంది స్థానిక సంస్థల ప్రతినిధులు కూడా ఉన్నారు. వారిలో ఇద్దరే సొంతంగా ప్రజాప్రతినిధి కావాలనే ఉత్సాహంతో వచ్చినవాళ్లు. మిగిలిన వాళ్లంతా భర్త నిర్ణయం ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసిన వాళ్లే. అయితే మొదట్లో భర్త ఇచ్చిన పేపర్ల మీద సంతకాలు చేసిన వాళ్లే... తర్వాత ‘ఇది ఇలా కాదయ్యా, మా సంఘం (డ్వాక్రా, వెలుగు, ఇందిరా క్రాంతి పథం)లో చెప్పారు’ అంటూ భర్తను కరెక్ట్ చేయగలిగిన దశకు చేరుతున్నారు. ఇప్పటి వరకు మహిళలు భర్త కళ్లతో సమాజాన్ని చూశారు, ఇప్పుడు సొంతంగా చూస్తున్నారు. ఇది చాలా మంచి పరిణామం’’.

ఇంటర్వ్యూ: **వాకా మంజులారెడ్డి**
ఫొటో: **మోహనాచారి**

ఆస్కార్ ‘వర్డ్స్’!

ఇన్‌క్లూజన్ రైడర్

‘‘లేడీస్ అండ్ జెంటిల్మన్.. చివరిగా రెండు మాటలు చెప్పి నా ప్రసంగాన్ని ముగిస్తాను..’’ అని ఒక్క క్షణం ఆగారు హాలీవుడ్ నటి ఫ్రాన్సెస్ మెక్‌డోర్మండ్. డాల్బీ థియేటర్‌లో ఒక్కసారిగా నిశ్శబ్దం. ఏమిటా రెండు మాటలు?!

డోర్మండ్ చేతిలో ‘ఉత్తమ నటి’గా ఆమె గెలుచుకున్న ఆస్కార్ ప్రతిమ ఉంది. ‘త్రీ బిల్‌బోర్డ్స్ అవుట్‌సైడ్ ఎబ్బింగ్ మిస్సోరీ’ చిత్రానికి వచ్చిన అవార్డు అది.

‘‘లేడీస్ అండ్ జెంటిల్మన్.. ఐ హ్యావ్ టూ వర్డ్స్ టు లీవ్ విత్ యు టునైట్’’ అని ఆగి, ఇన్‌క్లూజన్ రైడర్’’ అంటూ ప్రసంగాన్ని ముగించారు డోర్మండ్. అంతే! ఇంటర్నెట్ జామ్ అయింది. ట్వీటర్ కిక్కిరిసిపోయింది. ‘ఇన్‌క్లూజన్ రైడర్’ అనే మాటలకు మీనింగ్ ఏమై ఉంటుదన్న వెదకులాట మొదలైంది. కొన్ని గంటల తర్వాత గానీ ఒక క్లారిటీ రాలేదు.

Inclusion Rider అనేది ఒక ఫ్రేజ్ కాదు. వేర్వేరుగా రెండు పదాలు అవి. ఇన్‌క్లూజన్ అంటే ‘చేర్పు’. రైడర్ అంటే ‘ఉపవాక్యం’.

> “‘గోల్డెన్ గ్లోబ్ అవార్డు’ల ఫంక్షన్‌కు అందరూ నలుపురంగు దుస్తులే వేసుకుని వెళ్లారు. ‘బ్రిటిష్ అకాడమీ ఫిల్మ్’ అవార్డుల ప్రారంభోత్సవంలో నటీమణులంతా కలిసికట్టుగా ‘టైమ్స్‌అప్’కు మద్దతు ఇస్తూ ఒక ఉత్తరం రాశారు. అదేవిధంగా ఆస్కార్ ఫంక్షన్‌లో డోర్మండ్ ‘ఇన్‌క్లూజన్ రైడర్’ అనే మాట వాడారని అనుకోవాలి.

లేదా ‘అనుబంధ అంశం’. (రైడర్‌కి ఉన్న ఇంకో అర్థం తెలిసిందే. ‘నడిపే వ్యక్తి’). ఇన్‌క్లూజన్ రైడర్ అని డోర్మండ్ అనడంలోని ఉద్దేశం.. ‘చేర్చాలనే షరతు విధించండి’ అని చెప్పడం. ఏంటి చేర్చడం? ఏంటి షరతు? ఏంటి విధించడం? ఇన్ని ప్రశ్నలకూ ఒకే సమాధానం ఏంటంటే.. ‘ఓ.. ప్రధాన నటీనటులారా.. మీరొక సినిమా చేసేందుకు దర్శకనిర్మాతలతో ఒప్పందం కుదుర్చుకునేటప్పుడు ఎలాంటి జాతి, లైంగిక వివక్ష లేకుండా కథాంశంలోని కాల, స్థలాలను బట్టి నటీనటులు, ఇతర సిబ్బందిని చేర్చుకుంటేనే నేను ఈ చిత్రంలో కొనసాగుతాను అని ‘కొసరు’గా ఒక షరతును విధించండి’.. అని చెప్పడం! ఆ మాటనే ‘ఇన్‌క్లూజన్ రైడర్’ అనే పదాలతో చెప్పి, తన ప్రసంగాన్ని ముగించారు డోర్మండ్! ఒక విధంగా ఇది ‘మీటూ’, ‘టైమ్స్‌అప్’ మహిళా ఉద్యమాలను సమర్థించడమే. ‘గోల్డెన్ గ్లోబ్ అవార్డు’ల ఫంక్షన్‌కు అందరూ నలుపురంగు దుస్తులే వేసుకుని వెళ్లారు. ‘బ్రిటిష్ అకాడమీ ఫిల్మ్’ అవార్డుల ప్రారంభోత్సవంలో నటీమణులంతా కలిసికట్టుగా ‘టైమ్స్‌అప్’కు మద్దతు ఇస్తూ ఒక ఉత్తరం రాశారు. అదేవిధంగా ఆస్కార్ ఫంక్షన్‌లో డోర్మండ్ ‘ఇన్‌క్లూజన్ రైడర్’ అనే మాట వాడారని అనుకోవాలి.



ఆస్కార్ ఉత్తమ నటి ఫ్రాన్సెస్ మెక్‌డోర్మండ్

అయినా, ఈ రెండు మాటలకు అంత అర్థం ఉందని ఎలా అనుకుంటాం? డిక్షనరీలలోకి నేటికింకా ఈ పదాలు రాలేదు కదా! కానీ, ఈ జంట పదాలు రెండేళ్ల క్రితమే జన్మించాయి! డాక్టర్ స్టేసీ స్మిత్ అనే యువతి 2016లో కాలిఫోర్నియా యూనివర్సిటీకి సమర్పించిన ఒక సిద్ధాంత పత్రంలో ఈ పదప్రయోగం చేశారు. ‘ది డేటా బిహైండ్ హాలీవుడ్స్ సెక్సిజం’ అనే పత్రంలో ‘ఎ-లిస్టు హాలీవుడ్ నటులు తమ ఒప్పందాలలో ఒక ‘ఇన్‌క్లూజన్ రైడర్’ను పెడితేనే కానీ చిత్రపరిశ్రమలోని వివక్ష సమసిపోదు’ అని రాశారు. హాలీవుడ్‌లోని అసమానతల్ని తొలగించేందుకు స్టేసీ స్మిత్ చేసిన సూచన అది. అప్పట్లో ‘ఇన్‌క్లూజన్ రైడర్’ అనే పదాలకు ఏమంత ప్రాముఖ్యం రాలేదు. ఇప్పుడు అవే పదాలు ఆస్కార్ విజేత నోటి నుంచి రాగానే ప్రాణం పోసుకున్నాయి. నేడో, రేపో ఒకే పదబంధంగా ఇవి డిక్షనరీల్లో కనిపించడమే ఇక మిగిలింది. ●

చెట్టు నీడ

అప్పుడే చేయి ఆరోగ్యంగా ఉన్నట్టు!

ఒక ఊళ్లో ఒకాయన ఉండేవాడు. ఎవరికి ఏమైనా అవసరమొచ్చినప్పుడు సాయం చేయడానికి వెనుకాడేవాడు కాదు. వీధిలో ఎదురుపడి తమ కష్టం చెప్పుకున్నా కూడా, ‘మా ఇంటికెళ్లి నా భార్యతో చెప్పి తీసుకో’ అని వాళ్లకు కావాల్సింది అందేట్టు చూసేవాడు. అయితే, ఈ ధోరణి ఆయన భార్యకు నచ్చేది కాదు. కొన్నిసార్లు ఆ సాయం చేయడానికి నిరాకరించేది కూడా. ఒకరోజు అలా తిరగ్గొట్టిన విషయం ఆయనకు తెలిసింది.

> ఆయన దాన్ని మనసులో పెట్టుకుని, గుప్పిట మూసుకుని సాయంత్రం ఇంటికి వెళ్లాడు. భార్య గమనించి, ‘ఏమైంది?’ అని ఆశ్చర్యంగా అడిగింది.

ఆయన దాన్ని మనసులో పెట్టుకుని, గుప్పిట మూసుకుని సాయంత్రం ఇంటికి వెళ్లాడు. భార్య గమనించి, ‘ఏమైంది?’ అని ఆశ్చర్యంగా అడిగింది.

‘ఇది ఎప్పుడూ ఇలాగే వుందనుకో, దాన్నేమంటావ్?’ అని ప్రశ్నించాడు.

‘ఏదో వైకల్యం ఉన్నట్టు’ అని జవాబిచ్చింది.

మళ్లీ పూర్తిగా అరచేయిని చాచి చూపిస్తూ, ‘ఎప్పుడూ ఈ చేయి ఇలాగే ఉండిపోయిందనుకో, దాన్నేమంటావ్?’ అన్నాడు.

ఏం చెప్పబోతున్నాడో అర్థం చేసుకుంటున్నట్టుగా, ‘ఇది కూడా ఇంకో రకం వైకల్యమే’ అని జవాబిచ్చింది.

‘అదీ, అందుకే నువ్వు నా మంచి భార్యవు’ అని నవ్వుతూ తన పనిలో పడిపోయాడు.

సంపద వచ్చినప్పుడు కాపాడాలి. వచ్చినదాన్ని పంచుతూవుండాలి. అప్పుడే చేయి ఆరోగ్యంగా ఉన్నట్టు!

ఆ పైన ఎప్పుడూ ఆమె సాయం చేయడానికి వెనుకాడలేదు.

గుడ్ ఫుడ్

జీవకణాలకు శక్తి



జొన్నలను మనం చాలావరకు మరచిపోయినప్పటికీ అప్పుడప్పుడైనా వాటిని తినడం వల్ల వాటిలోని పోషకాలతో మనకు మేలు జరుగుతుందని గుర్తుంచుకోవాలి. జొన్నల వల్ల ఒనగూరే ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయి.

- జొన్నల్లో పీచుపదార్థాలు చాలా ఎక్కువ. ఫలితంగా వాటి వల్ల జీర్ణ వ్యవస్థకు మేలు జరుగుతుంది.
- జొన్నల్లో పిండి పదార్థంతో పాటు పీచు పదార్థాలు కూడా ఎక్కువే కాబట్టి జొన్నల్లోని చక్కెర వేగంగా కాకుండా... జీర్ణమయ్యాక చాలా మెల్లిగా రక్తంలోకి వస్తుంది. డయాబెటిస్ రోగులకు ఇదెంతో మేలు చేసే అంశం. స్థూలకాయంతో పాటు గుండెజబ్బులు, పక్షవాతం వంటి ప్రమాదకర పరిస్థితులను నివారిస్తాయి.
- జొన్నల్లో ప్రొటీన్లు కూడా ఎక్కువే. కండరాల రిపేర్లు, కణాల పుట్టుక, పెరుగుదలకు ప్రొటీన్లు ఎంతగానో తోడ్పడతాయి.
- జొన్నలు ఒంట్లోని చెడుకొవ్వులను నియంత్రిస్తాయి.



- వీటిల్లో శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.
- జొన్నల్లో మెగ్నీషియమ్ పాళ్లు ఎక్కువ. దాంతో అవి క్యాల్షియమ్‌ను ఎక్కువగా గ్రహించేలా దోహదపడటం ద్వారా ఎముకల దారుఢ్యాన్ని పెంచుతాయి.
- జీవకణాల్లో మరింత శక్తినింపుతాయి. వాటిలో పునరుత్తేజం కలిగిస్తాయి.

బిగ్ ఫైట్

చదువు కోసం ఆర్డర్ తెచ్చుకుంది

పద్దెనిమిది సంవత్సరాలకే బాలికలకు వివాహం జరగడం వల్ల వారింకా డిగ్రీ కూడా పూర్తి చేసి ఉండరు. అందుకే ఆసక్తి ఉన్నవారు వివాహ ధర్మాన్ని పాటిస్తూనే, చదువు కొనసాగించవలసి వస్తుంది. కొన్ని కుటుంబాల్లో వివాహానికి ముందే ఆడపిల్లల చేత చదువు మాన్పించినప్పటికీ వివాహానంతరం భర్త చొరవతో కాలేజీకి వెళ్లేవారూ ఉంటారు. అయితే అన్షియాబీ పరిస్థితి వీటన్నిటికీ భిన్నమైనది. చదువును కొనసాగించడం కోసం ఆమె హైకోర్టునే ఆశ్రయించవలసి వచ్చింది!

నిబంధనల ప్రకారం నో ఎంట్రీ

కేరళ తాళిపరంబలోని సర్ సయ్యద్ కళాశాలలో అన్షియాబీ బిఏ అరబిక్ విభాగంలో చదువుతోంది. మూడో సెమిస్టర్ వరకు అన్షియాబీ కాలేజీకి హాజరయ్యింది. గర్భవతి అయిన కారణంగా నాలుగవ సెమిస్టర్ సమయంలో సెలవు పెట్టవలసి వచ్చింది. 2016 మార్చిలో బిడ్డకు జన్మనిచ్చాక, కొంతకాలం విరామం తీసుకుని, మళ్లీ కాలేజీలో చేరి కోర్సు పూర్తి చేయాలనుకుంది. ఆ ఉద్దేశంతోనే 2017 జనవరిలో రీ అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే కాలేజీ ప్రిన్సిపాల్ తిరస్కరించారు. గడిచిన సెమిస్టర్లలో పాస్ కానివారికి తిరిగి ప్రవేశం కల్పించడం కుదరదని అన్నారు. దాంతో అన్షియాబీ ఆర్‌టిఐ ద్వారా కళాశాల రూల్స్‌కి సంబంధించిన విషయం తెలుసుకుంది అటువంటి నిషేధమేమీ లేదని తెలియడంతో అన్షియాబీ హైకోర్టులో పిటిషన్ వేసింది.



బిడ్డతో అన్షియాబీ

నిబంధనలు మార్చి రీ ఎంట్రీ!

‘‘మా కాలేజీ రెగ్యులేషన్స్ ప్రకారం, సెమిస్టర్ ప్రారంభమయ్యాక వరుసగా నెల రోజులు కాలేజీకి హాజరుకాని వారికి, తిరిగి ప్రవేశించే హక్కు లేదు’’ అన్నారు కాలేజీ యాజమాన్యం. దాంతో కోర్టు ఆలోచనలో పడింది. నెక్స్ట్ బ్యాచ్‌కి దరఖాస్తు చేసుకొమ్మని అన్షియాబీకి సూచించింది. కోర్టు సూచనల మేరకు అన్షియాబీ తరవాతి బ్యాచ్‌కి సరైన సమయంలో దరఖాస్తు చేసుకుంది. ఈసారి కూడా కళాశాల తిరస్కరించింది. మళ్లీ హైకోర్టును ఆశ్రయించింది అన్షియాబీ. అప్పుడు మాత్రమే అన్షియాబీకి న్యాయం జరిగింది. హైకోర్టు న్యాయమూర్తి అను శివరామన్ ఆమెకు అనుకూలంగా తీర్పు చెప్పారు. ‘‘తాను తల్లి అయ్యాక కూడా చదువు కొనసాగించాలను కుంటున్నట్లు అన్షియాబీ పిటిషన్ చేసుకున్నారు. ఆమెకు తప్పక చదువుకునే అవకాశం కల్పించాలి’’ అని న్యాయమూర్తి తీర్పు చెప్పారు. గర్భిణి అయిన కారణంగా కాని, ప్రసవం కారణంగా కాని మధ్యలోనే చదువు ఆపిన మహిళలకు, తిరిగి కళాశాలలో చేరే అవకాశం ఇవ్వాలని బెంచ్ తీర్పు చెప్పింది. ఈ తీర్పు రావడంతో, అన్షియాబీ తిరిగి కళాశాలలో చేరింది. చదువు వెలుగునిస్తుం దంటారు. అన్షియాబీ చదువు.. వెలుగునిచ్చే తీర్పునే తీసుకొచ్చింది.

> “తల్లి అయ్యాక కూడా చదువు కొనసాగించాలని కోరుకుంటున్న మహిళలకు విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పక సహకరించాలి”
>
> - కేరళ కోర్టు తీర్పు

సాక్షి ఫ్యామిలీ

సినిమా

విజయవాడ

మంగళవారం

6-3-2018

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! నా బెస్ట్ ఫ్రెండ్ ఒక అమ్మాయి.. మా స్కూల్ ఫ్రెండ్‌ని లవ్ చేసింది. ఒకరంటే ఒకరు ప్రాణంగా ఉండే వారు. కొన్ని రోజులు బాగానే ఉన్నారు. తరువాత నుంచి వాళ్లిద్దరికి నిత్యం గొడవలు జరిగేవి. విడిపోవడం, మళ్లీ తిరిగి కలుసుకోవడం ఇలానే జరుగుతూ ఉండేది. అబ్బాయి అమ్మాయికి చాలా ఆంక్షలు పెట్టేవాడు. దాంతో తను బాగా ఏడ్చేది. ఆ సమయం లోనే ఒకరోజు వాళ్ల లవ్ మేటర్ అమ్మాయి ఇంట్లో తెలిసిపోయింది. దాంతో అమ్మాయికి వాళ్ల ఇంట్లో ఆంక్షలు పెరిగాయి. ఇప్పుడు ఆ అబ్బాయి ''నువ్వు దూరమౌతుంటే నీ విలువ తెలుస్తుంది'' అంటూ ఏడుస్తున్నాడు. కానీ అమ్మాయి మాత్రం ''నేను పేరెంట్స్‌కి వ్యతిరేకంగా ఏం చెయ్యలేను'' అంటూ బాధపడుతోంది. అటు పేరెంట్స్‌కి, ఇటు ఆ అబ్బాయికి మధ్య నరకం చూస్తోంది. నా ఫ్రెండ్‌కి ఏదైనా మంచి సలహా ఇవ్వండి సార్ ప్లీజ్.

– లావణ్య

ఇంకా మెచ్యూరిటీ రాలేదు.

'ఎవరికి సార్ అబ్బాయికా?? అమ్మాయికా???'

ఇద్దరికీ....

'అసలు మెచ్యూరిటీ అంటే ఏంటి సార్????'

బుర్రకు గుండెకు డిస్కనెక్షన్...

'మైండ్‌కి హార్ట్‌కి డిస్కనెక్షనా..?????'

అవును నీలూ!

'మీరు సైంటిస్ట్‌లాగా మాట్లాడకండి సార్. మీ మైండ్‌కి ఏమైనా అయ్యిందోమోనని నాకు దిగులేస్తోంది సార్!'

అవును నీలాంబరి.. నేను చెప్పేది నిజం. డిగ్రీ లేని లవ్ డాక్టర్‌లాగా చెబుతున్నా. సైంటిస్ట్ లాగా కాదు...!

'అంటే ఏంటి సార్? మైండ్‌కి హార్ట్‌కి కనెక్షన్ లేకపోవడం మెచ్యూరిటీ ఎలా అవుతుంది సార్????'

అనుకుందల్లా చేస్తే మైండ్ పని. అనిపించిందల్లా చేస్తే హార్ట్ పని. అన్నదానికీ అనిపించిన దానికీ మధ్య కనెక్షన్ లేకపోతే.. కన్ఫ్యూజన్ ఉండదు. లేకపోతే చీటికీ మాటికీ మైండ్ లాజిక్, హార్ట్ ఎమోషన్ కలిసిపోయి కన్ఫ్యూజన్ పెరిగిపోతుంది. అదే మెచ్యూరిటీ ఉంటే అన్నదానికీ, అనిపించిన దానికీ తేడా అర్థమవుతుంది.

'మీ ఆన్సర్‌కి.. క్వశ్చన్‌కి కనెక్షన్ ఉండకపోతే మెచ్యూరిటీ కదా సార్???' అని పక్కున నవ్వింది నీలాంబరి.

lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

		5	2	4				6
	6	9	5		7			8
		7		9	6		5	
7	5						3	
8		1	6		3	4		7
	3						8	9
	1		4	7		8		
4			3		9	7	1	
9				8	5			

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

5	4	1	3	9	6	2	7	8
3	7	8	2	1	4	6	9	5
6	9	2	8	7	5	3	4	1
4	8	6	9	5	2	1	3	7
7	5	9	1	3	8	4	2	6
1	2	3	4	6	7	5	8	9
2	1	4	8	6	9	7	5	3
8	6	5	7	2	3	9	1	4
9	3	7	5	4	1	8	6	2

సెల్ఫ్ చెక్

పిల్లలకు రోడ్డు భద్రత చెప్తున్నారా?



సెలవులు రాకముందే పిల్లలు ఆ సెలవులకు సరిపోయేటట్లు షెడ్యూల్ వేసుకుంటుంటారు. టీనేజ్ పిల్లలైతే టూవీలర్ రైడింగ్ నేర్చుకోవడానికి, రైడింగ్ వచ్చిన పిల్లలు హాలిడే ట్రిప్‌లకు సిద్ధమవుతుంటారు. పిల్లలకు వాహనం ఇచ్చి బయటికి పంపించేముందు వాళ్లకు రోడ్ సేఫ్టీ గురించి చెబుతున్నామా?

1. వాహనాన్ని నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ మాట్లాడకూడదు, ఒకవేళ ఫోన్ వస్తే బండిని రోడ్ మార్జిన్‌కు తీసుకుని ఆపి మాత్రమే ఫోన్‌లో మాట్లాడాలి.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
2. హెల్మెట్, సీట్‌బెల్టులను తప్పని సరిగా ధరించాలి.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
3. చిన్నపిల్లలు ఆడుకునేచోట వాహనం స్పీడు తగ్గించాలని మీ పిల్లలకు మరీ మరీ చెప్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
4. రోడ్డు మీద జీబ్రా వద్ద దూకుడుగా వెళ్లకూడదని చెప్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
5. అలసినప్పుడు వాహనాన్ని నడిపితే ప్రమాదాలకు అవకాశం ఎక్కువ. అందుకే ఆ టైమ్‌లో బండి ఇవ్వరు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
6. పరిమితికి మించిన వేగాన్ని ప్రోత్సహించరు, 'స్పీడుగా వెళ్లడంలో నీకు కలిగే థ్రిల్ కంటే నీ చుట్టూ ఉండేవాళ్లకు కలిగే ఆందోళన భయంకరమైనది. నీ సంతోషం కోసం ఇతరులను భయభ్రాంతులకు గురి చేయడం రాక్షసత్వం' అని చెప్తుంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
7. రోడ్డు భద్రత చట్టం ఏర్పాటు చేసిన నియమాలను అనుసరించడం పౌరులుగా మన విధి అని గుర్తు చేస్తుంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
8. 'నీ గొప్ప కోసం నియమాలను అతిక్రమించడం చట్టవిరుద్ధం మాత్రమే కాదు అనైతికం కూడా' అని హెచ్చరిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐

మీ సమాధానాల్లో 'ఎ'లు ఆరు అంతకంటే ఎక్కువగా వస్తే వాహనం నడపడంలో పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అప్రమత్తంగా ఉంటున్నారు అనుకోవాలి. 'బి'లు ఎక్కువైతే పిల్లల సరదా శ్రుతి తప్పితే అది వాళ్లకు, ఇతరులకు ఎంత ప్రమాదాన్ని కలిగించగలదో చెప్పడం తల్లిదండ్రులుగా బాధ్యత.

ఏప్రిల్ నుంచి ఎటాక్



ఎన్టీఆర్

ఎన్టీఆర్–త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రానున్న సినిమా ఎప్పుడు స్టార్ట్ అవుతుంది? రెగ్యులర్ షూటింగ్ ఎప్పుడు? అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ ప్రశ్నకు సమాధానం వచ్చేసింది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్‌లో మొదలు కానుంది. ఈ చిత్రాన్ని హారికా హసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ నిర్మించనున్నారు. ఇందులో ఎన్టీఆర్‌కు జోడీగా పూజా హెగ్డేను సెలెక్ట్ చేశారు. ఈ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు సంగీతం తమన్, కెమెరాను పీఎస్ వినోద్ హ్యాండిల్ చేయనున్నారని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది సెకండ్ హాఫ్‌లో సినిమాను రిలీజ్ చేయటానికి ప్లాన్ చేస్తున్నారు.

ఎన్‌జీకే అంటే?



సూర్య

... ప్రస్తుతం సూర్య కొత్త టైటిల్ చూసినవారందరికీ వచ్చిన డౌట్ ఇది. ఆ డౌట్ తీరాలంటే దీపావళి వరకు ఆగాల్సిందే అంటోంది చిత్రబృందం. సూర్య హీరోగా రకుల్‌ప్రీత్ సింగ్, సాయి పల్లవి కథానాయికలుగా సెల్వ రాఘవన్ డైరెక్షన్‌లో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. సోమవారం దర్శకుడు సెల్వ రాఘవన్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు 'ఎన్‌జీకే' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసి, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసింది చిత్రబృందం. లుక్ సమ్‌థింగ్ డిఫరెంట్‌గా ఉంది కదూ. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్. ప్రభు, ఎస్.ఆర్. ప్రకాష్‌బాబు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

తమిళంలోకి తొలి అడుగు



మెహరీన్, విజయ్

విజయ్ దేవరకొండ తమిళ పరిశ్రమకు పరిచయం కాబోతున్నారు. 'ఇంకొక్కడు' ఫేమ్ ఆనంద్ శంకర్ డైరెక్షన్‌లో తెలుగు, తమిళ భాషల్లో విజయ్ దేవరకొండ, మెహరీన్ జంటగా కె.ఇ.జ్ఞానవేల్ నిర్మిస్తున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి. ముహూర్తపు సన్నివేశానికి అల్లు అరవింద్ క్లాప్‌నివ్వగా, 'అర్జున్ రెడ్డి' దర్శకుడు సందీప్ వంగా కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ – ''జ్ఞానవేల్ రాజాగారి బ్యానర్‌లో సినిమా చేయడం ప్రౌడ్‌గా ఫీల్ అవుతున్నాను. కథ వినగానే ఎగ్జైటింగ్‌గా అనిపించింది. డేట్స్ అడ్జస్ట్ చేసి మరీ ఈ సినిమాకు ఓకే చెప్పాను'' అన్నారు. ''అర్జున్ రెడ్డి'ని 5సార్లు థియేటర్‌లో చూశాను. విజయ్ అద్భుతమైన నటుడు. మా బ్యానర్‌లో డైరెక్ట్ తెలుగు ఫిల్మ్‌లో విజయ్ హీరోగా నటిస్తున్నందుకు హ్యాపీగా ఉంది. ఆనంద్ శంకర్, సంగీత దర్శకుడు శామ్.సి, ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ ఇలా పెద్ద సినిమాలకు పనిచేసిన టెక్నీషియన్స్ అందరూ ఈ సినిమాకు వర్క్ చేయడం ఆనందంగా ఉంది. మార్చి 8న హైదరాబాద్‌లో ఫస్ట్ షెడ్యూల్ స్టార్ట్ చేస్తాం'' అన్నారు జ్ఞానవేల్ రాజా. ''అర్జున్ రెడ్డి' బాగా నచ్చింది. విజయ్ బాగా యాక్ట్ చేశాడు. నేను చెప్పిన కథ విని బాగా ఎగ్జైట్ అయ్యాడు. తమిళం నేర్చుకుని మరీ డైలాగ్స్ చెబుతా అన్నాడు. అంత ప్యాషనేట్ యాక్టర్'' అన్నారు ఆనంద్ శంకర్. ''ఇటీవల విజయ్‌తో హోలీ సాంగ్ చేశాను. వెంటనే ఫుల్ లెంగ్త్ హీరోయిన్‌గా చేస్తున్నాను. స్క్రిప్ట్ విని ఎగ్జైట్ అయ్యాను. స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో యాక్ట్ చేయడం హ్యాపీగా ఉంది'' అన్నారు మెహరీన్. కేయస్ రామారావు, బీవీయస్‌యన్ ప్రసాద్, వంశీ పైడిపల్లి, స్వప్నా దత్, నవీన్ ఎర్నేని తదితరులు పాల్గొన్నారు.

మన్యంపులి లాగే ఆదరిస్తారని ఆశిస్తున్నా

– మోహన్‌లాల్



మేజర్ రవి, మోహన్‌లాల్, ఎన్. బాలాజీ

ఇండో–పాక్ బోర్డర్‌లో 1971లో జరిగిన ఇన్సిడెంట్స్ ఆధారంగా మలయాళంలో రూపొందిన చిత్రం '1971 బియాండ్ బోర్డర్స్'. మోహన్‌లాల్, అల్లు శిరీష్ ముఖ్య తారలుగా మేజర్ రవి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ సినిమాను 'యుద్ధభూమి' పేరుతో జాష్ రాజ్ ప్రొడక్షన్స్, శ్రీ లక్ష్మి జ్యోతి క్రియేషన్స్ బ్యానర్స్ పై ఎన్.బాలాజీ తెలుగులోకి అనువదిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన అనంతరం మోహన్‌లాల్ మాట్లాడుతూ – ''దర్శకుడు మేజర్ రవికి దేశభక్తి ఎక్కువ. ఆర్మీలో పని చేయడంతో ఆ బ్యాక్‌డ్రాప్‌లో ఇప్పటికే పది సినిమాలు తీశారు. అందులో 5 సినిమాలు నాతోనే తీశారు. అల్లు శిరీష్ ఎనర్జిటిక్ ఫెర్ఫార్మెన్స్ చూపించాడు. తనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం హ్యాపీగా ఉంది. 'మన్యం పులి' సినిమాలాగే ఈ సినిమాను కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు. ''మన సైనికులకు దేశ భక్తి ఉన్నట్టే ఆ దేశ సైనికులకు కూడా దేశభక్తి ఉంటుంది. ఇలా ఇరు దేశ సైనికుల భావోద్వేగాలను చూపించాం. మోహన్‌లాల్, శిరీష్ అద్భుతంగా నటించారు. ఎన్.బాలాజీ గారు తెలుగులో రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది'' అన్నారు మేజర్ రవి. ''ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్రమాలు ఫైనల్ స్టేజిలో ఉన్నాయి. మన నేటివిటీకి తగ్గట్టుగా ఎక్కడా రాజీ పడకుండా డబ్ చేస్తున్నాం. త్వరలో ప్రీ–రిలీజ్ ఫంక్షన్ ఏర్పాటు చేస్తాం. మేజర్ రవి, మోహన్‌లాల్, అల్లు శిరీష్, హాజరు కానున్నారు'' అని నిర్మాత బాలాజీ అన్నారు.

అట్టహాసంగా ఆస్కార్ 2018



మెక్‌డోర్మండ్, గెలెర్మో డెల్‌టొరో, గ్యారీ ఓల్డ్‌మేన్

■ హోస్ట్ జిమ్మీ కిమ్మెల్ 'మీటూ' ఉద్యమం గురించి మాట్లాడాడు. హార్వీ వెయిన్‌స్టీన్‌పై చేసిన పోరాటం గొప్పదని, ఇది హాలీవుడ్‌లో మార్పు తప్పకుండా తీసుకొస్తుందని ఆయన అభిప్రాయపడ్డాడు. ■ తక్కువ టైమ్‌లో స్పీచ్ పూర్తి చేసిన అవార్డ్ విన్నర్‌కు జిమ్మీ కిమ్మెల్ జెట్ స్కైని గిఫ్ట్‌గా ఇస్తానన్నాడు. మార్క్ బ్రిడ్జెస్ తక్కువ మాట్లాడి (30 సె॥) దక్కించుకున్నాడు. ■ రోజర్ డేకిన్స్ 13సార్లు బెస్ట్ సినిమాటోగ్రాఫర్‌గా నామినేషన్ సాధించి, నిరాశతో వెనుదిరిగాడు. ఈసారి 'బ్లేడ్ రన్నర్ 2049' సినిమాకు ఆస్కార్ దక్కించున్నాడు. ■ ఫస్ట్ టైమ్ రైటర్‌గా ఒక ఆఫ్రికన్ – అమెరికన్ (జోర్డాన్ పీలె) అవార్డు అందుకున్నాడు. ■ 89 ఏళ్లకు ఆస్కార్ అందుకొన్న అతి పెద్దవాడిగా రైటర్ జేమ్స్ ఐవరీ రికార్డ్ సాధించారు.

డాల్బీ థియేటర్.. లాస్ ఏంజిల్స్, యూఎస్ఏ. సినిమాకు పండగలాంటి 'ఆస్కార్–2018' వేడుక జరుగుతోంది. బెస్ట్ డైరెక్టర్‌గా అవార్డు అందుకున్న గెలెర్మో డెల్‌టొరో మాట్లాడుతూ.. ''ఈ కళ, ఈ సినీ పరిశ్రమ వల్ల జరిగే ఓ గొప్ప ప్రయోజనం ఏంటంటే.. ఈ మట్టిలో మనం గీసుకున్న గీతలను అవి చెరిపేస్తాయి. ఈ ప్రపంచం ఆ గీతల్ని ఎంత ఒత్తుగా గీస్తూ వెళ్లినా మనం ఆ గీతలను చెరిపేస్తూనే ఉండాలి..'' అన్నాడు. హాలీవుడ్‌లో అక్కడి పరిశ్రమకు కేంద్రమైన అమెరికా నుంచే నటులు, టెక్నీషియన్స్ ఎక్కువగా కనిపిస్తారు. గెలెర్మో మెక్సికన్. అయినా కూడా సినిమాయే తనను ఈ స్థాయిలో నిలబెట్టి, దేశాల మధ్య సరిహద్దులు చెరిపేసిందనే కోణంలో ఆయన తన స్పీచ్ ఇచ్చారు.

నిజమే! శతాబ్దానికి పైగా చరిత్ర ఉన్న, ప్రపంచాన్ని ఏకం చేయగల శక్తి సినిమా అనే మాధ్యమానికి తప్పకుండా ఉంది. సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి కూడా అంత ఉంది ఆ సినిమాకు. అలాంటి సినిమాకు పెద్దన్న లాంటి హాలీవుడ్ సినీ పరిశ్రమ ఏటా చేసుకునే ఆస్కార్ సంబరం, ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా జరిగింది. ఈ 90వ ఆస్కార్ వేడుకలో హాలీవుడ్‌లో గతేడాది అద్భుతాలు సృష్టించిన సినిమాలు, టెక్నీషియన్స్‌కు అవార్డులు అందజేసి ఆస్కార్ సంబరం జరిపింది.

గతేడాది ఆస్కార్స్‌కు హోస్ట్‌గా వ్యవహరించిన ప్రముఖ హాస్యనటుడు జిమ్మీ కిమ్మెల్, ఈ ఏడాది కూడా తన స్టైల్లో ఈ షోను ఉత్సాహంగా మొదలుపెట్టి, అలాగే నడిపించాడు. అతని మోనోలాగ్‌తోనే ఈ షో ప్రారంభమైంది. మోనోలాగ్‌లో ''ఆస్కార్ అవార్డు ప్రకటించే సమయంలో మీ పేరు రాగానే, వెంటనే వచ్చి అవార్డు తీసుకోకండి. ఒక నిమిషం ఆగండి. ఎందుకంటే గతేడాదిలాగా జరగొద్దని కోరుకుంటున్నా..'' అన్నాడు. గతేడాది బెస్ట్ పిక్చర్ విషయంలో జరిగిన తప్పిదం తెలిసిందే. బెస్ట్ పిక్చర్ అయిన 'మూన్‌లైట్'కు బదులు 'లా లా లాండ్'ను బెస్ట్ పిక్చర్‌గా ప్రకటించి, ఆ తర్వాత తప్పు జరిగిపోయిందని, మూన్‌లైట్‌కు ఆస్కార్ ఇచ్చారు. ఈసారి అలా జరగబోదని, ఎన్వలెప్‌లన్నీ సరిగ్గా చూసుకున్నామని జిమ్మీ చెప్పడంతో డాల్బీ థియేటర్ అంతా గట్టిగా నవ్వులు వినిపించాయి.

ఆస్కార్స్‌లో టాప్ అవార్డు అయిన 'బెస్ట్ పిక్చర్'ను ఈ ఏడాది 'ది షేప్ ఆఫ్ వాటర్' అందుకుంది. పోటీకి నిలబడ్డ తొమ్మిది సినిమాల్లో మిగతా ఎనిమిది సినిమాలను పక్కనబెట్టి బెస్ట్ పిక్చర్ అనిపించుకుంది. ఆస్కార్స్‌లో ఈ ఏడాది ఎక్కువ అవార్డులు అందుకుంది కూడా ఈ సినిమానే! బెస్ట్ పిక్చర్‌తో పాటు బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ ఒరిజినల్ స్కోర్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్ అవార్డులందుకుంది 'షేప్ ఆఫ్ వాటర్'.

ఇక రెండో ప్రపంచయుద్ధం నేపథ్యంలో డంకర్క్ ఎవాక్యుయేషన్‌ను బేస్ చేస్కొని తెరకెక్కిన 'డంకర్క్'.. బెస్ట్ ఫిల్మ్ ఎడిటింగ్, బెస్ట్ సౌండ్ మిక్సింగ్, బెస్ట్ సౌండ్ ఎడిటింగ్‌లతో మూడు అవార్డులందుకుంది.

'బ్లేడ్ రన్నర్ 2049', 'కోకో', 'డార్కెస్ట్ అవర్', 'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి' సినిమాలు రెండు చొప్పున అవార్డులు దక్కించుకున్నాయి. నామినేషన్స్ దక్కించుకోవడానికి ముందు నుంచే ఆస్కార్‌లో సత్తా చాటుతాయని భావించిన 'ది పోస్ట్', 'లేడీ బర్డ్' సినిమాలు ఒక్క అవార్డూ దక్కించుకోలేదు.

దాదాపు 4 గంటలకు పైనే సాగిన ఈ వేడుకలో గతేడాదిలాగా ఘోర తప్పిదాలేవీ జరగకపోయినా, అక్కడక్కడా కాస్త బోరింగ్‌గా నడిచిందనే టాక్ తెచ్చుకుంది. గతేడాది ఆస్కార్స్‌ను యూఎస్‌లో 3.29 కోట్ల మంది చూశారని అంచనా. ఈసారి ఆ నంబర్ కాస్త తగ్గొచ్చనే అంచనా వేస్తున్నారు.

బెస్ట్ యాక్టర్ అవార్డు అందుకున్న గ్యారీ ఓల్డ్‌మన్ తన స్పీచ్‌లో చెప్పాల్సిన వారందరికీ థ్యాంక్స్ చెప్పాక, ''ఆస్కార్ కంటే పెద్దదైన మా అమ్మకు.. వచ్చే బర్త్‌డేకి ఆమెకు 99 ఏళ్లు. ఆమె ఇప్పుడు సోఫాలో కూర్చొని ఈ వేడుక చూస్తూంటుంది. ఆమెకు ఇవ్వాళ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. అమ్మా! కాఫీ రెడీగా ఉంచు. ఆస్కార్‌ను ఇంటికి తీసుకొస్తున్నా..'' అన్నాడు. ఆ మాటకు థియేటర్ అంతా గట్టిగా నవ్వింది. ఆ నవ్వులాంటి ఇంకెన్నో ఎమోషన్స్‌తో ఆస్కార్ ఎప్పట్లానే ఫ్యాన్స్‌కు పండగలా వచ్చి, మళ్లీ వచ్చే ఏడాది కలుద్దామంటూ వెళ్లిపోయింది.

ఆస్కార్స్ వేడుకలో 'ఆస్కార్స్ ఇన్ మెమొరియమ్' పేరుతో ఆ ఏడాది ఈ లోకాన్ని విడిచివెళ్లిన ఫిల్మ్ స్టార్స్‌ను తల్చుకునే సంప్రదాయం ఉంది. ఈ ఏడాది మెమొరియమ్ సెక్షన్‌లో ఇండియన్ సినిమా లెజెండ్స్ శ్రీదేవి, శశి కపూర్‌లను ఆస్కార్స్ తలుచుకుంది.

అవార్డ్ విన్నింగ్ స్పీచ్

90వ ఆస్కార్ వేడుకలో ఫ్రాన్సెస్ మెక్‌డోర్మండ్ ఇచ్చిన స్పీచ్‌ను అవార్డ్ విన్నింగ్ స్పీచ్ అనొచ్చు. 'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి' సినిమాకు బెస్ట్ యాక్ట్రెస్ అవార్డు అందుకున్న మెక్‌డోర్మండ్, యాక్సెప్టెన్స్ స్పీచ్‌లో చెప్పాల్సిన వాళ్లందరికీ థ్యాంక్స్ చెప్పాక, "నేనిప్పుడు ఒక విషయం చెప్పాలి.." అంటూ ఆస్కార్‌కు నామినేట్ అయిన ఆడవాళ్లందరినీ నిలబడమని చెప్పింది. రెండే రెండు పదాలు చెప్పి ఈ స్పీచ్ ముగిస్తా, అని "ఇన్‌క్లూజన్ రైడర్" అంది. దానర్థం సినిమాల్లో నటించేముందు అగ్రిమెంట్ మీద సంతకం చేసే ఏ–లెవెల్ స్టార్స్‌కు సినిమా క్రూ అండ్ కాస్ట్‌లో 50 శాతం జెండర్ ఈక్వాలిటీ అడిగే చాన్స్ ఉందని. అంటే 50 శాతం మంది ఆడవాళ్లను టీమ్‌లో ఉండేలా చూసుకోమని. ఈ విషయం ఆస్కార్ వేడుక ముగిసాక, మెక్‌డోర్మంటే క్లారిటీ ఇస్తూ చెప్పింది.

ది షేప్ ఆఫ్ వాటర్‌కు ఎక్కువ అవార్డులు

శ్రీదేవి, శశికపూర్‌లకు ఆస్కార్ నివాళి

విన్నర్స్ లిస్ట్

బెస్ట్ పిక్చర్
ది షేప్ ఆఫ్ వాటర్

బెస్ట్ డైరెక్టర్
గెలెర్మో డెల్‌టొరో (ది షేప్ ఆఫ్ వాటర్)

బెస్ట్ యాక్ట్రెస్ - లీడింగ్ రోల్
ఫ్రాన్సెస్ మెక్‌డోర్మండ్ (త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి)

బెస్ట్ యాక్టర్ : లీడింగ్ రోల్
గ్యారీ ఓల్డ్‌మేన్ (డార్కెస్ట్ అవర్)

బెస్ట్ యాక్ట్రెస్ : సపోర్టింగ్ రోల్
ఎలిసన్ జేనీ (ఐ, టోన్యా)

బెస్ట్ యాక్టర్ : సపోర్టింగ్ రోల్
సామ్ రాక్‌వెల్ (త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి)

బెస్ట్ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్)
జోర్డాన్ పీలే (గెట్ ఔట్)

బెస్ట్ స్క్రీన్‌ప్లే (అడాప్టెడ్)
జేమ్స్ ఐవరీ (కాల్ మీ బై యువర్ నేమ్)

బెస్ట్ సినిమాటోగ్రఫీ
రోజర్ డీకిన్స్ (బ్లేడ్ రన్నర్ 2049)

బెస్ట్ ఒరిజినల్ స్కోర్
అలెగ్జాండర్ డిప్లా (ది షేప్ ఆఫ్ వాటర్)

బెస్ట్ ఒరిజినల్ సాంగ్
క్రిస్టిన్ ఆండర్సన్ లోపెజ్, రాబర్ట్ లోపెజ్ (సాంగ్ : రిమెంబర్ మి సినిమా : కోకో)

బెస్ట్ యానిమేటెడ్ ఫిల్మ్ (ఫీచర్)
కోకో

బెస్ట్ యానిమేటెడ్ ఫిల్మ్ (షార్ట్)
డియర్ బాస్కెట్ బాల్

బెస్ట్ లైవ్ యాక్షన్ (షార్ట్)
ది సైలెంట్ చైల్డ్

బెస్ట్ డాక్యుమెంటరీ ఫిల్మ్ (ఫీచర్)
ఇకారస్

బెస్ట్ డాక్యుమెంటరీ ఫిల్మ్ (షార్ట్)
హెవెన్ ఈజ్ ఎ ట్రాఫిక్ జామ్ ఆన్ ద 405

బెస్ట్ ఫారిన్ లాంగ్వేజ్ ఫిల్మ్
ఎ ఫెంటాస్టిక్ వుమన్ (చిలీయన్ సినిమా)

బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్
పాల్ డీ ఆస్టర్‌బెర్లీ, జెఫ్రీ ఎ మాల్విన్, షేన్ వియ (ది షేప్ ఆఫ్ వాటర్)

బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్
జాన్ నెల్సన్, గెర్డ్ నెఫ్‌జర్, పాల్ లాంబర్ట్, రిచర్డ్ ఆర్ హూవర్ (బ్లేడ్ రన్నర్ 2049)

బెస్ట్ ఫిల్మ్ ఎడిటింగ్
లీ స్మిత్ (డంకర్క్)

బెస్ట్ మేకప్ అండ్ హెయిర్ స్టైలింగ్
కజుహిరో సుజి, డేవిడ్ మాలినోవ్‌స్కీ, లూసీ సిబ్బిక్ (డార్కెస్ట్ అవర్)

బెస్ట్ కాస్ట్యూమ్ డిజైన్
మార్క్ బ్రిడ్జెస్ (ఫాంటమ్ థ్రెడ్)

బెస్ట్ సౌండ్ ఎడిటింగ్
రిచర్డ్ కింగ్, అలెక్స్ గిబ్సన్ (డంకర్క్)

బెస్ట్ సౌండ్ మిక్సింగ్
మార్క్ వెంగర్టన్, గ్రెగ్ ల్యాండెకర్, గ్యారీ ఎ రిజో (డంకర్క్)



ఆష్లే జడ్ · గాల్ గోడాట్ · గ్రేటా గెర్‌విగ్ · హీడీ క్లమ్ · జెన్నిఫర్ లారెన్స్

అదిరేటి డ్రెస్సు మీరేస్తే ఆహా.. మనసుకి ఆహా.. కంటికి ఆహా అంటూ ఆస్కార్ అవార్డ్స్ వేడుకలో రెడ్ కార్పెట్ పై క్యాట్ వాక్ చేసిన అందాల తారలను చూసిన వీక్షకులు ఆహా.. ఓహో అనుకున్నారు. సేమ్‌టైమ్ బెదిరేటి డ్రెస్సులు వేసుకొచ్చిన భామలూ ఉన్నారు. 'అబ్బే.. బొత్తిగా ఫ్యాషన్ తెలియదు' అని వాళ్లను చూసి పెదవి విరిచేశారు. ఏదేతైనేం విదేశీ భామలది విశాలమైన హృదయం అని సరదాగా జోకేసుకున్నవారూ ఉన్నారు.

నేను శక్తి సాక్షి
సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం, 6-3-2018

భార్యకు గౌరవం... భర్త ఇవ్వక్కర్లేదు

ఒకరు ఇవ్వాలనుకుని ఇస్తే వచ్చేది కాదు గౌరవం

గౌరవం మనసులో ఉంటే అది మాటలో వినిపిస్తుంది

ఎక్కడైతే గౌరవం ఉండదో...అక్కడ ప్రేమ లేమి ఉన్నట్లే

మరి భార్యను గౌరవించకపోతే...

ఆ భార్య ఏం చేయాలి? పిల్లల్ని ఏం చేయాలి?

విడిపోకుండా ఉండడానికి...

మార్గం ఏదన్నా ఉందా? ఉంది!


ప్రతీకాత్మక చిత్రం

పంటినొప్పి అంటే చికిత్సకు డబ్బులివ్వలేదు. అప్పుడు కొరికింది... మొగుడి అహాన్ని! దెబ్బకి రూట్‌లోకొచ్చాడు.

తెలుసుకో మిస్టర్!

''ఏంటీ! పంటి నొప్పా. రోజూ ఏదో ఒక న్యూసెన్స్'' విసుక్కుంటూ, భార్య మీద ధుమధుమలాడుతూ హాస్పిటల్‌కి వెళ్లి పోయాడు డాక్టర్ రాజేశ్.

భార్య పడుతున్న బాధకు భర్తగా హృదయంతో స్పందించలేదు, పోనీ ఒక డాక్టర్‌గా కూడా రెస్పాండ్ కాలేదతడు. మౌనంగా బాధను అదిమి పెట్టింది స్వప్న పంటిబాధతోపాటు మనసు బాధను కూడా.

ఇలాంటి మనిషి కోసమా డాక్టర్‌గా తన కెరీర్‌ను వదులుకున్నది. రాజేశ్ పీజీ చేస్తానంటే తాను ఉద్యోగం చేస్తూ అతడిని చదివించింది. ఆ సంగతులేవీ గుర్తులేవు కాబోలు. పిల్లల కోసం తాను కెరీర్‌కి దూరమైంది. ఇవేవీ అతడికి పట్టడమే లేదు.

రాజేశ్ వెళ్లి పోయిన తర్వాత మెల్లగా లేచి డెంటిస్ట్ దగ్గరకు వెళ్లింది స్వప్న. పిల్లలకు స్కూలు వదిలేలోపు పన్ను తీయించుకుని, వాళ్లను స్కూలు నుంచి ఇంటికి తీసుకురావాలి. అందుకే ఆమె భోజనం కూడా చేయకుండా కదిలింది.

'రూట్ కెనాల్ చేయాలి' అన్నాడు పంటిని పరీక్షించిన డెంటిస్ట్.

'పన్ను తీసేయండి' అన్నది స్వప్న నిర్లిప్తంగా.

డెంటిస్ట్ తలెత్తి ఆమెను చూశాడు, తాను విన్నది నిజమేనా అన్నట్లు. మెల్లగా 'పన్ను తీయాల్సిన అవసరం లేదు' రూట్‌కెనాల్ చేసి క్యాప్ వేసి పంటిని కాపాడుకోవచ్చు' వివరించాడు.

'పన్ను తీసేయండి డాక్టర్' అన్నది స్వప్న. మరో మాటకు తావులేదన్నట్లు. 'మీరు చెప్పిన ట్రీట్‌మెంట్‌కి కావలసినంత డబ్బు నా భర్త ఇవ్వడు' అని చెప్పలేక. 'నేనూ డాక్టర్‌నే, నాకూ తెలుసు' అని చెప్పుకోలేక. కుటుంబం కోసం చేజేతులా తన ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్‌ని జారవిడుచుకుంది. ఆ త్యాగమే ఇప్పుడు తనను చూసి నవ్వుతోంది. 'ఏం కోల్పోయానో దానిని తిరిగి సాధించుకోవాలి?' ఆలోచనలకు బ్రేక్ వేస్తూ పన్ను ఠాప్ మని విరిగిన శబ్దం. తీసిన పంటిని ట్రేలో పెట్టి, ఖాళీలో దూదిని నింపి దవడను పైకి అదుముతూ 'అదిమి పట్టుకో'మని చెప్పాడు డాక్టర్.

• ❖ •

''పిల్లలిద్దరూ చిన్నవాళ్లు, ఇప్పుడు ప్రాక్టీస్ పెట్టడం, ఉద్యోగంలో చేరడం రెండూ కష్టమే. ఆలోచించుకో'' స్వప్నకి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తోంది ఆమె తల్లి.

''నా అవసరాలను మానుకున్నాను, పిల్లల అవసరాలు తప్పవు కదా. అతడు చికాగ్గా విదిలించే డబ్బుతో ఎన్నాళ్లని'' నిలదీసినట్లే ఉంది స్వప్న మాట.

''ఆ ప్రాక్టీసో, ఉద్యోగమో ఏదైనా నీ భర్తతో కలిసి ఉంటూనే చేసుకోవచ్చుగా'' ప్రత్యామ్నాయం ఆలోచించు అన్నట్లుగా ఉందామె మాటలో అర్థింపు.

''ఆయనకు అమర్చి పెట్టి, పిల్లల పనులు చూసి, వాళ్లను స్కూల్లో దించి, స్కూలు నుంచి తీసుకువచ్చి... కెరీర్‌లో కొనసాగడం అయ్యే పని కాదమ్మా. అన్నీ అయ్యాక నాకు ఉద్యోగానికి మిగిలేది మూడు గంటలే'' పుల్ల విరుపుగానే ఉన్నాయి స్వప్న మాటలు.

స్వప్న విసిగిపోయి ఉందని అర్థమవుతోంది. కన్నీళ్ల కాపురాన్ని కూతురు వద్దనుకున్నంత సులువుగా తల్లి అనుకోలేదు, చక్కదిద్దాలని చూస్తుంది. ''స్వప్నా! నేనూ హైదరాబాద్‌కి వస్తాను'' అని లోపలికి వెళ్లిపోయింది.

• ❖ •

''బాబూ రాజేశ్! స్వప్నకి ఒంట్లో బాగోలేదు. పిల్లల్ని నేను రెడీ చేస్తాను, నువ్వు హాస్పిటల్‌కి వెళ్తూ స్కూల్లో దింపి వెళ్లాలి'' అన్నది అత్తగారు.

''అలాగే అత్తయ్యగారూ'' అన్నాడు చికాకును అణుచుకుంటూ.

ఇద్దరు పిల్లలు, రెండు స్కూలు బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లు, లంచ్ బాక్స్‌ల బాస్కెట్‌లు రెండు. ''నాకేమైనా ఆరు చేతులున్నాయా'' నోటి దాకా వచ్చింది రాజేశ్‌కి. ఎదురుగా ఉన్నది స్వప్న కాదు అత్తగారు.

స్కూల్ బ్యాగ్‌లు బైక్ హ్యాండిల్‌కి తగిలించాడు. అత్తగారు పిల్లల్ని ముందు ఒకరిని వెనుక ఒకరిని కూర్చోబెట్టింది. ఇక లంచ్ బాస్కెట్‌లు ఎలా? రాజేశ్ కళ్లలో అసహనం కనిపిస్తోంది కానీ అదేమీ పట్టనట్లు అల్లుడి చేతికి అందించిందామె.

''హే... నాన్న బైక్‌లో తీసుకెళ్తున్నాడు'' కేరింతలతో పిల్లలు ముఖాలు వెలిగిపోతున్నాయి.

''స్కూలు వదిలే టైమ్‌కి మీరు వెళ్తారు కదా'' బలవంతంగా వినయాన్ని పలికించాడు గొంతులో.

''నాకు మోకాళ్ల నొప్పులు. పైగా ఇంత బరువుతో అడుగు వేయలేను. స్వప్నకు ఓపిక వస్తే వెళ్తుంది. అమ్మాయి లేవలేకపోతే మీకు ఫోన్ చేస్తాను'' అందామె.

ఆమె మాటల్లో అర్థం సహేతుకంగా ఉన్నప్పటికీ, ఆమె ఉద్దేశం మాత్రం 'నీ చావు నువ్వే చావు' అన్నట్లుగా అర్థమవుతోంది రాజేశ్‌కి. బైక్ కదిలించాడు.

''నాన్నా! అమ్మకు స్కూటీ కొనివ్వు నాన్నా! మమ్మల్ని రోజూ ఇలాగే స్కూల్‌కి తీసుకెళ్తుంది'' అడిగింది వెనుక నుంచి రాజేశ్‌ని చుట్టుకుని కూర్చున్న పాపాయి.

''అమ్మ స్కూటీ అడిగితే నువ్వు కొనన్నావు కదా'' రాజేశ్‌కి ముందు కూర్చున్న కొడుకు మాటల్లో 'నువ్వింతే' అనే ఆరోపణ ధ్వనిస్తోంది.

'స్వప్న వీటన్నింటినీ ఎలా పట్టుకునేది' ఆలోచన మెదిలిందే తడవుగా పాపాయిని అడిగాడు.

''అమ్మ ఈ బ్యాగ్‌లను వీపుకు తగిలించుకుని, ఒక చేతిలో బాస్కెట్‌లను పట్టుకుని మరో చేత్తో తమ్ముడిని పట్టుకుంటుంది. చేయి వదిలితే వాడు రోడ్డు మీదకు పరుగెత్తుతాడు. నేను అమ్మ పక్కనే నడుస్తాను'' పాపాయి చెప్తుంటే రాజేశ్‌కి గుండె మెలిపెట్టినట్లయింది.

• ❖ •

''మన కాలనీలో ఉన్న పాలీక్లినిక్‌లో జాయిన్ అవుతున్నాను. మా అమ్మ వచ్చి మూడు వారాలైంది. ఊరికి వెళ్తానంటోంది'' అన్నది స్వప్న కాఫీ తాగి కప్పు టీపాయ్ మీద పెడుతున్న రాజేశ్‌తో.

స్వప్న క్లినిక్‌లో చేరడానికి, అత్తగారు ఊరికి వెళ్లిపోవడానికి మధ్య లింక్ ఎక్కడో ఏమీ తెలియలేదతడికి. మౌనంగా చూస్తూ ఉండిపోయాడు.

''నిన్ననే అత్తయ్యకు చెప్పాను. రోజంతా ఇంట్లో ఉండి పిల్లల పనులు, వంట చేసి పెట్టడానికి మనిషిని చూసి పంపించమని'' అని స్వప్న చెబుతుండగానే రాజేశ్‌కి పై మొదటి రెండు స్టేట్‌మెంట్‌ల లింక్ దొరికింది.

''జీతం ఎంత'' రాజేశ్ జీతమొక్కటే అడిగాడు కానీ ఊరి నుంచి వచ్చినామెకి గది ఇవ్వాలంటే పెద్ద ఇంటికి మారాలి. ఆమెకి మూడు సార్లు భోజనం ఆ పైన జీతం... అంకెలు వేలల్లో తిరుగుతున్నాయి.

''పది వేలు ఇవ్వందే రారు. ఊరిని వదిలి రావాలి కదా. అత్తయ్యకు వీలు కాకపోతే మా ఊరి నుంచి పంపించమని అమ్మకు చెబుతాను'' రాజేశ్‌కి మరో మాటకు చోటివ్వకుండా లోపలికి వెళ్లిపోయింది.

• ❖ •

''స్వప్నకు కెరీర్‌లో పెద్ద గ్యాప్ వచ్చిన మాట నిజమే. మరో రెండేళ్లు టైమివ్వండి. పిల్లలు కొంచెం పెద్దవుతారు'' స్వప్న పిల్లలను స్కూలుకి తీసుకెళ్లిన గ్యాప్ చూసి అత్తగారిని అడిగాడు రాజేశ్.

''వంద, రెండొందలకు చేయి చాస్తూ బతకడం తనకూ కష్టమే. ఇంత చదివించి మా అమ్మాయి డాక్టర్ అని గర్వంగా చెప్పుకున్న, మాక్కూడా అమ్మాయి ఇలా చేయి చాచాల్సి రావడం కష్టంగానే ఉంటుంది. రూట్‌కెనాల్ ట్రీట్‌మెంట్‌కి చేతిలో డబ్బులేక పన్ను పీకించుకుందని వాళ్ల నాన్నకు తెలిస్తే ఆయన గుండె పగిలిపోతుంది'' ఆమె మెల్లగానే అంటున్నప్పటికీ సూటిగానే తగులుతున్నాయి రాజేశ్‌కి.

పిల్లల్ని స్కూల్లో వదిలి ఇంటికొచ్చిన స్వప్న... రాజేశ్ హాస్పిటల్‌కి వెళ్లకుండా ఇంకా ఇంట్లో ఉండడంతో విచిత్రంగా చూసి గదిలోకి వెళ్లిపోయింది.

స్వప్నతోపాటు గదిలోకి వెళ్లి 'సారీ స్వప్నా, ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ. హాస్పిటల్‌కి వెళ్తున్నాను. ఈవెనింగ్ మాట్లాడుతాను' అని అంతే వేగంగా ఇంట్లో నుంచి బయట పడ్డాడు.

''ఏమైంది'' హాల్లోకి వచ్చి తల్లిని అడిగింది.

''ఏం కోల్పోయానో దానిని తిరిగి సాధించుకోవాలి?' అని నువ్వన్నప్పుడు నేనేమన్నాను?'' కూతుర్ని ప్రశ్నించింది.

''ఎక్కడ పోగొట్టుకున్నావో అక్కడే వెతుక్కోవాలన్నావు''

''ఇప్పుడు జరిగింది అదే'' అని వంటగదిలోకి వెళ్లింది స్వప్న తల్లి.

- మంజీర

కష్టమేంటో తెలిసేలా చేస్తే...



గౌరవం లేని చోట చూరుపట్టుకుని వేళ్లాడ్డం ఎవరికైనా కష్టమే. ఈ డాక్టర్ల విషయంలో భర్త బయట ప్రెషర్స్‌తో సున్నితత్వాన్ని కోల్పోయాడు, భార్య ఇంట్రావర్ట్ అయిపోయింది. పిల్లల భవిష్యత్తు పాడవుతుందని విడాకులు తీసుకుని పిల్లలను పెంచుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఇలాంటి సమస్యలకు పరిష్కారం... 'తాము పడుతున్న ఆవేదన, కష్టం ఎదుటి వారికి ఆచరణలో తెలిసేలా చేయడమే'. స్వప్న విషయంలో ఆమె తల్లి ఆ పని చేసింది. భార్యాభర్తలిద్దరితో విడి విడిగా మాట్లాడడం వల్ల మనసులో గూడు కట్టుకున్న ఆవేదన బయటకు వస్తుంది. భర్త కోసం భార్య పడిన శ్రమ, భార్య కోసం భర్త చేసుకున్న సర్దుబాట్లు తెలిశాక... ఇద్దరూ ఎదుటి వ్యక్తి కోణం నుంచి కూడా ఆలోచిస్తారు. ఈ సూత్రం... కరడు గట్టిన వాళ్లకు పని చేయదు, కానీ చాలా మందిలో గ్యాప్‌ను పూరిస్తుంది. స్వప్న మళ్లీ కెరీర్ ప్రారంభించే వరకు ఆమె అకౌంట్‌లో నెలనెలా డబ్బు వేశాడు రాజేశ్. అంతకంటే ఎక్కువగా భార్యాభర్తల మధ్య గ్యాప్ తొలగిపోయింది. పదేళ్లు ఉనికి కోసం పోరాడిన స్వప్న ఇప్పుడు తన ప్రయారిటీస్‌ను చక్కగా ప్లాన్ చేసుకుంటోంది.

- చెరువు వాణీమూర్తి, ఫ్యామిలీ కౌన్సెలర్

కౌన్సెలింగ్

ఇప్పుడు నేనేం చేయాలి?

మాది లవ్ మ్యారేజ్. ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ కూడా. మా అత్తగారింటి వాళ్లు డిమాండ్ చేయడంతో బంగారు, డబ్బు కట్నంగా ఇచ్చారు మా పేరెంట్స్. మా పెళ్లి 2016 ఆగస్టులో జరిగింది. నవంబర్ లో గర్భం దాల్చాను. పెళ్లయినప్పటి నుంచి నా భర్త, అత్తింటివారు నన్ను మా క్యాస్ట్ గురించి చాలా వేధించేవారు. ప్రెగ్నెంట్‌ని అని కూడా చూడకుండా ఆ వేధింపులు కొనసాగాయి. ఎనిమిదవ నెలలో నన్ను 'నీ పుట్టింటికి వెళ్లి సీమంతం చేయించుకో' అని పంపించారు. మరో పది లక్షల కట్నం తీసుకురమ్మన్నారు. నా బిడ్డకు ఎనిమిది నెలలు వచ్చినా అత్తింటి వాళ్లొచ్చి నన్ను తీసుకువెళ్లలేదు. నేనే వెళ్తే కొట్టి పంపించేశారు. నా భర్త బ్యాంకు ఉద్యోగి. 'డొమెస్టిక్ వయొలెన్స్ అండ్ డౌరీ కేస్ వేసినా ఏం చేయలేరు, నా జాబ్ కూడా ఎఫెక్ట్ అవ్వదు. మిమ్మల్ని చంపుతా' అని బెదిరిస్తున్నాడు.

నా వైవాహిక జీవితం అంతా భరించలేని వేధింపులే. కొట్టడం, తిట్టడం, అన్నం పెట్టకపోవడం... చెప్పుకుంటూ పోతే ఎన్నో. మా పేరెంట్స్ దగ్గరకు ఓ సారి రౌడీలు వచ్చి బెదిరించారు. నా భర్త, అతని సోదరుడు, అత్తగారు, ఆడపడుచు అందరూ కలిసి కొట్టేవారు. నా పరిస్థితిని అర్థం చేసుకుని నాకు సజెషన్ ఇవ్వండి. ప్లీజ్.

- శ్రీ, ఈ మెయిల్


ప్రతీకాత్మక చిత్రం

ఈ స్థితిలో ఆ వైవాహిక బంధాన్ని కొనసాగించడం కష్టమే. తాత్కాలిక కోపం, చిరాకు పడడం వంటి వాటిని అయితే సర్దుకుపోవడం, అర్థమయ్యేలా చెప్పడం వంటి ప్రయత్నాలతో పరిష్కరించుకోవచ్చు. మీరు చెప్తున్న వివరాలు చూస్తే... మీరు నిర్ణయం తీసుకోక తప్పదనిపిస్తోంది. ముందుగా హెరాస్‌మెంట్, డొమెస్టిక్ వయొలెన్స్‌ల నుంచి బయటపడానికి ఐపిసి సెక్షన్ 498ఎ, సెక్షన్ 406ల కింద కేసు నమోదు చేయాలి. క్యాస్ట్‌ను కించపరుస్తూ వేధిస్తున్నట్లు కూడా చెప్పారు. కానీ మీరిచ్చిన వివరాల ప్రకారం ఎస్‌సి అండ్ ఎస్‌టి (ప్రివెన్షన్) అట్రాసిటీస్ యాక్ట్ పరిధిలోకి వస్తారో రారో తెలియడం లేదు. ఒకవేళ వర్తించేటట్లయితే వాటి కింద కూడా కేసు నమోదు చేయవచ్చు. విడాకులు, భరణం కోరుతూ మరో కేస్ ఫైల్ చేయాలి.

అలాగే మీ క్వాలిఫికేషన్ తెలిస్తే మరికొంత సహకారం అందించగలుగుతాం. ఎందుకంటే పై వన్నీ తేలే వరకు మీరు పుట్టింటి వాళ్ల మీద ఆధారపడి ఉండాల్సి రావడం కష్టమే. మీ కంటూ సంపాదన ఉండాలి. మీ కాళ్ల మీద మీరు నిలబడడం చాలా ముఖ్యం. మీ వివరాలు తెలియచేస్తే మీరు చేయగలిగిన ఉద్యోగావకాశాలు ఎక్కడ ఉన్నాయో గైడ్ చేయగలుగుతాం.




- బులుసు విజయలక్ష్మి,
సాయి సేవా సంఘ్ ట్రస్ట్

మాకు పంపండి: ఒక మహిళగా మీరు గృహహింస వంటి వేధింపులకు గానీ, సామాజికంగా వివక్షకుగానీ లేదా సంబంధిత ఇతర సమస్యలతో బాధపడుతున్నారా? మీ సమస్యను రాసి మాకు మెయిల్ ద్వారా పంపించండి.ఆయా రంగాలకు చెందిన నిపుణులతో మీకు తగిన సూచనలు / సలహాలు ఇప్పించే ఏర్పాటు చేస్తాం. మీరు మీ ప్రశ్నలను పంపాల్సిన మెయిల్ ఐడీ : nenusakthiquestions@gmail.com

---

మళ్లీ చెప్పకుందాం! రీటోల్డ్ కథలు - 24

పునాదిరాయి




• కవనశర్మ

హౌస్ ఓనర్ ఆశ్చర్యపోయింది ఎదురుగా నిలుచున్న మనిషిని చూసి.

వయసు యాభై యాభైఅయిదు ఉంటాయి. చక్కని ముత్తయిదు స్త్రీ అని తెలిసిపోతోంది. చదువు, సంస్కారం కూడా ఉంటాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. భాష చక్కగా ఉంది. హుందాగా కట్టుకున్న చీర, చేతులకు మట్టిగాజుల మధ్య ఒకటీ రెండు బంగారు గాజులు, మెట్టెలు, మంగళసూత్రాలు... కాని ఒక్కత్తే ఉంటాననంటోంది. అందుకే ఆశ్చర్యం.

'ఏం ఇవ్వరా?' అడిగింది.

'అబ్బే... అలాంటిదేమీ లేదు. మిమ్మల్ని చూశాను ఒకటి రెండుసార్లు మార్కెట్‌లో. చేరండి. మా పిల్లలు ఎక్కడెక్కడో సెటిల్ అయ్యి బోర్ కొడుతోంది. ఈ చిన్నపోర్షన్ అందుకే అద్దెకు వదిలాం. చేరండి పర్లేదు'

సంతోషంగా నమస్కారం చేసింది.

ఏమేం సామాన్లు తెచ్చుకుంటుందో అని హౌస్‌ఓనర్ చూస్తూ ఉంది.

ఏమీ లేవు. ఒక చాప. రెండు దుప్పట్లు. మార్కెట్‌లో గ్యాస్‌తో పాటు అమ్మే చిన్న స్టౌ. ఒకటి రెండు బ్యాగుల్లో బట్టలు. ఇక్కడకు చేరాకే పాల కోసమైనా గిన్నె కొనుక్కుని వచ్చి పొంగించింది. కొంచెం కాఫీ చేసి హౌస్‌ఓనర్‌కు ఇచ్చింది కూడా. రెండు మూడు రోజుల్లోనే ఆ చిన్న పోర్షన్ ముచ్చటైన ఇంటిగా మారిపోయింది. గడప దగ్గర రెండు పూల కుండీలు చేరాయి. ముగ్గులూ.. తక్కువధరకు వచ్చినవే అయినా అందంగా ఉన్న వాల్ హ్యాంగింగ్‌లూ... కుతూహలంతో హౌస్‌ఓనర్ తొంగి చూస్తే 'నా ఇల్లండీ... అచ్చంగా నా ఇల్లు' అంది నవ్వుతూ.

'ఖాళీ చేయించరుగా' మళ్లీ అడిగింది.

'అబ్బే లేదండీ... మీరు ఎన్నేళ్లయినా ఉండొచ్చు. ఖాళీ చేస్తానన్నా నేను చేయించనుగా'

'అమ్మయ్య.. ఇలాంటి దిలాసా మా ఇంట్లో ఉండేది కాదంటే నమ్మండి' అంది.

భర్త ఇంజనీరు. స్టాఫ్ మీద చెలాయించాడు. కాని ఇంట్లో చెలాయిస్తే ఎలా? పడి ఉండటానికి బంట్రోతా? భార్య.

ఒక రోజు కాఫీ అడిగాడు.

సిద్ధంగా పెట్టిన డికాక్షన్ చేయి జారి ఒలికి పోయింది. మళ్లీ సిద్ధం చేస్తుంటే విసుక్కున్నాడు. విసుక్కోవచ్చు. కాని పద్ధతి ఉండాలి కదా.

'సంసారం బుద్ధులు బొత్తిగా లేవు నీకు. ఒక్క రూపాయి సంపాదిస్తే తెలుస్తుంది సంపాదన ఎంత కష్టమో' అన్నాడు.

సంసారం బుద్ధులు లేవా తనకు? పెళ్లయ్యి ముప్పై ఏళ్లు గడుస్తుంటే సంసారం బుద్ధులు లేవని కనిపెట్టాడా? చిన్న ఉద్యోగిగా ఉన్నప్పుడు ఇల్లు ఎలా లాక్కుని వచ్చింది, పిల్లల చదువుకని ఎలా పొదుపు చేసింది, తెచ్చిన జీతంలో రూపాయి రూపాయి దాచి ఎలా మిగిల్చి ఇచ్చింది... రెండు చెంచాల కాఫీ పొడికి ఇంత పెద్ద మాటా?

పట్టుదల వచ్చింది.

తెలిసిన వాళ్ల ఆఫీసు ఉంటే చిన్న ఉద్యోగం సంపాదించింది. పార్ట్‌టైమ్ లాంటిది. నలుగైదు గంటలు హెచ్‌ఆర్‌లో కూచుని అటెండెన్స్‌లు అవీ చూడాలి. భర్త కక్కాలేక మింగాలేక చూశాడు. కక్కేది ఏముంది... మింగడమే.

'ఊరి నుంచి అక్కయ్య వస్తోంది వెళ్లి రిసీవ్ చేసుకో' అన్నాడు ఒకరోజు.

ఆడపడుచు అంటే తనకూ గౌరవమే. కాని ఆఫీసులో ఊహించని పని పడి వెళ్లలేకపోయింది. ఆడపడుచు నేరుగా ఇంటికే వచ్చేసింది. అక్కాతమ్ముళ్లు ఏం మాట్లాడుకున్నారో. కోపం వచ్చింది. కోపం రావచ్చు. కాని వ్యక్తపరచడంలో పద్ధతి ఉండాలి కదా.

'నువ్వు కావాలనే వెళ్లలేదు కదూ' అన్నాడా రాత్రి.

'అది కాదండీ'...

'నా మాటంటే నీకు లెక్కలేదు. చూస్తున్నానంతా. ఇలా అయితే నా ఇంట్లో ఉండాల్సిన పని లేదు. ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉండు. లేదంటే వేరే ఇల్లు చూసుకొని ఫో.'

ఏమంటున్నాడు... ఇది నా ఇల్లు అంటున్నాడు. స్థలం చూసినప్పుడు, రిజిస్ట్రేషన్ చేయిస్తున్నప్పుడు, శంకుస్థాపన చేస్తున్నప్పుడు, కడుతున్నప్పుడు, కట్టాక ఇక్కడే పిల్లలను పెంచుతున్నప్పుడు, వంట చేస్తున్నప్పుడు, తులసి కోట చుట్టూ తిరుగుతున్నప్పుడు, రాత్రిళ్లు పవళింపు సేవ చేస్తున్నప్పుడు, ఇన్నేళ్లుగా ఈ నాలుగ్గోడలను తీర్చిదిద్దుతున్నప్పుడు తన ఇల్లు కూడా అనుకుందే. తనకు హక్కు ఉంది అనుకుందే. తనది కాకుండా పోతుందా అనుకుందే.

తనది కాదు.

ఏ ఇల్లూ స్త్రీది కాదు. అయితే అది తండ్రిది. లేకుంటే భర్తది. కాకుంటే కొడుకుది. ఈ ఇల్లు అనేది లేకుండా పోవడం వల్లే కదా మగాడు ఆడదాన్ని ఆడిస్తున్నాడు. 'ఇంటిని సంపాదిస్తాను. నా ఇంట్లో నేనుంటాను' అని అనుకుంది.

బయటకు వచ్చేసింది.

ఈ ఇల్లు తీసుకుంది.

వారం పదిరోజులు గడిచాయో లేదో ఊరి నుంచి తమ్ముడు దిగబడ్డాడు.

'ఏంటక్కయ్యా... ఈ చోద్యం' అన్నాడు దిగులుగా, అక్క మీద బెంగగా.

'చోద్యం ఏముందిరా. అది ఆయన ఇల్లు. ఆయన అనుమతితో ఆయన పద్ధతి ప్రకారం నేను ఉండాలి. ఇది నా ఇల్లు. ఇక్కడ నా ఇష్టప్రకారం నేనుంటాను. మగాళ్లకు ఇదొకటి ఆటైంది... చీటికి మాటికి పెళ్లాన్ని పట్టుకొని ఫో... బయటికి పో అని బెదరగొట్టడం... ఏం పోలేమనుకున్నారా?'

'బావ బాగా బెంబేలు పడిపోతున్నాడక్కా'

'ఎందుకురా బెంబేలు. నేనేం విడిపోలేదుగా. విడాకులు తీసుకోలేదుగా. రమ్మను ఇక్కడకు. నాకు తోచిందేదో నేను పెడతాను. ఉండమను. లేదంటే ఉండిపోమను. కాని నా కంఠంలో ప్రాణం ఉండగా ఆ ఇంటి గడప తొక్కను'

'పిల్లలు కంగారు పడుతున్నారు'

'పడనీ'

'ఊళ్లో మగాళ్లందరూ కంగారు పడుతున్నారు'

'పడనీ'

'అసలీ ప్రపంచమే కంగారు పడేలా ఉంది. ఎంత పని చేశావక్కా' అన్నాడు తమ్ముడు.

ఆమె చిరునవ్వుతో తన డబ్బుతో తాను కొన్న, కింద పడినా, చేయి ఒలికినా ఎవరూ ఏమీ అనని కాఫీని తయారు చేయడానికి, ఫో బయటకి అని ఎవరూ బెదిరించలేని తన వంట గదిలోకి హాయిగా అడుగులు వేసింది.

కథ ముగిసింది.

కవనశర్మ రాసిన 'ఆమె ఇల్లు' కథ ఇది.

మగాళ్లూ భద్రం. ఇప్పుడు హాస్టల్స్ పెరిగాయి. సర్వీస్ అపార్ట్‌మెంట్లు వచ్చాయి. పేయింగ్ గెస్ట్ ఆఫర్లు కూడా బోలెడు ఉన్నాయి. ఫో... నా ఇంట్లో నుంచి అని అంటే వాళ్లు నిజంగా వెళితే గతేం కాను? రిజిస్ట్రేషన్ కాగితాల్లో ఏ ఇల్లైనా మగాడి పేరు మీదే ఉండొచ్చు. కాని దానికి పునాది రాయి మాత్రం స్త్రీ అని మర్చిపోతే ఎలా?

పునః కథనం: **ఖదీర్**

సాగుబడి

ఫేస్‌బుక్‌లో sakshi saagubadi గ్రూప్‌ను చూడండి.

పూర్వాభాద్ర కార్తె: మార్చి 4 నుంచి

సేంద్రియ చిట్కా

దేశీ ఆవు పాలతో విత్తన శుద్ధి: వైరస్ తెగుళ్ల నివారణ

కూరగాయలు, బొప్పాయి వంటి పంటలకు విత్తనం ద్వారా వైరస్ తెగుళ్లు సంక్రమించే అవకాశం ఉంది. వీటి నివారణకు– విత్తనాలను అరగంట పచ్చి దేశీ ఆవు పాలలో నానబెట్టి.. తర్వాత 20 నిమిషాలు నీడలో ఆరబెట్టి విత్తడం గాని లేదా నారు పోసుకోవడం గానీ చేసినట్లయితే విత్తనం ద్వారా వచ్చే వైరస్ తెగుళ్లను సమర్థవంతంగా అరికట్టవచ్చు.

దీనితోపాటు ప్రతి 10 రోజులకు ఒకసారి పచ్చి దేశీ ఆవు పాలు 5% పిచికారీ చేయడం ద్వారా కూడా వైరస్ తెగుళ్లను అరికట్టవచ్చు.



ఇంటిపంటల రుచే వేరు!



ఇంటి పంట

జీవిత బీమా సంస్థ ఉద్యోగులైన మేడేపల్లి సాయిశ్రీ, అనంత్ దంపతులు తమ ఇంటిపైన రెండేళ్లుగా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతోపాటు పూలమొక్కలను పెంచుకుంటున్నారు. హైదరాబాద్ గుడిమల్కాపూర్‌లోని జయనగర్ ఎల్.ఐ.సి. కాలనీలో రెండంతస్తుల సొంతిల్లు నిర్మించుకున్న తర్వాత టెర్రస్ కిచెన్ గార్డెనింగ్‌పై దృష్టిసారించారు. ఇంటిపంటల సాగుపై ముందస్తు ప్రణాళికతో టెర్రస్‌పైన లీక్ ప్రూఫింగ్ చేయించారు. ఐరన్ బెంచ్‌లు చేయించి, వాటిపై ఎత్తుల వారీగా కుండీలను అందంగా అమర్చారు. చిన్న సైజు సిల్పాలిన్ బ్యాగ్‌లలో టమాటా, కొత్తిమీర, పాలకూర సాగు చేస్తున్నారు. ఎర్రమట్టి, పశువుల ఎరువు కలిపి మొక్కలు పెట్టుకున్న తర్వాత అడపాదడపా కోకోపిట్, వర్మీకంపోస్టు వేస్తూ.. జీవామృతం కొనుగోలు చేసి, పది రెట్లు నీరు కలిపి మొక్కల పోషణకు ఉపయోగిస్తున్నారు.



గతంలో ఇబ్బడిముబ్బడిగా పండిన తెల్ల వంకాయలు, పచ్చి మిరపకాయలను తమ సహోద్యోగులకు, తెలిసినవారికి కూడా పంచిపెట్టడం చాలా సంతోషాన్నిచ్చిందని వారు తెలిపారు. ఇంటి కూరగాయలు, ఆకుకూరలు ఆరోగ్యకరమైనవి కావడంతో పాటు.. వీటితో వండిన కూరలకు.. బయట కొన్న కూరగాయలతో వండిన కూరలకు రుచిలో స్పష్టమైన తేడా ఉందన్నారు. పిల్లలు సైతం ఈ తేడాను స్పష్టంగా గుర్తించగలరని వారన్నారు. ఎండలు ముదురుతున్నందున షేడ్‌నెట్ ఏర్పాటు చేసి.. మరింతగా ఆకుకూరల సాగుపై దృష్టిపెట్టనున్నామని సాయిశ్రీ(93480 28228) అన్నారు.

నివాళి

ఉసురు తీసిన అప్పు భయం



పాపయ్య భార్య, పిల్లలు

షాబాద్(చేవెళ్ల): పంటలు సక్రమంగా పండకపోవడంతో అప్పుల పాలైన రైతు కుమ్మరి పాపయ్య(45) ఆత్మహత్య చేసుకొని ఏడాది గడుస్తున్నా ఆయన కుటుంబానికి ప్రభుత్వ సాయం అందలేదు. షాబాద్ మండలం అంతిరెడ్డిగూడ గ్రామానికి చెందిన పాపయ్య అప్పటిలో తనకున్న రెండు ఎకరాల్లో గులాబితోట, అర ఎకరంలో వరి సాగు చేశాడు. బోరు ఎండిపోయి నీరు లేక పంటలు ఎండుముఖం పట్టడంతో.. అప్పులు చేసి తన భూమిలో 4 బోర్లు వేశాడు. అయిన చుక్కనీరు రాలేదు. సుమారు రూ. 5 లక్షల అప్పు ఎలా తీర్చాలన్న దిగులుతో ఎవరూ లేని సమయంలో పశువుల పాకలోకి వెళ్లి తన లుంగీనే వాసానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదు. వర్షాలు సరిగ్గా లేక వ్యవసాయంలో తీవ్ర నష్టం వచ్చినా ప్రభుత్వ సాయంపై గంపెడాశతో లక్ష్మమ్మ కుమారుడితో కలిసి కుటుంబ భారాన్ని మోస్తున్నారు.

నేను శక్తి సాక్షి

మన్య దీపిక!



రైతులు.. అందులోనూ గిరిజనులు..
ఇక చెప్పేదేముంది!
దిగుబడులు వస్తున్నాయంటే..
దళారుల పంట పండినట్లే కదా!!
కానీ, రోజులన్నీ ఒకేలా ఉండవు..
కాలంతోపాటు శ్రీకాకుళం జిల్లా సీతంపేట ప్రాంత అమాయక గిరిజన రైతులూ ఇప్పుడు తెలివి తెచ్చుకుంటున్నారు.
రసాయనాల్లేకుండా ప్రాణానికి ప్రాణంగా సాగు చేసిన తమ పంటలకు ఇప్పుడు తామే ధర నిర్ణయించుకుంటున్నారు.
'మన్య దీపిక రైతు ఉత్పత్తిదారుల కంపెనీ'ని ఏర్పాటు చేసుకున్నారు.
తమ ప్రతి ఒక్కరి తలరాతను కలసికట్టుగా తిరగరాసుకుంటున్నారు.
కల్లాకపటం లేని ఆ గిరిజన రైతు కలల కంపెనీకి వెలుగుబాట చూపుతున్న మార్గదర్శి.. పడాల భూదేవి!
ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చైతన్య దీప్తికి 'సాగుబడి' నుంచి జేజేలు!

కొండకోనల్లో, ప్రకృతి ఒడిలో కపటం లేని జీవించే గిరిజన రైతులు అవగాహన లేక, దారిచూపేవారు లేక, ఐక్యత లేక, దళారుల దోపిడీ వల్ల అనాదిగా పేదరికంలో మగ్గిపోతున్నారు. అయితే, శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏ పరిధిలోని హిర, సీతంపేట, ఎల్ఎన్‌పేట, కొత్తూరు, వీరఘట్టం మండలాల్లో రైతుల సంగతి వేరు. ఈ మండలాల్లో చిన్నయ్య ఆదివాసీ వికాస్ సంఘం ఆధ్వర్యంలో సుమారు 4 వేల మంది గిరిజన రైతులు సంఘటితమై భూమి హక్కులను సాధించుకోవడం ద్వారా పేదరికాన్ని అధిగమిస్తున్నారు. ఉమ్మడి భూమి హక్కులు సాధించుకున్నారు. మెరుగైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకొని, స్వల్ప ఖర్చుతోనే అధికోత్పత్తి సాధిస్తున్నారు.

అంతేకాదు.. నాబార్డు సహాయంతో 10 నెలల క్రితం 'మన్య దీపిక రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్'ను ఏర్పాటు చేసుకొని తాము పండించిన పంటకు తామే ధర నిర్ణయించుకొని పడాల భూదేవి నేతృత్వంలో అధిక నికరాదాయాన్ని పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గిరిజన నేత, తన తండ్రి దివంగత చిన్నయ్య అడుగుజాడల్లో నడుస్తూ భూదేవి గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆధునిక పోకడలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరచుకుంటే ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించే పంటకు అధికాదాయం పొందవచ్చని గిరిజన రైతులను చైతన్య పరచి ఆమె ముందుకు నడిపిస్తున్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘం గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న తీరు.. భూదేవి మాటల్లోనే..





ఎకరానికి 13 క్వింటాళ్ల చిరుధాన్యాల దిగుబడి

గత 13 సంవత్సరాలుగా సేంద్రియ సాగు విధానాన్ని మా గిరిజన రైతులకు అలవాటు చేశాం. ఇదే క్రమంలో చిరుధాన్యాలు సాగు ప్రారంభించాం. వ్యవసాయ యాంత్రీకరణ, సాగులో ఆధునిక విధానాలు అలవాటు చేస్తున్నాం. రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యాలను పాత పద్ధతిలో కేవలం ఎకరాకు మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే సాధించేవారు. కొత్త పద్ధతులు అలవాటు చేసిన తరువాత మొక్కలు నాటే 'గులి' పద్ధతిలో సాగు చేసి, ఎకరానికి 13 క్వింటాళ్ల దిగుబడి సాధించే స్థాయికి చేరుకున్నారు. సీతంపేట ఐటీడీఏ, నాబార్డు, ఆత్మ, వ్యవసాయశాఖలతో పాటు మరి కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో చిరుధాన్యాలు, సేంద్రియ సాగుతో లాభాల బాట పడుతున్నాం.. దాదాపు 3 వేల ఎకరాల్లో రెండు వేల మంది గిరిజన రైతులు చిరుధాన్యాల సాగు చేస్తున్నారు. ఏటా రాగి వంద టన్నులు, కొర్రలు 50, జొన్న 35, సజ్జ 25 టన్నుల వరకూ దిగుబడి వస్తోంది. సొంత విత్తనాలనే వాడుకుంటున్నారు. ఈ సంవత్సరం ఏపీ సీడ్స్ సంస్థకు 9 టన్నుల రాగి విత్తనాలు కిలో రూ.36 చొప్పున పంపిణీ చేశాం.

11 మంది డైరెక్టర్లలో ఆరుగురు మహిళలు

ఈ ప్రాంతంలో గిరిజన రైతులు ఎక్కువగా చిరుధాన్యాలను, పప్పుధాన్యాలను సాగు చేస్తున్నారు. వారి ఉత్పత్తులను దళారులకు, లేదా స్థానిక సంతల్లో వచ్చిన ధరకు అమ్మేసుకుంటూ ఉండటం వల్ల ఎంతో ఆదాయాన్ని నష్టపోతుండేవారు. రైతు ఉత్పత్తిదారుల కంపెనీని ఏర్పాటు చేసుకున్నాక తాము నిర్ణయించుకున్న గిట్టుబాటు ధరకు అమ్ముకోగలుగుతున్నాం. ఇందులోని 11 మంది డైరెక్టర్లలో నాతో పాటు ఆరుగురం మహిళా గిరిజన రైతులమే. మన్య దీపిక రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసుకున్న తర్వాత తమ ఉత్పత్తులకు మేమే ధర నిర్ణయిస్తున్నాం. ఐటీడీఏ సమకూర్చిన గోదాములో సుమారు రూ.5–6 లక్షల ఖరీదైన ప్రాసెసింగ్ యంత్రాలను నెలకొల్పాం. కంపెనీలో సీఈవోతోపాటు పార్ట్‌టైమ్ సిబ్బంది సహా 30 మంది వరకు సిబ్బంది పనిచేస్తున్నారు.

చిరుధాన్యాల నుంచి బిస్కెట్ల వరకు..

కొర్ర బియ్యం, సామ బియ్యం, ఊద బియ్యం, జొన్నలు, సజ్జలు, రాగులు వంటి చిరుధాన్యాలు.. కంది పప్పు, మినపప్పు, ఉలవలు, చీపుర్లు, చింతపండు.. వంటి 25 రకాల సరుకులను శుద్ధి చేసి, చక్కగా ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నాం. శ్రీకాకుళం రైతుబజారులో, సీతానగరం ఐటీడీఏ ఆవరణలో ప్రత్యేక స్టాల్స్‌ను నిర్వహించడంతోపాటు.. విజయవాడ, విశాఖపట్నం, విజయనగరంతోపాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు కూడా సరుకును నేరుగా వినియోగదారులకు, దుకాణదారులకు విక్రయిస్తున్నాం.

అంతకుముందు కుంచం(3 కిలోలు) సేంద్రియ కందులు రూ.90లకు రైతులే స్థానికంగా అమ్ముకునేవాళ్లు. ఇప్పుడు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ద్వారా రూ. 120కు బయట మార్కెట్లలో అమ్మగలిగాం. కొర్ర ధాన్యాన్ని రైతు నుంచి కిలో రూ. 40కు కొనుగోలు చేసి, శుద్ధిచేసి ప్యాకెట్లలో నింపి రిటైల్‌గా కిలో రూ. 80కు విక్రయిస్తున్నాం. గత పది నెలల్లో 325 మంది రైతులు తమ ఉత్పత్తులను రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ద్వారా విక్రయించారు. ఇప్పటికి నెలకు రూ. 4 లక్షల టర్నోవర్ జరుగుతున్నది.

విదేశీ మార్కెట్ల కోసం అన్వేషణ..

మా సేంద్రియ ఉత్పత్తులను మొదట మేము తింటున్నాం. ఉత్పత్తులను మా ప్రాంత హాస్టల్ పిల్లలకు, వివిధ రాష్ట్రాల ప్రజలకు అందిస్తున్నాం. ఇక్కడ మార్కెట్‌కు ఇవ్వగా మిగిలే ఉత్పత్తులను విదేశీ మార్కెట్లలో అమ్మేందుకు కూడా మార్గాలను అన్వేషిస్తున్నాం. పీజీఎస్ సర్టిఫికేషన్ పొందే దశలో ఉన్నాం. అడవి తల్లి ఒడిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగైన మా ఉత్పత్తులను వ్యక్తులు, సంస్థలు ఎవరైనా నేరుగా కొనుగోలు చేయవచ్చు. ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపుతాం.

(వివరాలకు.. మన్య దీపిక రైతు ఉత్పత్తిదారుల కంపెనీ–హిరమండలం, శ్రీకాకుళం జిల్లా– డైరెక్టర్ పడాల భూదేవి: 73820 98533, సీఈఓ కైలాస్ సాహు: 88978 65521)

– అల్లు సూరిబాబు, సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం
ఫొటోలు: కుప్పిలి జయశంకర్, సాక్షి ఫొటో జర్నలిస్టు



హాస్టళ్లకు రాగి పిండి, చిరుధాన్యాల బిస్కెట్లు..

శ్రీకాకుళం జిల్లాలోని 47 గిరిజన సంక్షేమ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ కోసం ఏడాది కాలంగా నెలకు 9 టన్నుల రాగి పిండిని అందిస్తున్నారు. గిరిజన కుటుంబాల్లో వివిధ కారణాల వల్ల అనేక మంది ఒంటరి మహిళలుగా మిగిలిపోతున్నారు. వీరిలో 15 మందికి ఉపాధి కల్పించేందుకు చిరుధాన్యాలతో రుచికరమైన వంటకాల తయారీని ప్రారంభించాం. చిరుధాన్యాల పిండితో బిస్కెట్లు, కేక్, జంతికలు, మిక్చర్, పకోడి, రాగి పిండితో అంబలి, సంగటి, అట్లు, రొట్టెలు, లడ్డూలు తయారు చేస్తున్నాం. వాటిని రైతుబజార్లతో పాటు ప్రైవేట్ దుకాణాలకు సరఫరా చేస్తున్నాం. వాసన్ స్వచ్ఛంద సంస్థ, కృషి విజ్ఞాన కేంద్రం సాంకేతిక సహకారంతో చిరుధాన్యాలతో నెలకు రూ. 5 లక్షల బిస్కెట్లను తయారు చేస్తున్నాం. ఐటీడీఏ సహకారంతో రోజుకు 11 వేల బిస్కెట్లు గిరిజన విద్యార్థులకు అందిస్తున్నాం.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

'అరణ్య'కు నారీ శక్తి పురస్కారం!

'మహిళలు ఏం చేసినా జాగ్రత్తగా చేస్తారు..'





గ్రామీణాభివృద్ధి, సేంద్రియ వ్యవసాయ విస్తరణ కార్యక్రమాల్లో మహిళలకు, ముఖ్యంగా ఒంటరి మహిళలకు అధిక ప్రాధాన్యాన్ని ఇస్తుంటామని ప్రముఖ శాశ్వత వ్యవసాయ(పర్మాకల్చర్) నిపుణురాలు, అరణ్య అగ్రికల్చరల్ ఆల్టర్నేటివ్స్ సంస్థ సీఈవో కొప్పుల పద్మ అన్నారు. మహిళా సాధికారత సాధనకు చేసిన కృషికి గుర్తింపుగా కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ నారీ శక్తి పురస్కారాని(2017)కి అరణ్య అగ్రికల్చరల్ ఆల్టర్నేటివ్స్ ఎంపికైంది. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మ ఈ పురస్కారాన్ని(రూ. లక్ష నగదు, ప్రశంసాపత్రం) అందుకోనున్నారు. ఈ సందర్భంగా పద్మను 'సాగుబడి' పలుకరించింది. ఎమ్మే పొలిటికల్ సైన్స్ చదువుకున్న ఆమె 1989 నుంచి పన్నెండేళ్ల పాటు జహీరాబాద్‌లోని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీలో దళిత మహిళా రైతుల జీవితాలను మెరుగుపరిచేందుకు కృషి చేశారు. తదనంతరం భర్త కొప్పుల నరసన్నతో కలసి అరణ్య అగ్రికల్చరల్ ఆల్టర్నేటివ్స్ సంస్థను నెలకొల్పారు. హైదరాబాద్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పర్మాకల్చర్ సమ్మేళనాలను సమర్థవంతంగా నిర్వహించిన ఘనత పద్మకు దక్కుతుంది. 'ప్రభుత్వ అవార్డు గురించి ఎప్పుడూ ఆలోచించలేదు, ప్రయత్నించనూ లేదు. మాకు తెలిసినది, నచ్చినది చేసుకుంటూ వస్తున్నాం. మేం జిల్లాలో పనిచేసినా మహిళలకు, ముఖ్యంగా ఒంటరి మహిళలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం మా విధానం. మార్పు మహిళల్లో స్పష్టంగా కళ్లకు కనిపిస్తుంది. ఏం చేసినా మహిళలు జాగ్రత్తగా చేస్తారు. వీరిపై ఉండే ప్రభావం చిన్నదైనా అది కుటుంబానికి చేరుతుంది. మహిళలు నిలదొక్కుకోవాలంటే అన్ని స్థాయిల్లోనూ నిర్ణయాలు తీసుకోవడంలో వారికి తగిన ప్రాతినిధ్యం ఉండాలి..' అన్నారు పద్మ (99490 62295). కంగ్రాట్స్ టు 'అరణ్య' టీమ్!

'నేలమ్మ' గొడుగు నీడలో..



చిన్న, సన్నకారు రైతులు కాలం కలసిరాక అప్పుల పాలై ఆత్మహత్య చేసుకుంటుండడంతో కుటుంబాలు వీధిన పడుతున్నాయి. బాధిత కుటుంబాలకు చెందిన మహిళా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్తింటి వారి నుంచి భూములు, ఆస్తులపై హక్కులు దక్కని దుస్థితి కొందరిదైతే.. ఒంటరి మహిళలుగా వ్యవసాయం కొనసాగించడంలో సమస్యలు మరికొందరిని వేధిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కేరింగ్ సిటిజెన్స్ కలెక్టివ్(సీసీసీ) అనే స్వచ్ఛంద సంస్థ నిస్సహాయులైన రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాల మహిళా రైతులతో నేలమ్మ మహిళా రైతుల పరస్పర సహాయ సహకార సంఘాన్ని ఏర్పాటు చేసి అండగా నిలుస్తోంది. సిద్దిపేట జిల్లా మిడిదొడ్డి మండలం లింగపల్లికి చెందిన పెద్దలింగన్నగారి బాలమణి అధ్యక్షతన రెండేళ్ల క్రితం ఈ సంఘం రిజిస్టరైంది. 30 మంది రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాల మహిళా రైతులతోపాటు 200 మంది మహిళా రైతులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. వీరికి సేంద్రియ పద్ధతుల్లో ఆకుకూరలు, కూరగాయలు సాగు చేసుకోవడంపై సంఘం శిక్షణ ఇప్పించింది. అనేక ఎకరాల పొలం కలిగి ఉన్నప్పటికీ .. ప్రతి ఒక్కరూ అరెకరం, పావెకరంలోనైనా సరే కంపోస్టు ఎరువుతో సేంద్రియ సేద్యం చేసి ఇంటికి సరిపడా కూరగాయలు పండిస్తున్నారు. సంఘం అండదండలతో ధైర్యంగా జీవితాన్ని ఎదుర్కొంటూ పిల్లలను చదివించుకుంటున్నారు పలువురు రైతు ఆత్మహత్య కుటుంబాల మహిళలు. మహిళా దినోత్సవం సందర్భంగా వారిలో కొందరిని 'సాగుబడి' పలుకరించింది..

సంఘం అండతో వ్యవసాయం చేస్తున్నా..



మాకు ఎకరం చెల్క (మెట్ట) భూమి ఉంది. వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు వంటి పంటలు పెట్టేవాళ్లం. నీటి కోసం 3 బోర్లు వేశాం. అప్పు పెరిగిందే గాని నీరు రాలేదు. కొడుకు పొట్ట చేతబట్టుకొని బొంబాయి వెళ్లాడు. నా భర్త పదేళ్ల క్రితం ఒకనాడు రాత్రి పదైనా ఇంటికి రాలేదు. చెట్టుకు ఉరిపోసుకున్నాడు.. సంఘం అండతో వ్యవసాయం చేస్తున్నా. బోరు నీటితో వరి వేశా.. రూ. 2 లక్షల అప్పుంది. బిడ్డ పెళ్లి చేయలేదు..

- పోతరాజు కనకమ్మ, లింగపల్లి, మిడిదొడ్డి మండలం, సిద్దిపేట జిల్లా

రెండెకరాల్లో వరి వేస్తున్నా..



రెండెకరాలుంది. 17 ఏళ్ల క్రితం నా భర్త రాములు 3 బోర్లు వేశాడు. నీరు రాలేదు. నీరు లేక 4 మడులు ఎండిపోయాయి. పొలం దగ్గర చెట్టుకు ఉరేసుకొని చనిపోయాడు. ఇద్దరు బిడ్డలు, కొడుకు. ఒక బిడ్డ బోన్‌కేన్సర్‌తో చనిపోయింది. ఇంకో బిడ్డ టీటీసీ చదివింది. రెండెకరాల్లో వరి వేస్తున్నా. సంఘం నేర్పిన విధంగా.. ఎటువంటి (రసాయనిక) మందులూ వేయకుండా చేస్తున్నా.

- ఉప్పునూతల రామలక్ష్మి, లింగపల్లి, మిడిదొడ్డి మండలం, సిద్దిపేట జిల్లా

సంఘం అండగా నిలబడింది..



మాది ఉమ్మడి కుటుంబం. ఆరెకరాల భూమి ఉంది. నా భర్త రమేశ్ ఏడేళ్ల క్రితం వర్షాధారంగా వరి వేశాడు. కోతకొచ్చే సమయంలో 2 బోర్లు ఫెయిలయ్యాయి. గుళికలు మింగి చనిపోయాడు.. మా భూమి మల్లన్నసాగర్‌లో పోయింది. మా పాప చదువుకు సంఘం తోడ్పడింది. అమ్మ వాళ్లింట్లోనే ఉండి సీసీసీ స్వచ్ఛంద సంస్థ వలంటీర్‌గా పనిచేస్తున్నా. సేంద్రియ వ్యవసాయంలో తోటి మహిళా రైతులకు శిక్షణ ఇస్తున్నా. పెళ్లికి ముందు 9వ తరగతి చదివా. డిగ్రీ రాస్తున్నా..

- మెంగన సుజాత, లక్ష్మాపూర్, తొగుట మండలం, సిద్దిపేట జిల్లా

లగ్గం అయిన మూడేళ్లకే..



ఐదెకరాల చెల్క ఉన్నా.. పంటలు పండేది రెండెకరాల్లోనే. వడ్డీ వ్యాపారుల దగ్గర రూ.3 లక్షల అప్పు అయ్యింది. నా భర్త ప్రభాకర్ లగ్గం అయినాక మూడేళ్లకే మందు తాగి చనిపోయాడు. ఇద్దరు పిల్లలున్నారు. మూడేళ్ల క్రితం ప్రభుత్వమే బోరు వేయించింది. వరి ఎకరం(35–40 బస్తాల ధాన్యం పండుతుంది), అర్థెకరం పత్తి వేస్తున్నా. సంఘంతో కలిసి పనిచేస్తున్నా.

- గుర్రాల సుగుణ, చెల్లంకిరెడ్డిపల్లి, చిన్నకొండూరు మండలం, సిద్దిపేట జిల్లా

ఏడాది పాటు సేంద్రియ సేద్యంపై శిక్షణ



సంఘం సభ్యులకు గత ఏడాదిలో అనేక దఫాలుగా సేంద్రియ వ్యవసాయ నిపుణులు కిషన్‌రావు వద్ద శిక్షణ ఇప్పించాం. తాము తినడానికి వరకు సేంద్రియంగా పండించుకుంటున్నారు. మహిళా రైతుల హక్కుల సంఘం నేతలు ఆశాలత, లక్ష్మిల తోడ్పాటుతో బాధిత మహిళల భూమి హక్కులపై చైతన్యం తీసుకువస్తున్నాం. ప్రవాస తెలుగువారితో కూడిన ఐ4ఫార్మర్స్ బృందం బాధిత మహిళలకు వడ్డీ లేని రుణం అందిస్తున్నది.

- సజయ (99483 52008), కేరింగ్ ఫర్ సిటిజెన్స్ కలెక్టివ్